www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

రేపు లేదా ఎల్లుండి టెన్త్ ఫలితాలు!

ఏర్పాట్లు చేస్తున్న విద్యాశాఖ అధికారులు.. ఈసారి సబ్జెక్టుల వారీగా మార్కులు, గ్రేడ్లు 14

నేటి నుంచి ఎప్‌సెట్.. నేడు, రేపు అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగాలకు

మే 2-4 వరకు ఇంజనీరింగ్ పరీక్షలు 3

పరీక్షకు గంటన్నర ముందు నుంచే అనుమతి

పరీక్ష ప్రారంభమయ్యాక నిమిషం లేటైనా నో ఎంట్రీ

ఎప్‌సెట్‌కు మొత్తం 3,06,894 దరఖాస్తులు



మంగళవారం | 29-4-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 30 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, శుక్ల పక్షం; తిథి: విదియ సా.5.32 తదుపరి తదియ; నక్షత్రం: కృత్తిక రా.6.47 తదుపరి రోహిణి; వర్జ్యం: ఉ.8.12-9.37; దుర్ముహూర్తం: ఉ.8.25-9.15, రా.10.14-10.58; అమృతఘడియలు: సా.4.40-6.04; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం: 5.53; సూర్యాస్తమయం: 6.31 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఖజానా లూటీ..
కేసీఆర్ పనే..

పదేళ్ల విధ్వంసాన్ని సరిచేయడానికే ఏడాది పట్టింది

పథకాల ప్లానింగ్‌కు ఏడాదిన్నర సరిపోయింది

ఇక వాటి అమలుపై పూర్తిస్థాయిలో దృష్టి పెడతా

కేసీఆర్‌లా లాంచింగ్, క్లోజింగ్, షోపుటప్ పథకాలుండవ్

రేవంత్ చెప్పింది చేస్తాడనే నమ్మకం ప్రజల్లో కలిగిస్తా

కేసీఆర్ ప్రసంగంలో పస లేదు.. అక్కసు వెళ్లగక్కాడు

నేను సీఎం అయిన రెండోరోజే ఆయన గుండె పగిలింది

పిలగాళ్లంటూ కేటీఆర్, హరీశ్‌ను అసెంబ్లీకి ఎందుకు పంపుతున్నారు?

ప్రత్యామ్నాయం లేకే కొందరు అధికారుల కొనసాగింపు

పార్టీ నిర్ణయం తర్వాతే కగార్‌పై ప్రభుత్వ ప్రకటన

మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్ రెడ్డి

శాంతి చర్చలపై మాజీ మంత్రి జానారెడ్డితో చర్చలు



సీఎంను కలిసిన కొత్త సీఎస్

హైదరాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కె.రామకృష్ణారావు సోమవారం సీఎం రేవంత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎ్‌సకు సీఎం శుభాకాంక్షలు తెలిపారు. ఇరువురూ పలు అంశాలపై మాట్లాడుకున్నారు. బుధవారం సాయంత్రం సీఎ్‌ఎగా రామకృష్ణారావు బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

నన్ను నమ్ముకున్నోళ్లను ఎన్నడూ మర్చిపోను. అద్దంకి దయాకర్‌కు ఎమ్మెల్సీ ఇస్తానని చెప్పా. ఆయన ఓపిగ్గా నన్నే నమ్ముకుని ఉన్నాడు. ఆయనకు ఎమ్మెల్సీ పదవి వచ్చింది. అద్దంకి దయాకర్‌లాగా ఓపిగ్గా ఉంటే నాకూ బాధ్యత ఉంటుంది. అలా కాకుండా బయటికి వెళ్లి స్వీపింగ్ రిమార్కులు చేస్తే నాపైన భారం ఉండదు. చెల్లుకు చెల్లయిందని భావిస్తా. - సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న అనర్థాలకు మాజీ సీఎం కేసీఆరే కారణమని, తెలంగాణ రాష్ట్ర ఖజానా మొత్తాన్ని లూటీ చేసిన ఆయన.. ఇప్పుడు తమపై నిందలు వేస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండిపడ్డారు. పదేళ్ల పాలనలో కేసీఆర్ చేసిన విధ్వంసాన్ని సెట్ చేయడానికే తమకు ఏడాది సమయం పట్టిందన్నారు. మావోయిస్టులతో శాంతి చర్చల అంశంపై చర్చించేందుకు సీఎం రేవంత్ రెడ్డి సోమవారం మాజీ మంత్రి జానారెడ్డి నివాసానికి వెళ్లారు. ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం ముఖ్యమంత్రి మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. "గడిచిన ఏడాదిన్నర కాలం పథకాలను ప్రణాళిక చేసుకోవడానికి సరిపోయింది. ఇక వాటి అమలుపై పూర్తి స్థాయిలో దృష్టి పెడతా. రేవంత్ రెడ్డి చెప్పింది చేస్తాడన్న నమ్మకం ప్రజల్లో కలిగేలా చేస్తా. కేసీఆర్ మాదిరిగా లాంచింగ్.. క్లోజింగ్

మిగతా 13వ పేజీలో...



కశ్మీర్‌లో మళ్లీ కళ

తిరిగి వస్తున్న పర్యాటకులు

ప్రత్యేక డిస్కౌంట్లు ఇస్తున్న హోటళ్లు

పర్యాటకులకు భద్రతా సిబ్బంది, స్థానికుల అండ

జమ్మూ కశ్మీర్‌లోని గుల్మార్గ్‌లో గొండోలా కేబుల్ కార్ స్టేషన్ వద్ద పర్యాటకుల సందడి

పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో.. పాక్‌పై
భారత్ దాడి తథ్యం!

మా ఉనికికి ముప్పు వస్తే అణ్వస్త్ర ప్రయోగం జరుపుతాం

'రాయిటర్స్' ఇంటర్వ్యూలో పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా

స్థానిక టీవీ చానల్‌కిచ్చిన మరో ఇంటర్వ్యూలో మాట మార్పు

యుద్ధం జరిగే అవకాశం ఉందని.. వచ్చే 3-4 రోజులే కీలకం అని మాత్రమే అన్నానని.. తన మాటల్ని వక్రీకరించారని వెల్లడి

పాక్‌కు తుర్కియే అండ.. ఆరు సి-130 విమానాల అందజేత

ఉగ్రవాదులను సరిహద్దులకు దూరంగా తరలిస్తున్న పాక్

2 మోదీతో రాజ్‌నాథ్ భేటీ.. సరిహద్దుల్లో భద్రతపై వివరణ

ఉగ్రవాదులను తీవ్రవాదులంటారా?.. బీబీసీపై కేంద్రం ఫైర్

చిక్కినట్లే చిక్కి.. తప్పించుకుంటున్న పహల్గాం ఉగ్రవాదులు

ఇస్లామాబాద్, ఏప్రిల్ 28: పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో.. తమ దేశంపై భారత్ సైనిక దాడి తథ్యమని పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ముహమ్మద్ అసిఫ్ రాయిటర్స్ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సంచలన వ్యాఖ్యలు చేశారు. భారత్ దాడి చేసే అవకాశాల గురించి పాక్ సైన్యం ప్రభుత్వానికి వివరించిందని.. అందుకే తమ దళాలను బలోపేతం చేసుకున్నామని చెప్పారు. పాకిస్థాన్ పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉందన్న ఆయన.. తమ ఉనికికి ప్రత్యక్ష ముప్పు వాటిల్లే పరిస్థితి వచ్చినప్పుడు మాత్రమే

మిగతా 2వ పేజీలో...

ఇక నేవీలోనూ రాఫెల్ సత్తా!

2

త్వరలోనే భారత్‌కు 26 రాఫెల్ మెరైన్ జెట్లు

వాటిలో 22 సింగిల్ సీటర్లు.. 4 ట్విన్ సీటర్లు

రూ.63 వేల కోట్లతో ఫ్రాన్స్‌తో భారీ ఒప్పందం





సంచలన సూర్యవంశీ

14 ఏళ్ల వయసులోనే ఐపీఎల్ సెంచరీ

35 బంతుల్లో 7 ఫోర్లు, 11 సిక్సలు

'రాజస్థాన్ రాయల్స్' చిన్నోడి ఘనత 11

14 ఏళ్ల వయసు పిల్లాడు.. ఐపీఎల్‌లో సంచలనం సృష్టించాడు. రాజస్థాన్ రాయల్స్ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ 35 బంతుల్లోనే సెంచరీ కొట్టాడు. సోమవారం గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సిక్సర్లు, ఫోర్లతో సుడిగాలి ఇన్నింగ్స్ ఆడాడు. టీ20 చరిత్రలోనే పిన్న వయసులో సెంచరీ చేసిన బ్యాటర్‌గా రికార్డు సృష్టించాడు. ఐపీఎల్‌లో తక్కువ బంతుల్లో సెంచరీ సాధించిన బ్యాటర్లలో గేల్ (30) తర్వాతి ఆటగాడయ్యాడు. వైభవ్ సునామీతో 210 పరుగుల భారీ లక్ష్యాన్ని రాజస్థాన్ రాయల్స్ 15.5 ఓవర్లలోనే ఛేదించింది.

అమరావతే ఏపీకి
ఏకైక రాజధాని



ఉండవల్లిలోని సీఎం నివాసంలో జరిగిన సమావేశానికి హాజరైన అమరావతి రైతులు, మహిళలు. (ఇన్‌సెట్) మాట్లాడుతున్న ఏపీ సీఎం చంద్రబాబు

ఈమేరకు పార్లమెంట్‌లో చట్టం చేయిస్తా

అదనపు భూ సమీకరణపై అపోహలొద్దు

అమరావతి అభివృద్ధి కోసమే ఇదంతా.. లేదంటే మునిసిపాలిటీగా మిగులుతుంది

భూముల ధరలు పడిపోవు.. నాదీ హామీ

రైతులు, రైతు కూలీలకు ఏపీ సీఎం చంద్రబాబు భరోసా

అమరావతి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): అమరావతిని అంతర్జాతీయ స్థాయి నగరంగా చూడాలంటే ఫేజ్-2 భూ సమీకరణ తప్పనిసరి అని ఏపీ సీఎం చంద్రబాబు రాజధాని రైతులకు తెలిపారు. "అదనపు భూసమీకరణ కారణంగా అమరావతిలో భూముల ధరలు పడిపోతాయనే

మిగతా 3వ పేజీలో...



పురపాలనలో
గందరగోళం!

ఇద్దరు కార్యదర్శుల మధ్య పని విభజనే కారణం

కేంద్రంతో సంప్రదింపులకు బాధ్యత ఎవరిదనే దానిపై చర్చ

సీడీఎంఏనూ విభజించారా.. సందేహాలు

ఓఆర్ఆర్ అవతల అని పేర్కొనడమే కారణం

ప్రభుత్వం స్పష్టత ఇస్తుందంటున్న అధికార్లు

హైదరాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పురపాలక శాఖ విషయంలో ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయం గందరగోళానికి దారితీసింది. గతంలో ఎప్పుడూ లేనివిధంగా ఈ శాఖలో ఇద్దరు కార్యదర్శుల మధ్య పాలనాపరమైన విభజన చేయడం ఉద్యోగుల్లో చర్చనీయాంశంగా మారింది. గతంలో మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణాభివృద్ధి అని వేర్వేరు విభాగాలు ఉన్నా.. రాష్ట్ర స్థాయిలో మాత్రం ఒకే అధికారి పర్యవేక్షణ చేసేవారు. అయితే ప్రస్తుతం పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి పోస్టు లేకుండా ఇద్దరు కార్యదర్శుల మధ్య పని విభజన చేశారు. 2012లో నీటిపారుదల శాఖలో ఇదే తరహాలో ముగ్గురు

మిగతా 3వ పేజీలో...

చెప్పకుండానే నా శాఖలో
ఇద్దరి బదిలీనా?

వద్దని అన్నాక కూడా ట్రాన్స్‌ఫర్ చేస్తారా?

ఐఏఎస్‌ల బదిలీలపై ఓ మంత్రి అసంతృప్తి

రాజ్‌భవన్‌లో కార్యక్రమానికి గైర్హాజరు



హైదరాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): తనకు తెలియకుండా, కనీస సమాచారం లేకుండా.. తన శాఖలో కీలకమైన ఇద్దరు ఐఏఎస్ అధికారులను బదిలీ చేయడంపై ఓ సీనియర్ మంత్రి షాక్‌కు గురయ్యారు. ఆ ఇద్దరిలో ఒకరు బదిలీ అవుతారని కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. మరో ఐఏఎస్ అధికారి ఆ శాఖలో బాధ్యతలు తీసుకుని ఏడాది కూడా పూర్తి కాలేదు. ఆ ఐఏఎస్ బదిలీల జాబితాలో లేకున్నా.. చివరి నిమిషం ట్రాన్స్‌ఫర్ చేయడంపై సదరు సీనియర్ మంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. కచ్చితంగా బదిలీ అవుతారనుకున్న ఐఏఎస్ అధికారిని తన శాఖలోనే కొనసాగించాలని, ట్రాన్స్‌ఫర్ చేయవద్దని కొద్ది రోజుల క్రితమే ఆ మంత్రి ప్రభుత్వ పెద్దలను కలిసి విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. ఆ వినతిని పరిగణనలోకి తీసుకోకుండా ఆ ఐఏఎస్ అధికారిని సైతం సర్కారు ట్రాన్స్‌ఫర్ చేసింది. ఈ బదిలీల వ్యవహారంపై ఆ మంత్రి తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు తెలుస్తోంది. సోమవారం ఆయన కార్యక్రమాల న్నింటినీ రద్దు చేసుకుని ఇంట్లోనే ఉన్నారు. రాజ్‌భవన్‌లో లోకాయుక్త ప్రమాణ స్వీకారానికి హాజరు కావాల్సి ఉన్నా.. దానికి సైతం డుమ్మా కొట్టినట్లు తెలుస్తోంది. రోజంతా ముభావంగా ఉండటంతో పాటు సందర్శకులను సైతం కలవలేదని సమాచారం.



అఫిడవిట్‌లో అబద్ధాలు చెప్తారా?

రూ. 20 వేలు జరిమానా కట్టండి

గ్రూప్-1 మూల్యాంకనంలో తప్పులు జరిగాయంటూ పిటిషన్ వేసిన 19 మందికి హైకోర్టు జరిమానా

ఇందులో కొందరు ప్రభుత్వ ఉద్యోగులు

పిటిషన్ కొట్టివేత.. తప్పుడు పత్రాలివ్వడంపై విచారణకు ఆదేశం 14

మరో పిటిషన్‌లో.. నియామకపత్రాలు ఇవ్వొద్దన్న ఆదేశాలపై టీజీపీఎస్సీ అప్పీల్



తెలుగు ప్రావీణ్యం
తప్పనిసరి

తెలంగాణ న్యాయాధికారుల నియామకంపై సుప్రీంకోర్టు

రాష్ట్ర ప్రభుత్వ నిబంధనను సమర్థించిన ధర్మాసనం

ఉర్దూలో ప్రావీణ్యం నిబంధనను కూడా చేర్చాలన్న పిటిషన్‌పై విచారణకు నిరాకరణ

సీఎంపై వ్యాఖ్యలు.. కేటీఆర్‌పై కేసును కొట్టేసిన హైకోర్టు

12

పెట్టిన సెక్షన్లకు, కేసుకు పొంతన లేదని వ్యాఖ్య

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో న్యాయాధికారులుగా అర్హత సాధించేందుకు తెలుగులో ప్రావీణ్యాన్ని తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను స్వీకరించేందుకు సుప్రీం కోర్టు సోమవారం నిరాకరించింది. తెలంగాణ జ్యుడిషియల్ సర్వీస్‌లో చేరే అభ్యర్థులకు తెలుగులో ప్రావీణ్యం తప్పనిసరి అని స్పష్టం చేసింది. తెలంగాణ జ్యుడిషియల్ (సర్వీస్ అండ్ కేడర్) రూల్స్-2023 ద్వారా ఉర్దూను మినహాయించారని పిటిషనర్ మహ్మద్ షుజాత్ హుస్సేన్ లేవనెత్తిన వాదనను జస్టిస్ బీఆర్ గవాయ్, అగస్టిన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం తిరస్కరించింది. పరీక్షల్లో ఉర్దూను మినహాయించలేదని, తెలుగులో

మిగతా 13వ పేజీలో...





రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి పద్మ పురస్కారాలు అందుకుంటున్న నాగేశ్వర్‌రెడ్డి, బాలకృష్ణ

నాగేశ్వర్‌రెడ్డికి పద్మవిభూషణ్..
బాలయ్యకు పద్మభూషణ్

71 మందికి పద్మ పురస్కారాల అందజేత

రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా ప్రదానం

పురస్కారాలు అందుకున్న నలుగురు తెలుగువారు

మాడుగుల నాగఫణిశర్మ, అప్పారావుకు పద్మశ్రీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పద్మ పురస్కారాల ప్రదానోత్సవం రాష్ట్రపతి భవన్‌లో కనుల విందుగా జరిగింది. 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్రం దేశవ్యాప్తంగా 139 మందికి పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ పురస్కారాలను ప్రకటించింది. వారిలో 71 మందికి

మిగతా 2వ పేజీలో...


పహల్గాం పార్కులో ఆదివారం విదేశీ పర్యాటకుల సందడి

కశ్మీర్‌కు మళ్లీ పర్యాటక కళ

పహల్గాం, ఏప్రిల్ 28: అందమైన పైన్ చెట్లు, ఆకర్షించే ప్రదేశాలతో మిని స్విట్జర్లాండ్‌గా గుర్తింపు పొందిన పహల్గాంలో తిరిగి సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయి. ఏప్రిల్ 22న ఉగ్రవాదులు దాడి చేసి 26 మందిని బలిగొన్న తర్వాత కొన్ని రోజులపాటు స్తబ్దుగా ఉన్న ఆ ప్రాంతంలో ఆంక్షలు ఎత్తివేయడంతో మళ్లీ దేశీయులతో పాటు విదేశీ పర్యాటకులు సందడి చేస్తున్నారు. లిద్దర్ నది ఒడ్డున ఉన్న ప్రముఖ సెల్ఫీ పాయింట్ వద్ద ఫొటోలు దిగుతూ సరదాగా గడుపుతున్నారు. అలాగే అక్కడి ప్రకృతి అందాలను ఆస్వాదిస్తున్నారు. పర్యాటకులను ఆకర్షించేందుకు అక్కడి హోటళ్లు కూడా ప్రత్యేక డిస్కౌంట్లను అందజేస్తున్నాయి. పహల్గాంను చూసేందుకు కోల్‌కతా నుంచి వచ్చిన పర్యాటకుడు జయ్‌దీప్ ఘోష్ ఓ మీడియా చానల్‌తో మాట్లాడుతూ, "పహల్గాంలో ఆంక్షలు ఎత్తివేశారని తెలుసుకొని మేము శుక్రవారం రోజు ఇక్కడకు వచ్చాం. మార్కెట్‌తో పాటు ఇంకా కొన్ని దుకాణాలు మూసి ఉన్నప్పటికీ, ప్రస్తుతం ఇక్కడ మొత్తం సాధారణంగానే ఉంది. కాల్పులు జరిగిన బైసరన్ లోయ ప్రాంతాన్ని మినహాయించి మిగతా అన్ని ప్రదేశాలను చూశాం. ఇక్కడి సెక్యూరిటీ సిబ్బంది, స్థానిక ప్రజలు మాకు ఎంతో సహకరిస్తున్నారు." అని చెప్పారు. ఉగ్రవాదుల దాడికి ముందు పహల్గాంకు రోజుకు 3 వేల నుంచి 5 వేల మంది పర్యాటకులు వచ్చేవారు.

పహల్గాంపై నోరెత్తవద్దు!

» కాంగ్రెస్ నేతలకు అధిష్ఠానం హెచ్చరిక

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28: కాంగ్రెస్ అధిష్ఠానం ఎట్టకేలకు కళ్లు తెరచింది. పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాద దాడి అంశంపై నోరెత్తవద్దని, వివాదాస్పద వ్యాఖ్యలు చేయొద్దని పార్టీ నేతలను ఆదేశించింది. ఉగ్రవాద దాడి, సింధు జలాల ఒప్పందం సస్పెన్షన్‌పై తమ నేతలు కొందరు పాకిస్థాన్‌కు మద్దతుగా మాట్లాడుతుండడం.. 26 మంది పర్యాటకులను హత్య చేస్తే తేలిగ్గా తీసుకోవడం.. వారిని చంపేముందు ఉగ్రవాదులు మతం అడగలేదనడం.. తమ వారి హత్యలను కళ్లారా చూసిన బాధితులే మతి చలించి మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించడం.. దీనిపై బీజేపీ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించడంతో రాహుల్‌గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. కొందరు పార్టీ నేతలు కేంద్రానికి, యుద్ధానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారు. వీరి వ్యాఖ్యలను పాక్, ఆ దేశ మీడియా తమకు అనుకూలంగా ప్రచారం చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో నేతలెవరూ బహిరంగంగా ఎలాంటి వ్యతిరేక ప్రకటనలు చేయొద్దని రాహుల్, ఖర్గే ఆదేశించారని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ సోమవారం 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. ఉగ్రదాడిపై వర్కింగ్ కమిటీ తీర్మానం, ఖర్గే, రాహుల్, అధీకృత ఏఐసీసీ ఆఫీసు బేరర్లు వ్యక్తంచేసే అభిప్రాయాలను మాత్రమే పార్టీ వైఖరిగా పరిగణించాలని కోరారు.

బీబీసీ వార్తాసంస్థకు కేంద్రం హెచ్చరిక

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28: బీబీసీ వార్తా సంస్థను కేంద్ర ప్రభుత్వం హెచ్చరించింది. 'పాకిస్థాన్ సస్పెండ్స్ వీసాస్ ఫర్ ఇండియన్స్ ఆఫ్టర్ డెడ్లీ కశ్మీర్ అటాక్స్ ఆన్ టూరిస్ట్స్' అంటూ ఆ సంస్థ పెట్టిన హెడ్డింగ్‌పై అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆ కథనంలోనే ఉగ్రవాదులను తీవ్రవాదులుగా పేర్కొనడమేంటని ప్రశ్నిస్తూ విదేశాంగ శాఖలోని ప్రచార విభాగం బీబీసీ భారత్ హెడ్ మార్టిన్‌కు ఒక లేఖ రాసింది. ఇకపై బీబీసీ ప్రసారాలను పర్యవేక్షిస్తుంటామని స్పష్టం చేసింది. కాగా, పాకిస్థాన్‌కు చెందిన 16 యూట్యూబ్ చానళ్లను మన దేశంలో నిషేధిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత రెచ్చగొట్టే కథనాలను, మతపరంగా సున్నితమైన కంటెంట్‌ను ప్రసారం చేస్తున్నందున ఈ చానళ్లపై నిషేధం విధించినట్లు ప్రభుత్వం తెలిపింది. హోం శాఖ సిఫారసు మేరకు డాన్, సామా టీవీ, బోల్ న్యూస్, రాఫ్తర్, జీయో న్యూస్, సునో న్యూస్ తదితర 16 యూట్యూబ్ చానళ్ల ప్రసారాలను భారత్‌లో నిషేధించారు.

యూపీ గాయని నేహా రాథోడ్‌పై దేశద్రోహం కేసు



లఖ్‌నవూ, ఏప్రిల్ 28: ఉత్తరప్రదేశ్‌కు చెందిన జానపద గాయని నేహా సింగ్ రాథోడ్‌పై పోలీసులు దేశద్రోహం కేసు నమోదు చేశారు. పహల్గాం విషాదం నేపథ్యంలో ఓ వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని ఆమె చేసిన సోషల్ మీడియా పోస్టులు రెచ్చగొట్టేలా ఉన్నాయని, ఇవి దేశ సమగ్రతకు హాని కలిగిస్తాయంటూ అభయ్ ప్రతాప్ సింగ్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుతో ఈ కేసు నమోదైంది. దీనిపై నేహా స్పందించారు. తనపై కేసు నమోదు చేసిన ప్రభుత్వం వాస్తవ అంశాల నుంచి దృష్టి మళ్లించాలనుకుంటోందన్నారు. "పహల్గాం దాడికి ప్రతిస్పందనగా ప్రభుత్వం ఇప్పటి వరకు ఏం చేసింది? నాపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడమా? మీకు ధైర్యం ఉంటే వెళ్లి ఉగ్రవాదుల తలలు తీసుకురండి" అని పేర్కొంటూ ఆమె ఎక్స్‌లో సోమవారం ఓ వీడియో షేర్ చేశారు.

సింధు జలాల నిల్వకు భారత్ రెండు ప్రాజెక్టులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28: సింధు నదీ జలాలను నిల్వ చేసుకునేందుకుగాను రెండు ప్రాజెక్టులను భారత్ నిర్మిస్తోందని సింధు నదీ జల వ్యవహారాల మాజీ కమిషనర్, సింధు జలాల ఒప్పందానికి పదేళ్లు టెక్నికల్ కన్సల్టెంట్‌గా పని చేసిన ఏకే బజాజ్ తెలిపారు. సింధూ జలాల ఒప్పందంపై రెండేళ్ల క్రితమే తిరిగి చర్చలు జరపడానికి ప్రభుత్వం ఒక ఫ్రేమ్‌వర్క్‌ను సిద్ధం చేసినట్టు ఎన్‌డీటీవీ ఇంటర్వ్యూలో బజాజ్ తెలిపారు. మరోవైపు సింధు నది వ్యవస్థపై రెండు కొత్త నీటి నిల్వ ప్రాజెక్టుల (పకుల్దుల్ ప్రాజెక్టు, బర్సర్ ప్రాజెక్టు) పనులను ప్రభుత్వం వేగవంతం చేసిందన్నారు. పకుల్దుల్ ప్రాజెక్టు నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయని, బర్సర్ ప్రాజెక్టు తుది ప్రణాళిక దశలో ఉందని చెప్పారు. ఈ రెండు ప్రాజెక్టులు సిద్ధమైతే సింధు. దాని ఉప నదుల నుంచి భారత్ అవసరానికి అనుగుణంగా నీటిని మళ్లించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు.

తండ్రి భారతీయుడు.. తల్లి పాకిస్థానీ

» ఏపీలో 19 ఏళ్లుగా పాకిస్థాన్ పౌరసత్వంతోనే కూతురు

ధర్మవరం రూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్ పౌరసత్వం ఉన్న ఓ యువతి 19 ఏళ్ల నుంచి శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలో ఉంటోంది. తండ్రి ఇండియన్, తల్లి పాకిస్థానీ కావడం, కార్గిల్ యుద్ధ సమయంలో తల్లి పాకిస్థాన్‌లో ప్రసవించడంతో ఆ యువతి విచిత్రమైన పరిస్థితిని ఎదుర్కొంటోంది. ధర్మవరం పట్టణంలోని చంద్రబాబునగర్‌కు చెందిన రఫీక్ అహ్మద్ ఆయుర్వేద వైద్య నిపుణుడు. బళ్లారికి చెందిన ఇతడి మేనమామ మహబూబ్ పీరాన్.. దేశ విభజన సమయంలో పాకిస్థాన్‌కు వెళ్లిపోయాడు. రఫీక్ 1989లో మేనమామ కూతురు జీనత్ పీరాను వివాహం చేసుకున్నాడు. రఫీక్, జీనత్ దంపతులకు మొదట ఇక్కడే కుమారుడు జన్మించాడు. జీనత్ 1998లో రెండోసారి గర్భం దాల్చింది. ఆ సమయంలో తన తండ్రి ఆరోగ్యం బాగాలేకపోవడంతో చూసేందుకు జీనత్ కరాచీ వెళ్లింది. అదే సమయంలో కార్గిల్ యుద్ధం జరగడంతో ఆమె వెంటనే భారత్‌కు తిరిగిరాలేకపోయింది. ఈ క్రమంలో 1999లో కూతురు రంశాకు జన్మనిచ్చింది. 2005లో ఆమె తన కూతురిని తీసుకుని ధర్మవరంలో ఉన్న భర్త వద్దకు వచ్చింది. దాదాపు ఏడేళ్లపాటు అక్కడే ఉండటంతో రంశాకు పాకిస్థాన్ ప్రభుత్వం అక్కడి పౌరసత్వాన్ని ఇచ్చింది. ఇక్కడికి వచ్చినప్పుడు రంశాకు తల్లిదండ్రులు లాంగ్ విజిట్ వీసా తీసుకున్నారు. ప్రస్తుతం రంశా వయసు 26 ఏళ్లు. ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు ధర్మవరంలో చదువుకుంది. అనంతపురంలో బీ ఫార్మసీ ఫైనల్ ఇయర్ చదువుతోంది. ఇప్పటికీ ఆమె పాకిస్థాన్ పౌరసత్వంతోనే ఉంటోంది. లాంగ్ విజిట్ వీసా 2029 వరకు ఉంది. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో దేశంలో ఉన్న పాకిస్థాన్ పౌరుల వివరాలను సేకరిస్తున్న క్రమంలో రంశా పౌరసత్వం విషయం వెలుగులోకి వచ్చింది. దీనిపై ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్ మాట్లాడుతూ.. రంశా రఫీక్‌కు లాంగ్‌టర్మ్ వీసా ఉందని, ఆ వీసా కింద దేశంలో ఉండవచ్చనే కేంద్ర ప్రభుత్వ ఆదేశాలున్నాయని స్పష్టం చేశారు.


పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో..
పాక్‌పై భారత్ దాడి తథ్యం!

(మొదటి పేజీ తరువాయి)

అణ్వాయుధాలను వాడతామని స్పష్టం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో తాము తీసుకోవాల్సిన వ్యూహాత్మక నిర్ణయాలను తీసుకున్నామని పేర్కొన్నారు. తాజా పరిణామాల నేపథ్యంలో.. తాము తమ మిత్ర దేశాలైన గల్ఫ్ దేశాలు, చైనాను సంప్రదించామని, అమెరికా, బ్రిటన్ సహా పలు దేశాలకు పరిస్థితుల గురించి వివరించామని చెప్పారు. అరేబియన్ గల్ఫ్‌లోని కొన్ని మిత్రదేశాలు తమతోపాటు భారత్‌తో కూడా మాట్లాడాయని తెలిపారు. అమెరికా మాత్రం ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోవడానికి సిద్ధంగా లేదని చెప్పారు. అయితే.. ఆ తర్వాత కాసేపటికే ఆయన మాట మార్చారు. 'పాక్‌పై భారత్ దాడి తథ్యం' అనే మాటే తాను అనలేదని పాకిస్థాన్‌కు చెందిన 'సమా టీవీ'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. యుద్ధం జరిగే అవకాశం స్పష్టంగా ఉందని.. దీనికి సంబంధించే వచ్చే 2, 3, 4 రోజులే అత్యంత కీలకమని మాత్రమే తాను అన్నానని.. ఈ నాలుగు రోజుల్లో ఏమీ జరగకపోతే ప్రమాదం తప్పినట్టే అన్నానని వెల్లడించారు. "(యుద్ధ) ప్రమాదం అయితే స్పష్టంగా ఉంది. కానీ.. అది తథ్యమని నేను చెప్పలేదు" అని ఆయన స్పష్టం చేశారు. చుట్టుపక్కల దేశాలు ఈ ముప్పును తప్పించడానికి ప్రయత్నిస్తున్నాయని.. దేశ సార్వభౌమాధికారానికి భంగం కలిగే పరిస్థితి వస్తే ఎలాంటి యుద్ధపరిస్థితినైనా ఎదుర్కోవడానికి పాక్ 100 శాతం సిద్ధంగా ఉందని తేల్చిచెప్పారు.

తుర్కియే మద్దతు..

భారత్-పాక్ మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకొన్న సమయంలో.. పాకిస్థాన్‌కు తుర్కియే మద్దతు తెలిపింది. మిలటరీ హార్డ్‌వేర్‌తో పాటు ఆరు సి-130 విమానాలను ఇస్లామాబాద్‌కు పంపింది. ఇరుదేశాల మధ్య ఉన్న సరిహద్దు రక్షణ సహకారంలో భాగంగానే తుర్కియే యుద్ధ సామగ్రిని అందించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ విమానాలు చేరుకున్న విషయాన్ని పాక్, తుర్కియే వర్గాలు ధ్రువీకరించాయి. ఇదిలా ఉండగా.. భారత సరిహద్దుల వెంబడి ఉన్న కీలక వైమానిక స్థావరాలను పాక్ క్రియాశీలం చేసింది. పెస్సి, స్కర్దు, స్వాత్ స్థావరాల్లో ఎఫ్-16, జే-10, జేఎఫ్-17 యుద్ధ విమానాలను మోహరించింది.



పహల్గాం దాడి వివరాలు సేకరించిన ఎన్ఐఏ

పహల్గాంలో ఉగ్రవాదుల దాడి వివరాలను సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ భరత్ భూషణ్ భార్య సుజాత, మంజునాథరావు భార్య పల్లవి నుంచి ఎన్ఐఏ అధికారులు సేకరించారు. ఉగ్రదాడిలో భరత్ భూషణ్, మంజునాథరావు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. బెంగళూరు మత్తికెరె ప్రాంతంలోని సుందరనగర్‌లో భరత్‌భూషణ్ ఇంటికి ఎన్ఐఏ అధికారులు ఆదివారం వెళ్లారు. శివమొగ్గలోని మంజునాథరావ్ ఇంటికి సోమవారం వెళ్లారు. కాల్పులకు ముందు ఉగ్రవాదులు ఏం మాట్లాడారు?, వారు ముఖాలు ఎలా ఉన్నాయి? వంటి వివరాలు సేకరించారు.

పాక్ ఆర్మీ బంకర్లలో ఉగ్రవాదులు

పహల్గాం దాడి నేపథ్యంలో భారత్ చేపట్టిన చర్యలు, నియంత్రణ రేఖ (ఎల్వోసీ) అవతల ఉగ్ర స్థావరాలపై కన్నేయడంతో.. పాకిస్థాన్ అప్రమత్తమైంది. ఉగ్రవాదులను పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే) సరిహద్దుల సమీపంలోని లాంచ్‌ప్యాడ్‌ల (భారత్‌లోకి చొరబడేందుకు సిద్ధంగా ఉన్న ఉగ్రవాదులను తాత్కాలికంగా ఉంచే స్థావరాల) నుంచి భద్రమైన ప్రదేశాలకు తరలిస్తోంది. ముఖ్యంగా కేల్, సార్డి, దుధ్నియాల్, ఆత్ముఖం, జూరా, లిపా, పచ్చిబన్, కహూటా, కొట్లి, ఖుయిరట్టా, మంధార్, నిక్రైల్, చమన్‌కోట్, జాన్‌కోట్ తదితర ముఖ్యమైన ఉగ్ర శిక్షణ కేంద్రాల్లోని సుమారు 200 మంది ఉగ్రవాదులను.. పాక్ ఆర్మీ బంకర్లు, రహస్య స్థావరాలకు తరలించినట్టు సమాచారం. అంతేకాదు ఉగ్రవాద శిక్షణ శిబిరాలను కూడా సరిహద్దులకు దూరంగా పీఓకే లోపలి ప్రాంతాలకు మార్చుతున్నట్టు తెలిసింది. భారత్ అకస్మాత్తుగా విరుచుకుపడవచ్చనే ఆందోళనతో పాటు, ఉగ్రవాద వ్యవహారాలు బయటికి పొక్కకుండా పాక్ ఈ చర్యలు చేపట్టినట్టు భారత నిఘా వర్గాలు చెబుతున్నాయి. పీఓకేలో ఇప్పటివరకు సుమారు 42 ఉగ్రవాద లాంచ్‌ప్యాడ్‌లను గుర్తించినట్టు సమాచారం. శిక్షణ పొందిన ఉగ్రవాదులను వీటిలో సిద్ధంగా ఉంచుతారు. ఆయుధాలు, ఆహారాన్ని అందజేస్తారు. వీటిలోని ఉగ్రవాదులు అదను దొరకగానే భారత్‌లోకి చొరబడతారు.

చిక్కినట్లే చిక్కి.. తప్పించుకుంటున్నారు

» పహల్గాం ఉగ్రవాదులను నాలుగు సార్లు గుర్తించిన భద్రత బలగాలు

జమ్మూ, ఏప్రిల్ 28: పహల్గాం ఉగ్రవాదులు భద్రత బలగాలకు చిక్కినట్లే చిక్కి.. తప్పించుకుంటున్నారు. ఉగ్రదాడిలో నలుగురు పాల్గొన్నట్లు ఇప్పటికే తేలింది. వీరిలో ఇద్దరు పాకిస్థానీలు. స్థానికులు అందిస్తున్న సమాచారం, నిఘా వర్గాల సూచనలతో భద్రత బలగాలు వీరి కోసం గాలిస్తుండగా.. నాలుగు సార్లు పక్కా లొకేషన్‌ను ట్రాక్ చేశారు. అయితే.. బలగాలు అక్కడికి వెళ్లేలోపు.. ఉగ్రవాదులు అక్కడి నుంచి దట్టమైన అడవుల్లోకి పారిపోయారు. "ఉగ్రవాదులను తొలుత పహల్గాం సమీపంలోని తెహస్లీ వద్ద గుర్తించాం. భద్రత బలగాలు అక్కడికి చేరుకునేలోపు.. వారు అడవుల్లోకి పారిపోయారు. కల్గాం అడవుల్లో వారి ఉనికి ఉన్నట్లు గుర్తించి, అక్కడికి వెళ్లగా.. ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. భద్రత బలగాలు ఎదురుకాల్పులు జరపడంతో అడవుల్లోకి పారిపోయారు. ఆ తర్వాత కొకెర్నాగ్‌లో, అక్కడికి సమీపంలోని ఓ గ్రామంలో ఉగ్రవాదులున్నట్లు గుర్తించినా, వారు పారిపోయారు" అని ఓ సైనికాధికారి జాతీయ మీడియాకు తెలిపారు. మరోవైపు జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) కూడా ఉగ్రవాదులను ట్రాక్ చేస్తోంది. పహల్గాం దాడి సమయంలో ఉగ్రవాదులు ఇద్దరు పర్యాటకుల సెల్‌ఫోన్లను తస్కరించారు. కమ్యూనికేషన్ కోసం వాటిని ఉపయోగించే అవకాశాలున్నాయి. దీంతో.. ఆ ఫోన్లపైనా నిఘా కొనసాగుతోందని అధికారులు తెలిపారు.

5లక్షల మంది పాక్ యువతులు పెళ్లి చేసుకొని భారత్‌లో

పాక్ ఉగ్రవాదానికి ఇది కొత్తరూపం: దూబే

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే కీలక వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్‌కు చెందిన 5లక్షల మంది యువతులు.. పెళ్లి చేసుకోవడం ద్వారా భారత్‌లోకి ప్రవేశించారని అన్నారు. భారత పౌరసత్వం కూడా లేకుండానే వారు ఇక్కడ నివసిస్తున్నారని తెలిపారు. ఇది పాకిస్థాన్ ఉగ్రవాదానికి కొత్త రూపం అని 'ఎక్స్'లో దూబే పేర్కొన్నారు. భారత్‌లోకి ఈ రూపంలో చొరబడ్డ శత్రువులతో ఎలా పోరాడగలమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వీరి వీసాలపై దర్యాప్తు జరిపించాలన్నారు.



లోకం తీరు

ఇక నేవీలోనూ రాఫెల్ సత్తా!

63 వేల కోట్లతో 26 రాఫెల్ మెరైన్ జెట్ల కొనుగోలుకు ఫ్రాన్స్‌తో భారత్ ఒప్పందం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28: భారత్-పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న తరుణంలో మన నౌకాదళ సామర్థ్యాన్ని మరింత పెంచే దిశగా కీలక ముందడుగు పడింది. వాయుసేనకే పరిమితమైన రాఫెల్ యుద్ధ విమానాలు త్వరలోనే భారత నేవీకి కూడా అందనున్నాయి. నౌకాదళం కోసం 26 రాఫెల్ మెరైన్ యుద్ధ విమానాలు కొనుగోలు చేసేందుకు ఫ్రాన్స్‌తో భారత్ భారీ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు రూ.63వేల కోట్ల రూపాయల విలువైన మెగా డీల్‌పై ఇరుదేశాలు సోమవారం సంతకాలు చేశాయి. ఇది ఇరు ప్రభుత్వాల మధ్య నేరుగా కుదిరిన ఒప్పందం. వర్చువల్‌గా జరిగిన ఈ కార్యక్రమంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, రక్షణ శాఖ కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్, నేవీ వైస్ చీఫ్ అడ్మిరల్ కె స్వామినాథన్ పాల్గొన్నారు. స్వదేశీ విమానవాహక యుద్ధ నౌక ఐఎన్ఎస్ విక్రాంత్‌లో రాఫెల్ జెట్లను మోహరించేందుకు ఫ్రాన్స్ రక్షణ సంస్థ డసాల్ట్ ఏవియేషన్ నుంచి భారత్ ఈ విమానాలు కొనుగోలు చేయనుంది. ప్రధాని మోదీ నేతృత్వంలోని భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఎస్) ఈ కొనుగోలుకు ఆమోదం తెలిపిన మూడు వారాల్లోనే ఈ డీల్ కుదరడం గమనార్హం. ఒప్పందంలో భాగంగా.. భారత నౌకాదళానికి 22 సింగిల్ సీటర్లు, నాలుగు ట్విన్ సీటర్లతో కూడిన మొత్తం 26 రాఫెల్ మెరైన్ యుద్ధ విమానాలను డసాల్ట్ ఏవియేషన్ 37 నుంచి 65 నెలల్లోగా డెలివరీ చేయాల్సి ఉంటుంది. అంటే 2031 నాటికి ఈ 26 యుద్ధవిమానాల డెలివరీలు పూర్తవుతాయని అంచనా వేస్తున్నారు.


పర్యాటకుడు సెల్ఫీ వీడియో తీసుకుంటుండగా, ఉగ్రదాడిలో బుల్లెట్ దెబ్బ తగిలి కిందపడుతున్న ఓ వ్యక్తి

జిప్‌లైన్‌పై రైడ్ చేస్తూ సెల్ఫీ వీడియో!

» తెలియకుండానే ఉగ్రదాడిని రికార్డ్ చేసిన పర్యాటకుడు!

పహల్గాం, ఏప్రిల్ 28: పహల్గాం ఉగ్రదాడికి సంబంధించి ఓ కొత్త వీడియో వెలుగులోకి వచ్చింది. అహ్మదాబాద్‌కు చెందిన ఓ పర్యాటకుడు జిప్‌లైన్‌పై రైడ్ చేస్తూ సెల్ఫీ వీడియో తీసుకోగా అందులో ఉగ్రదాడికి సంబంధించిన దృశ్యాలు రికార్డయ్యాయి. జిప్‌లైన్‌పై ప్రయాణిస్తూ అతడు కేరింతలు కొడుతుండగా, దిగువన ఉన్న వ్యక్తుల కేకలు, తుపాకీ శబ్దాలు అందులో రికార్డయ్యాయి. అలాగే ఉగ్రవాదుల దాడికి భయపడి పర్యాటకులు పరుగెడుతున్న దృశ్యాలు, దాడిలో గాయపడిన ఓ వ్యక్తి నేలకొరిగిన దృశ్యాలు రికార్డయ్యాయి. అయితే తన చెవులు కప్పి ఉంచడం వల్ల దిగువన జరుగుతున్న విషయాలేవీ ఆ పర్యాటకుడు గుర్తించలేదు. కాగా, రైడ్‌కు ముందు జిప్‌లైన్ ఆపరేటర్ వ్యవహార శైలి తీరుపై పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కాగా, పహల్గాం ఉగ్రదాడికి ముష్కరులు చైనా మెసేజింగ్ యాప్‌లను వాడినట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు వెల్లడించాయి. ఈ యాప్‌ల సాయంతోనే ఉగ్రవాదులు భారత సరిహద్దుకు ఆవల ఉన్నవారితో సమాచారాన్ని పంచుకున్నాయని, ఆదేశాలు అందుకున్నాయని వివరించాయి. ఈ యాప్‌లను 2020లో గల్వాన్ ఘర్షణ అనంతరం భారత్ నిషేధించిందని పేర్కొన్నాయి. గల్వాన్ ఘర్షణ తర్వాత ఇండియా నిషేధం విధించిన చైనా మెసేజింగ్ యాప్‌ల్లో వీచాట్, క్యూక్యూ ఇంటర్నేషనల్ ఉన్నాయి.


మృతదేహాలను చూపి
రాష్ట్ర హోదా డిమాండ్ చేయను

పర్యాటకుల భద్రతకు నాదే బాధ్యత

» క్షమాపణ చెప్పడానికి కూడా నా వద్ద మాటల్లేవు

» జమ్ము కశ్మీర్ అసెంబ్లీ ప్రత్యేక సమావేశాల్లో సీఎం ఒమర్

శ్రీనగర్, ఏప్రిల్ 28: పహల్గాం ఉగ్ర దాడిని రాజకీయం చేయదలచుకోలేదని, అమాయకుల మృతదేహాలను చూపి రాష్ట్ర హోదాను డిమాండ్ చేయాలనుకోవడం లేదని జమ్ము కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా వ్యాఖ్యానించారు. ఉగ్ర దాడిపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. అసెంబ్లీ ప్రత్యేక సమావేశాల్లో సోమవారం ఆయన మాట్లాడారు. "కొద్ది రోజుల కిందటే పెళ్లి చేసుకున్న నేవీ అధికారి భార్యను నేనెలా ఓదార్చగలను? మేం చేసిన నేరం ఏమిటని బాధితుల కుటుంబాలు అడుగుతున్నాయి. అందుకు నా దగ్గర జవాబు లేదు. జమ్ము కశ్మీరులో శాంతి భద్రతలకు మేం ఇన్‌చార్జి కాదు. కశ్మీరుకు పర్యాటకులను ఆహ్వానించాం. వారి భద్రతకు నాదే బాధ్యత. కానీ, పర్యాటకులకు క్షమాపణ చెప్పడానికి కూడా నా దగ్గర మాటల్లేవు. అయినా, ప్రస్తుత పరిస్థితిని రాష్ట్ర హోదా డిమాండ్ చేయడానికి ఉపయోగించుకోదలచుకోవడం లేదు. మృతదేహాలను చూపి రాష్ట్ర హోదాను డిమాండ్ చేయను. అంత నీచ మనస్తత్వం నాది కాదు. దానిని మరో సందర్భంలో డిమాండ్ చేస్తాం" అని వ్యాఖ్యానించారు. ఉగ్ర దాడిని తీవ్రంగా ఖండిస్తూనే మృతుల పేర్లను అసెంబ్లీలో చదివి వినిపించారు. పర్యాటకుల భద్రత తమ బాధ్యతని, కానీ ఈ దాడి తమను చేష్టలుడిగేలా చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ, "ఇంత విషాదంలోనూ ఓ ఆశా కిరణం ఉంది. ఇటువంటి దాడికి వ్యతిరేకంగా గత 26 ఏళ్లలో ఎవరూ బయటకు వచ్చి నిరసనలు తెలిపిన దాఖలాలు లేవు. స్వచ్ఛందంగా పోస్టర్లు, బ్యానర్లు పట్టుకుని ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కశ్మీరు వ్యాప్తంగా మసీదుల్లో నివాళులర్పించారు. ఇది చాలా కీలక పరిణామం. ప్రజలు సహకరిస్తే ఉగ్రవాదం అంతమవుతుంది. ఇది దానికి ఆరంభం మాత్రమే" అని ఆయన వ్యాఖ్యానించారు. తుపాకులతో ఉగ్రవాదాన్ని నియంత్రించగలమని, కానీ, ప్రజలు సహకరించినప్పుడే అది అంతమవుతుందని చెప్పారు.



మోదీతో రాజ్‌నాథ్ 40నిమిషాలు భేటీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28: రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సోమవారం ప్రధాని మోదీతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత సరిహద్దుల్లో భద్రతా ఏర్పాట్లు, ఉగ్రవాదుల కోసం కొనసాగుతున్న వేట తదితర అంశాలను సమగ్రంగా వివరించారు. ఈ ఇరువురి సమావేశం సుదీర్ఘంగా 40నిమిషాల పాటు కొనసాగింది. అంతకుముందు రాజ్‌నాథ్‌తో భారత ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేదీ సమావేశమయ్యారు. కశ్మీర్‌లో ముఖ్యంగా పహల్గాంలో క్షేత్రస్థాయిలో పరిస్థితులను వివరించారు. ఈ నెల 22న పహల్గాం ఉగ్రదాడిలో 26మంది చనిపోయారు.

నాగేశ్వర్‌రెడ్డికి పద్మవిభూషణ్..
బాలయ్యకు పద్మభూషణ్

(మొదటి పేజీ తరువాయి)

సోమవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పురస్కారాలను ప్రదానం చేశారు. మిగిలిన వారికి త్వరలోనే అందజేయనున్నారు. ప్రముఖ వైద్యుడు దువ్వూరు నాగేశ్వర్‌రెడ్డి పద్మవిభూషణ్, ప్రముఖ సినీనటుడు నందమూరి బాలకృష్ణ పద్మభూషణ్ పురస్కారాలను అందుకోగా.. సహస్రావధాని మాడుగుల నాగఫణిశర్మ, కళారంగంలో మిరియాల అప్పారావు పద్మశ్రీ పురస్కారాలను స్వీకరించారు. మొత్తం ఏడుగురు తెలుగువారికి ఈ ఏడాది పద్మ పురస్కారాలు లభించగా వారిలో తొలివిడత నలుగురు అవార్డులను అందుకున్నారు. ఐదు దశాబ్దాలుగా చిత్ర పరిశ్రమలో ఉన్న ప్రముఖ సినీనటుడు, రాజకీయనాయకుడిగా బాలకృష్ణను ప్రశంసాపత్రంలో పేర్కొనగా.. డి.నాగేశ్వర్‌రెడ్డిని ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజిస్టు అని, వైద్య పరిశోధనలో అనేక విజయాలు సాధించిన వైద్యుడు అని కొనియాడారు. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా, పౌర విమానయాన మంత్రి కె.రామ్మోహన్ నాయుడు, బొగ్గు, గనుల మంత్రి కిషన్‌రెడ్డితో పాటు పలువురు కేంద్ర మంత్రులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. నందమూరి కుటుంబ సభ్యులు, పలువురు అవార్డు గ్రహీతల కుటుంబ సభ్యులతో అశోకా హాలు కళకళలాడింది. బాలకృష్ణ పద్మభూషణ్ పురస్కారాన్ని స్వీకరిస్తుండగా ఆయన సతీమణి వసుంధర, సోదరి నారా భువనేశ్వరి, ఏపీ మంత్రి లోకేశ్, ఆయన సతీమణి బ్రాహ్మణి, ఎంపీ భరత్, ఆయన సతీమణి తిలకించారు. పురస్కారాలు అందుకున్న వారిలో సినీనటులు శేఖర్ కపూర్, అజిత్ కుమార్ ఉన్నారు. సుజుకి కంపెనీ అధినేత ఒసాము సుజుకి, ప్రముఖ గాయకుడు పంకజ్ ఉదాస్, బిహార్ మాజీ డిప్యూటీ సీఎం సుశీల్‌కుమార్ మోదీ, ప్రముఖ మలయాళీ రచయిత వాసుదేవన్ నాయర్ దివంగతులైనందువల్ల వారి కుటుంబ సభ్యులు పురస్కారాలను స్వీకరించారు.


అప్పారావు తరఫున పద్మశ్రీ అందుకుంటున్న ఆయన కూతురు శ్రీదేవి


పద్మశ్రీతో నాగఫణి శర్మ

వరుసగా నాలుగో రోజు
పాక్ కాల్పులు

జమ్ము, ఏప్రిల్ 28: వరుసగా నాలుగో రోజు కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ పూంచ్ సెక్టార్‌లో నియంత్రణ రేఖ (ఎల్ఓసీ) వెంబడి పాకిస్థాన్ కాల్పులకు పాల్పడింది. జమ్ము కశ్మీర్‌లోని పూంచ్, కుప్వారా జిల్లాల్లో ఆదివారం అర్ధరాత్రి పాకిస్థాన్ ఆర్మీ జరిపిన కాల్పుల్ని సమర్థంగా తిప్పికొట్టామని భారత సైన్యం ప్రకటించింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని తెలిపింది. గత వారం పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి తర్వాత దాయాది దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే. మరోవైపు పాక్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే) నుంచి దోడా, కిష్త్వార్ జిల్లాల్లో కార్యకలాపాలు కొనసాగిస్తున్న ఉగ్రవాదుల నివాసాల్లోనూ, వారికి సహకరిస్తున్నారన్న అనుమానితుల ఇళ్లల్లోనూ పోలీసుల సోదాలు కొనసాగుతున్నాయని అధికార వర్గాలు తెలిపాయి. కాగా, పాకిస్థాన్ గగనతలం మూసివేత అనంతరం తలెత్తిన పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని, పూర్తిగా అవగాహనకు వచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు చెప్పారు.

హైదరాబాద్-విజయవాడ హైవే
6 లేన్లుగా విస్తరణకు 5 వేల కోట్లు

- కిలోమీటరకు రూ.20 కోట్ల చొప్పున అవసరమని ఎన్‌హెచ్ఏఐ అంచనా
- మే నెలాఖరుకు డీపీఆర్ పూర్తికి చర్యలు
- ఆ వెంటనే అనుమతి తేవాలని యోచన

హైదరాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి (ఎన్‌హెచ్-65)ని ఆరు లేన్లుగా విస్తరించే ప్రక్రియ వేగం పుంజుకుంటోంది. కిలోమీటరుకు సుమారు రూ.20 కోట్ల చొప్పున 265 కిలోమీటర్లకు రూ.5,300 కోట్ల వరకు నిధులు అవసరమవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. మే నెల చివరి నాటికి సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను పూర్తిచేయించాలని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) భావిస్తోంది. జూన్ మొదటి వారంలో విస్తరణ పనులకు అవసరమైన అనుమతులను తీసుకురావాలని యోచిస్తోంది. ఇందులో భాగంగా డీపీఆర్ రూపొందించే పనిని దక్కించుకున్న భోపాల్‌కు చెందిన సంస్థతో ఎన్‌హెచ్ఏఐ అధికారులు సమీక్షిస్తున్నారు. గతంలోనే ఆరు లేన్లకు సరిపడా భూమిని సేకరించారు. దాంతో ఇప్పుడు భూ సేకరణ చేయాల్సిన అవసరంలేదు. అయితే విస్తరణకు సాంకేతికంగా కొన్ని అంశాలను పరిశీలించి, అధ్యయనం చేయాలి. అందుకోసమే డీపీఆర్‌ను రూపొందించనున్నారు. హైదరాబాద్ అవతల దండు మల్కాపూర్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని గొల్లపూడి వరకు దాదాపు 265 కిలోమీటర్ల మేర రహదారిని ఆరు లేన్లుగా విస్తరించనున్నారు. మార్గమధ్యలో కొన్నిచోట్ల వెహికల్ అండర్ పాస్‌లు (వీయూపీలు), రోడ్ ఓవర్ బ్రిడ్జిలు (ఆర్‌వోబీలు), బ్రిడ్జిలు నిర్మించనున్నారు. ఏపీ-తెలంగాణ సరిహద్దు రామాపురం క్రాస్ రోడ్డు దగ్గర వీయూపీ నిర్మించాలని నిర్ణయించారు. ప్రస్తుతం అక్కడ ఓపెన్ జంక్షన్ ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. రామాపురం దగ్గర్లో సిమెంటు ఫ్యాక్టరీలు ఉండడంతో లారీలు ఎక్కువగా తిరుగుతుంటాయి. అందువల్ల వీయూపీ నిర్మించనున్నారు. ఆ జంక్షన్‌కు దగ్గర్లో పాలేరువాగు ప్రవహిస్తోంది. దానిపై ఉన్న బ్రిడ్జి ఇటీవల వర్షాలకు దెబ్బతినగా, మరమ్మతులు చేశారు. దానికి పక్కనే కొత్త బ్రిడ్జి నిర్మించాలని అధికారులు నిర్ణయించినట్టు సమాచారం. ఇవికాకుండా మిగతాచోట్ల ఎక్కడెక్కడ వీయూపీలు, ఆర్‌వోబీలు, బ్రిడ్జిలు నిర్మించాలనే అంశంపై కూడా అధికారులు ఒక స్పష్టతకు వచ్చారు. ప్రస్తుతం ఈ రహదారిపై రోజుకు 50 వేలకు పైగా వాహనాలు తిరుగుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.



యాదాద్రి థర్మల్ ప్లాంట్‌లో అగ్ని ప్రమాదం

- ఆయిల్ పైప్‌లైన్ లీకై అంటుకున్న మంటలు

దామరచర్ల, హైదరాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం సమీపంలోని యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం (వైటీపీఎస్) యూనిట్-1లో ఆదివారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం జరిగింది. ఈ యూనిట్లో 800 మెగావాట్ల పూర్తి సామర్థ్యంతో విద్యుదుత్పత్తికి సంబంధించి ట్రయల్ రన్ నిర్వహిస్తున్న సమయంలో ఆయిల్ పైప్‌లైన్ లీకైంది. చిమ్నీ దిగువన అత్యంత వేడిగా ఉండే భాగాలపై ఈ ఆయిల్ పడటంతో.. ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఫైర్ సిబ్బంది కాసేపట్లోనే మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అప్పటికే సుమారు 30 మీటర్ల ఎత్తులోని కేబుల్ కమ్యూనికేషన్ వ్యవస్థ దెబ్బతిన్నట్టు అధికారులు గుర్తించారు. లక్షల్లో ఆస్తినష్టం ఉండవచ్చని అంచనా వేశారు. యూనిట్-1 నిర్మాణం పూర్తయిన నేపథ్యంలో.. వచ్చే నెలలో జాతికి అంకితం చేయనున్నారు. కాగా, వైటీపీఎస్‌లో అగ్ని ప్రమాదంపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సోమవారం జెన్‌కో సీఎండీ సందీప్‌కుమార్ సుల్తానియా, బీహెచ్ఈఎల్ సీఎండీ సదా శివమూర్తి, జెన్‌కో, బీహెచ్ఈఎల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ప్రమాదానికి కారణాలను తెలుసుకున్నారు. రెండు రోజుల్లో మరమ్మతులు పూర్తిచేసి, పనులు పునః ప్రారంభించాలని ఆదేశించారు. కాగా.. ఆయిల్ లీకేజీ ప్రమాదానికి కారణమని, యూనిట్-1 ఇంకా నిర్మాణ సంస్థ బీహెచ్ఈఎల్ ఆధీనంలోనే ఉందని జెన్‌కో యాదాద్రి ప్రాజెక్టు డైరెక్టర్, చీఫ్ ఇంజనీర్(కన్‌స్ట్రక్షన్) ఒక ప్రకటనలో తెలిపారు.

చర్లపల్లి - తిరుపతి మధ్య 16 ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వేసవి రద్దీ దృష్ట్యా చర్లపల్లి-తిరుపతి స్టేషన్ల మధ్య 16 ప్రత్యేకరైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సీఆర్) ప్రకటించింది. వచ్చేనెల ఏడో తేదీ నుంచి జూన్ 25వ తేదీ వరకు ప్రతి బుధవారం చర్లపల్లి నుంచి తిరుపతికి ఎనిమిది సర్వీసులు, వచ్చేనెల ఎనిమిదో తేదీ నుంచి జూన్ 26 వరకు ప్రతి గురువారం తిరుపతి నుంచి చర్లపల్లికి ఎనిమిది సర్వీసులు నడుస్తాయని ఎస్‌సీఆర్ సీపీఆర్ఓ శ్రీధర్ తెలిపారు. మరోవైపు కాచిగూడ - నాగర్‌కోయిల్ స్టేషన్ల మధ్య ప్రస్తుతం నడుస్తున్న (07435/07436) ప్రత్యేక రైళ్లను వచ్చేనెల తొమ్మిదో తేదీ నుంచి జూన్ ఎనిమిదో తేదీ వరకు పొడిగించినట్లు సీపీఆర్ఓ శ్రీధర్ వెల్లడించారు.

ఇస్లామిక్ కోర్టులకు చట్టబద్ధత లేదు

- సుప్రీంకోర్టు స్పష్టీకరణ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28: ఇస్లామిక్ కోర్టులకు చట్టపరంగా ఎలాంటి గుర్తింపు లేదని సుప్రీంకోర్టు పునరుద్ఘాటించింది. 'ఖాజీ కోర్ట్, ఖజాయత్ కోర్ట్ (దారుల్ ఖాజా), షరియా కోర్టులు ఇచ్చే ఆదేశాలను చట్టం ప్రకారం అమలు చేయలేరని, వాటి నిర్ణయాలను పాటించాల్సిన పనిలేదని స్పష్టం చేసింది. ఫత్వాలకు కూడా చట్టబద్ధత ఉండదని తెలిపింది. ఈ మేరకు సుధాంశు ధులియా, జస్టిస్ అహసనుద్దీన్ అమానుల్లా ధర్మాసనం తీర్పు చెప్పింది. ఓ జంట మధ్య వివాదాలు తలెత్తడంతో ఇస్లామిక్ కోర్టులో విడాకులు తీసుకున్నారు. విడాకులు తీసుకున్నందున భర్త నుంచి భరణం ఇప్పించాలని కోరుతూ ఆమె ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించింది. ఇస్లామిక్ కోర్టులో రాజీ కుదిరినందున మళ్లీ భరణం చెల్లించాల్సిన అవసరం లేదని ఫ్యామిలీ కోర్టు తీర్పు ఇచ్చింది. దీనిని సవాలు చేస్తూ ఆమె అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించగా అక్కడ కూడా ఇదే తీర్పు వచ్చింది. దాంతో ఆమె సుప్రీంకోర్టులో అప్పీలు చేసింది. విచారణ జరిపిన ధర్మాసనం ఫ్యామిలీ కోర్టు తీర్పును తప్పు పట్టింది. ఇస్లామిక్ కోర్టులకు చట్టబద్ధత లేదని, వాటి ఆధారంగా ఎలా నిర్ణయాలు తీసుకుంటారని ప్రశ్నించింది. ఇరు పక్షాలు స్వచ్ఛందంగా అంగీకారం తెలిపి, చట్టాలకు అనుగుణంగా ఉన్నప్పుడే చెల్లుబాటు అవుతాయని తెలిపింది. రాజీకి వచ్చే పక్షాలకే ఆ తీర్పు వర్తిస్తుందని, మూడో పక్షానికి వర్తించదని తెలిపింది. భర్తకు అది రెండో వివాహం కావడంతో ఆయనకు కట్నం ఇచ్చే పరిస్థితి ఉండదంటూ ఫ్యామిలీ కోర్టు చేసిన వ్యాఖ్యలను కూడా ధర్మాసనం విమర్శించింది. ఇది చట్టం పట్ల ఉన్న అజ్ఞానానికి నిదర్శనమని వ్యాఖ్యానించింది. భార్యకు నెలకు రూ.4,000 వంతున మనోవర్తి చెల్లించాలని మాజీ భర్తను ఆదేశించింది. ఆమె ఫ్యామిలీ కోర్టుకు వెళ్లిననాటి నుంచి ఇవ్వాలని సూచించింది. ఆ జంటకు 2002 సెప్టెంబరులో వివాహం జరిగింది. ఇద్దరికీ అది రెండో వివాహమే. 2009లో ఇస్లామిక్ కోర్టులో ఆమెకు భర్త విడాకులు ఇచ్చాడు. దాంతో మనోవర్తి ఇప్పించాలని ఆమె ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించింది. గొడవలు పెట్టుకొని పుట్టినింటికి వెళ్లిపోవడం వల్లనే ఆయన విడాకులు ఇచ్చాడని, అందువల్ల మనోవర్తి ఇవ్వాల్సిన పనిలేదని తీర్పు ఇచ్చింది. ఈ నిర్ణయాన్నే ప్రస్తుతం సుప్రీంకోర్టు తప్పు పట్టింది.

అమరావతే ఏపీకి ఏకైక రాజధాని

(మొదటి పేజీ తరువాయి)

అపోహలకు గురికావద్దు. అంతర్జాతీయ విమానాశ్రయం వస్తేనే అమరావతి అంతర్జాతీయ నగరంగా ఎదుగుతుంది. లేనిపక్షంలో మున్సిపాలిటీగానే మిగిలిపోతుంది. మీకు అమరావతిని మున్సిపాలిటీగా చూడాలని ఉందా? లేక అంతర్జాతీయ నగరంగా చూడాలని ఉందా?" అని ప్రశ్నించారు. రాజధాని రైతులు, రైతు కూలీలతో ఉండవల్లి నివాసంలో సోమవారం గంటన్నరపాటు ఆయన సమావేశమయ్యారు. రైతుల అపోహలకు సవివరంగా సమాధానాలిచ్చారు. అమరావతి ఏకైక రాజధానిగా పార్లమెంటులో చట్టం చేయాలని రాజధాని రైతులు కోరగా సీఎం తప్పకుండా చేయిస్తానని రైతులకు హామీ ఇచ్చారు. గత 10 ఏళ్లలో హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా ఉన్నందునే ఆ ప్రతిపాదన చేయలేకపోయామన్నారు. రాజధాని అవసరాలకు అదనంగా భూమిని సమీకరించాల్సి ఉంటుందని వివరించారు. "గతంలో శంషాబాద్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి 5 వేల ఎకరాలు భూసేకరణ చేస్తే అంత ఎందుకని చాలా మంది ప్రశ్నించారు. ముందు చూపుతో అంత భూమి సేకరించబట్టే నేడు అంతర్జాతీయ విమానాశ్రయంతోపాటు పెద్ద పెద్ద హోటళ్లు, మాల్స్ వచ్చి అక్కడ భారీ ఎత్తున ఆర్థిక కార్యకలాపాలు పెరిగాయి. చుట్టుపక్కల భూముల ధరలూ పెరిగి రైతులకు మేలు చేకూరింది. అమరావతిలో కూడా అంతర్జాతీయ విమానాశ్రయం, క్రికెట్ స్టేడియం నిర్మాణాలకు మరికొంత భూమి అవసరం. స్వచ్ఛందంగా భూములు ఇచ్చిన రైతుల అభీష్టానికి వ్యతిరేకంగా, వారికి నష్టం కలిగేలా ఏ కార్యక్రమం.. నిర్ణయం ఉండదు" అని స్పష్టం చేశారు. కృష్ణా నదిపై మరో మూడు, నాలుగు వారధులు, ఇన్నర్, ఔటర్ రింగు రోడ్లు వస్తాయని, ఇతర ప్రాంతాలకు కనెక్టివిటీ పెరుగుతుందని చెప్పారు. రాజధాని విస్తరించడం వల్ల పెద్ద ఎత్తున సంస్థలు, పెట్టుబడులు వస్తాయన్నారు. మే 2 తర్వాత రాజధాని నిర్మాణం వేగవంతమవుతుందని, రైతులకు కేటాయించిన ప్లాట్లను కూడా అభివృద్ధి చేస్తామని భరోసా ఇచ్చారు. అమరావతి అభివృద్ధి విషయంలో ముఖ్యమంత్రి తీసుకున్న ఎలాంటి నిర్ణయాన్నికైనా ఏకగ్రీవంగా అంగీకరిస్తామని రైతులు స్పష్టం చేశారు.



విట్ క్యాంపస్‌లో వి లాంచ్‌ప్యాడ్ 2025లో స్టార్టప్ స్టాల్‌ను పరిశీలిస్తున్న చంద్రబాబు

ఉద్యోగులు కాదు.. ఉద్యోగాలిచ్చేవారు కావాలి

- విట్‌లో 4 బ్లాకులు ప్రారంభించిన చంద్రబాబు

గుంటూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): దేశంలోని ఏడు బెస్ట్ యూనివర్సిటీలు అమరావతిలో ఉండనున్నాయని, ఇక ఇప్పుడు అమరావతి అన్‌స్టాపబుల్ అని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. విట్ అమరావతి, ఎస్ఆర్ఎమ్, అమృత్ వంటి సంస్థలు ఇప్పటికే ఉండగా త్వరలో బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, టాటా ఇన్నోవేషన్ సెంటర్ అమరావతికి రాబోతున్నాయని వివరించారు. సోమవారం వీఐటీ అమరావతి వర్సిటీలో నిర్వహించిన 'వీ- లాంచ్‌ప్యాడ్ 2025' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నాలుగు హాస్టల్ బ్లాకులను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. "ప్రపంచంలోని అత్యుత్తమ సంస్థలను, విజ్ఞానాన్ని మీ ముందుకు (విద్యార్థులను ఉద్దేశించి) తీసుకొస్తా. మీరు అందిపుచ్చుకోండి. ఇప్పుడంతా నాలెడ్జ్ ఎకనామీదే భవిష్యత్తు. నాకు ఇప్పుడు కావాల్సింది లక్షల రూపాయల జీతాలు తీసుకునే ఉద్యోగులు కాదు. సంస్థలు స్థాపించే ఆంత్రప్రెన్యూర్లదే రాజ్యం. ఉద్యోగాలు కల్పించేవారే ఇప్పుడు నాకు కావాలి. ఐటీ మాదిరిగా రాబోయే కాలమంతా క్వాంటమ్ కంప్యూటర్లదే. క్వాంటమ్ వ్యాలీకి అమరావతి కేరాఫ్ అడ్రస్ కానుంది. ఐటీ కోసం సిలికాన్ వ్యాలీవైపు చూసినట్లే క్వాంటమ్ టెక్నాలజీ కోసం ప్రపంచమంతా ఏపీవైపు చూడాలి. అందుకు తగిన విధంగా తీర్చిదిద్దుతా.." అని వ్యాఖ్యానించారు.



గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

మద్యం దుకాణాలు వద్దంటూ మహిళల ధర్నా!

- మే 5వ తేదీలోగా మూసివేయాల్సిందే

చిట్యాల రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో నిర్వహిస్తున్న మద్యం దుకాణాలను మే ఐదో తేదీ లోగా స్వచ్ఛందంగా మూసివేయాలని డిమాండ్ చేస్తూ నల్గొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామంలో మహిళలు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. లేదంటే తామే మద్యం దుకాణాలపై దాడులు చేసి మద్యాన్ని ధ్వంసం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ గ్రామంలో సుమారు 15 బెల్టుషాపులున్నాయని, ఉదయం 5 గంటల నుంచి అర్ధరాత్రి ఒంటిగంట వరకు మద్యం విక్రయిస్తుండటంతో తమ కుటుంబీకులు నిత్యం మద్యం దుకాణాల్లోనే ఉంటున్నారని తెలిపారు. మద్యం తాగేందుకు డబ్బులు లేకుంటే పుస్తెలతాడు, బియ్యం, ఇతర వస్తువులను విక్రయిస్తుండటంతో తమ కుటుంబాలు రోడ్డున పడేలా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దలు మద్యం మత్తులో ఉంటే, యువకులు గంజాయికి అలవాటు పడి తమ జీవితాల్ని నాశనం చేసుకుంటున్నారని మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. తమ కుటుంబాలు ఆరోగ్యంగా, ఆర్థికంగా నష్టపోవడానికి కారణమైన బెల్టుషాపుల తొలగింపునకు సహకరించాలని, గంజాయి లేకుండా చేయాలని అధికారులను మహిళలు విజ్ఞప్తి చేశారు.

నేటి నుంచి ఎప్‌సెట్

- నేడు, రేపు అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగాలకు
- మే 2నుంచి 4వ తేదీ వరకు ఇంజనీరింగ్ పరీక్షలు

హైదరాబాద్ సిటీ/హైదరాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన టీజీ ఎప్‌సెట్-2025 ప్రవేశ పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మంగళ, బుధవారాల్లో అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగానికి సంబంధించిన పరీక్షలు, మే నెల 2నుంచి 4 వరకు ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన పరీక్షలు జరగనున్నాయి. ఇంజనీరింగ్ పరీక్షలను ప్రతిరోజూ రెండు సెషన్లలో నిర్వహించనుండగా, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ పరీక్షలు మంగళవారం రెండు సెషన్లలో, బుధవారం ఒక(ఉదయం) సెషన్‌లో మాత్రమే జరగనున్నాయి. పరీక్ష ప్రారంభమైన తర్వాత ఒక్క నిమిషం లేటైనా అభ్యర్థులను అనుమతించబోమని అధికారులు స్పష్టం చేశారు. అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగం పరీక్షల నిర్వహణకు అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా 112 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా, ఇంజనీరింగ్ పరీక్షల నిమిత్తం 124 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎప్‌సెట్ పరీక్షా కేంద్రాలు ఉన్న రూట్లలో అభ్యర్థుల సౌలభ్యం కోసం అదనపు బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ అధికారులు ప్రకటించారు.

అగ్రికల్చర్ విభాగానికి 59ఏళ్ల అభ్యర్థి దరఖాస్తు

ఎప్‌సెట్‌కు మొత్తం 3,06,894 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇందులో అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగానికి 86,523మంది దరఖాస్తు చేయగా, ఇంజనీరింగ్ విభాగం కోసం 2,20,117మంది, రెండు పరీక్షల కోసం మరో 254మంది అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించారు. మరోవైపు ఎప్‌సెట్ రాసేందుకు గరిష్ఠ వయో పరిమితి లేనందున.. అగ్రికల్చర్ పరీక్షకు గరిష్ఠంగా 59ఏళ్ల అభ్యర్థి, ఇంజనీరింగ్ పరీక్షకు 57ఏళ్ల అభ్యర్థి దరఖాస్తు చేసుకోవడం గమనార్హం. మరోవైపు కనిష్ఠ వయస్సు 17ఏళ్లు కాగా, అంతకన్నా తక్కువ వయస్సున్న ఇద్దరు అభ్యర్థులు ఎప్‌సెట్‌కు దరఖాస్తు చేసుకున్నారు.


మే 15 నాటికి 62 కొత్త చెరువుల నిర్మాణం

- సింగరేణిలో 'నీటి బిందువు-జల సింధువు' కార్యక్రమం

హైదరాబాద్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): భూగర్భ జలాల పెంపే లక్ష్యంగా 'నీటి బిందువు- జల సింధువు' పేరుతో మినీ చెరువుల నిర్మాణాన్ని సింగరేణి చేపట్టింది. మే 15 నాటికి సింగరేణి వ్యాప్తంగా మొత్తం 12 ఏరియాల్లో 62 కొత్త చెరువుల నిర్మాణం, 40 చెరువుల్లో పూడిక తొలగింపు చేపట్టాలని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో సోమవారం ఈమేరకు సమీక్ష నిర్వహించారు. ఇప్పటికి 20 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయని, వాటిని మరింత వేగిరం చేస్తూ మే 15నాటికి మొత్తం చెరువుల నిర్మాణం పూర్తి చేయాలన్నారు.

చిన్నారి ప్రాణం తీసిన పల్లీ గింజ

- ఊపిరితిత్తుల్లో ఇరుక్కుపోయి మృతి



తన్విక(ఫైల్)

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పల్లీగింజ ఓ చిన్నారి ప్రాణం తీసింది. ఊపిరితిత్తుల్లో ఇరుక్కుపోయి తన్విక అనే నాలుగేళ్ల చిన్నారి మృతి చెందింది. ఈ ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో జరిగింది. లష్కర్‌గూడలో నివాసం ఉంటున్న బండారి శ్యామ్‌సుందర్, మహేశ్వరి దంపతులకు తన్విక ఒక్కగానొక్క కూతురు. ఆదివారం సాయంత్రం ఇంట్లో వేయించిన పల్లీలను తల్లిదండ్రులతో కలిసి తిన్నది. ఈ క్రమంలో చిన్నారి తన్విక శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతుండడం గమనించిన తల్లి మహేశ్వరి అదే రోజు రాత్రి నీలోఫర్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు ఊపిరితిత్తుల్లో పల్లీగింజ ఇరుక్కుపోయిందని తెలిపారు. ఆపరేషన్ చేసి తొలగించాలని కుటుంబ సభ్యులకు సూచించారు. కాగా సోమవారం ఉదయం చికిత్స పొందుతూ చిన్నారి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారని పోలీసులు తెలిపారు. చిన్నారి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పురపాలనలో గందరగోళం!

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యకార్యదర్శులు ఉండేవారు. ఈ ముగ్గురు తెలంగాణ, రాయలసీమ, ఆంధ్రా ప్రాంతాలకు ఒక్కొక్కరు చొప్పున ప్రాతినిధ్యం వహించేవారు. దీంతో వారి కిందిస్థాయిలో పని చేసే ఉద్యోగుల ఏసీఆర్‌లను ఎవరు రాస్తారనే ప్రశ్న తలెత్తింది. ఇదే విషయాన్ని ప్రస్తుతం సీడీఎంగా, పురపాలకశాఖ కార్యదర్శిగా కొనసాగుతున్న టి.కె.శ్రీదేవి అప్పట్లో నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శిగా ఉన్న జోషిని ప్రశ్నించారు. అయితే ముగ్గురిలో ఎవరు సీనియర్ అధికారి అయితే.. వారికే పాలనాపరమైన నిర్ణయాలపై అధికారం ఉంటుందని జోషి స్పష్టతనిచ్చారు. ఇప్పుడు మళ్లీ పురపాలక శాఖలో ఇదే తరహాలో ఇద్దరు కార్యదర్శులు రావడంతో ఉద్యోగుల్లో రకరకాల చర్చలు మొదలయ్యాయి. ఆర్థిక సంఘం నిధుల విషయంలో, కేంద్రం నుంచి నిధులు వచ్చే అమృత్, స్మార్ట్‌సిటీ, స్వచ్ఛభారత్ వంటి పథకాల విషయంలో రాష్ట్రం తరఫున ప్రతిపాదనలు, నిధుల కోసం లేఖలు ఎవరు పంపుతారనే చర్చ జరుగుతోంది.

సీడీఎంఏను కూడా రెండుగా విభజించారా?

సాధారణంగా పట్టణ ప్రాంతాల నిధులు, అభివృద్ధి పనులు, ఉద్యోగుల బదిలీలు, పాలనా పరమైన విషయాలపై పురపాలక శాఖ కమిషనర్, సంచాలకుల కార్యాలయం(సీడీఎంఏ) నుంచే నిర్ణయాలు తీసుకుంటారు. అయితే ఆదివారం ఐఏఎస్ అధికారుల బదిలీల ఉత్తర్వుల్లో 'ఓఆర్ఆర్ అవతల' అనే పదం సీడీఎంఏకి వర్తిస్తుందని పేర్కొనడంతో.. దీనిని కూడా రెండుగా విభజించారా? అనే చర్చ మొదలైంది. దీనిపై పురపాలక శాఖకు చెందిన ఓ అధికారి 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. సీడీఎంఏ ఒక్కరే ఉంటారని, ఇందులో ఎలాంటి విభజన లేదని చెప్పారు. స్వచ్ఛభారత్ మిషన్ డైరెక్టర్‌గా సీడీఎంఏనే వ్యవహరిస్తున్నారని, నోడల్ ఏజెన్సీగా ఉన్న సీడీఎంఏ నుంచే స్వచ్ఛభారత్ నిధులు జీహెచ్ఎంసీకి కూడా వెళతాయని తెలిపారు. సీడీఎంఏ నుంచే కొంత మంది ఉద్యోగులను జీహెచ్ఎంసీకి పంపుతారని, పాలనా పరమైన విషయాల్లో సీడీఎంఏ గతంలో ఎలా పని చేసిందో ఇప్పుడు కూడా ఒకే ఏజెన్సీగా పని చేస్తుందని అన్నారు. హెచ్ఎండీఏ ప్లానింగ్ ఏజెన్సీ అని, అభివృద్ధిపరమైన విషయాల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రభుత్వం ఇద్దరు కార్యదర్శులను ఏర్పాటు చేసి ఉంటుందని అభిప్రాయపడ్డారు. రాష్ట్రం మొత్తమ్మీద 153 మునిసిపాలిటీలు ఉంటే.. రాష్ట్రస్థాయి సమావేశాలు నిర్వహించినప్పుడు ఎక్కువ సమయం హెచ్ఎండీఏ సమీక్షకే సరిపోతోంది. హెచ్ఎండీఏ పరిధిలో ఏకంగా 40 మునిసిపాలిటీలు ఉండడమే ఇందుకు కారణం. తాజాగా ఇద్దరు కార్యదర్శుల నియామకం వల్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించే అవకాశం ఉంటుందనే అభిప్రాయాన్ని అధికారులు వ్యక్తం చేస్తున్నారు.

నింగిలో మన గూఢచారి


- పహల్గాం దాడి నేపథ్యంలో ప్రయోగానికి ఇస్రో సన్నాహాలు
- జూన్‌లో ఈవోఎస్-09 ఉపగ్రహ ప్రయోగం

సూళ్లూరుపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్-పాకిస్థాన్ సరిహద్దుపై నిఘా పెంచాలని భారత్ భావిస్తోంది. దీని కోసం పగలూ, రాత్రీ తేడా లేకుండా 24 గంటలూ.. నిఘా పెట్టే ఓ గూఢచారి ఉపగ్రహాన్ని ప్రయోగించేందుకు ఇస్రో సిద్ధమవుతోంది. దీనికోసం జూన్‌లో అత్యాధునిక ఈవోఎస్-09 ఉపగ్రహాన్ని రోదసిలోకి పంపేందుకు సన్నాహాలు చేస్తోంది. శ్రీహరికోట నుంచి పీఎస్ఎల్వీ-సీ61 రాకెట్ ద్వారా ఈ ఉపగ్రహాన్ని కక్ష్యలోకి పంపనుంది. సీ-బ్యాండ్ సింథటిక్స్ ఎవర్చర్ రాడార్‌ను అమర్చిన ఈవోఎస్-09 ఎలాంటి వాతావరణ పరిస్థితుల్లోనైనా అధిక రిజల్యూషన్‌తో కూడిన భూ ఉపరితల చిత్రాలను తీయగలదు. భారత్‌కు ఇప్పటికే అంతరిక్షంలో 50కి పైగా ఉపగ్రహాలు ఉన్నాయి. ఇప్పుడు రాడార్ ఇమేజింగ్ శాటిలైట్ వాటికి జతకలవనుంది. ఇప్పటికే అధునాతన కార్టోశాట్-3 ఉపగ్రహం లోయర్ ఎర్త్ ఆర్బిట్‌లో తిరుగుతూ ఫొటోలు అందిస్తోంది. కానీ ఇది రాత్రి వేళల్లో పనిచేయదు. దీంతో శత్రువులు తమ ఆయుధాలను రాత్రి వేళల్లో తరలించగలుగుతున్నారు. తాజాగా పీఎస్ఎల్వీ-సీ61 రాకెట్ ద్వారా ప్రయోగించబోయే హైఎండ్ ఈవోఎస్-09 నుంచి శత్రువులు రాత్రి వేళల్లో కూడా తప్పించుకోలేరు. ఈ ప్రయోగానికి సంబంధించి షార్‌లోని ప్రథమ ప్రయోగ వేదిక వద్ద పీఎస్ఎల్వీ-సీ61 రాకెట్ అనుసంధాన పనులు శరవేగంగా జరుగుతున్నాయి. జూన్ తొలివారంలో ఈ ప్రయోగాన్ని చేపట్టేందుకు ఇస్రో సన్నాహాలు చేస్తోంది.

మిథున్‌రెడ్డి బెయిల్‌పై ఉన్న ఉద్రిక్తత సరిహద్దుల్లోనూ లేదు!

- సుప్రీంకోర్టు ధర్మాసనం వ్యాఖ్యలు
- ఎంపీకి మధ్యంతర రక్షణ కొనసాగింపు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి ముందస్తు బెయిల్ వ్యవహారంలో ఉన్నంత ఉద్రిక్తత దేశ సరిహద్దుల్లోనూ లేదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఏపీ మద్యం కుంభకోణం వ్యవహారంలో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ మిథున్‌రెడ్డి ఈ నెల 3న సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆ పిటిషన్ ధర్మాసనం ముందు సోమవారం విచారణకు వచ్చింది. ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, సిద్దార్థ్ లూథ్రా, మిథున్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాదులు అభిషేక్ మను సింఘ్వి, నిరంజన్ రెడ్డి హాజరయ్యారు. ఒక ముందస్తు బెయిల్ పిటిషన్ అంశంపై నలుగురు సీనియర్ న్యాయవాదులు వాదనలను వినిపించడంపై న్యాయమూర్తి జస్టిస్ పార్థీవాలా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ముందస్తు బెయిల్ వ్యవహారంలో ఉన్న ఉద్రిక్తత ప్రస్తుతం దేశ సరిహద్దుల్లోనూ లేదని వ్యాఖ్యానించారు. ఇరుపక్షాల వాదనల అనంతరం విచారణను ధర్మాసనం రెండు వారాలకు వాయిదా వేసింది. మిథున్ రెడ్డికి గతంలో ఇచ్చిన మధ్యంతర రక్షణ కొనసాగుతుందని తెలిపింది.



డాక్టర్ ముత్తురామన్‌ను సన్మానిస్తున్న ఐసీఏఆర్ అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎస్.కె ప్రధాన్, ఐఐఆర్ఆర్ డైరెక్టర్ డాక్టర్ రామన్ మీనాక్షి తదితరులు

వరి సాగు విస్తీర్ణాన్ని 5 శాతం తగ్గించాలి

- ఐఐఆర్ఆర్ డైరెక్టర్ డాక్టర్ రామన్ మీనాక్షి సుందరం

రాజేంద్రనగర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): భారత వ్యవసాయ పరిశోధన మండలి(ఐసీఏఆర్) భాగస్వామ్యంతో రాజేంద్రనగర్‌లోని జాతీయ వరి పరిశోధన సంస్థ (ఐఐఆర్ఆర్)లో మూడు రోజులపాటు జరిగిన వరి పరిశోధకుల గోల్డెన్ జూబ్లీ సమావేశాలు సోమవారం ముగిశాయి. దేశ నలుమూలల నుంచి వచ్చిన 350 మంది వరి పరిశోధకులు గత వర్షాకాలంలో చేసిన ప్రయోగాల గురించి వివరించి, వచ్చే వానా కాలంలో వాటిని ఏ విధంగా అమలు చేయాలనే అంశాలపై చర్చించారు. ముగింపు కార్యక్రమంలో ఐఐఆర్ఆర్ డైరెక్టర్ డాక్టర్ రామన్ మీనాక్షి సుందరం మాట్లాడుతూ వరిసాగు విస్తీర్ణాన్ని ఐదు శాతం తగ్గించాలని, అదే సమయంలో పది శాతం వరి ఉత్పత్తులను పెంచేలా పరిశోధనలు జరగాలని సదస్సులో చర్చించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా జాతీయ వరి పరిశోధన సంస్థకు విశేష సేవలందించి మరో రెండు నెలల్లో ఉద్యోగ విరమణ చేయనున్న డాక్టర్ ముత్తు రామన్‌ను ఘనంగా సన్మానించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

'ఒక వ్యక్తిగా నేను అంతరిక్షానికి ప్రయాణిస్తున్నప్పటికీ, అది 140 కోట్ల మంది భారతీయుల యాత్ర అని మనఃపూర్వకంగా విశ్వసిస్తున్నా'నని శుభాంశు శుక్లా అన్నారు. నలభై సంవత్సరాల అనంతరం అంతరిక్షానికి ప్రయాణించనున్న ద్వితీయ భారతీయుడు శుక్లా. రాబోయే వారాలలో ఫ్లోరిడాలోని కెన్నెడీ స్పేస్ సెంటర్ నుంచి ఇంటర్నేషనల్ స్పేస్ సెంటర్‌కు వెళ్లనున్న యాక్సియమ్–2 మిషన్ పైలట్‌గా ఆయన రోదసీయాత్ర చేయనున్నారు. వచ్చే ఏడాది భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) గగన్‌యాన్ మిషన్‌లో మహాఆకాశంలోకి వెళ్లనున్న ప్రప్రథమ భారతీయ వ్యోమగాముల బృందంలో కూడా శుక్లా ఒకరు. యువ భారతీయుల మేధో శక్తి సామర్థ్యాలకు శుక్లా, గగన్‌యాన్‌లు వైయక్తిక, సాముదాయిక ప్రతీకలు. భారతీయ అంతరిక్ష పరిశోధనా పథ నిర్దేశకులు వేసిన వెలుగుబాటల వల్లే ఈ సమున్నత, సాహసిక యాత్రలు సాధ్యమవుతున్నాయి. ఈ దృష్ట్యా, గత శుక్రవారం నాడు 84 ఏళ్ల వయసులో మరణించిన ఖగోళ భౌతిక శాస్త్రవేత్త, ఇస్రో మాజీ డైరెక్టర్ డాక్టర్ కృష్ణస్వామి కస్తూరి రంగన్, ఆయన జీవిత కృషి సంస్మరణకు, శుభాంశు శుక్లా, గగన్‌యాన్ ప్రస్తావన ఒక సముచిత నాందీ వాక్యమవుతుంది.

సమాజాభివృద్ధే అంతరిక్ష పరిశోధనలు ధ్యేయంగా ఉండాలని దృఢంగా విశ్వసించిన శాస్త్రవేత్త కస్తూరి రంగన్. ఇస్రో ఆరంభంలోనే ఆ సంస్థలో చేరిన రంగన్ మొదటి రెండు ప్రయోగాత్మక భూపరిశీలన ఉపగ్రహాలు భాస్కర-1, 2ల రూపకల్పన, ప్రయోగాలకు సారథ్యం వహించారు. తొలి రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహం ఐఆర్ఎస్-1 ఆయన నేతృత్వంలోనే రూపుదిద్దుకున్నది. ఇస్రో శాటిలైట్ సెంటర్ డైరెక్టర్‌గా ఆయన దూరదృష్టి కారణంగానే భారతీయ భాషలలో కేబుల్ టీవీ కార్యక్రమాలు కోట్లాది కుటుంబాలకు అందుబాటులోకి వచ్చాయి. భారతీయ టీవీ కార్యక్రమాలు ప్రపంచవ్యాప్తంగా పలుదేశాలకు చేరడం మొదలయింది. స్పేస్ ఫర్ సొసైటీ అన్న ఇస్రో లక్ష్య స్ఫూర్తితో టెలిఎడ్యుకేషన్‌కు ఎడ్యుశాట్, టెలి

వెలుగుబాట

మెడిసిన్, కమ్యూనికేషన్‌కు ఇన్సాట్, జిశాట్ ఉపగ్రహాలు, ధరిత్రి వనరుల పరిశోధనకు రిసోర్స్‌శాట్, వాతావరణ పరిశోధనలకు మెట్‌శాట్, ఖగోళ అన్వేషణలకు ఆస్ట్రోశాట్ మొదలైన వాటిని ఆయన సారథ్యంలోనే రూపొందించి ప్రయోగించడం జరిగింది. ఇవన్నీ గ్రామీణాభివృద్ధి, ప్రాకృతిక విపత్తుల నిర్వహణ, జాతీయ సంధాయతకతకు విశేషంగా తోడ్పడ్డాయి. భారతదేశ రోదసీ ఆకాంక్షల సాఫల్యానికి మేధో స్వావలంబనకు ఆయన చేసిన దోహదం అద్వితీయమైనది.

ఇస్రో డైరెక్టర్ (1994–2003)గా ప్రతిష్ఠాత్మక పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్‌ను పరిపూర్ణంగా తీర్చిదిద్దారు. అలాగే జియో సింక్రోనస్ శాటిలైట్ లాంచ్ వెహికల్‌ను కూడా జయప్రదంగా పరీక్షించారు. పిఎస్ఎల్‌విని ఉపయోగించడం ద్వారా చంద్రుని కక్ష్యలోకి ఉపగ్రహాన్ని పంపవచ్చని 1999లో వెలువరించిన ఒక చరిత్రాత్మక ప్రసంగంలో కస్తూరిరంగన్ ప్రతిపాదించారు. నాటి వాజపేయి ప్రభుత్వం ఆ ప్రతిపాదనకు సానుకూలంగా ప్రతిస్పందించింది. చంద్రయాన్‌కు అంకురార్పణ జరిగింది. భారతదేశ ఈ మొదటి చంద్రయాత్ర అక్టోబర్ 2008లో ప్రారంభమై ఆగస్టు 2009 దాకా కొనసాగింది. చంద్రునిపై నీటి అణువుల ఉనికిని నిర్ధారించడం చంద్రయాన్-1 సాధించిన గొప్ప విజయం. భారతదేశ వైజ్ఞానిక ప్రతిభాపాటవాలకు అది అద్దం పట్టింది. చంద్రయాన్ విజయ స్ఫూర్తితో ఇస్రో శాస్త్రవేత్తలు 2013లో మంగళయాన్ (మార్స్ ఆర్బిటర్ మిషన్) జయప్రదంగా నిర్వహించారు. అంగారక గ్రహ కక్ష్యలోకి ఉపగ్రహాన్ని పంపించిన మొదటి ఆసియా దేశంగా భారత్ ఖ్యాతిగాంచింది. పదవీవిరమణ అనంతరం రాజ్యసభసభ్యుడుగా నియమితుడైన కస్తూరి రంగన్ ఇండో –అమెరికన్ పౌర అణు ఒప్పందం పార్లమెంటు ఆమోదం పొందేందుకు తన వాదనలతో తోడ్పడ్డారు. జాతీయ విద్యా విధానం–2020 రూపకల్పనలో కూడా కీలక పాత్ర వహించారు. భారతదేశ మొట్టమొదటి ఉపగ్రహం ఆర్యభట్టను రూపొందించి, ప్రయోగించిన బృందంలో సభ్యుడుగా ఉన్న నాటినుంచి చంద్రయాన్, మంగళ్‌యాన్‌లకు స్ఫూర్తినిచ్చి, ప్రాతిపదికలు నిర్మించిన నాటిదాకా భారతీయ అంతరిక్ష పరిశోధనా కార్యక్రమాలపై కస్తూరి రంగన్ ముద్ర చెరిపివేయలేనిది. ఆయన మేధో కృషి జాతికి జ్ఞానేంద్రియం, దేశ భవిష్యత్తుకు శాశ్వత వెలుగుబాట.

డిజిటల్ లైంగిక నేరాలపై చట్టమేదీ?

స్మార్ట్‌ఫోన్లు, ఇంటర్నెట్, సోషల్ మీడియాను వాడుకుని మహిళలపై డిజిటల్ హింస పెరుగుతున్నది. మహిళలు, బాలికల అభ్యంతరకర ఫొటోలను, వీడియోలను వారి అనుమతి లేకుండా వ్యాప్తిచేయడం లైంగిక వేధింపుల కంటే తీవ్రంగా విస్తరిస్తున్నది. ఈ తరహా నేర విధానం (మోడస్ ఒపెరాండి)పై ఉక్కుపాదం మోపి ఈ నేరాలను అరికట్టాలి. ఇందుకు తక్షణ కర్తవ్యంగా– ఈ నేరస్థులను కఠినంగా శిక్షించేందుకు చట్టం రూపొందించాలి. అప్‌లోడ్ అయిన ఫొటోలను, వీడియోలను త్వరగా తొలగించే సాధనాలను, మార్గాలను గుర్తించాలి. వాటిని బాధితులకు అందించాలి.

అభ్యంతరకర వీడియోలను అప్‌లోడ్ చేస్తున్నప్పుడే గుర్తించి, తొలగించగలిగే సామర్థ్యం యూట్యూబ్ వంటి వేదికలకు ఉంది. ఈ వేదికలు కృత్రిమ మేధస్సుతో పాటు మానవ పర్యవేక్షణను కూడా ఉపయోగిస్తున్నాయి. కానీ, వాట్సాప్ వంటి వేదికలు ఎండ్–టు–ఎండ్ ఎన్‌క్రిప్షన్‌తో గోప్యతకు పెద్దపీట వేయడంతో అక్కడ అభ్యంతరకర సమాచారాన్ని ముందస్తుగా గుర్తించడం గాని, ప్రభుత్వ పర్యవేక్షణ గాని దాదాపు అసాధ్యం. ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్ప వాట్సాప్ చర్యలు తీసుకోలేదు (అప్పుడు కూడా చివరి ఐదు సందేశాలు మాత్రమే పరిశీలనకు వెళ్తాయి). దీనివల్ల ఫిర్యాదు అందని పక్షంలో హానికరమైన కంటెంట్ విచ్చలవిడిగా వ్యాప్తి చెందే ప్రమాదం ఉంది.



ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం – 2000, సెక్షన్ 67ఎ ప్రకారం, అసభ్యకర ఫొటోలు, వీడియోలు షేర్ చేసిన వారికి ఐదేళ్ల వరకు జైలు శిక్ష విధించవచ్చు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (మధ్యవర్తి మార్గదర్శకాలు, డిజిటల్ మీడియా ఎథిక్స్ కోడ్) నియమాలు –2021 ప్రకారం చట్టవిరుద్ధమైన సమాచారాన్ని తొలగించడానికి సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు త్వరితగతిన చర్యలు తీసుకోవాలి. వ్యక్తిగత ఫిర్యాదుల కోసం ఫిర్యాదు అధికారిని నియమించి 24 గంటల్లోగా చర్య తీసుకోవాలి. కానీ ఇవి సరిపోవు. ప్రత్యేకంగా డిజిటల్ లైంగిక వేధింపులను అరికట్టేందుకు మరింత కఠినమైన, నిర్దిష్టమైన చట్టాల అవసరం ఉంది. సైబర్ నేరాలపై ఫిర్యాదుల కోసం 'నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్' (నంబర్: 1930)ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే, దీనికి ఆర్థిక నేరాలపైనే ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయి. దానితో ఈ పోర్టల్ డిజిటల్ లైంగిక వేధింపులపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టలేకపోతోంది. డిజిటల్ వ్యక్తిగత డేటా పరిరక్షణ చట్టం–2023, సెక్షన్ 12(3) ద్వారా అభ్యంతరకర సమాచారం, ఫొటోలు, వీడియోలను ఇంటర్నెట్ నుంచి తొలగించాలని కోరే హక్కును పౌరులకు కల్పించింది. దీని ఉల్లంఘనలపై రూ.50కోట్ల వరకు జరిమానా విధించే అధికారం 'డేటా పరిరక్షణ బోర్డు'కు ఉంటుంది. ఈ చట్టం ఇంకా అమలులోకి రావాల్సి ఉంది.

అంతర్జాతీయంగా పలు దేశాలు డిజిటల్ హింసను అరికట్టేందుకు మెరుగైన చర్యలు తీసుకున్నాయి. మనమూ ఆ ఉదాహరణలను పరిగణనలోకి తీసుకుని కఠినమైన చట్టాన్ని రూపొందించాలి. మెక్సికో, ఆస్ట్రేలియా తరహాలో అభ్యంతరకర వీడియోలు, ఫొటోలను మొదట పోస్ట్ చేసే వారినే కాకుండా, వాటిని ఫార్వర్డ్ చేసే వారిని కూడా కఠినంగా శిక్షించాలి. సోషల్ మీడియా సంస్థలు చట్టాలకు అనుగుణంగా నడుచుకునేలా, ఫిర్యాదులపై తక్షణమే స్పందించేలా చూడాలి. జర్మనీ తరహాలో భారీ జరిమానాలు విధించేలా నిబంధనలను కఠినతరం చేయాలి. ఆస్ట్రేలియా 'ఇ–సేఫ్టీ కమీషనర్' తరహాలో ఆన్‌లైన్ వేధింపులపై ఫిర్యాదులను స్వీకరించి, కంటెంట్‌ను వేగంగా తొలగించేందుకు, బాధితులకు సహాయం అందించేందుకు ప్రత్యేక వ్యవస్థలను బలోపేతం చేయాలి.

అంతేగాక పోర్నోగ్రఫీ నియంత్రణపై కూడా దృష్టిపెట్టాలి. అనేక లైంగిక నేరాల విషయంలో నిందితులపై పోర్నోగ్రఫీ ప్రభావం బైటపడింది. పశ్చిమ బెంగాల్ వైద్యురాలి హత్యాచారం కేసులో నిందితుడు పోర్నోగ్రఫీకి బానిస అని తేలింది. ఇప్పటికే బాలల పోర్నోగ్రఫీపై నిషేధం అమల్లో ఉంది. చైనా, యూఏఈ వంటి దేశాలు పోర్నోగ్రఫీపై పూర్తి నిషేధాన్ని అమలు చేస్తున్నాయి. ఈ దేశాలు మహిళలకు, బాలలకు భద్రమైనవిగా పేరు పొందాయి. కొంతకాలం పాటు మన దేశంలో కూడా పోర్నోగ్రఫీపై నిషేధం విధించి, తద్వారా ఇమేజ్ బేస్డ్ అబ్యూజ్‌ను కూడా నిరోధించవచ్చనే ఆలోచనను పరిశీలించాలి. కేవలం చట్టాలు, సాంకేతిక నియంత్రణలే కాకుండా సామాజిక దృక్పథంలో కూడా మార్పు రావాలి. పురుషులందరినీ భావి నేరస్థులుగా ఒకే గాటన కట్టే మూస ధోరణి కన్నా, మహిళలను గౌరవించే, వారి సాధికారతను కోరుకునే పురుషులను యువతకు ఆదర్శంగా చూపాలి.

– శ్రీనివాస్ మాధవ్

కశ్మీర్‌లో ఏది ఓడాలి? ఏది గెలవాలి?

మారణకాండలూ కిరాతక కాల్పివేతలూ చరిత్రను గుర్తుకుతెస్తాయి. ఆ చరిత్ర వెనకున్న దారుణ భావాలపై దృష్టిపడేలా చేస్తాయి. పహల్గాం ఘోరకలిపై క్షోభించని హృదయం లేదు. గర్హించని మనసు లేదు. ఆగ్రహం చెందని ఆత్మలేదు. కన్నీరు కార్చని కన్నులు లేవు. మానవత్వం ప్రేరేపించే ఈ స్పందనలతో సమస్య తీరిపోదు. భవిష్యత్తు దారుణాలను ఆపనూలేవు. రాజకీయ లక్ష్యాల కోసం సాగించే రాక్షసాలనూ నిలువరించలేవు. మరోవైపు తక్షణ ప్రతీకారాలూ ప్రతిచర్యలూ మొదలయ్యాయి. హృదయాగ్నులను తాత్కాలికంగా చల్లార్చటం కూడా కొన్ని సందర్భాల్లో కావాల్సి వస్తుంది. కానీ సమస్య మూలాల్లోకి వెళ్లే సమాంతర చర్యలు చేపడితేనే వాటికీ సార్థకత లభిస్తుంది.



మతతత్వం రాజకీయాలను ప్రభావితం చేస్తున్నంత వరకూ తీవ్రవాదాలు నిరంతరం ఊపిరి పోసుకుంటూనే ఉంటాయి. కశ్మీర్ సమస్య చుట్టూ ఆవరించిన తీవ్రవాదం ఆ తత్వం నుంచే ప్రేరణ పొందుతోంది. దుశ్చర్యలన్నీ అందులో నుంచే తన్నుకొస్తున్నాయి. అందుకే విశాల దృష్టితో సమస్యను చూడటం మొదలుపెడితేనే కష్టమైనా, కొంత నష్టమైనా శాశ్వత పరిష్కార మార్గం కనపడుతుంది. మతదృక్పథంలో ఎంతటి వైషమ్యాలూ, ద్వేషాలూ, అమానవీయ ధోరణులూ గూడుకట్టుకుంటాయో గ్రహించటానికి పాకిస్థాన్ సైన్యాధిపతి ఆసిమ్ మునీర్ ఇటీవల చేసిన వ్యాఖ్యలే నిదర్శనం. పహల్గాం దారుణానికి ముందూ, తర్వాత కూడా మునీర్ చేస్తున్న వ్యాఖ్యలు యథాలాపంగా చేసినవిగా అనుకోలేం. 1940ల నుంచీ బలం పుంజుకున్న మతతత్వ భావాల నుంచే అలాంటి వ్యాఖ్యలు పుట్టుకొస్తున్నాయి.

1940లకు ముందు కూడా మతతత్వ భావాలు ఉన్నాయి. రెండో ప్రపంచయుద్ధం ముమ్మరంగా సాగుతున్న రోజుల్లో అవింకా ఇంకా బలపడ్డాయి. పాక్ సైన్యాధ్యక్షుడు పదేపదే ప్రస్తావిస్తున్నట్లుగా ముస్లింలు, హిందువులు అన్నిరకాలుగా వేర్వేరనీ ఇరువురూ ఒక రాజ్యవ్యవస్థలో ఇమడలేరనే భావన మతతత్వ సిద్ధాంతంలో కీలకం. 1940లో మహ్మద్ అలీ జిన్నా చేసిన లాహోర్ ప్రసంగంలో అది బలంగా వ్యక్తమైంది. దాన్నే మునీర్ లాంటి వాళ్లు పదేపదే వల్లెవేస్తున్నారు. నిజానికి జిన్నా మతతత్వాన్ని నూటికి నూరుపాళ్లూ విశ్వసించారని చెప్పలేం! ప్రత్యేక పాకిస్థాన్ ఏర్పడాలనే లక్ష్యానికి అది కావాల్సి వచ్చింది. జిన్నా ప్రకటన తర్వాత రాజకీయాలు పూర్తిగా మారిపోయాయి. ఆ తర్వాత అడుగులన్నీ దేశ విభజన దిశగానే పడ్డాయి. మైనారిటీలకు అనేక రక్షణలను కల్పించి, అధికారంలో సముచిత వాటా ఇచ్చి, ఉన్నత పదవులకు పోటీపడటానికి అన్ని అవకాశాలనూ అందించి, హిందువులు, ముస్లింలు సామరస్యంగా మనగలిగే రీతిలో గట్టి రాజ్యాంగబద్ధమైన ఏర్పాట్లు చేసుకుందామని ఎన్ని ప్రతిపాదనలు చేసినా జిన్నా అంగీకరించలేదు. అందుకు జిన్నా సమర్థించుకున్న తీరును తెలుసుకోవాలనుకుంటే లాహోర్ ప్రసంగం లోతుల్లోకి వెళ్లాలి. 1990ల తర్వాత ఇంటాబయటా పెరుగుతున్న భిన్నరకాల మతతత్వాలను అర్థం చేసుకోటానికీ అది అత్యవసరం. సారంలో మతతత్వాల మధ్య పెద్ద తేడా ఉండదు.

హిందువులూ ముస్లింలూ ఏక రాజ్యవ్యవస్థలో సామరస్యంతో జీవించగలరని ఎవరు చెప్పినా జిన్నా తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య లౌకిక విధానాలతో భిన్న మతాల ప్రజలకు సమానహక్కులు కల్పిస్తే ఐక్యంగా ఉండొచ్చన్న ప్రతిపాదనను జిన్నా కొట్టిపడేశారు. అట్లా సాధ్యం అవుతుందని చెప్పిన ఆనాటి కాంగ్రెస్ నాయకులకు అసలు హిందూ–ముస్లిం మతాల మూల సారమే అర్థం కావటంలేదనీ విమర్శించారు. జిన్నా దృష్టిలో ఇస్లాం, హిందూ మతాలు.. భిన్న దేవతారాధనలకూ, భిన్న విశ్వాసాలకూ పరిమితమైనవే కావు. అవి మతాలు కావనీ భిన్న సామాజిక వ్యవస్థలనీ సూత్రీకరించారు. సామాజిక వ్యవస్థ అంటే సమాజ మనుగడకు అవసరమైన అన్ని కార్యకలాపాలనూ భావాలనూ ఇముడ్చుకున్న ఒక వ్యవస్థ. అనేక సంబంధాల సమాహారమైన ఒక ఏర్పాటు. అది మనుషుల స్థానాలను నిర్దేశిస్తుంది. ఆ స్థానాల్లో కుదురుకుని జీవించేలా విలువలను బోధిస్తుంది. నీతులను ఖాయపరుస్తుంది. పాపపుణ్యాలను స్పష్టం చేస్తుంది. అసమానతలను సమర్థించే భావాలను కలిగి ఉంటుంది.. కష్టనష్టాలకు దైవిక కారణాలను పేర్కొంటుంది. అధికారాలకు హద్దులనూ అర్హతలనూ నిర్దేశిస్తుంది. ఒకనాటి సగటు భారతీయ గ్రామాన్ని చూస్తే సామాజిక వ్యవస్థకు సంబంధించిన ప్రధాన రూపురేఖలన్నీ స్పష్టంగా కనపడతాయి. హిందువులకూ ముస్లింలకూ పూర్తి భిన్నంగా ఉండే వ్యవస్థగా దాన్ని భావించలేం. ముస్లిం భూస్వాములకు ఆధిపత్యం ఉండేచోట భిన్న సామాజిక వ్యవస్థ ఉంటుందనీ అట్లాగే హిందూ భూస్వాములకు ఆధిపత్యం ఉన్నచోట వేరే సామాజిక వ్యవస్థ ఉంటుందనీ చెప్పేందుకు భారత్ చరిత్రలో ఆధారాలు కనపడవు. ఒక మతాన్ని పాటించేవారు ఎక్కువగా ఉన్నచోట సాంస్కృతిక పరమైన ఆచారాలు, కట్టుబాట్లు భిన్నంగా ఉండొచ్చు. అంతమాత్రాన భిన్నమతాలు పాటించే వారందరూ ప్రత్యేకమైన సామాజిక వ్యవస్థలో ఉన్నట్లుగా భావించలేం. గ్రామాలకైనా నగరాలకైనా ఇదే వర్తిస్తుంది.



■ రాహుల్ కుమార్

జిన్నా దృష్టిలో వేర్వేరు మతాలను అవలంబించేవారు ఒకే జాతిగా ఉండలేరు. అందుకు అవసరమైన జాతీయ ఐక్యతా భావాన్ని ఏర్పరుచుకోలేరు. సహానుభూతిని సృష్టించుకోలేరు. కష్టనష్టాలకు ఒకరీతిగా స్పందించలేరు. ఉమ్మడి ప్రమాదాలప్పుడూ ఊపివేసే ఉమ్మడి ఉద్వేగ భావన కనపడదు. అనుసరించే మతసంస్కృతి భిన్నమైంది కాబట్టి సమష్టి భావన నెలకొనదు. అందుకే జాతీయ భావాలతో ముస్లింలూ, హిందువులూ ఎదగగలరని అనుకోవటం ఒక కల.. అపోహ మాత్రమే. దీన్ని గ్రహించకపోవటమే అన్ని సమస్యలకూ మూలం. ఆ అపోహనూ ఆ కలనూ వీడి పొరపాటును సరిదిద్దుకోకపోతే భారతదేశం వినాశం వైపు నడుస్తుంది. ఇట్లా మౌలికంగా భిన్న మతాలపై ఆధారపడిన రెండు వేర్వేరు నాగరికతలకు.. హిందువులూ, ముస్లింలూ చెందుతారనీ జిన్నా వ్యాఖ్యానించారు. ఒక రాజ్యంలో వీళ్లు కలిసి ఉంటే సంఘర్షణలు తప్పవని జిన్నా 1940ల్లో సూత్రీకరించారు. అమెరికా రాజకీయ శాస్త్రవేత్త శామ్యూల్ హంటింగ్‌టన్ 1990లో బాగా ప్రచారంలోకి తీసుకొచ్చిన భిన్న నాగరికతల సంఘర్షణల భావనకూ దీనికీ పెద్ద తేడా కన్పించదు. అంబేడ్కర్ కూడా ముస్లింలు ప్రత్యేక దేశం కోరుకోవటంలో తప్పులేదంటూ గట్టి వాదనే చేశారు. ముస్లింలీగ్ వాదనపై అంబేడ్కర్ చేసిన విశ్లేషణ ఆయన రచనలు– ప్రసంగాల ఎనిమిదో సంపుటంలో స్పష్టంగా ఉంది.

ఇక జిన్నా ప్రకారం... ముస్లిం సాహిత్యం వేరు. తాత్వికత వేరు.. అభిరుచి వేరు.. ప్రేరణగా తీసుకునే మూలాలు వేరు.. కావ్యాలు వేరు... కథనాలు వేరు... ముస్లిం వీరులు వేరు... శత్రువులు వేరు.. విషాదాలు వేరు.. ఇంకా చెప్పుకోవాలంటే ఒకరి (హిందువులైనా, ముస్లింలైనా) విజయం ఇంకొకరికి పరాజయం అవుతుంది... ఇలాంటి విరుద్ధ భావనలు, చరిత్రలు కలిగిన రెండు జాతులను ఒక దేశంలో కలిపి ఉంచటం, అందులోనూ ఒకదాన్ని మెజారిటీగా మరొకదాన్ని మైనారిటీగా కలిపి ఉంచటం ఏ విధంగానూ వాంఛనీయం కాదు.

జిన్నా ఈ మాటలు చెప్పి 85 ఏళ్లు అయింది. విశాల ప్రజాస్వామ్య దృష్టితో వీటిని అంగీకరించటం కష్టం. అన్నిటినీ మతమే నిర్ణయిస్తుందని భావిస్తే ఆధునిక నాగరికతకు అర్థమే ఉండదు. ఆర్థిక, సాంకేతిక, విజ్ఞాన శాస్త్రాల్లో వచ్చిన అనేక మార్పులు మతాలు ప్రాణప్రదంగా భావించే ఎన్నో భావాలను మార్చివేశాయి. ఏక భాష, ఏక మతం, ఏక ప్రాంతం ఆధారంగా తలెత్తిన జాతీయ రాజ్యాలు (నేషన్ స్టేట్స్), జాతీయవాదాలు (నేషనలిజమ్స్) మారణకాండలకూ, యుద్ధాలకూ, ఉన్మాద రాజకీయాలకు పలుచోట్ల కారణమయ్యాయి. ఈనాటి జాతీయ రాజ్యాల గతంలో ఎంతో హింస ఉంది. అల్పసంఖ్యాకుల అణచివేత ఉంది.

బహుళ సంస్కృతుల పట్ల సహనం, సమానత్వం చూపాలనీ మతాధిక్య రాజ్యాంగాలు ఉండకూడదనే భావన బలపడినచోటే ప్రజాస్వామ్యాలు నిలబడ్డాయి. ఏక మతాధిక్యతే రాజ్యాంగానికి ఆధారమైన చోట నియంతృత్వాలు రాజ్యమేలుతున్నాయి. 78 ఏళ్ల మన ప్రజాస్వామ్యం మనగలగటానికి బహుళ సంస్కృతుల పట్ల సహనమే ప్రధానకారణం. ఆ సహనానికి కల్పించిన రాజ్యాంగబద్ధతే మనల్ని జిన్నా భావాల నుంచి దూరంగా ఉంచుతోంది. ప్రస్తుతానికి దూరంగా ఉన్నంత మాత్రాన ప్రమాదం తొలగిపోయిందన్న భరోసాలేదు. 1940ల్లో జిన్నా, 1990ల్లో శామ్యూల్ హంటింగ్‌టన్ చేసిన సూత్రీకరణలను నిజం చేయటానికి జరుగుతున్న ప్రయత్నాలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరంగా మారాయి. జిన్నా ఆలోచనలు ఇస్లాం మతాన్ని అనుసరించిన వారికే పరిమితం కాలేదు. ఆ భావాలకు నకళ్లూ, ప్రతిధ్వనులూ బలంగా వ్యాపించటం మన ప్రజాస్వామ్యానికి సవాలుగా మారాయి. మతం సర్వోన్నతమని, స్వమతం నుంచే సమస్త ప్రేరణ పొందాలని, ప్రతినాయకులందరూ ఇతర మతాల్లోనే ఉన్నారని చెలరేగిపోతున్న ప్రచారమే ఇందుకు నిదర్శనం.

జిన్నా దృష్టిలో వేర్వేరు మతాలను అవలంబించేవారు ఒకే జాతిగా ఉండలేరు. జాతీయ ఐక్యతా భావాన్ని ఏర్పరుచుకోలేరు. సహానుభూతిని సృష్టించుకోలేరు. కష్టనష్టాలకు ఒకరీతిగా స్పందించలేరు. అనుసరించే మతసంస్కృతి భిన్నమైంది కాబట్టి సమష్టి భావన నెలకొనదు. అందుకే జాతీయ భావాలతో ముస్లింలూ, హిందువులూ ఎదగగలరని అనుకోవటం ఒక కల.. అపోహ మాత్రమే.

ముస్లింలు అధికులుగా ఉన్న కశ్మీర్ తమకే చెందాలనే పాకిస్థాన్ చేస్తున్న వితండవాదన వెనుక ఉన్నది 1940ల్లో పురుడుపోసుకున్న మతతత్వమే. మతతత్వం ఉన్నచోట ప్రజాస్వామ్య నిర్ణయాలకు తావుండదు. ప్రజల అభీష్టాలకు విలువుండదు. అన్యమతస్థులను అసమానంగా, కర్కశంగా, అమానవీయంగా చూడటం ద్వారానే మతతత్వం మనుగడ సాగిస్తుంది. కశ్మీర్ ప్రజలు దాన్ని తిరస్కరించేలా చేయటంలోనే అసలు విజయం ఉంటుంది. పహల్గాం సంఘటనకు ప్రతీకార చర్యలు... సింధూ నదీజలాల ఒప్పందం నుంచి వైదొలగటంతో మొదలై మరెన్నింటి దాకానో వెళ్లొచ్చు. పాక్‌ను చక్రబంధనం చేయొచ్చు. చిన్నాభిన్నం చేసే వ్యూహాలకు పదును పెట్టొచ్చు. కశ్మీర్ వ్యవహారాల నిపుణులందరూ ఏమేమీ చేయాలో జాబితాలూ ఇస్తున్నారు. వారందరూ ముఖ్యమైందిగా చెప్పేదీ ఒకటుంది. అది.. కశ్మీరీల హృదయాలను గెలుచుకోవటం! ఆ గెలుపే తీవ్రవాదుల ఓటమిని ఖాయం చేస్తుంది. కశ్మీర మహాచరిత్రకారుడైన కల్హణుడు అన్నట్లుగా కశ్మీరును ఆధ్యాత్మికంగా గెలుచుకోవటం ఒకనాడు కష్టం అయివుండొచ్చు. ఆధునిక ప్రజాస్వామ్యంలో తగినంత ఉదారత ప్రదర్శిస్తే అది అసాధ్యం కాదు. అందుకు ఇప్పటిదాకా వేసిన అడుగులు మాత్రం సరిపోవు!

పహల్గాం సంఘటనకు ప్రతీకార చర్యలు... సింధూ నదీజలాల ఒప్పందం నుంచి వైదొలగటంతో మొదలై మరెన్నింటి దాకానో వెళ్లొచ్చు. కశ్మీర్ వ్యవహారాల నిపుణులందరూ చెప్పేదీ ఒకటుంది. అది.. కశ్మీరీల హృదయాలను గెలుచుకోవటం! ఆ గెలుపే తీవ్రవాదుల ఓటమిని ఖాయం చేస్తుంది. కశ్మీర మహాచరిత్రకారుడైన కల్హణుడు అన్నట్లుగా కశ్మీరును ఆధ్యాత్మికంగా గెలుచుకోవటం ఒకనాడు కష్టం అయివుండొచ్చు. ఆధునిక ప్రజాస్వామ్యంలో తగినంత ఉదారత ప్రదర్శిస్తే అది అసాధ్యం కాదు. అందుకు ఇప్పటిదాకా వేసిన అడుగులు మాత్రం సరిపోవు!

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

జీవో 21ను సవరించాలి

ప్రభుత్వం అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీ కోసం జీవో నెంబర్ 21 ద్వారా మార్గదర్శకాలను విడుదల చేసింది. అయితే ఈ జీవోలోని మార్గదర్శకాలు మాలాంటి కాంట్రాక్టు ప్రొఫెసర్లకు అన్యాయం చేసేలా ఉన్నాయి. మేం ఇన్నేళ్లుగా అరకొర వేతనాలతో, రెగ్యులర్ అసిస్టెంట్ ప్రొఫెసర్లతో సమానంగా పనిచేసినప్పటికీ, అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఉద్యోగ నియామకాల్లో మా సర్వీసు, బోధనానుభవానికి ఎలాంటి మార్కుల వెయిటేజ్ ఇవ్వలేదు. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలో, లేదా పరిశోధన సంస్థల్లో పని చేసిన ప్రొఫెసర్ల బోధనానుభవాన్ని పరిగణలోకి తీసుకుని సంవత్సరానికి ఒకటి చొప్పున గరిష్ఠంగా పది మార్కులను కేటాయించారు. కానీ కేంద్రీయ విశ్వవిద్యాలయాల నియామకాల్లో బోధన, పరిశోధన అనుభవానికి సమానంగా ఇండస్ట్రీ ఎక్స్‌పీరియన్స్‌కు ఇచ్చినట్టు స్థానిక వర్సిటీలకు సంబంధించిన ఈ జీవోలో ఎలాంటి మార్కుల వెయిటేజ్ కల్పించలేదు. ఏదైనా విద్యా సంస్థల నుంచి సంబంధిత విభాగాల్లో పీహెచ్‌డీ కలిగి ఉండి, ఆయా విభాగాల్లో కనీసం పదేళ్ల విశేష కృషి చేసిన ప్రొఫెషనల్స్‌ను ప్రొఫెసర్లుగా నియమించుకోవచ్చని యూజీసీ 2018 నియామక మార్గదర్శకాలు సూచిస్తున్నాయి. కానీ ఈ జీవో 21లో కాంట్రాక్టు ప్రొఫెసర్లకు అలాంటి ప్రాధాన్యం ఇవ్వకపోవడం గమనార్హం.

రాష్ట్ర ప్రభుత్వం 'యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ'ని ఏర్పాటు చేసింది. కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న అనుభవజ్ఞులను అందులో ప్రొఫెసర్లుగా ప్రభుత్వం నియమించుకోవచ్చు. ప్రభుత్వం ఆ దిశగా ఆలోచించి 21 జీవోను సవరించాలి. లేదా కాంట్రాక్టు ప్రొఫెసర్లకు ఉద్యోగ భద్రత కల్పించిన తర్వాతే ప్రొఫెసర్ల నియామక ప్రక్రియలో ప్రభుత్వం ముందుకెళ్లాలి.

– డా. కే. రామస్వామి, జర్నలిజం విభాగం, ఉస్మానియా యూనివర్సిటీ

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ–మెయిల్
editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.

ప్రజావ్యూహం!

అటవీసంపద–ఖనిజాల వేటలో
ప్రజా ఉద్యమాల అణచివేతలో
అడవిబిడ్డల ప్రాణాలను
హరించడమే– తప్పు
వొడ్డుకు చేర్చలేని శస్త్రచికిత్స
ఇప్పుడు కొనసాగుతున్న
సైనిక ఆపరేషన్– కగార్!

ఈ అసమ అరణ్య యుద్ధంలో
క్షేత్రస్థాయి నిజాన్ని మరచి
రక్తమోడిన యాభై సంవత్సరాల
'ప్రజాయుద్ధం' సాధించినదెంత?

అడవిమూలాల అంచులపై
కొండలపై ఆత్మరక్షణే కావొచ్చు,
మందుపాతరలు పేలిన ఫలితం
చీలిన అవయవాలు– కండరాలు–
నేలంతా చిందిన రక్తం!

ప్రతీకార 'కగార్' కక్షతో
మారుమోగే తుపాకుల మోతలో
సంజాయిషీ లేని
సర్కారి హింసాకాండకు
ఇకనైనా ముగింపు పలకాలి,
ఇరువైపులా శాంతి చర్చలే మార్గాంతరం,
పోరాటశక్తుల ఆత్మవిశ్వాసాన్ని
వెల్లడించడమే ప్రజావ్యూహం!!

– నిఖిలేశ్వర్

గిగ్ వర్కర్లకు భరోసా, భద్రత!

ఎండా, వానా, చలీ అనుకోకుండా రద్దీ ట్రాఫిక్‌లో వేగవంతమైన బైక్ ప్రయాణంతో ఎక్కే గడపా దిగే గడపాగా జీవనోపాధి ఎంచుకున్న వీళ్ళు ఎవరసలు? మన జీవితంలో ఎలా భాగమయ్యారు? వాళ్ళ జీవితాలేమిటి? వాళ్ళ ఆదాయాలేమిటి? వాళ్లకున్న సమస్యలేమిటి? వారికున్న హక్కులేమిటి? మనం ఎప్పుడైనా ఆలోచించామా?

సాధారణంగా వీళ్ళను గిగ్ లేదా ప్లాట్‌ఫామ్ కార్మికులంటారు. అమెరికా, యూరప్‌లలో 'gig' అంటే, డిక్షనరీ అర్థం ప్రకారం, చిన్న స్వతంత్ర పని లేదా ఒప్పంద ఆధారిత ఉద్యోగం. నిజానికి భారతదేశంలో app (ఏప్) ఆధారితంగా జరుగుతున్న పనులను అంతా తాత్కాలిక ప్రాతిపదికన ఎవరూ ఎంచుకోవడం లేదు. ఎక్కువమంది ఈ కార్మికులు రోజుకు 12 నుండీ 14 గంటల పాటు పని చేస్తున్నారు. కొన్ని ఏప్ ఆధారిత కంపనీలు, "రోజుకు 14 గంటలు పని చేయండి, కేవలం 6 గంటలు నిద్రపోండి, నెలకు యాభై వేలు సంపాదించండి" లాంటి వాణిజ్య ప్రకటనలను అధికారికంగానే విడుదల చేస్తున్నాయి. వీరి విషయంలో 8 గంటల పని దినం అనేది అసలు లేకుండా పోయింది.

ప్లాట్‌ఫామ్ అంటే, ఏదో ఒక ఏప్ ఆధారంగా పని చేయడం. ఇప్పటికే తెలంగాణలో ఏప్ ఆధారిత ప్రధాన కంపనీలు పదికి పైగా ఉన్నాయి. ముఖ్యంగా ఫుడ్ డెలివరీ రంగంలో స్విగ్గి, జొమాటో; రైడ్ షేరింగ్ రంగంలో ఓలా, ఊబర్, రాపిడో, పోర్టర్, ఇతర ఈకామర్స్; గ్రాసరీ డెలివరీ రంగంలో అమెజాన్, బిగ్ బాస్కెట్, బ్లింక్ ఇట్, ఫ్లిప్ కార్ట్, మంత్ర; ఇతర సర్వీసుల రంగంలో అర్బన్ కంపెనీ లాంటి పెద్ద కంపెనీలు ఉన్నాయి. హైదరాబాద్‌కే పరిమితం కాకుండా కొన్ని కంపెనీలు, కొన్ని టూటైర్ సిటీలకు కూడా తమ వ్యాపార సేవలను విస్తరించాయి. తెలంగాణ రాష్ట్రంలో ఇలా ఏప్ ఆధారిత పనులు చేసుకుంటున్న వారి సంఖ్య 4,20,000 వరకూ ఉంటుందని ఒక అంచనా.

ఎంత పని చేసినా, ఈ సేవల కార్మికులు రూ.15వేల నుంచి 18 వేల దాకా, రైడ్ షేరింగ్ కార్మికుల విషయంలో రూ.20వేల నుంచి 25వేల దాకా సంపాదించడం గగనంగా మారింది. వీరికి నిర్దిష్ట వేతనాలు లేవు. కనీస ఆదాయానికి గ్యారంటీ లేదు.

కంపెనీలు ఈ డెలివరీ బాయ్స్‌ను కార్మికులుగా గుర్తించవు కాబట్టి, ఇతర రంగాల కార్మికుల కోసం దశాబ్దాలుగా పని చేస్తున్న కార్మిక సంఘాలు కూడా వీరిని గుర్తించటం లేదు, వీరికోసం పని చేయడం లేదు. కానీ, ఒక హైదరాబాద్ కుర్రాడు మూడేళ్ల పాటు వీరి జీవితాలను పరిశీలించాడు. తెలంగాణ రాష్ట్రంలో వీళ్ళ కోసం ఒక సంఘమే పెట్టాడు. ఆ కుర్రాడే షేక్ సలావుద్దీన్. తాను పెట్టిన సంఘమే 'తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్'. హిందీలో, తెలుగులో గలగలా మాట్లాడే ఈ కుర్రాడు ఇప్పుడు దేశంలో, రాష్ట్రంలో గిగ్ అండ్ ప్లాట్ ఫారం వర్కర్స్ సమస్యలపై గొంతెత్తి మాట్లాడుతున్నాడు.

ఈ డెలివరీ బాయ్స్‌ను కంపెనీలు కార్మికులుగా గుర్తించవు కాబట్టి, కార్మిక సంఘాలు కూడా గుర్తించటం లేదు. కానీ, ఇతర సామాజిక కార్యకర్తలతో కలసి షేక్ సలావుద్దీన్ చేసిన కృషి ఫలితంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్మికుల సంక్షేమం కోసం ఒక ముసాయిదా చట్టాన్ని రూపొందించింది. లక్షలాది మంది గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ కార్మికుల సంక్షేమానికి ఉపయోగపడే చట్టం, సంక్షేమ బోర్డు వేగంగా అమలులోకి రావాలని కోరుకుందాం.



రాహుల్‌గాంధీ సాగించిన భారత్ జోడో యాత్రలో కూడా అతను భాగస్వామిగా చేరి, ఈ కార్మికుల సమస్యలు అర్థమయ్యేలా వివరించాడు. కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోయినా, కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వాలు అధికారంలో ఉన్న చోట ఈ కార్మికులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశాడు. పదివేల మంది సభ్యత్వం కలిగిన ఈ యూనియన్ రాజకీయ నాయకులతో లాబీ చేయడమే కాదు, అనేక ఆందోళనలు, ధర్నాలు కూడా చేసి ఈ కార్మికుల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తెచ్చింది.

ఈ సందర్భంగా రవాణా, ఆహారం, కొరియర్ డెలివరీ, లాజిస్టిక్స్ గృహ ఆధారిత సేవలు, వృత్తిపరమైన సేవలు, ఆరోగ్య సంరక్షణ వంటి అన్ని రంగాలలోని గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ కార్మికుల హక్కులను రక్షించాలని; ఈ కార్మికులు రాష్ట్ర ప్రభుత్వం దగ్గర కూడా నమోదు చేసుకునే అవకాశం ఉండాలని; ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ఐడీ ఇవ్వాలని; రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్మికుల కోసం సంక్షేమ బోర్డు, సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలని; ఈ బోర్డు ద్వారా, కార్మికులు సామాజిక భద్రతా పథకాలను పొందే వీలుండాలని; అగ్రిగేటర్లు, ప్లాట్‌ఫామ్ సంస్థలు కార్మికుల వర్గీకరణకై ఉపయోగించే అల్గారిథం మేనేజ్‌మెంట్‌లో పారదర్శకత ఉండాలని; ఈ సమాచారాన్ని, అగ్రిగేటర్లు సేకరించిన కార్మికుల వ్యక్తిగత సమాచారాన్ని కార్మికులు యాక్సెస్ చేయగలగాలని యూనియన్ కోరుతున్నది.

కార్మికులు సురక్షితమైన పని వాతావరణాన్ని కలిగి ఉండాలని; అగ్రిగేటర్లు రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన కార్యాలయ భద్రత, ఆరోగ్య ప్రమాణాలను పాటించాలని యూనియన్ కోరింది. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనం పొందే హక్కు కార్మికులందరికీ ఉండాలని; ఏప్ ఆధారిత డ్రైవర్స్‌కు ఏకరూప చార్జీల వంటి చర్యల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఆదాయ భద్రతను నిర్ధారించాలని; ఫిర్యాదులను నివేదించడం, పరిష్కరించడం కోసం ఒక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని; దాని ముందుకు వెళ్ళే హక్కు కార్మికులందరికీ ఉండాలని; కార్మికులు ఆన్‌లైన్‌లో, లేదా నిర్దేశిత అధికారి ముందు ఫిర్యాదు చేసే అవకాశం ఉండాలని; పారిశ్రామిక వివాదాల చట్టం 1947 కింద కార్మికులు పరిష్కారాన్ని పొందగలగాలని యూనియన్ కోరుతున్నది. అగ్రిగేటర్లు సరైన కారణాలను లిఖితపూర్వకంగా ఇవ్వకుండా, పద్నాలుగు రోజుల ముందు నోటీసు ఇవ్వకుండా కార్మికుడిని తొలగించకూడదని; కార్మికులందరికీ న్యాయమైన పని నిబంధనలు, షరతులు ఉండాలని; అగ్రిగేటర్లు కాంట్రాక్టులో ఏవైనా మార్పులు చేయడానికి కనీసం 14 రోజుల ముందు కార్మికులకు తెలియచేయాలని కూడా యూనియన్ కోరుతున్నది.

రాజస్థాన్‌లో ఎమ్‌కెఎస్ఎస్ సంస్థ బాధ్యులుగా ఉన్న సామాజిక కార్యకర్త నిఖిల్‌డే బృందంతో కలసి సలావుద్దీన్ అక్కడి కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి, ఒక చట్టాన్ని ఆమోదించేలా చేశారు. దేశం మొత్తంలోనే గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ కార్మికుల కోసం వచ్చిన మొదటి చట్టం ఇది. తాజాగా రాహుల్‌గాంధీ సహకారంతో, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి, ఈ కార్మికుల కోసం ఒక ఆర్డినెన్స్ తెచ్చేలా విజయం సాధించారు. తన స్వంత రాష్ట్రం తెలంగాణలో కూడా ఇతర రాష్ట్రాలకు మించి గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ కార్మికుల కోసం ఒక మంచి చట్టం తేవడానికి సలావుద్దీన్, ఇతర సామాజిక కార్యకర్తలతో కలసి చేసిన కృషి కూడా ఒక రూపం దాల్చింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఒక ముసాయిదా చట్టాన్ని రూపొందించి, ప్రజల అభిప్రాయాల కోసం పబ్లిక్ డొమైన్‌లో ఉంచింది.

మే 1 నుండీ కొత్త చట్టాన్ని అమలు చేయాలనే ప్రయత్నంలో ప్రభుత్వం ఉన్నట్టు కనిపిస్తోంది. చివరి దశలో యాజమాన్యాలు అడ్డుపడకుండా ఉంటే, చట్టంతో పాటు, ఈ కార్మికుల కోసం ఒక సంక్షేమ బోర్డు కూడా ఉనికిలోకి వచ్చే అవకాశం ఉంది. లక్షలాది మంది గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ కార్మికుల సంక్షేమానికి ఉపయోగపడే చట్టం, సంక్షేమ బోర్డు అమలులోకి రావాలనీ, షేక్ సలావుద్దీన్ లాంటి సామాజిక కార్యకర్తల కల నెరవేరాలనీ కోరుకుందాం. రాష్ట్రంలో ఉన్న ఇతర కార్మిక సంఘాలు కోల్పోతున్న కార్మికుల హక్కులను కాపాడుకోవడానికి ఈ కృషిని, చట్టాన్ని స్ఫూర్తిగా తీసుకుంటాయని ఆశిద్దాం.

■ కన్నెగంటి రవి
తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ





సదస్సులో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, చిత్రంలో మంత్రి పొన్నం ప్రభాకర్, తదితరులు

ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తాం

- కాంగ్రెస్ పథకాలు చూసి కొందరు దుఃఖం ఆపుకోలేకపోతున్నారు
- పేదల కోసమే భూ భారతి చట్టం
- రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- ఎల్కతుర్తిలో రైతులకు అవగాహన సదస్సు
- హాజరైన బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

ఎల్కతుర్తి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తామని, తమ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను చూసి కొందరు దుఃఖం ఆపుకోలేకపోతున్నారని రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఎల్కతుర్తి మండల కేంద్రంలో సోమవారం రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌తో కలిసి ఆయన భూ భారతి చట్టంపై రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని రైతుకు ఉన్న భూ సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతులనుద్దేశించి మాట్లాడారు. ఇందిరమ్మ ప్రభుత్వంతోనే గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలు పరిష్కారమవుతాయన్న నమ్మకంతో కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టారన్నారు. గతంలో బీఆర్ఎస్ రూ. 8లక్షల 19వేల కోట్ల అప్పులు చేసి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దిగజార్చిందని మండిపడ్డారు. దేశ వ్యాప్తంగా 18 రాష్ట్రాల

(మిగతా 8వ పేజీలో)

కళ్లు మండి కాంగ్రెస్‌పై విమర్శలు


- 15నెలల్లో 60వేల ఉద్యోగాలు భర్తీ చేశాం
- గౌరవెల్లికి రూ.431కోట్లు కేటాయించి కాల్వలు తవ్వినం
- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్
- ఎల్కతుర్తి మండలంలో అభివృద్ధి పనులకు శ్రీకారం



6

ఏదీ మునుపటి.. వాడీవేడి?

రజతోత్సవ సభలో కానరాని కేసీఆర్ మ్యాజిక్



సభతో గులాబీ శ్రేణుల్లో జోష్..

ఎల్కతుర్తి సభ గులాబీశ్రేణుల్లో జోష్ నింపింది. ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు వినయ్‌భాస్కర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, వొడితల సతీష్‌కుమార్ నేతృత్వంలో ఎల్కతుర్తి వద్ద భారీగా ఏర్పాట్లు చేశారన్న పేరొచ్చింది. సభకు వచ్చే వారికి ఎక్కడ కూడా లోటు లేకుండా సరిపడా నీళ్ల, మజ్జిగతో పాటు కొందరికి సమోసలు, బిస్కెట్లు కూడా అందించటం క్యాడర్‌ను ఆకట్టుకుంది. ఎండాకాలం కావడంతో చల్లగా ఉండేందుకు డ్రమ్ముల్లో ఐస్ వేసి అందులో నీళ్ల, మజ్జిగ ప్యాకెట్లు ఉంచారు. సభావేదికతో పాటు లైట్లు, కుర్చీలు, బారికేడ్లు తదితర ఏర్పాట్లలో బాధ్యతలు తీసుకున్న గులాబీ నేతలు సక్సెస్ అయ్యారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇక జనసమీకరణ కూడా ఆశించిన స్థాయిలోనే జరిగిందనే చర్చ పార్టీ నేతల్లో వ్యక్తమైంది. అయితే ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో కొందరు ఇన్‌చార్జ్‌లు జనసమీకరణపై పెద్దగా దృష్టి పెట్టలేదని, సొంత పబ్లిసిటీకి ఇచ్చిన ప్రాధాన్యం.. జనసమీకరణకు ఇవ్వలేదని, అలాగే పార్టీ నుంచి వచ్చిన ఫండ్ కూడా సక్రమంగా ఖర్చవలేదన్న చర్చ కూడా పార్టీలో జరుగుతోంది. ఫలితంగా కొన్ని నియోజకవర్గాల నుంచి అనుకున్న స్థాయిలో జనసమీకరణ జరగలేదని ఆపార్టీ శ్రేణుల్లోనే చర్చ మొదలైంది. ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, మెదక్ జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు పడటం కూడా కొంత జనసమీకరణకు ఆటంకం కలిగినట్టుగా భావిస్తున్నారు. వరుస ఓటములతో డీలా పడిన క్యాడర్‌లో ఉత్సాహం నింపేందుకు గులాబీ నేతలు ఎక్కువగానే చెమటోడ్చారనే చర్చ జరుగుతోంది.

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

- ప్రసంగంలో పదును, పంచ్‌లు తగ్గాయంటూ చర్చ
- సీఎం రేవంత్ పేరు ఎత్తని గులాబీ బాస్
- స్క్రిప్టు చదవడంపైనా సొంతపార్టీలోనే గుసగుసలు
- సభ సక్సెస్ అయినా.. అధినేత నిరాశపరిచారంటూ వ్యాఖ్యలు
- వరుస ఓటముల్లో ఉన్న శ్రేణులకు కొత్త భరోసా కరువు
- వందల మంది నేతలున్నా ఒక్కరికీ మాట్లాడే అవకాశం ఇవ్వకపోవడంపై అసంతృప్తి
- జనసమీకరణలో శ్రమించి.. సక్సెస్ అయిన ఉమ్మడి జిల్లా నేతలు
- ఏర్పాట్లు, సౌకర్యాలతో క్యాడర్ ఖుషీ ఖుషీ
- మావోయిస్టులతో శాంతి చర్చల తీర్మానం పార్టీకి కలిసొస్తుందని ఆశాభావం

ఉద్యమనేపథ్య సభలో అయినా.. ఎన్నికల ప్రచారపర్వమైనా.. విలేకరుల సమావేశమైనా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రసంగం అంటే అందరికీ గుర్తొచ్చేవి ఆయన వేసే పంచులు.. చెప్పే ప్రాసలు.. పిట్టకథల రూపంలో ఎదుటి వాళ్లపై వేసే సెటైర్లు. అందుకే ఆదివారం ఎల్కతుర్తి వేదికగా జరిగిన ఆ పార్టీ ఆవిర్భావ సభలో ఆయన చేసే ప్రసంగం కోసం అందరూ ఎదురుచూశారు. కానీ ఈ రజతోత్సవ సభలో ఆయన మార్క్ మ్యాజిక్ కనిపించలేదు. మాటలో పదను.. ప్రత్యర్థులపై పంచ్‌ల జాడలేదు. ఎప్పుడు మాట్లాడినా.. ప్రత్యర్థిపై తనదైన శైలిలో వ్యాఖ్యలు చేసే కేసీఆర్.. పాతికేళ్ల సంరంభంలో 52నిమిషాల పాటు మాట్లాడినా.. ఎక్కడా సీఎం రేవంత్‌రెడ్డి పేరెత్తక పోవటం చర్చనీయాంశంగా మారింది. ఈ సభ ద్వారా కేసీఆర్ మాట తీరులో మార్పు చూశామని.. పైగా మాటల మాంత్రికుడిగా పేరున్న ఆయన ఎవరో రాసిచ్చిన స్క్రిప్టు చూసి ప్రసంగించటం ఏంటనే చర్చ సొంతపార్టీలోనే జరుగుతోంది. ఇక కార్యకర్తలు ఈలలు వేస్తూ.. కేరింతలు కొట్టినా.. సభలో సందడి చేసినా.. గులాబీబాస్ మాత్రం తన ప్రసంగంతో మంత్రముగ్ధులను చేయలేదనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. అయితే సుమారు నెలరోజులుగా సభకోసం విస్తృత ఏర్పాట్లు చేయటంతో పాటు జనసమీకరణలో విజయం సాధించిన ఓరుగల్లు నేతలు సభను సక్సెస్ చేశారని, కానీ అధినేత ప్రసంగంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తకావడం కాస్త ఇబ్బందిగా ఉందని ఆపార్టీ శ్రేణులే వ్యాఖ్యానిస్తుండటం గమనార్హం. అయితే మావోయిస్టులతో శాంతి చర్చలు జరుపాలని తీర్మానం చేయడం ప్రతిపక్షంగా తమకు కలిసి వస్తుందనే చర్చ గులాబీ శ్రేణుల్లో జరుగుతోంది.

కేసీఆర్ మాటల మ్యాజిక్ ఏదీ?

రజతోత్సవ సభ నిర్వహణను బీఆర్ఎస్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. అసెంబ్లీ ఎన్నికల తరువాత భారీ బహిరంగ సభ వేదిక ద్వారా ప్రతిపక్ష నేత కేసీఆర్ ప్రజల ముందుకు వస్తుండటంతో అదే స్థాయిలో పబ్లిసిటీ కూడా జరిగింది. మాటల మాంత్రికుడిగా.. తన వాగ్ధాటితో ప్రత్యర్థులకు చుక్కలు చూపిస్తారన్న పేరున్న నేతగా కేసీఆర్‌కు గుర్తింపు ఉండటంతో రజతోత్సవ సభలో ఆయన ప్రసంగం కోసం ప్రజలంతా ఆసక్తిగా ఎదురు చూశారు. కానీ ఆయన మాటల్లో చమక్కులు,

మిగతా 7వ పేజీలో..



మాట్లాడుతున్న బీజేపీ క్రమశిక్షణ సంఘం చైర్మన్ మార్తినేని ధర్మారావు

ఆపరేషన్ కగార్‌పై వెనక్కి తగ్గేదే లేదు..

- వచ్చే ఏడాది మార్చి 31వరకు తుడిచిపెట్టడమే బీజేపీ లక్ష్యం
- మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ మార్తినేని ధర్మారావు

6



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయిని రాజేందర్‌రెడ్డి, చిత్రంలో రేవూరి ప్రకాష్‌రెడ్డి, కడియం శ్రీహరి, కేఆర్ నాగరాజు, ఎర్రబెల్లి స్వర్ణ తదితరులు

కేసీఆర్‌ను జనం మరిచిపోయారు

- ఉనికి కోసమే కాంగ్రెస్‌పై విమర్శలు
- సభకు 2 లక్షల మంది కూడా రాలేదు
- వరంగల్ నగరాభివృద్ధికి బీఆర్ఎస్ చేసిందేం లేదు
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యేలు నాయిని, రేవూరి, కడియం

7



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి

సర్కారు ఆదేశాలతోనే పోలీసులు చేతులెత్తేశారు

- భద్రత విషయంలో నిర్లక్ష్యం చేశారు
- చరిత్రలో నిలిచిపోయేలా సభ జరిగింది
- లక్షలాదిగా తరలివచ్చిన ప్రజలకు కృతజ్ఞతలు
- మాజీ ఎమ్మెల్యేలు వినయ్ భాస్కర్, సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి

6

జూన్ 16 వరకు భద్రకాళి పూడికతీత పనులు పూర్తి కావాలి

- రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- హైదరాబాద్‌లో అధికారులతో సమీక్ష

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం వరంగల్ భద్రకాళి చెరువులో జరుగుతున్న పూడిక తీత పనులను జూన్ 16 నాటికి పూర్తి చేయాలని రాష్ట్ర నీరుపారుదల, పౌరసరఫరా శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ జల సౌదలో సోమవారం భద్రకాళి పూడికతీత పనులపై రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు సత్యశారదదేవి, ప్రావీణ్యతో పాటు నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు జరిగిన పనుల పురోగతిపై రెండు జిల్లాల కలెక్టర్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. భద్రకాళి చెరువు పూడికతీత పనులు యుద్ధ ప్రాతిపాదికన పూర్తి చేయాలన్నారు. నిర్ణీతపనులు త్వరగా పూర్తి చేసేందుకు మరో రెండు టెండర్లను సత్వరమే ఆహ్వానించాలని అన్నారు. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. భద్రకాళి చెరువు పూడికతీత పనులను ఇరు జిల్లాల కలెక్టర్లు, నీటి పారుదల శాఖ అధికారులు మంగళవారం (నేడు) సందర్శించి పనుల పురోగతికి సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన నివేదికను సమర్పించాలన్నారు.

ఈ సమావేశంలో నీటిపారుదలశాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్‌బొజ్జ, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, సాగునీటి పారుదలశాఖ ఈఎన్‌సీ అనిల్‌కుమార్, సీఈ అశోక్‌కుమార్‌లతో పాటు ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

సమస్యలకు సత్వర పరిష్కారం చూపండి

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- ప్రజావాణిలో ఫిర్యాదుల వెల్లువ

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణ పరిష్కారం చూపాలని, అప్పుడే ప్రజలకు న్యాయం జరుగుతుందని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. సోమవారం గ్రేటర్ వరంగల్ మహా నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. అక్కడి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజలు సమస్యలతో కార్యాలయానికి వస్తే వారికి సత్వర న్యాయం చేయాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. ప్రజలు అందించే అర్జీలు పెండింగ్‌లో లేకుండా చూడాలన్నారు. వేసవిలో ప్రజలకు మంచి నీటి సమస్య రాకుండా ఇంజనీరింగ్ అధికారులు శ్రద్ధ వహించాలన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరిగిన గ్రీవెన్స్‌లో 115 ఫిర్యాదులు స్వీకరించినట్టు కమిషనర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, డిప్యూటీ కమిషనర్ రాజేశ్వర్, హెచ్‌వో లక్ష్మారెడ్డి, ఇన్‌చార్జి సీపీ రవీంద్ర రాడేకర్‌తో పాటు వివిధ విభాగాల వింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ - 20, హెల్త్, శానిటేషన్ - 7, ప్రాపర్టీ ట్యాక్స్ రెవెన్యూ - 17, టౌన్‌ప్లానింగ్ - 52, తాగునీటి సరఫరా - 14, ఎలక్ట్రికల్ - 2, జనరల్ - 3 ఇలా మొత్తం 115 దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు తెలిపారు.

అధికారులు స్వీకరించిన ఫిర్యాదులు ఇలా..

మడికొండ డంపింగ్ యార్డ్ కారణంగా చాలా మంది సమీప ప్రజలు ప్రాణాంతక వ్యాధులకు గురవుతున్నారని, వెంటనే అక్కడి నుంచి ఎత్తేసి శాశ్వత పరిష్కారం చూపాలని



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

డంపింగ్ యార్డ్ నిర్మూలన ఉద్యమ అడహక్ కమిటీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

- ఏనుమాముల కోటిలింగాలగుడి సమీపంలో ట్రాక్టర్ల ద్వారా తెచ్చిన చెత్తను ఇక్కడే పడేసి కాల్చి వేస్తున్నారు. ఈ దుర్వాసన, పొగ వల్ల నిద్రలేకుండా పోతుందని 19వ డివిజన్ వాసులు ఫిర్యాదు చేశారు.
- గ్రేటర్ వరంగల్ 37వ డివిజన్ శ్రీనివాసనగర్ కాలనీలో చాలా కాలంగా విద్యుత్ స్తంబాలు లేవని వెంటనే ఏర్పాటు చేయాలని ఫిర్యాదు చేశారు.
- మడికొండలోని మెర్సి స్క్రాప్ షాపు నుంచి పడేసిన వస్తువులు మంటల్లో కాల్చడం వల్ల చాలా ఇబ్బందిగా మారుతుందని కాలనీవాసులు కమిషనర్‌ను కలిసి విన్నవించారు.
- హనుమకొండ రెడ్డికాలనీలో 15 ఫీట్ల రోడ్డును ఆక్రమించి అక్రమంగా కట్టడాలు నిర్మిస్తున్నారని, అక్రమ కట్టడాలను నిలిపి వేయాలని కాలనీవాసులు కమిషనర్‌ను కోరారు.

వేసవిలో మొక్కలు ఎండిపోకుండా చూడాలి

వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు పాటించాలని మేయర్ గుండు సుధారాణి అధికారులకు సూచించారు. సోమవారం ఎల్లాపూర్‌తోపాటు నగర శివారులో బల్దియా ఆధ్వ ర్యంలో కొనసాగుతున్న నర్సరీలని మేయర్ సందర్శించారు. ఈ సం దర్భంగా సుధారాణి మాట్లాడుతూ.. సిబ్బంది డ్యూటీలో భాగంగా సమయపాలన పాటించాలని అన్నారు. గ్రీన్‌షెడ్‌ను విస్తరించి మొక్కలు నీడలో ఉండేలా చూడాలని ఆదేశించారు. సిబ్బందికి అవసరమయ్యే పని ముట్లను సిబ్బందికి అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం మొక్కల జాతులను అడిగి తెలుసుకున్నారు.



ఎల్లాపూర్‌లో నర్సరీని పరిశీలిస్తున్న మేయర్ సుధారాణి



దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి

ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచొద్దు

ప్రజావాణిలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి

వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను వెంటవెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ సంధ్యారాణి ఆదేశించారు. సోమవారం వరంగల్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి వినతులు స్వీకరించి మాట్లాడారు. ఫిర్యాదులపై అలసత్వం వహించకుండా సాధ్యమైనంత మేరకు వెంటనే పరిష్కరించాలని సూచించారు. భూ సంబంధిత సమస్యలపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయని వా టిపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ప్రజావాణిలో మొత్తం 136 వినతు లు అందగా వాటిని శాఖల వారీగా ఎండార్స్ చేశారు. అందులో రెవెన్యూ 48, హౌసింగ్ పీడీ 43, జడ్పీ సీఈవో 4, జీడబ్ల్యూఎంసీ 7, పౌరసరఫరాల శాఖ 3, డీఆర్‌డీఏ 3, లీడ్ బ్యాంక్ మేనేజర్ 2, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ 1, జిల్లా వ్యవసాయశాఖ 2, జిల్లా పంచాయతీ అధికారి 2, జిల్లా సంక్షేమశాఖ 2 వితనతులు అందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో విజయలక్ష్మి, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణి, హౌసింగ్ పీడీ గణపతి, ఎస్సీ కార్పొరేషన్ డీఈ సురేశ్, వ్యవసాయ శాఖ అధికారి అనురాధ, డీసీవో నీరజ, డీపీవో కల్పన, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నర్సంపేట సీఐ రమణమూర్తి బదిలీ

- ఆయన స్థానంలో సీసీఎస్ సీఐ రఘుకు పోస్టింగ్
- సంవత్సర వ్యవధిలోనే బదిలీ కావడం చర్చనీయాంశం

వరంగల్ క్రైం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధి ఈస్ట్‌జోన్‌లోని నర్సంపేట సీఐ రమణమూర్తిని కమిషనరేట్ సెంట్రల్ క్రైం స్టేషన్ (సీసీయస్)కు బదిలీ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో సీసీఎస్‌లో ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్న ఇన్‌స్పెక్టర్ ఎల్. రఘును నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా, బాధ్యతలు తీసుకున్న సంవత్సర వ్యవధిలోనే బదిలీ కావడం చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ నాయకులకు వత్తాసు పలుకుతూ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నాడని, పలు వివాదాలకు కేరాఫ్‌గా నిలుస్తూ శాంతిభద్రతలను కాపాడాల్సిన వ్యక్తి విఘాతం కల్గిస్తున్నాడని గతంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి సీఐపై ఆరోపణలు చేశారు. అప్పట్లో దీనిపై పోలీస్‌శాఖలో పెద్ద దుమారం రేపింది. ప్రెస్‌మీట్ వరకే పరిమితం కాకుండా రాష్ట్ర డీజీపీతో పాటు వరంగల్ పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. స్థానికులతో పాటు కొంత మంది బీఆర్‌ఎస్ నాయకులు మానవ హక్కుల కమిషన్‌కు సైతం ఫిర్యాదు చేశారు. ఇటీవల కాలంలో మాధన్నపేట రోడ్డులోని ఓ భూవివాదంలో ఘర్షణకు చర్చకు దారి తీసింది. ఈ ఘటనలో బీఆర్‌ఎస్ శ్రేణులకు సీఐ సహకరించాడని స్థానిక కాం గ్రెస్ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకబోగా సీఐపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లుగా సమాచారం. బాధ్యతలు తీసు కున్నప్పటి నాటి నుంచి ఏదో ఒక వివాదంలో సీఐ పేరు వినిపించిన ఫలితంగా రెండేళ్ల సర్వీస్ పూర్తికాక ముందే 13 నుంచి 14 నెలల కాలవ్యవధిలోనే బదిలీ కావాల్సి వచ్చిందని పోలీస్‌శాఖతో పాటు సాధారణ ప్రజలు చర్చించుకుంటున్నారు.

బోధనేతర ఉద్యోగుల అంతర్గత బదిలీలు

18 మందిని బదిలీ చేస్తూ కేయూ రిజిస్ట్రార్ ఉత్తర్వులు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ బోధనేతర కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను 18 మందిని అంతర్గత బదిలీ చేస్తూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారిలో కాంట్రాక్టు సీనియర్ అసిస్టెంట్లు టి. రవీందర్, బి. గోపి, హమీద్ బేగం, ఎస్. స్వాతి, కె. గౌరీశంకర్, అవుట్ సోర్సింగ్/కాంట్రాక్టు డేటా ఎంట్రీ ఆపరేటర్స్ కేవీఎస్ రామకృష్ణారెడ్డి, ఎస్. రవీందర్, కె.రాజమహేందర్, ఆఫీస్ అసిస్టెంట్లు బి. శ్యాముల్ సింగ్, బి. కిషన్, ఎస్. లక్ష్మీనారాయణ, పి. సాంబయ్య, ఎం. శ్రీనివాస్, పి. వెంకటేశ్వర్లు, జి. కళ, కె.వనజ, బి. సుజాత, ఆర్. రమేశ్వర్లు ఉన్నారు. వీరంతా కొత్త స్థానాలకు వెళ్లి జాయిన్ కావాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రూ. 400 కోట్లు ఖర్చు చేసి సభ ఎందుకు ? : ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

ఎల్కతుర్తిలో బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ సభకు రూ. 400 కోట్లు ఖర్చు చేసి నిర్వహించుకోవడం ఎందుకని హనుమకొండ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ ఫాం హౌజ్ తవ్వితే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని పేర్కొ న్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి, టీపీసీసీ సభ్యులు అశోక్‌రెడ్డి, నాయకులు గోలి రాజేశ్వర్‌రావు, సంతాజీ, డాక్టర్ రమేష్, గొర్రె మహేందర్, తదితరులు పాల్గొన్నారు.



దామెరలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొన్నం, చిత్రంలో నాయకులు, అధికారులు

కళ్లు మండి కాంగ్రెస్‌పై విమర్శలు

- 15 నెలల్లో 60 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం
- గౌరవెల్లికి రూ.431కోట్లు కేటాయించి కాల్వలు తవ్వాం
- సోనియా లేకుంటే తెలంగాణ వచ్చేదా ?
- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్
- ఎల్కతుర్తి మండలంలో అభివృద్ధి పనులకు శ్రీకారం

ఎల్కతుర్తి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): అనతి కాలంలోనే కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధిని ఓర్వలేక కళ్లు మండి ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. ఎల్కతుర్తి మండల పరిధిలో దామెర, చింతలపల్లి, బావుపేట, వీరనారాయణపూర్ గ్రామాల్లో సోమవారం పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. అనంతరం భూ భారతి చట్టంపై నిర్వహించిన రైతు అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. పదేళ్లలో ఏం చేశారని రజతోత్సవ సంబరాలు జరుపుకున్నారని మండిపడ్డారు. గౌరవెల్లి వద్ద కుర్చేసుకుని ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తానని ప్రగల్భాలు పలికి ఎన్ని ఎకరాలకు నీరు అందించారో చెప్పాలని సవాల్ విసిరారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ. 431 కోట్లు కేటాయించి ప్రాజెక్టు దిగువన కాలువలు తవ్వించామని గుర్తు చేశారు. ధరణిలో ఉత్పన్నమైన సమస్యలు పునరావృతం కాకుండా ఉండేందుకు భూ భారతి చట్టాన్ని తీసుకరావడం జరిగిందన్నారు. అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోనే 60 వేల ఉద్యోగాలు భర్తీ చేసిన చరిత్ర రేవంత్ సర్కార్‌దన్నారు. సోనియాగాంధీ లేకుండా తెలంగాణ వచ్చేదా.. మీకు పదవులు దక్కేవా అని ఆరోపించారు. రాష్ట్రాన్ని ఇచ్చిన తల్లినే విమర్శించడం వారి అవివేకమన్నారు.

భూ భారతితో సమస్యల పరిష్కారం : కలెక్టర్ ప్రావీణ్య

భూభారతి చట్టం వల్ల గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలు సత్వర పరిష్కారమవుతాయని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. భూ భారతి చట్టంపై రైతులకు ఆమే అవగాహణ కల్పించారు. ఈ చట్టాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలో 40 వేల సాదాబైనామా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటిని రెగ్యులరైజ్ చేసి పట్టాపాస్ పుస్తకాలు అందజేయ నున్నట్లు తెలిపారు.

ధరణి రైతులకు మనోధైర్యం లేకుండా చేసింది : ఎమ్మెల్యే నాగరాజు

గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్ రైతులకు మనో ధైర్యం లేకుండా చేసిందని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు అన్నారు. గతంలో జరిగిన అన్యాయం రైతులకు జరుగకుండా ఉండేందుకు భూ భారతి చట్టాన్ని రూపొందించడం జరిగిందన్నారు. ఇట్టి అవకా శాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సర్కారు ఆదేశాలతోనే పోలీసులు చేతులెత్తేశారు..

- భద్రత విషయంలో నిర్లక్ష్యం చేశారు
- చరిత్రలో నిలిచిపోయేలా సభ జరిగింది
- లక్షలాదిగా తరలివచ్చిన ప్రజలకు కృతజ్ఞతలు
- మాజీ ఎమ్మెల్యేలు వినయ్ భాస్కర్, సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు లక్షలాదిగా ప్రజలు తరలి వస్తే రేవంత్‌రెడ్డి సర్కార్ ఆదేశాలతో సభలో పోలీసులు చేతులెత్తేసి నిర్లక్ష్యం చేశారని మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. రజతోత్సవ సభను విజయవంతం చేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. ప్రజలు రజతోత్సవ సభకు ఆటోలు, ఎడ్లబండ్లు, పాదయాత్రల ద్వారా లక్షలాదిగా తరలివచ్చి సభను విజయవంతం చేశారని అన్నారు. సభ నిర్వహణకు రైతులు 1200ఎకరాలు ఇచ్చిన వారికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ చరిత్రలో ఎప్పుడు జరుగని విధంగా బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ విజయవంతం అయిందని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు లక్షలాదిగా తరలి వచ్చి సభను జయప్రదం చేశారని అన్నారు. పోలీసులు సభ నిర్వహణలో నిర్లక్ష్యం చేయడంతో భారీగా ట్రాఫిక్ జామ్‌తో పాటు భద్రత విషయంలో నిర్లక్ష్యం చేశారని మండి పడ్డారు. సభకు వస్తున్న వాహనాలను ఆర్‌టీవో అధికారులు తనిఖీలతో బీఆర్‌ఎస్ కార్యకర్తలను ఇబ్బంది పెట్టారని మండిపడ్డారు. నర్సంపేట నియోజక వర్గంలో ఒక్క స్కూల్ బస్సును పెట్టవద్దని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు , ఆర్‌టీవో అధికారులు బెదిరించినట్లు తెలిపారు. మంత్రులకు సిగ్గుండాలని పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. కేసీఆర్ ఉపన్యాసం ముగియగానే కాంగ్రెస్ మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, జూపల్లి కృష్ణారావు. పొన్నం కేసీఆర్‌కు వ్యతిరేకంగా మాట్లాడడం సిగ్గుచేటని 25 ఏళ్ల పార్టీ పండుగ జరుపుకుంటే ఇంగిత జ్ఞానం లేకుండా మాట్లాడారని విమర్శించారు. సభ విషయంలో పోలీసులు పూర్తిగా నిర్లక్ష్యం చేశారని, ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీలు సభలు నిర్వహించుకుంటే రక్షణ కల్పించి సభ విజయవంతానికి కృషి చేస్తారని, ఫోన్లు చేసినా పోలీసులు ఎత్తలేదన్నారు. సభకు వస్తున్న వాహనాలను ములుగు రోడ్డు వద్ద ఆర్టీఏ అధికారులు రోడ్డుకు అడ్డంగా ఆపి గంటల తరబడి నిలబెట్టి ఇబ్బందికి గురి చేశారు. దీంతో అక్కడ ఘర్షణ వాతావరణం నెలకొందని మండిపడ్డారు. ఈ పరిస్థితుల్లో అక్కడ తాను ఉంటే ఆర్టీవో అధికారులను లాగులు ఊడదీసి కొట్టేవాన్ని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు, ఆర్టీవో అధికారులు ప్రభుత్వానికి కార్యకర్తల్లా పని చేశారని విమర్శించారు.

ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ సూచనలతో బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు 1200 ఎకరాల్లో రైతుల నుంచి ఎన్‌వోసీ తీసుకొని మ్యాప్‌ను తయారు చేసి పోలీసు అనుమతికి దరఖాస్తు చేస్తే అనుమతి ఇవ్వలేదని కోర్టు నుంచి అనుమతి తెచ్చుకున్నామని తెలిపారు. చివరి రోజు సభలో లక్షలాదిగా తరలి వచ్చిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు, ప్రజలను ట్రాఫిక్‌ను నియంత్రించి సభ సజావుగా సాగేందుకు పోలీసులు కృషి చేయలేదని, సభ నిర్వహణకు 2వేల మంది పోలీసులు సపోర్ట్ చేస్తారని చెప్పి 200మంది కూడా రాలేదన్నారు. సభ నిర్వహణ రోజే భూపాలపల్లి నియోజక వర్గంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు జాబ్ మేళాలు పెట్టి సభను ఫెయిల్ చేయాలని చూశారని జనం సభకు తరలి వచ్చి విజయవంతం చేసినట్లు తెలిపారు. పోలీసులు సహకరించకున్నా బీఆర్‌ఎస్ కార్యకర్తలు కష్టపడి ఇబ్బందులు లేకుండా పనిచేశారని వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. కేసీఆర్‌పై తెలంగాణ ప్రజలకు అభిమానంతో 15కిలోమీటర్ల నుంచి సభ వద్దకు కాలినడకన వచ్చారని, ఏ సభకు ఇలా జరుగలేదని ప్రజల గుండెల్లో కేసీఆర్ పదిలంగా ఉన్నారని శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కేసీఆర్ సభను విజయవంతం చేసిన హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్ బాబు, వలంటీర్లుగా పనిచేసిన కార్యకర్తలకు సభ విజయవంతానికి కృషి చేసిన వారికి ధన్యవాదాలు తెలిపారు.

చర్లపల్లి నుంచి తిరుపతికి ప్రత్యేక రైళ్లు

గిర్మాజీపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వచ్చే మే నెల 7, 14, 21 తేదీలలో చర్లపల్లి నుంచి తిరుపతికి వరంగల్ మీదుగా ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు దక్షణమధ్య రైల్వే ప్రకటించింది. ప్రతీ బుధవారం సాయంత్రం 6.30 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6.55 గంటలకు తిరుపతికి చేరుకుంటుంది. అదేవిధంగా తిరుపతి నుంచి చర్లపల్లికి వెళ్లే రైళ్లు మే 8, 15, 22 తేదీలలో నడుస్తాయి. ప్రతీ గురువారం సాయంత్రం 4.55 గంటలకు తిరుపతిలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6 గంటలకు చర్లపల్లికి చేరుకుంటుంది. ఈ ప్రత్యేక రైళ్లకు మొదటి, రెండో, మూడో ఏసీ కోచ్‌లు, స్లీపర్, జనరల్ కోచ్‌లు ఉంటాయి. ఇవి జనగామ, కాజీపేట, వరంగల్, నెక్కొండ, మహబూబాబాద్, ఖమ్మం, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, వెంకటగిరి, శ్రీకాళహస్తి, రేణిగుంట స్టేషన్‌లలో ఆగుతాయి. ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని దక్షిణమధ్య రైల్వే ముఖ్య పౌరసంబంధాల అధికారి ఎ.శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు.

బాలలకు వ్యక్తిత్వ వికాస శిక్షణ శిబిరం

బాలసముద్రం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ కేఎల్ఎన్ రెడ్డి కాలనీలోని శ్రీరామకృష్ణా సేవా మందిరంలో బాల సంస్కార్ వేసవి వ్యక్తిత్వ వికాస శిక్షణ శిబిరాన్ని సేవా సమితి అధ్యక్షుడు కటంగూరి సత్యనారాయణరెడ్డి సోమవారం ప్రారంభించారు. శిబిరంలో 4వ తరగతి నుంచి 10వ తరగతి చదువుతున్న బాల బాలికలకు శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఈ శిబిరంలో పాల్గొనే విద్యార్థులకు ఉదయం 7 గంటల నుంచి ప్రార్థన, యోగాసనాలు , ధ్యానం, ఆకర్షణీయమైన చేతి వ్రాత, శ్లోకాల పఠనంతో పాటు నైతిక శిక్షణ అంశాలను నేర్పిస్తున్నారు. నైతిక శిక్షణలో మాతృ, పితృ భక్తి , గురు పరంపర, దేశ భక్తి ఆదర్శ విద్యార్థి ఏకాగ్రత రహస్యాలు , భారతీయ వారసత్వ వైభవం, ఆచారాలు, ఆదర్శాలు, సమయపాలన తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. అంతేగాక గుణాత్మకమైన ఆటలు ఆడిస్తున్నారు. ఈ శిబిరం పదిరోజుల పాటు కొనసాగుతుందని రామకృష్ణా సేవా సమితి అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి తెలిపారు



శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న కటంగూరి సత్యనారాయణ రెడ్డి

ఆపరేషన్ కగార్‌పై వెనక్కి తగ్గేదే లేదు..

- వచ్చే ఏడాది మార్చి 31వరకు తుడిచి పెట్టడమే బీజేపీ లక్ష్యం
- మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ మార్తినేని ధర్మారావు

రాంనగర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ కగార్‌పై వెనక్కి తగ్గేదే లేదని ఈ విషయంలో ఎవరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోబోమని కచ్చితంగా కొనసాగుతుందని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ మార్తినేని ధర్మారావు అన్నారు. సోమవారం హనుమకొండ హంటర్‌రోడ్డులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మారావు మాట్లాడుతూ వేలాది మంది అమాయక గిరిజనులను పొట్టనపెట్టుకుంటున్న మావోయిస్టు టెర్రరిజాన్ని బీజేపీ ఎప్పటికీ ఆమోదించదన్నారు. దానిని పూర్తిగా నిర్మూలించడానికి కేంద్ర ప్రభుత్వం వచ్చే ఏడాది మార్చి 31 వరకు డెడ్‌లైన్ పెట్టిందని గుర్తు చేశారు. ఈ విషయంలో మావోయిస్టుల విశ్వాసం పొందేందుకు మాజీ సీఎం, సీఎం పోటీపడుతున్నారని ఎద్దేవా చేశారు. భారత్ సరిహద్దుల్లోని ఉగ్రవాదుల దాడుల్లో స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు సైనికులతో పాటు సాధారణ పౌరులు 47,914 మరణిస్తే ఎప్పుడు నోరు మెదపని ప్రాంతీయ, జాతీయ పార్టీలు ఇప్పుడు దేశభక్తి ఉన్నట్లుగా నటిస్తూ మాట్లడడం సిగ్గు చేటన్నారు. 11 ఏళ్లలో 11 పైసలు బీజేపీ ప్రభుత్వం ఇవ్వలేదని 10 యేళ్ల సీఎంగా చేసిన కేసీఆర్ రజతోత్సవ సభలో మాట్లాడటం ఆయన అబద్ధాలకు నిదర్శనమన్నారు. 2023 సంవత్సరంలో పార్లమెంట్ ఎన్నికలు జరిగే నాటికి కేంద్ర ప్రభుత్వం నుంచి తెలంగాణకు 9 లక్షల 72 వేల కోట్ల నిధులు రావడం జరిగిందన్నారు. మహబూబాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యుడు అజ్మీరా సీతారాంనాయక్ మాట్లాడుతూ హైదరాబాద్ ఎమ్మెల్సీ స్థానంలో ఎంఐఎం అభ్యర్థి బరిలో ఉంటే ఆ పోటీ నుంచి బీఆర్‌ఎస్ ఎందుకు వైదొలిగింది.? బీఆర్‌ఎస్ ముస్లింలకు సపోర్ట్ చేస్తుందా.. హిందువులకు సపోర్ట్ చేస్తుందా తేల్చుకోవాలని డిమాండ్ చేశారు. భారత్‌లో జరిగిన ఉగ్రవాద చర్యలను ప్రపంచంలోని దేశాలన్ని ఖండిస్తే భారత్‌దేశంలో ఉన్న కేసీఆర్ ఫామ్‌హౌజ్‌కు పరిమితమై ఆదివారం జరిగిన రజతోత్సవ సభలో వారం రోజులకు స్పందించడం సిగ్గుచేటన్నారు. గిరిజన వర్సిటీకి 900 కోట్లు ఇచ్చిన విషయం నీకు తెలియదా... వలిగొండ టూ భద్రచలంకు 240 కోట్లతో రోడ్డు పనులు జరుగుతుంది తెలియదా...? స్మార్ట్ సిటీలో వరంగల్‌కు 1000 కోట్లు ఇచ్చింది తెలియదా... ఇవన్నీ తెలిసాకా బేవకూఫ్ మాటలు ఎందుకు మాట్లాడుతున్నావని మండిపడ్డారు. హను మకొండ మాజీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ మాట్లాడుతూ.. తెలంగాణలో మహాలక్ష్ములుగా చూసుకునే ఆడపిల్లలను సభ వేదికగా కేసీఆర్ అవమానించడం సిగ్గు చేటని దీనిపై తక్షణమే రాష్ట్ర మహిళా కమిషన్ స్పందించాలన్నారు. అమాయక ప్రజలను నక్సలైట్లు హత్యలు చేస్తున్నప్పుడు అధికారంలో ఉండి కూడ మాట్లాడని కేసీఆర్ ఇప్పుడు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. తెలంగాణ తొలి ఉద్యమకారులైన కొండా లక్ష్మణ్‌బాపూజీ, జయశంకర్‌కు నివాళులు అర్పించకుండా, వారి ఫొటోలను పెట్టకుండా అవమానపరిచారని, కేవలం తండ్రి, కొడుకల సభలాగా కొనసాగిందన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, మాజీ మేయర్ రాజేశ్వర్‌రావు, పగడాల కాళీప్రసాద్, కొండేటి శ్రీధర్, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు ఏడునూతల నిషిధర్‌రెడ్డి, ములుగు జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు వల్లభ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మందులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య

అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలి

డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ.అప్పయ్య

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : అత్యవసర మందులను ఎప్పుడు అందుబాటులో ఉంచాలని హను మకొండ డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ. అప్పయ్య సూచించారు. సోమవారం ఎల్కతుర్తి పీహెచ్‌సీ, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్, దామెర, కేశవాపూర్, బావుపేటలను సందర్శించారు. ఈ సందర్భంగా గర్భిణులకు అందుతున్న సేవలను పరిశీలించి, పీహె చ్‌సీ పరిధిలో ఉన్న బీపీ, షుగర్, క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు తగిన సేవలను అందించాలన్నారు. ప్రజలకు వేసవి సందర్భంగా జాగ్రత్తలు, సాధారణ ప్రసవాల వల్ల కలిగే మేలు గురించి, ప్రభుత్వ ఆస్పత్రులలో ప్రసవాలను ప్రోత్స హించే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్కతుర్తి వైద్యాధికారి డాక్టర్ శ్రీనాథ్, పల్లె దవాఖాన వైద్యాధికారులు అరవింద్, వాణి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రవీందర్, సూపర్‌వైజర్ టి.రామచందర్, యాదమ్మ, విప్లవ్ కుమార్, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

బార్ షాపులకు దరఖాస్తుల వెల్లువ

- నాలుగు షాపులకు గానూ 491 మంది పోటీ
- నేడు కలెక్టరేట్ సమావేశ మందిరంలో లక్కీడ్రా

వరంగల్ క్రైం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ పరిధిలో కొత్తగా లైసెన్స్ జారీ చేసే నాలుగు బార్ షాపులకు 491 మంది మద్యం వ్యాపారులు పోటీపడుతున్నారు. గతంలో రెన్యూవల్ కాకుండా మిగిలిన నాలుగు బార్‌షాపులను దక్కించుకోవడానికి ఆసక్తి గల వ్యక్తులు లక్ష రూపాయల నాన్ రీఫండబుల్ చెల్లించి డ్రాలో పాల్గొనాలని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు ఈ నెల 22న ప్రకటించిన నేపథ్యంలో మద్యం వ్యాపారులు తమ అదృష్టాన్ని పరీక్షించబోతున్నారు. ఒక వ్యక్తి తనపేరు మీద ఎన్ని షాపులకైన దరఖాస్తులు చేసుకోవచ్చని అబ్కారీశాఖ బంఫర్ ఆఫర్ ఇవ్వడంతో పోతే నాల్గు లక్షలు వస్తే షాపు అన్నట్లుగా కొంత మందికి నాల్గు షాపులకు దరఖాస్తులు చేసుకున్నట్లుగా తెలుస్తోంది.

పోటీ తీవ్రంగా ఉన్నప్పటికి లక్ష రూపాయల నాన్ రిఫండబుల్ స్కీంను లెక్కచేయకుండా వందల సంఖ్యలో దరఖాస్తు చేసు కున్నారు. దీంతో అబ్కారీ శాఖకు 4 కోట్ల 97 లక్షల ఆదాయం చేకూరింది. ఉన్న నాలుగు షాపుల్లో ఒక్కొక్క షాపుకు 125 మంది పోటీపడపోతుండగా, 491 మందిలో అదృష్టం ఎవరిని వరించబోతుందో మంగళవారం ఉదయం 11 గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ ఆధ్వర్యంలో తీసే లక్కీ డ్రాలో తేలనుంది.

ఎంట్రీ పాస్‌లతో హాజరు కావాలి

దరఖాస్తుదారులు ఎంట్రీపాస్‌తో ఉదయం 10 గంటల వరకు హనుమకొండ కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో జరిగే లక్కీ డ్రాకు హాజరుకావాలని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి కె. చంద్రశేఖర్ తెలిపారు.

నేడు శాంతి పండుగ

భిన్న మతాల ప్రముఖులకు సన్మానం

హనుమకొండ కల్చరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ కేంద్రంగా అంతర్జాతీయ స్థాయిలో విధులు నిర్వహి స్తున్న వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం 5 గంటలకు వాగ్దేవి కళాశాల ఆడిటో రియంలో నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు ప్రొఫెసర్ సురేష్‌లాల్, హమ్మద్ సిరాజుద్దీన్‌లు తెలిపారు. ఇటీవల ఉగాది, రంజాన్, మహావీర్ జయంతి, శ్రీరామ నవమి, గుడ్ ఫ్రైడే, ఈస్టర్ ఫెస్టివల్ లాంటి అనేక పర్వాలు ఎవరికి వారే జరుపుకున్న నేపథ్యంలో సమాజంలోని అన్ని మతాల వారు ఐక్యంగా జరుపుకునే పర్వమే శాంతి పండుగ అని వారు వివరించారు. ఈ వేడుకల్లో భాగంగా అన్ని రకాల వంటకాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, వీటితోపాటు భిన్న మతాలకు చెందిన ప్రముఖులు ఐదుగురిని ఎంపిక చేసి వారిని ఘనంగా సత్కరిస్తామని చెప్పారు. శాంతి సామరస్యాన్ని ఐక్యంగా చాటే ఈ వేడుకల్లో ఎవరైనా పాల్గొనవచ్చని వారు ఆహ్వానించారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7460	5300
మక్కలు	2181	1521
కందులు	6052	3022
పెసళ్లు	6922	3022
పల్లికాయ (సూక)	5900	5200
పల్లికాయ (పచ్చిది)	4350	3575
పసుపు (కాడి)	14155	10534
పసుపు (గోల)	12509	9700
తేజ మిర్చి	13000	9500
వండర్‌హాట్	11500	10000
యూఎస్ 341	11500	9000
దీపిక	10500	10000
దేశీ	20000	18000
సింగిల్ పట్టి	-	-
తాలు మిర్చి	5000	2500

- వరంగల్ వ్యవసాయం

నాట్యం.. ఓరుగల్లు వారసత్వం

- కళల కాణాచిలో గుబాళిస్తున్న నృత్య సౌరభాలు
- గిన్నిస్ రికార్డులో చోటు దక్కించుకున్న బతుకమ్మ నృత్య రూపం
- పలు జాతీయ వేదికలపై వెలుగులీనుతున్న కళ

నేడు ప్రపంచ నాట్య దినోత్సవం



జాతీయ నృత్య కళా కారిణి హిమాన్సీ

హనుమకొండ కల్చరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : కళల కాణాచి, సాంస్కృతిక రాజధాని చారిత్రక ఓరుగల్లులో నాట్య సౌరభాలు గుబాళిస్తున్నాయి. కాకతీయుల సంగీత, సాహిత్య, శిల్ప, నృత్య కళలను పోషించిన విషయం తెలిసిందే. అనేక నాట్య శాస్త్ర భంగిమలను విభిన్న నాట్య రీతులను అనేక ఆలయాల్లో శిల్పాలుగా చెక్కించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు భిన్న నృత్యాలు కాకతీయుల వారసత్వంగా కొనసాగుతూ వస్తున్నాయి. వారి కాలంలో పురుడు పోసుకున్న పేరిణి, జానపదం ముఖ్యంగా కూచిపూడి ఓరుగల్లు నేలపై నిత్యం తొణికిసలాడుతోంది. అంతేగాక ఓరుగల్లు నృత్యానికి అంతర్జాతీయ స్థాయిలో గిన్నిస్ బుక్‌లోనూ చోటు దక్కించుకోవడం అపూర్వ విషయమే. మంగళవారం ప్రపంచ నాట్య దినోత్సవం సందర్భంగా కథనం.

ఓరుగల్లు కళా సంస్థలు

వరంగల్‌లో టీవీ మాధ్యమ ప్రభావంతో నృత్యాలకు ఆదరణ పెరుగుతోంది. వరంగల్‌లో వందలాది మంది కళాకారులు జాతీయ వేదికలపై రాణిస్తున్నారు. పలు కళాక్షేత్రాలు, సంఘాలు కళాకారులను ప్రోత్సహిస్తున్నాయి. వరంగల్‌లో వెలిసిన వెంపటి నాగేశ్వరి నృత్య కళాక్షేత్రంతో పాటు బొంపెల్లి సుధీర్‌రావు నేతృత్వంలోని నృత్య మాల, శివానంద సద్గురు నృత్య కేంద్రం, తాడూరి రేణుక నాట్యాచారిణిగా నృత్య స్రవంతి, నృత్య రవళి పేరుతో పరమేశ్వర్ ఆధ్వర్యంలో నృత్య కళా సంస్థ, కుండె అరుణ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో హనుమకొండలో మయూరి నాట్య కళా కేంద్రం, రుద్ర వేణు, వానమామల కృష్ణదేవ్, భ్రమరాంబ, నెహ్రూ యువ కేంద్రం, బాలభవన్ల ద్వారా ఝాన్సీ, కాట్రగడ్డ హిమాన్సీ చౌదరి ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య రీతుల్లో టెంపుల్ డ్యాన్స్ పేరిట వందలాది మంది కూచిపూడి కళాకారులను తీర్చిదిద్దుతున్నారు. రమ్యమైన కళారూపాల్లో ప్రధానమైనది నృత్యమే. ఇందులో ఎక్కువ మందిని అలరింపజేస్తున్నది కూచిపూడే కావడం విశేషం. ప్రధానంగా నారాయణతీర్థులు రాసిన శ్రీకృష్ణ లీలా తరంగిణి, సంప్రదాయ సిద్ధమైన సిద్ధేంద్రయోగి, భామకలాపం, కూచిపూడి నాట్య విద్యలో బాలగోపాల తరంగం, దశావతార నృత్యం, అష్టపదులు లాంటి నృత్య రీతులను ఓరుగల్లు కళాకారులు ప్రధానంగా ప్రదర్శిస్తున్నారు. కాకతీయుల అపూర్వ చరిత్ర నృత్య రూపకాన్ని అన్ని కళా సంస్థల విద్యార్థినులు అద్భుతంగా ప్రదర్శిస్తూ అలనాటి ఓరుగల్లు కీర్తిని చాటుతున్నారు. ఓరుగల్లు నుంచి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన కళాకారుల సంఖ్య వందల్లోనే ఉంటుందనడంలో అతిశయోక్తి లేదు. కూచిపూడిలో శిక్షణ పొందడమే కాక డిప్లొమా, టీటీసీ కోర్సులను పూర్తి చేసి కేంద్ర ప్రభుత్వ స్కాలర్‌షిప్‌లను పొందుతున్న విద్యార్థుల జాబితా కూడా చాలా ఉంది.

గిన్నిస్ బుక్‌లో బతుకమ్మ నృత్య రూపం

డాక్టర్ శాంతికృష్ణ కళాకారుడిగా అంచెలంచెలుగా ఎదిగారు. ఓరుగల్లులోని వెంపటి కళా క్షేత్ర ఆచార్యుడు వెంపటి శ్రావణి హైదరాబాద్‌లో 500 మంది కళాకారులతో ప్రదర్శించిన బతుకమ్మ తల్లి జానపద నృత్యం గిన్నిస్ బుక్‌లో చోటు దక్కించుకుంది. వీరు ఇప్పటివరకు 11దేశాల్లో బతుకమ్మ తల్లి ప్రదర్శనలు ఇచ్చారు. గతేడాది మార్చి 28 నుంచి ఏప్రిల్ 2 వరకు మలేషియా దేశంలోని కౌలాలంపూర్‌లో తెలుగు అసోసియేషన్ ఆఫ్ మలేషియా ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవాలు నిర్వహించారు. 19మంది కూచిపూడి కళాకారులు ఇచ్చిన ప్రదర్శన ఆ దేశ ప్రధాని నుంచి ప్రశంసలందుకుంది. అమెరికాలోని వైట్‌హౌస్, దుబాయిలోని బుర్జ్ ఖలిఫా వేదికపై నృత్య ప్రదర్శన ద్వారా ఓరుగల్లు కీర్తిని చాటి చెప్పామన్నారు.



శాంతికృష్ణను సత్కరిస్తున్న సినీ నిర్మాత దిల్ రాజు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, బండా ప్రకాశ్, జేడీ లక్ష్మీనారాయణ (ఫైల్)



అమెరికాలో ఓరుగల్లు కళాకారులు (ఫైల్)

అద్భుత కళాకారులు

దశాబ్దం క్రితం సుధీర్‌రావు వద్ద నృత్యంలో ఓనమాలు నేర్చుకున్న హిమాన్సీ అనేక వేదికలపై అద్భుత ప్రదర్శనలిచ్చి ప్రశంసలందుకున్నారు. అలాగే టెంపుల్ డ్యాన్స్ పేరిట ప్రత్యేక ఆర్ట్ ఫామ్ తయారు చేయించి వందలాది శిష్యులకు ఈ విద్యను నేర్పిస్తోంది. నృత్య స్రవంతి ద్వారా తాడూరి రేణుక 1991లో తమ కేంద్రాన్ని ప్రారంభించి ఇప్పటి వరకు మూడు వేల మందికి శిక్షణ ఇచ్చినట్లు ఆమె చెప్పారు. చందన రాముల జాతీయ వేదికలపై మెరిసి.. లిమ్కా బుక్‌లో తన పేరును లిఖించారు. ఈటూరి అజయ్ కుమార్ కూచిపూడి నృత్యంలో పీహెచ్‌డీ పూర్తి చేసి యూజీసీ నుంచి జూనియర్ రిసెర్చ్ ఫెల్లోషిప్‌కు ఎంపికైనట్లు రేణుక చెప్పారు. అన్ని కళాసంస్థల విద్యార్థులు తెలుగు రాష్ట్రాల్లో జరిగే నృత్య పోటీల్లో పతకాలను సాధిస్తూ ఓరుగల్లు ఖ్యాతి చాటుతున్నారు. ఓరుగల్లులో ఏటా జరిగే అనేక సంప్రదాయ ఉత్సవాలు, ఆలయాలు, వినాయక చవితి పర్వదినాల్లో వేలాది మంది విద్యార్థులు తమ ప్రదర్శనతో సందడి చేస్తారు.



నృత్య ప్రదర్శనలో శ్రావణి, శాంతికృష్ణ (ఫైల్)



నృత్యకారిణి చందన

ఏదీ మునుపటి.. వాడీవేడి?

(5వ పేజీ తరువాయి)

వ్యంగాస్త్రాలు కనిపించకపోవటం వారిని నిరాశకు గురిచేస్తే.. రాసిచ్చిన స్క్రిప్టు చదవటం మరింత చర్చనీయాంశంగా మారింది. 52 నిమిషాలు మాట్లాడిన కేసీఆర్ ఒక్క కొత్త మాట మాట్లాడలేదని, కొత్త కార్యక్రమాలకు పిలుపునివ్వలేదని, ప్రత్యర్థులపై ఘాటైన విమర్శలు, పంచ్‌లు వేయలేదన్న అభిప్రాయాలు క్యాడర్‌లో వ్యక్తమవుతున్నాయి. వరంగల్ లాంటి ఉద్యమ గడ్డపై కేసీఆర్ స్పీచ్‌లో పంచ్‌లు లేకపోవటం హాట్‌టాపిక్‌గా మారింది. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్‌తో పాటే నడిచిన ఓరుగల్లుకు చెందిన ప్రొఫెసర్ జయశంకర్‌తో పాటు కాళోజీ తదితర దిగ్గజాల పేర్లు ప్రస్తావించకపోవడం శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రత్యర్థులపై వ్యంగ స్త్రాలతో దాడి చేయకపోవడంతో పాటు, సీఎం రేవంత్‌రెడ్డి పేరెత్తకుండా కేసీఆర్ ప్రసంగం సాగడం రాజకీయ విశ్లేషకులను సైతం ఆశ్చర్యపరిచింది. ఇటీవల స్టేషన్‌ఘన్‌పూర్‌లో జరిగిన సభలో కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి ఘాటైన వ్యాఖ్యలు చేశారు. వాటికి కేసీఆర్ దీటైన సమాధానం చెప్తారని గులాబీ శ్రేణులు ఆశించాయి. ఇక సభలో కాల్పుల విరమణపై తీర్మానం ఒక్కటే ప్రవేశ పెట్టారు. పార్టీ సంస్థాగత నిర్మాణంపై ఎలాంటి తీర్మానాలు కనిపించక పోవటం క్యాడర్‌లో చర్చకు దారితీసింది. వరుస ఓటములతో నిరాశలో ఉన్న క్యాడర్‌కు దిశ, దశ చూపించాల్సిన సమయంలో ప్రభుత్వంపై విమర్శలకే పరిమితమయ్యారనే చర్చ జరుగుతోంది. కేసీఆర్ ప్రసంగంలో పదును తగ్గటానికి పరిస్థితుల కారణమా.. ఆరోగ్య కారణాలా లేక ఉద్దేశ్యపూర్వకంగానే తన సహజ శైలికి భిన్నంగా ప్రసంగించారా.. అనే చర్చ ప్రజల్లో జోరుగా జరుగుతోంది. మొత్తానికి సభ సక్సెస్ అయినప్పటికి, గులాబీ బాస్ స్పీచ్‌లో వేడి తగ్గిందనే చర్చ మాత్రం అటు ప్రజల్లోనూ.. ఇటు ఆపార్టీ శ్రేణుల్లోనూ వ్యక్తమవడం గమనార్హం.

ఏ ఒక్కరికి దక్కని మాట్లాడే ఛాన్స్..

పాతికేళ్ల గులాబీ ప్రస్థానంలో తమ నేతల పాత్రను కూడా చెప్పుకునే అవకాశం రాలేదనే చర్చ జరుగుతోంది. మధ్యాహ్నం 2గంటల నుంచి సభకు జనం రావటం ప్రారంభించారు. కేటీఆర్ సాయంత్రం 4గంటల ప్రాంతంలో సభావేదిక వద్దకు రాగా, కేసీఆర్ 5.45లకు సభాప్రాంగణానికి హెలికాప్టర్‌లో చేరుకున్నారు. సుమారు గంట సేపు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గదిలో విశ్రాంతి తీసుకున్నారు. ఈ లోపు తెలంగాణ ఉద్యమ వీడియో పాటలను ఎల్ఈడీ స్క్రీన్‌లల్లో ప్లే చేశారు. అంతకు ముందు రసమయి బాలకిషన్ బృందం ఆటపాటలతో జోష్ నింపారు. అయితే వేదికపై తెలంగాణ ఉద్యమంలో ఎన్నో పోరాటాలు చేసిన అనేక మంది ఆసీనులయ్యారు. ప్రధానంగా మాజీ మంత్రులు కేటీఆర్, హరీ‌ష్‌రావు, జగదీ‌ష్‌రెడ్డి, శ్రీనివా‌స్‌గౌడ్, సిరికొండ మధుసూదనాచారి, కెప్టెన్ లక్ష్మీకాంతరావు, ఎమ్మెల్సీ కవిత, పెద్ది సుదర్శ‌న్‌రెడ్డి, వినయ్‌భాస్కర్, పోచంపల్లి శ్రీనివా‌స్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వ‌ర్‌రెడ్డి, నాగుర్ల వెంకటేశ్వ‌ర్‌రావు తదితర నేతలు అనేక మంది వేదికపై ఉన్నారు. అయినా 25ఏళ్ల సుదీర్ఘ యాత్ర గురించి మాట్లాడే అవకాశం ఏ ఒక్కరికి ఇవ్వకపోవటం కార్యకర్తల్లో చర్చకు దారిసింది. వరంగల్ గడ్డపై సభ జరుగుతున్న నేపథ్యంలో టీఆర్ఎస్ వ్యవస్థాపక సభ్యుడు, బీసీ నేత సిరికొండ మధుసూదనాచారికైనా లేదా సుదీర్ఘకాలం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా పని చేయటంతో పాటు జడ్పీటీసీగా, ఎమ్మెల్యేగా సేవలందించిన పెద్ది సుదర్శ‌న్‌రెడ్డిలలో ఒకరికైనా 25ఏళ్ల బీఆర్ఎస్ చరిత్రపై మాట్లాడే అవకాశం ఇవ్వాల్సిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇక స్వాగతోపన్యాసం చేసే అవకాశం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వినయ్‌భాస్కర్‌కు కాకుండా.. కేసీఆరే స్వయంగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు ఇవ్వడం గులాబీ శ్రేణుల్లో హాట్‌టాపిక్‌గా మారింది.



సభ ఏర్పాట్లు బాగా చేశారంటూ పెద్ది సుదర్శ‌న్‌రెడ్డిని అభినందిస్తున్న హరీ‌ష్‌రావు, కేటీఆర్

ఇంకెప్పుడు పూర్తయ్యేను ?

- మరో 17 రోజుల్లో సరస్వతీ పుష్కరాలు
- కాళేశ్వరంలో ఎక్కడి అభివృద్ధి పనులు అక్కడే
- రూ.25 కోట్లు మంజూరు చేసినా ఫలితం శూన్యం



పుష్కరఘాట్ వద్ద అసంపూర్తిగా ఉన్న స్నానపు గదుల పనులు

మహదేవపూర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించని చందంగా ఉంది కాళేశ్వరంలో సరస్వతీ పుష్కరాల పనులు. రాష్ట్ర ప్రభుత్వం రూ. 25కోట్లు మంజూరు చేసినా ఫలితం కనిపించడం లేదు. అభివృద్ధి పనులు ఎక్కడివక్కడే ఉండిపోయాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మహదేవపూర్ మండలం కాళేశ్వరం వద్ద జరిగే సరస్వతి పుష్కరాలకు ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చొరవతో రాష్ట్ర ప్రభుత్వం, రూ.25 కోట్లు మంజూరు చేసింది. మరో 17రోజుల్లో పుష్కరాలు రానుండగా.. ఈ లోపు పనులు ఎలా పూర్తవుతాయో అర్థం కాని పరిస్థితి ఉంది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, ఇంజనీరిగ్ అధికారులు అసలు పట్టించుకోకపోవడంతో ఈ ఈ పరిస్థితి ఏర్పడిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వీఐపీ ఘాట్ వద్ద భక్తులకు ఇబ్బందులు కలుగకుండా మెట్లను పెంచే పనులు అసంపూర్తిగానే ఉండటం, బాత్ రూంలు, స్నానపు గదులు, శారదమండపం, సరస్వతి మాత విగ్రహ పనులు ఇప్పటివరకు 20 శాతం కూడా పూర్తి కాలేదు. దాంతో పాటు ప్రధాన పుష్కర ఘాట్ వద్ద కేశ ఖండన, మహిళలు చీరలు మార్చుకోవడానికి ప్రభుత్వం టాయిలెట్లు, బాత్ రూంలను మంజూరు చేయగా ఇప్పటివరకు పునాదులకే పరిమితమయ్యాయి. సరస్వతీ పుష్కరాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా దాదాపు 30 నుంచి 40 లక్షల రూపాయలతో టాయిలెట్లు, బాత్ రూంలు పూర్తవ్వాలనేది ప్రభుత్వ నిర్ణయం.. కానీ ఆ పనులు ఇంతవరకు పునాదులకే పరిమితమయ్యాయి. వీఐపీ ఘాట్లతో పాటు గోదావరి వద్ద ఆర్చి గేటు పనులు 10 శాతం కూడా కాకపోవడంతో, మట్టి కుప్పలుగా పోయడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం సరస్వతీ పుష్కరాలపై హైదరాబాద్‌లో, భూపాలపల్లి కలెక్టరేట్, కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సమీక్షలు, సమావేశాలు నిర్వహించడం తప్ప కాంట్రాక్టర్లతో పనులు చేయించడంపై దృష్టి పెట్టలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలోనే దక్షిణ కాశీగా పేరుగాంచిన కాళేశ్వరాలయం వద్ద మూడు నదుల సంగమం ఉన్న నేపథ్యంలో సరస్వతీ పుష్కరాలకు ప్రాధాన్యం ఉన్న క్రమంలో పనుల పూర్తిపై అధికార యంత్రాంగం దృష్టి పెట్టకపోవడం, ఇంజనీరింగ్ అధికారులపై ఒత్తిడి తీసుకురాలేపోవడం కారణంగా కాంట్రాక్టర్లు కూడా ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నారన్న విమర్శలున్నాయి. నిత్యం 50నుంచి లక్ష మంది భక్తులు వస్తారని ప్రభుత్వం అంచనా వేస్తుంటే ఎక్కడ చూసినా కంకర కుప్పలు, ఇసుక కుప్పలే దర్శనమిస్తున్నాయి. గోదావరికి వెళ్లాలంటే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే అధికార యంత్రాంగం సమావేశాలతోనే కాలయాపన చేస్తుండడం గమనార్హం. రూ.25కోట్ల పనులతో ఈ ప్రాంతం దశ మారుతుందనుకుంటే పనులు నత్తనడకన సాగుతున్నాయి. పుష్కరాలు కేవలం 17 రోజులే ఉండడంతో రోడ్లు తప్పా ఇంకేమి పనులు పూర్తి కాలేదని గ్రామ ప్రజలు, భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇంకా పూర్తి కాని మెట్ల పనులు



రాతి నుంచి సంగీతం

- అరుదైన నవీనయుగం నాటి శిల లభ్యం
- వెల్లడించిన పరిశోధకుడు రత్నాకర్‌రెడ్డి



← రాతిని కొట్టి శబ్దాన్ని వినిపిస్తున్న రత్నాకర్‌రెడ్డి

నర్మెట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా నర్మెట మండలం బొమ్మకూరులో నవీన శిలాయుగం నాటి సంగీతం వినిపించే అరుదైన రాతి కళాఖండాన్ని చరిత్ర పరిశోధకుడు రత్నాకర్‌రెడ్డి గుర్తించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ బొమ్మకూరులో ఓ రైతు పొలం దున్నుతుండగా మూడు రోజుల క్రితం ఈ అరుదైన శిల దొరికిందని, దానిని పరిశీలించగా సంగీతంలా వినూత్న శబ్దం వస్తోందని వెల్లడించారు. 15 కిలోల బరువున్న రాయిపై ఏదైనా రాయితో కొట్టినప్పుడు గంట కొట్టిన శబ్దం వస్తోందని తెలిపారు. ఇలాంటి శబ్ధాలు రావడం అరుదైన విషయమన్నారు. దొరికిన రాయితో నాటి ప్రజలు ధాన్యాన్ని నూరడం, దంచడం లాంటివి చేసిన ఆనవాళ్లు స్పష్టంగా కనిపిస్తున్నాయని వెల్లడించారు. బొమ్మకూరు చారిత్రకంగా ఎంతో ప్రసిద్ధి చెందిందని, జిల్లాలోనే అతి పెద్ద ఇనుము లోహ పరిశ్రమ గతంలో ఇక్కడ విలసిల్లిందన్నారు. చారిత్రక సంపదను వివిధ రాష్ట్రాల పరిశోధకులే కాకుండా ఇంగ్లండ్, ఇటలీకి చెందిన పరిశోధకులు గ్రామానికి వచ్చారన్నారు. జిల్లాలో ఉన్న పురావస్తు చరిత్ర ఆధారాలు, శిల్పాల భద్రతకు మ్యూజియం ఏర్పాటుకు కృషి చేయాలని రత్నాకర్‌రెడ్డి కోరారు.

కేసీఆర్‌ను జనం మరిచిపోయారు..

- ఉనికి కోసమే కాంగ్రెస్‌పై విమర్శలు
- సభకు రెండు లక్షల మంది కూడా రాలేదు
- వరంగల్ నగరాభివృద్ధికి బీఆర్ఎస్ చేసిందేం లేదు
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యేలు నాయిని, రేవూరి, కడియం, మాజీ మేయర్ స్వర్ణ

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను జనం మరిచిపోయారని కాంగ్రెస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. ఉనికి కో సం రజతోత్సవ సభలో కాంగ్రెస్‌పై విమర్శలు చేశారని, కాంగ్రెస్‌ను విమర్శిస్తేనే కేసీఆర్‌కు బతుకు అని మండిప డ్డారు. సోమవారం హనుమకొండలోని కాం గ్రెస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని, పదేళ్ల పాలనలో వారు ప్రజలకు చేయలేని మేలు.. 16 నెలల కాలంలోనే తమ ప్రభుత్వం చేసి చూపిందన్నారు. సన్నబియ్యం, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్ల తదితర పథకాలు కేసీఆర్‌కు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో కొల్లగొట్టిన డబ్బులతో సభలు నిర్వహించి ఉనికిని చాటుకునేందుకు తంటాలు పడతున్నారని ఎద్దేవా చేశారు. రజతోత్సవ సభలో వేదికపై కేసీఆర్, కేటీఆర్ ఫొటోలే తప్ప ఆచార్య జయశంకర్ లాంటి ఉద్యమకారుల ఫొటోలు లేవని విమర్శించారు. మాజీ మంత్రి హరీ‌శ్‌రావు కమ్మ కూ డా చినిగిపోయిందన్నారు. కగార్ ఆపరేషన్ ప్రస్తావనను అప్పటికప్పుడే కేసీఆర్ సభలో తీసుకొచ్చారని దుయ్యబట్టారు. వరంగల్ నగరాభివృద్ధి కోసం బీఆర్ఎస్ చేసిందేమిటని ప్ర శ్నించారు. అభివృద్ధి చేస్తే కదా సభలో ప్రస్తావించేది అని దుయ్యబట్టారు. సభకు రెండు లక్షల జనం కూడా రాలేదని విమర్శించారు.

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లా డుతూ తెలంగాణకు కాంగ్రెస్సే విలన్ అంటు న్న కేసీఆర్ అధినేత్రి సోనియా గాంధీ కాళ్లు పట్టుకొని ఎందుకు మొక్కాడని ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రిగా ఎంతో బాధ్యతగా సభలో మాట్లాడతాడని ఆశిస్తే అబద్ధాల ప్రసంగం చేశారని మండిపడ్డారు. కాపలా కుక్కలా ఉంటానన్న కేసీఆర్ తోడేళ్లుగా మారారని ఆరోపించారు. రాష్ట్రాన్ని అప్పులమయంగా చేశారన్నారు. బీఆర్ఎస్ ఉన్న 38 మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేసి ప్రజా తీర్పు కోరాలని రేవూరి సవాల్ విసిరారు. సగం మంది తిరిగి ఎమ్మెల్యేలుగా గెలిచినా బీఆర్ఎస్‌ను తాము ఒప్పుకుంటామని స్పష్టం చేశారు.

స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. కగార్ ఆపరేషన్‌ను కేంద్ర ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలన్నారు. టెర్రరిస్టులు, మావోయిస్టుల దృక్పథం ఒకటి కాదని ఈ క్రమంలో ఇద్దరినీ ఒకే కోణంలో చూడరాదని సూచించారు. మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరపాలని కోరారు. బీఆర్ఎస్ పాలనలో కూడా అణచివేత చర్యలు చోటు చేసుకున్నాయని పేర్కొన్నారు. ధర్నా చౌక్‌నే ఎత్తి వేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదని శ్రీహరి మండిపడ్డారు. కగార్‌ను నిలిపివేయాలనే కేసీఆర్ డిమాండ్‌లో నిజాయితీ లేదని ఆరోపించారు. కేసీఆర్ అవినీతి పాలన వల్ల 20 మంది ఐఏఎస్, ఐపీయస్‌ల్లో కొందరు విదేశాలకు వెళ్లగా మరి కొందరు జైలు పాలయ్యారని, ఇంకొందరు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని ఆరోపించారు.

వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ రజతోత్సవ సభ క్రమంలో కేసీఆర్‌కు బ్రీత్ అనలైజ్ టెస్ట్ చేస్తే వాస్తవాలు బయటపడేవని ఆరోపించారు. దేశంలోని రాజకీయ నేతల్లో అత్యంత సంపన్నుడు కేసీఆర్ ఆయన కుటుంబ సభ్యులేనని ఆరోపించారు. లిక్కర్ స్కాం మొదలు చేయని దందా లేదన్నారు. కాళేశ్వరం అక్రమాలు త్వరలోనే వెలుగులోకి వస్తాయని కేసీఆర్ బండారం బయటపడుతుందని పేర్కొన్నారు.

కాంగ్రెస్ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ.. రజతోత్సవ సభలో కేసీఆర్ ప్రసంగం దయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందన్నారు. 16 నెలల పాలనలో కాంగ్రెస్ చేసిన మేలేంటో ప్రజలకు తెలుసని, కార్పొరేషన్ ఎన్నికల్లో 400 శిలాఫలాకాలు వేసి చేతులు దులుపేసుకున్న బీఆర్ఎస్‌కు సిగ్గు అనిపించడం లేదా అని మండిపడ్డారు. కాళేశ్వరం ద్వారా దోచిన డబ్బులు ఖర్చు పెట్టి సభలు పెడుతున్నారని విమర్శించారు. సభలతో తమకేమీ అభ్యంతరం లేదని కాంగ్రెస్‌ను విమర్శిస్తేనే సహించేది లేదన్నారు. సభ అయిపోయిందిగా.. ఇక ఫామ్ హౌజ్‌కు వెళ్లి తలదాచుకోమంటూ ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల టీపీసీసీ పరిశీలకులు కోటిమ్‌రెడ్డి వినయ్‌రెడ్డి, మక్సూద్ అహ్మద్, అమీర్ అలీ ఖాన్, మేడి రవిచంద్ర, ఎమ్మెల్సీ సారయ్య, మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, టీపీసీసీ నాయకులు కత్తి వెంకటస్వామి, కూచన రవళి, బత్తిని శ్రీనివాస్, ఈవీ శ్రీనివాస్, దొమ్మాటి సాంబయ్య, మోజెస్ ఆనంద్, ధన్వం తి, డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ పెరుమాండ్ల రామక్రిష్ణ, బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మీసాల ప్రకాశ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి కల్యాణ మహోత్సవాలు

భద్రకాళి ఆలయంలో మే 10 వరకు వేడుకలు

వరంగల్ కల్చరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఓరుగల్లు ప్రజల ఆరాధ్య దేవత భద్రకాళి అమ్మ వారి కల్యాణ బ్రహ్మోత్సవాలు ఈ నెల 29 నుంచి మే 10వ తేదీ వరకు అత్యంత వైభవోపేతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈవో శేషు భారతి, అర్చకులు భద్రకాళి శేషు తెలిపారు. సోమవారం ఈవో కార్యాలయం వద్ద వారు వేడుకల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భద్రకాళి శేషు మాట్లాడుతూ.. 12 రోజుల పాటు కొనసాగే ఈ వేడుకల్లో ఉదయం, సాయంత్రం వాహన సేవలు, నిత్య పూజలు, హోమాలు, అభిషేకాలు, పారాయణాలు, ప్రత్యేక పూజలు, నైవేద్య నివేదనలు, మహా మంగళహారతులు, అన్నదాన వితరణలు కొనసాగుతాయని తెలిపారు. మొదటి రోజు మున్నూరు కాపు, రెండో రోజు ముదిరాజు సంఘం, మూడో రోజు ఆర్యవైశ్య సంఘం, నాలుగో రోజు కమ్మ సంఘం, ఐదో రోజు సగర సంక్షేమ సంఘం, ఆరో రోజు విశ్వబ్రాహ్మణ సంఘం, ఏడో రోజు పద్మశాలీ సంఘం, ఎనిమిదో రోజు నాయీ బ్రాహ్మణ, తొమ్మిదో రోజు పెరుక సంఘం, పదో రోజు కుమ్మరి సంఘం, పదకొండో రోజు గౌడ సంఘం వారు పూజలు చేస్తారని, పన్నెండో రోజు శ్రీచక్ర స్నానంతో బ్రహ్మోత్సవాలు పూర్తవుతాయని తెలిపారు. ఈవో శేషు భారతి మాట్లాడుతూ.. భక్తుల కోసం తాగునీటి వసతితో పాటు చలువ పందిళ్లు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ అద్దంకి విజయ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ కూచన హరినాథ్, దేవస్థానం పీఆర్‌వో శ్యామ్, అర్చకులు చెప్పల నాగరాజు శర్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఆలయ ఈవో శేషు భారతి, అర్చకులు, సిబ్బంది

హక్కుల నేతకు అభినందనల వెల్లువ

వడ్డేపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఉమ్మడి జిల్లాకు చెందిన ఎంబీఎస్‌సీ 57 కులాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మితయ్యల్‌వార్ సంక్షేమ సంఘం రాష్ట్ర నేత త్రికోవెల నరసింహస్వామికి (టీఎన్. స్వామి)కి రాష్ట్ర ప్రభుత్వం దళిత రత్న అవార్డును ప్రదానం చేసింది. కాగా గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ పరిమిళ కాలనీలోని మితయ్యల్‌వార్ వరంగల్ ఉమ్మడి జిల్లా సంక్షేమ సంఘం కార్యాలయంలో సోమవారం టీఎన్. స్వామిని ఆ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డీవీ రమణ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘం నేతలు తాళ్లూరి లక్ష్మయ్య, బల్లారి భిక్షపతి, తిరుకోవెల భిక్షపతి, వేణు, రాయల తిరుపతి, రాయ ఊర్మిళ, సరస్వతి, స్వప్న, వేణు పాల్గొన్నారు.



టీఎన్.స్వామిని సత్కరిస్తున్న మితయ్యల్‌వార్ నేతలు

ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తాం

(5వ పేజీ తరువాయి)





సభలో సమస్య వివరిస్తున్న మహిళ, సదస్సుకు హాజరైన రైతులు

మేధావులతో మాట్లాడి రైతులకు ఉపయోగపడే మంచి అంశాలను తీసుకొచ్చి చట్టాన్ని రూపొందించి అసెంబ్లీలో ప్రవేశపెట్టామని, చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ఈనెల 15 నుంచి 30వ తేదీ వరకు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. నాలుగు జిల్లాలోని నాలుగు మండలాల్లో పైయిలెట్ ప్రాజెక్టు కింద భూ భారతి చట్టాన్ని అమలు చేయడంతో పాటు అక్కడి అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని గడిచిన 90 రోజుల్లో చట్టంలో మార్పులు చేసి ప్రజల ముందుకు తీసుకొచ్చామన్నారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి చట్టానికి మూడున్నరేళ్ల పాటు రూల్స్ లేకుండా అమలుచేసి రైతులను ఇబ్బందులకు గురి చేశారన్నారు. గ్రామ స్థాయిలోనే పరిష్కరించుకునే సమస్యలు 30 శాతం ఉన్నాయన్నారు. తహసీల్దార్ చేతిలో కానివి, ఆర్డీవో వద్ద కానివి, అదనపు కలెక్టర్ల స్థాయిలోనే సమస్యలను పరిష్కరించుకునే విధంగా ఈ చట్టంలో పొందుపరిచనట్టు తెలిపారు. 2020 ధరణిలో సాదాబైనామాల అంశాన్నే పొందుపర్చలేదని మండిపడ్డారు. సాదాబైనామాల కోసం 9 లక్షల 26 వేల దరఖాస్తులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ నిర్వహించిన రజతోత్సవ సభలో దుఃఖం వస్తుందని మాజీ సీఎం కేసీఆర్ అనడంపై మండిపడ్డారు. పేదలకు సన్నబియ్యం, 200 యూనిట్ల ఉచిత కరెంటు, రూ.500 లకే గ్యాస్, రూ. 10 లక్షల ఆరోగ్య శ్రీ, మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం అందించడాన్ని చూసి దుఃఖం ఆగడం లేదా అని ప్రశ్నించారు. ఆ సభలో తాను అధికారంలో ఉండగా తెచ్చిన ధరణి పోర్టల్ గురించి మాట్లాడితే ఆసభలోనే జనం చెప్పులు విసిరే వారన్నారు. పదేళ్ల పాలనలో ఎన్ని డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇచ్చావని కేసీఆర్‌ను ప్రశ్నించారు. 96 వేల ఇళ్లు మొదలు పెట్టి 70 వేలు మాత్రమే పూర్తి చేశారని గుర్తు చేశారు. రాష్ట్రం అప్పుల్లో ఉన్నప్పటికీ వాటిని పూర్తి చేయడంతో పాటు మొదటి విడతగా రాష్ట్ర వ్యాప్తంగా నాలుగున్నర లక్షల ఇళ్లకు రూ.5లక్షల కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. జూన్ 2న రాష్ట్ర అవతరణ రోజున రాష్ట్రాన్ని సోనియా ప్రకటిస్తే అదే ప్రభుత్వంపై ఏరకంగా విషం చిమ్మారని మండిపడ్డారు. జూన్ 3 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రతీ గ్రామానికి రెవెన్యూ అధికారులు వచ్చి సమస్యలను పరిష్కరిస్తారన్నారు. కోర్టుల ద్వారా పరిష్కారం కాని వాటికి ప్రత్యేక ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. నాలుగేళ్లలో 20లక్షల ఇళ్లు కట్టడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, నాగరాజు, కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి, కుడా చైర్మన్ వెంకట్రామిరెడ్డి, ఆర్డీవో రమేష్‌రాథోడ్, తహసీల్దార్ జగత్‌సింగ్, ఎంపీడీవో విజయ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి, టీపీసీసీ సభ్యుడు అశోక్‌రెడ్డి ఏఎంసీ చైర్మన్ ఝాన్సీ, నాయకులు వొడితెల ప్రణవ్, గోలి రాజేశ్వర్‌రావు, సంతాజీ, గొర్రె మహేందర్, రమేష్, తిరుపతి పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలిక.. ఒంగోలు చైల్డ్‌లైన్‌కు అప్పగింత



తప్పిపోయిన కావ్య

కాజీపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం-1లో ఓ బాలిక తప్పిపోయి ఆచూకీ కోసం తిరుగుతుండగా ప్రయాణికులు రైల్వే పోలీసులు అప్పగించారు.. కాజీపేట రైల్వే ఇన్‌స్పెక్టర్ రాంమూర్తి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కాజీపేట రైల్వే స్టేషన్‌లో సోమవారం ఓ ఏడేళ్ల బాలిక తప్పిపోయి ప్లాట్‌ఫారంలో తిరుగుతోంది. వివరాలు అడగగా తన పేరు కావ్య, తండ్రి పేరు వీరన్న, మండపల్లి గ్రామం, ఒంగోలు జిల్లా, ఏపీ అని చెప్పింది. బాలికను ఒంగోలు చైల్డ్ వెల్ఫేర్ వారికి అప్పగించారు. ఆచూకీ తెలిసిన వారు కాజీపేట రైల్వే పోలీస్ ఇన్‌స్పెక్టర్ రామ్మూర్తి మొబైల్ నంబర్ 87126 58578, 87126 58609కు సమాచారం ఇవ్వాలని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

మానసిక దివ్యాంగురాలిపై దాడి

సంగెం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మానసిక దివ్యాంగురాలిని ప్లాస్టిక్ పైపుతో చితకబాదిన సంఘటన పర్వతగిరి మండలం అన్నారంలో జరిగింది. స్థానికులు తెలిపిన ప్రకారం.. వరంగల్‌లోని కరీమాబాద్ ప్రాంతానికి చెందిన మానసిక దివ్యాంగురాలైన గజ్జెల సుజాత గత పదేళ్లుగా తండ్రి కృష్ణమూర్తి, సోదరితో కలిసి అన్నారం దర్గాలో వద్ద ఉంటోంది. సోమవారం సాయంత్రం దర్గా వద్ద పూజల అనంతరం దర్గా ముందు పడుకుని సేదతీరుతున్న సుజాతను దర్గా సూపరింటెండెంట్ ముంతాజ్ హుస్సేన్ ఇక్కడినుంచి వెళ్లిపోవాలని ప్లాస్టిక్ పైపుతో ఇష్టం వచ్చినట్లు దాడిచేశాడు. దీంతో ముంతాజ్ హుస్సేన్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని భక్తులు డిమాండ్ చేశారు. మతిస్థిమితం సరిగా లేని మహిళను కొట్టడంపై వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ రియాజ్‌ను వివరణ కోరగా మానసిక దివ్యాంగురాలిని కొట్టినట్లు తన దృష్టికి వచ్చిందని సీసీ కెమెరాల ఆధారంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కొనసాగుతున్న కాంట్రాక్టు అధ్యాపకుల దీక్షలు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ పరిపాలన భవనం ఎదుట కాంట్రాక్టు అధ్యాపకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం 10వ రోజుకు చేరాయి. దీక్షల్లో జేఏసీ నేతలు కరుణాకర్, భాస్కర్, కనుకయ్య, రంగారెడ్డి, నిరంజన్, శ్రీధర్‌కుమార్‌లోథ్‌లు మాట్లాడారు. కాంట్రాక్టు అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు.

భారతీయ ప్రమాణాలను విద్యార్థులకు తెలపాలి

- తరగతి గది నుంచే ఇది జరగాలి
- బిఐఎస్‌తో నిట్ ఒప్పందం
- నూతన ఆవిష్కరణలకు శ్రీకారం
- వరంగల్ నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న బీఐఎస్ హైదరాబాద్ అధిపతి శ్రీకాంత్

హనుమకొండ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు తరగతి గది నుంచే భారతీయ ప్రమాణాల గురించి తెలపాల్సిన అవసరం ఉందని వరంగల్‌ఎన్‌ఐటీ డైరెక్టర్ విద్యాధర్ సుబుధి అన్నారు. వరంగల్ నిట్‌లో సోమవారం వరంగల్ నిట్ అధ్యాపకులకు, భారతీయ ప్రమాణాల బ్యూరో(బీఐఎస్) అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు భారతీయ ప్రమాణాలపై పూర్తి అవగాహన కల్పించేందుకు, తరగతి గదుల్లో ప్రమాణాలను భాగం చేసేందుకు ఇటీవలే బీఐఎస్, వరంగల్ ఎన్ఐటీతో అవగాహన ఒప్పందం చేసుకున్నది. ఈ ఒప్పందంలో భాగంగా బీఐఎస్ చేపట్టిన కార్యక్రమాలు, ప్రమాణాల రూపకల్పన, నాణ్యత పరీక్షా విధానాలు తదితర అంశాలపై అధ్యాపకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఐటీ వేదికగా జరిగిన ఈ కార్యక్రమాన్ని వరంగల్ ఎన్ఐటీ డైరెక్టర్ విద్యాధర్‌సుబుధి, బీఐఎస్ హైదరాబాద్ శాఖాధిపతి పీవీ శ్రీకాంత్‌లు ప్రారంభించారు. వరంగల్ ఎన్ఐటీ బీఐఎస్ మెంటార్ ప్రొఫెసర్ రతీష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డైరెక్టర్ సుజాత, జాయింట్ డైరెక్టర్లు రాకేశ్ తన్నీరు, రాజేశ్ చౌదరి, డిప్యూటీ డైరెక్టర్లు కేవీఎన్ అజిత్ తదితరలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిట్ డైరెక్టర్ సుబుధి మాట్లాడుతూ దేశీయ ప్రామాణీకరణలో బీఐఎస్‌తో పరస్పర ఒప్పందం భవిష్యత్తులో నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుడుతుందన్న ఆశాభా వాన్ని వ్యక్తం చేశారు. ఎన్ఐటీ, బీఐఎస్ ఎక్సలెన్స్ కేంద్రం ఏర్పాటు, ప్రామాణీకరణ, పరిశోధనల్లో భాగస్వామ్యం, స్టాండర్డ్స్ క్లబ్ తదితర విషయాల్లో కలిసి ముందుకు సాగాలని కోరారు. బీఐఎస్ సీనియర్ డైరెక్టర్, నోడల్ అధికారి కెవి రావు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరి జీవితంలో భారతీయ ప్రమాణాలు భాగమని, దేశాభివృద్ధిలో ప్రమాణాలే కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. బీఐఎస్ హైదరాబాద్ శాఖాధిపతి పవి శ్రీకాంత్ రెండు సంస్థల మధ్య ఒప్పందంతో ఒనగూరే ప్రయోజనాల గురించి వివరించారు. అనంతరం బీఐఎస్ అధికారులు వివిధ అంశాలపై టెక్నికల్ ప్రజంటేషన్లు అందించారు.

నర్సింహారెడ్డికి డీసీసీ పదవి ఇవ్వాలని పూజలు



ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న యూత్ కాంగ్రెస్

వడ్డేపల్లి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పింగిళి వెంకట్రాం నర్సింహారెడ్డికి హనుమకొండ జిల్లా డిస్ట్రిక్ట్ కాంగ్రెస్ కమిటీ(డీసీసీ) పదవి ఇవ్వాలని యూత్ కాంగ్రెస్ నేతలు గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్‌లోని పరిమళ కాలనీలో గల ఆంజనేయ స్వామి దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా యూత్ కాంగ్రెస్ నేత మేకల పవన్ మాట్లాడుతూ పింగిళి వెంకట్రాం నర్సింహరెడ్డి గత 35 ఏళ్లుగా జిల్లాలో కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కృషిచేశారని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ అయిన వెంకట్రాం నర్సింహారెడ్డికి డీసీసీ పదవి కేటాయించి సముచిత స్థానం కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డికి, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్‌కు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నేతలు వినయ్ కుమార్, శ్రీకాంత్, సందీప్, రవి, అజయ్‌కుమార్, జశ్వంత్, పండు, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మరణించిన పోలీసు కుటుంబాలకు భద్రత చెక్కులు

వరంగల్ క్రైం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో విధులు నిర్వహిస్తున్న కాలంలోనే పలు కారణాలతో గత సంవత్సరం మరణించిన ఏఎస్సై మల్లిఖార్జున్, హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ రమేశ్ కుటుంబసభ్యులకు పోలీస్ భద్రత విభాగం మంజూరు చేసిన 7 లక్షల 89 వేల 920 రూపాయల చెక్కును సోమవారం సీపీ సన్‌ప్రీత్ సింగ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ రవి, ఏవో రామకృష్ణ సూపరింటెండెంట్ రమాదేవి పాల్గొన్నారు.



బాధిత కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న సీపీ

మే 1 నుంచి బాలగోకులం

- ఉచిత వేసవి శిబిరానికి దరఖాస్తుల ఆహ్వానం

హనుమకొండ కల్చరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మాధవ స్మారక సమితి హనుమకొండ కాకాజీ కాలనీలోని వివేకానంద యోగా కేంద్రంలో మే 1వ తేదీ నుంచి వారం రోజులపాటు నిర్వహించే వేసవి బాలగోకులం ఉచిత శిబిరానికి దరఖాస్తులను చేసుకోవాలని సమితి అధ్యక్షుడు డాక్టర్ సుధాకర్‌రావు సూచించారు. ఆధ్యాత్మిక, మానసిక, శారీరక, బౌద్ధిక, వ్యక్తిత్వ వికాసంపై అనుభవజ్ఞులైన నిపుణులు శిక్షణ ఇస్తారని శిబిరంలో పాల్గొనదల్చిన వారు ఈనెల 30 లోగా 9440720624 నెంబరులో సంప్రదించి పేరు నమోదు చేసుకోవాలన్నారు.

పొంగులేటిని కలిసిన గుండు సుధారాణి



పొంగులేటికి పూలమొక్కను అందిస్తున్న మేయర్ సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రతిష్ఠాత్మకంగా తీసుకువచ్చిన భూ భారతి చట్టం (ఆర్ఓఆర్)-2025 పై సోమవారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో జరిగిన అవగాహన కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి కలిసి పూలమొక్కను అందించారు. హెలీప్యాడ్ వద్ద మర్యాద పూర్వకంగా కలిసి స్వాగతం పలికారు.

ఇళ్ల లబ్ధిదారుల ఎంపికపై ఎంపీడీవో ఆరా

- కమిటీ సభ్యులు రూపొందించిన జాబితాలు రద్దు
- సీతంపేట జీపీలో తుది జాబితా ఫైనల్
- కొత్త జాబితాలో 24 మంది లబ్ధిదారుల ఎంపిక

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



లబ్ధిదారుల జాబితాను చదివి వినిపిస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ తిరుపతి

హసన్‌పర్తి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతంపేటలో గత రెండు రోజులుగా ఇందిరమ్మ లబ్ధిదారుల జాబితా ఎంపికలో వస్తున్న ఆరోపణలపై స్థానిక ఎంపీడీవో కర్ణాకర్‌రెడ్డి స్పందించారు. ఈ నెల 27వ తేదీన 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో కమిటీ సంతకంపై కలెక్టర్‌కు ఫిర్యాదు అనే వార్తా కథనంపై సోమ వారం పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి హరిత అధ్యక్షతన ఇందిరమ్మ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. గ్రామంలో అర్హులైన ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల జాబితాను తెప్పించి పరిశీలించారు. వీరిలో మొదటి దఫా ఇళ్లు అవసరమైన 16 మంది వితంతువులు, నలుగురు వికలాంగులు, నలుగురు ఇతర లబ్ధిదారులను ఎంపిక చేసి తుది జాబితాను ఎంపీడీవో కరుణాకర్‌రెడ్డి సమక్షంలో పంచాయతీ కార్యదర్శి హరిత కన్వీనర్‌గా నలుగురు కమిటీ సభ్యుల ముందు కంప్యూటర్ ఆపరేటర్ తిరుపతి చదివి వినిపించారు. ఈ కమిటీ సభ్యుల సమక్షంలో ఎంపికైన 24 మంది లబ్ధిదారుల పేర్లను ఇందిరమ్మ జాబితాలో చేర్చి ప్రకటించారు. కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు గుంపుల రణధీర్‌రెడ్డి, గిన్నారపు భిక్షపతి, గోపరాజు రమేష్, జాడి రేణుకతో పాటు కమిటీ కన్వీనర్ హరిత పాల్గొన్నారు.

అసంతృప్తులు.. ఫిర్యాదులు.. అలకలు.. చురకలు

- కాంగ్రెస్ 'సంస్థాగత' సన్నాహక సమావేశంలో నేతల రుసరుసలు
- పార్టీని నమ్ముకున్న వారికి న్యాయం జరగడం లేదనే వాదన
- వలసవాదులకే పట్టం కడుతున్నారంటూ పలువురి ఆవేదన
- అబ్జర్వర్ల ఎదుటే బయటపడ్డ విభేదాలు

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశంలోనే విభేదాలు రగిలాయి. కష్టకాలంలో పార్టీకి అండగా ఉండి పనిచేసిన వారికి గుర్తింపు లేదనే వాదనలు.. ఆవేదనలు.. అభిప్రాయాలు బయటికొచ్చాయి. బీఆర్ఎస్ అధికారంలో ఉండగా అనుభవించిన కష్టాలు, అవమానాలకు ఫలితం లేకపోగా.. పార్టీలోకి వలస వచ్చిన నేతలు, వారి అనుచరుల ఎదుట అవమానాలు తప్పడం లేదంటూ కొందరు నేతలు వాపోయారు. వలస వచ్చిన నేతలకే పదవులు కాకుండా వారి అనుయాయులకే పార్టీ, అధికార పదవుల కల్పన జరుగుతోందనే గోడు వెళ్లగక్కారు. సోమవారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన హనుమకొండ, వరంగల్ జిల్లాల కాంగ్రెస్ సంస్థాగత నిర్మాణం సన్నాహక సమావేశంలో కొందరు నాయకులు తమకు గుర్తింపు లేదంటూ సాక్షాత్తు వరంగల్, హనుమకొండ జిల్లాల టీపీసీసీ అబ్జర్వర్లు కోటిమ్‌రెడ్డి వినయ్‌రెడ్డి, మక్సూద్ అహ్మద్ అమీర్ అలీ ఖాన్, మేడి రవిచంద్ర ఎదుట ఆవేదన వెళ్లగక్కారు. దీనిపై హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ కలగజేసుకుని పార్టీ తప్పక న్యాయం చేస్తుందని, క్రమశిక్షణ పాటించాలని సూచించారు. పార్టీ ఆదేశాలను గౌరవించాలని, గుర్తించేందుకే సమావేశ నిర్వహణ జరుగుతుందంటూ నేతలకు సర్ధిచెప్పారు.



అసంతృప్తులు... ఫిర్యాదులు

సమావేశం సాగుతుండగా వరంగల్ తూర్పు నియోజకవర్గానికి చెం దిన కొందరు నాయకులు తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. తమకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదంటూ ఆవేశానికి లోనయ్యారు. పార్టీని వీడిన వారు, తిరిగి పార్టీలోకి వచ్చిన వారు, ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లోకి వలస వచ్చిన నేతలకే మాట్లాడే అవకాశం ఇస్తే ఎలా అంటూ ప్రశ్నించారు. ఈ పరిణామాలతో సమావేశం వేడెక్కింది. వలస నేతలకే కాకుండా వారి అనుంగులకు పదవులు కల్పిస్తున్నారంటూ వాపోయారు. ఇప్పటికే ఉమ్మడి వరంగల్ జిల్లాలో పార్టీని నమ్ముకొని ఉన్న నేతలకు సముచిత న్యాయం జరగలేదంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. మరి కొందరు జరుగుతున్న పరిస్థితులపై ఫిర్యాదులు చేశారు. వరంగల్ జిల్లాలోని ఇద్దరు నాయకులు తమకు మాట్లాడే అవకాశం ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలో ఉండగా పదవులు అనుభవించి ఆపై బీఆర్ఎస్‌లోకి వెళ్లి తిరిగి కాంగ్రెస్‌లోకి వచ్చిన వారికి మాట్లాడే అవకాశం ఇస్తారు కానీ తమకు ఇవ్వరా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. టీపీసీసీ నాయకుడు ఓ ఎమ్మెల్యే తీరుపై సమావేశంలో ఆగ్రహంగానే ఫిర్యాదు చేశారు. దశాబ్దాలుగా పార్టీ కోసం పని చేసినా టికెట్ రాలేదని వాపోయారు. నామినేటెడ్ పదవికి కూడా అడ్డుపడుతూ తన కంటే చాలా జూనియర్ నాయకుడికి సదరు ఎమ్మెల్యే అండగా ఉంటూ పదవి కల్పించేలా వ్యవహరిస్తున్నాడని కాస్త ఆగ్రహంగానే మాట్లాడారు. దీనిపై సమావేశంలో మాట్లాడడం సరి కాదని....తరువాత మాట్లాడుకుందామని అధ్యక్షులు చెప్పడంతో సదరు నాయకుడు మైక్‌ను వదిలేసి సమావేశం విడిచి వెళ్లారు. ఇక వరంగల్ ఉమ్మడి జిల్లాలోని ఓ జిల్లాకు టీపీసీసీ అబ్జర్వర్‌గా నియమితులైన నేత కూడా అందరికి మాట్లాడే అవకాశాలు దక్కడం లేదని వాదన వినిపించారు. మొత్తంగా సంస్థాగత సన్నాహక సమావేశం ఆరంభంలోనే పార్టీలని విభేదాలు, అసంతృప్తులకు వేదికగా మారింది.

తగిన గుర్తింపు తప్పక లభిస్తుంది

డీసీసీల అధ్యక్షులు నాయిని రాజేందర్‌రెడ్డి, ఎర్రబెల్లి స్వర్ణ

పార్టీ కోసం పని చేసిన వారికి తప్పక గుర్తింపు ఉంటుందని కాంగ్రెస్ హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు నాయిని రాజేందర్‌రెడ్డి, ఎర్రబెల్లి స్వర్ణ సమావేశంలో స్పష్టం చేశారు. ఆలస్యం అవుతుందేమో కానీ న్యాయం జరగకుండా ఉండదన్నారు. సమష్టిగా పార్టీ నిర్మాణం కోసం కృషి చేద్దామని సమావేశంలోని నేతలకు పిలుపునిచ్చారు.

కార్పొరేషన్ పదవుల భర్తీ : టీపీసీసీ పరిశీలకులు

సంస్థాగత నిర్మాణంలో భాగంగా పార్టీ పదవులతో పాటు కార్పొరేషన్ పదవులను కూడా భర్తీ చేయనున్నట్లు వరంగల్, హనుమకొండ జిల్లాల టీపీసీసీ అబ్జర్వర్లు కోటిమ్‌రెడ్డి వినయ్‌రెడ్డి, మక్సూద్ అహ్మద్ అమీర్ అలీ ఖాన్, మేడి రవిచంద్ర వెల్లడించారు. గ్రామ, మండల, పట్టణ, బ్లాక్ స్థాయి కమిటీల నిర్మాణం కోసం ఐదుగురి పేర్లతో ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. పార్టీ కోసం పని చేసిన వారినే గుర్తించాలని సూచించారు. పనిచేయలేని వారు స్వచ్ఛందంగా వైదొలగాలని స్పష్టం చేశారు.

కశ్మీర్ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో 28 మంది పర్యాటకులను అతి కిరాతకంగా కాల్చి చంపిన ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పహల్గాంలో ఉగ్రవాదుల చేతిలో మరణించిన పర్యాటకులకు సోమవారం రాత్రి హనుమకొండ చౌరస్తా నుంచి అశోకా జంక్షన్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. అనంతరం రమేష్ మాట్లాడుతూ.. బాధిత కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. కశ్మీర్‌ఘటనలో ఇంటిలిజెన్స్, భద్రతా నిఘా వైఫల్యం కారణంగానే ఈ ఘటన జరిగిందని, దీనికి కేంద్ర ప్రభుత్వం బాధ్యతవహించాలన్నారు.ఈసందర్భంగా హింసా వద్దు శాంతి ముద్దు, ఉగ్రవాదం నశించాలి, ప్రపంచ శాంతి వర్ధిల్లాలి అంటూ చౌరస్తా నుంచి అశోక జంక్షన్ వరకు సీఐటీయూ నాయకులు నినాదాలు చేస్తూ కొవ్వొత్తులతో ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య, ఆఫీస్ బేరర్స్ బొట్ల చక్రపాణి, మెట్టు రవి, బి. మహేష్, ఎస్.రజిత, యాస బాబు, మల్లేశం, బొట్ల కుమార్, ఎండీ. యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.



హనుమకొండ చౌరస్తా నుంచి అశోకా జంక్షన్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు



జాతీయ జెండాను చేతబూని అమరులకు నివాళులు అర్పిస్తున్న ఐటీఐ విద్యార్థులు

- వరంగల్‌టౌన్: కశ్మీర్‌లోని పహల్గాంలో ముష్కరుల దాడిలో ప్రాణాలర్పించిన మృతులకు వరంగల్ ఐటీఐ విద్యార్థులు నివాళులు అర్పించారు. సోమవారం ములుగురోడ్‌లోని ప్రభుత్వ ఐటీఐలో ప్రిన్సిపాల్ ఎం.చందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు, సిబ్బంది జాతీయ జెండాను చేతబూని అమరులకు నివాళులు అర్పించారు.
- పహల్గాం నిందితులను కఠినంగా శిక్షించాలని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్ డిమాండ్ చేశారు. సోమవారం హనుమకొండలోని సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... 26 మంది యాత్రికులను విచక్షణరహితంగా కాల్చి చంపిన ముష్కరులను ప్రభుత్వం పట్టుకొని కఠిన శిక్షను విధించాలన్నారు. ఈ కార్యక్రమంలో రవీందర్‌రాజు, రాజు, కుమార్, కిరణ్‌కుమార్, వెంకట్‌రెడ్డి, అన్నాదేవి, రాజారాం, రవూఫ్, లింగారావు, కరుణాకర్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.
- బాలసముద్రం: పహల్గాం దుర్ఘటన సామాజిక వర్గాల మధ్య ఐక్యమత్యం మీద దాడి అని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఇ.నర్సింహారెడ్డి అభివర్ణించారు. సోమవారం రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం హనుమకొండ, వరంగల్ జిల్లాల సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ఈ దారుణానికి పాల్పడ్డ వారిని, వారి వెనుక ఉన్న దృష్టశక్తులను గుర్తించి కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో ఇంకా పెన్షనర్ల సంఘం నాయకులు తుమ్మ వీరయ్య, మదార్ సాహెబ్, రమేష్, కిష్టయ్య తదితరులు మాట్లాడారు. మంగళవారం సాయంత్రం 7 గంటలకు అసోసియేషన్ కార్యాలయం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు.
- కాజీపేట: కశ్మీర్‌లో టూరిస్టులపై ఉగ్రదాడిలో మృతి చెందిన వారిని సోమవారం కాజీపేట ఐటీఐ విద్యార్థులు శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం మృతులకు శ్రద్ధాంజలి ఘటించారు. టెర్రరిజం నశించాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది నాసిక్, అనిల్, లత, రవివర్మ, తిరుపతమ్మ, చక్రవర్తి, వసుంధర, యశోద, సుజాతతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఇదేంది సార్లూ..



అది భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించేందుకు ఎల్కతుర్తిలో ఏర్పాటు చేసిన సమావేశం. సోమవారం జరిగిన ఈ కార్యక్రమానికి రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హాజరై తమ ప్రభుత్వం తెచ్చిన భూభారతి చట్టం ప్రాధాన్యాన్ని, రైతులకు ఒనగూరే ప్రయోజనాలను వివరిస్తున్నారు. ఈ క్రమంలో వేదికపై ఆయన పక్కన కూర్చున్న వారంతా ఇదిగో ఇలా సెల్‌ఫోన్లలో నిమగ్నమయ్యారు. ఈ దృశ్యాన్ని చూసిన అక్కడి వారు సాధారణంగా ఏదైనా ముఖ్యమైన సమావేశం జరిగినప్పుడు ఫోన్ స్విచ్ ఆఫ్ చేయాలంటూ బోర్డు పెట్టి మరీ అధికారులు సమావేశాలు నిర్వహి స్తారు, కానీ రైతుల కోసం నిర్వహించిన ఈ సమావేశంలో వేదికపై ఉన్న వారు ఫోన్లలో నిమగ్నం కావడాన్ని చూసి 'ఇదేంది సార్లు..' అని చర్చించుకోవడం కనిపించింది.

ఫొటో : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హనుమకొండ.



అధ్యయనం

ఒకే పరీక్షతో 30 క్యాన్సర్ల గుర్తింపు!

నాసిక్‌లోని హెచ్‌ఎస్‌జి మానవతా క్యాన్సర్ కేంద్రంలోని బహుళ సంస్థాగత పరిశోధక బృందం, ఒకే ఒక రక్తపరీక్షతో క్లోమం, ఊపిరితిత్తులు, అండాశయాలతో సహా 30 రకాల క్యాన్సర్లను కనిపెట్టే విప్లవాత్మకమైన రక్తపరీక్షను అభివృద్ధి చేసింది. ఈ ప్రయోగంలో 6,500 మంది పాల్గొన్నారు. వీరిలో 2,800 మందికి వేర్వేరు దశల్లోని క్యాన్సర్ ఉన్నట్టు నిర్ధారణ అయింది. అలాగే తొలి దశకు చేరువలో ఉన్న క్యాన్సర్ కూడా ఈ పరీక్షలో బయల్పడడం చెప్పుకోదగిన విశేషం. కణితి డిఎన్ఎ, లేదా కణాల ఆధారంగా క్యాన్సర్ వ్యాధిని నిర్ధారించే పరీక్షలకు భిన్నంగా, ఈ పరీక్ష తొలి దశ క్యాన్సర్లకు సంబంధించి కచ్చితమైన ఫలితాలను అందించగలుగుతోంది. 2030 నాటికి ప్రపంచవ్యాప్త మరణాలకు క్యాన్సర్ ప్రధాన కారకంగా మారుతుందనే అంచనా వేయడం జరిగింది కాబట్టి, ఆ మరణాలను అరికట్టడం కోసం క్యాన్సర్ వ్యాధిని ముందస్తుగా గుర్తించడం అత్యంత ఆచరణీయమైన వ్యూహంగా మారింది. ప్రస్తుత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల్లో కేవలం ఐదు రకాల క్యాన్సర్లను మాత్రమే ప్రారంభ దశల్లో గుర్తించే వీలు కలుగుతోంది. కానీ ఈ కొత్త పరీక్షతో 30 రకాల క్యాన్సర్లను కనిపెట్టగలిగే వీలు చిక్కుతోంది. ఫలితంగా ఈ వ్యాధిని ప్రారంభంలోనే కచ్చితత్వంతో నిర్ధారించడం ద్వారా వ్యాధి మరింత ముదిరిపోకుండా నిలువరించడంతో పాటు, సమర్థమైన చికిత్సతో ప్రారంభంలోనే ఈ వ్యాధిని తుదముట్టించవచ్చని, క్యాన్సర్ పరిశోధక బృందానికి నాయకత్వం వహించిన డాక్టర్ నాగర్కార్ అంటున్నారు.

ఆహారంలో ఆరోగ్యం

పనసతో ప్రయోజనం



పనసలో పోషకాలకు కొదవ ఉండదు. దీన్లో ఫ్రక్టోజ్, సుక్రోజ్ మొదలైన సహజ చక్కెరలుంటాయి. త్వరిత శక్తిని అందించే వీలున్న ఈ చక్కెరలు వేసవిలో కలిగే నిస్సత్తువ నుంచి కోలుకునేలా సహాయపడతాయి. నీటి శాతం ఎక్కువగా కలిగి ఉండే పనస తొనలతో డీహైడ్రేషన్ తగ్గడంతో పాటు శరీరంలో ఎలక్ట్రొలైట్లు సమం అవుతాయి. విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా కలిగి ఉండే పనస తొనలు తినడం వల్ల వ్యాధినిరోధకశక్తి బలపడుతుంది. పనసలో పీచు ఎక్కువ కాబట్టి జీర్ణసంబంధ సమస్యలు తగ్గుతాయి.

హార్ట్ కేర్



గుండెకు గండం తగ్గిద్దాం

ఒకప్పటి గుండె చికిత్సలు అప్పటికప్పుడు ప్రాణాలు నిలబెట్టడమే ధ్యేయంగా సాగేవి. కానీ ఇప్పుడు, కొన్ని దశాబ్దాల పాటు గుండె సమర్థంగా పని చేయడమే లక్ష్యంగా చికిత్సలు సాగుతున్నాయి. కాలానుగుణంగా గుండె చికిత్సలో సాధించిన ప్రగతి, ప్రతిఫల గురించీ, హృద్రోగాల పట్ల అవగాహన పెంచుకోవలసిన అవసరం గురించీ సీనియర్ కార్డియోథొరాసిక్ అండ్ హార్ట్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్, స్టార్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్, **డాక్టర్ గోపీచంద్ మన్నం** ఏమంటున్నారో తెలుసుకుందాం!



ఒకప్పటితో పోలిస్తే ఇప్పుడు గుండె చికిత్సల్లో ఎంతో పురోభివృద్ధిని సాధించాం. చికిత్సల్లో, నైపుణ్యాల్లో ఎంతో పరిణతి పొందాం! ఒకప్పుడు బైపాస్ సర్జరీ అనగానే, వైద్యుల గుండెలు గుబగుబలాడే పరిస్థితి. పరికరాలను కొనే స్తోమత లేక రక్తంలో ఆక్సిజన్, కార్బన్‌డయాక్సైడ్, ఆమ్లం ఏ మోతాదుల్లో ఉన్నాయో తెలుసుకోకుండా, సర్జరీకి పూనుకున్న సందర్భాలు లేకపోలేదు. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. బైపాస్ సర్జరీతో పాటు, ఒకటికి, రెండు, మూడు కవాటాలు మార్చడం, బృహద్ధమని, జఠరిక చికిత్సలు ఎంతో సరళతరమైపోయాయి. గుండె తీసి కృత్రిమ గుండెను అమర్చగలిగేంతగా గుండె చికిత్సల్లో పరిణతి సాధించాం! ఉదాహరణకు ఎటువంటి రుగ్మతలు లేకుండా, గుండె రక్తనాళాల్లో మూడు అవరోధాలు ఏర్పడిన వ్యక్తిని, కేవలం ఐదు శాతం ముప్పుతో, ఆ సమస్య నుంచి బయటకు తీసుకురాగలిగే పరిస్థితికి చేరుకున్నాం.

అధునాతన పరికరాలతో...


గుండె సర్జరీ విజయం, గుండె పంపింగ్ మీదే ఆధారపడి ఉంటుంది. పంపింగ్ సామర్థ్యం 65 శాతం ఉన్నప్పుడు చక్కని ఫలితాలు సాధించవచ్చు. కానీ అంతకంటే తక్కువగా 35% పంపింగ్ సామర్థ్యం ఉన్నప్పుడు బెలూన్ పంప్ ఆసరాతో గుండెకు దన్నును పెంచే దశను అందుకున్నాం. అయితే పంపింగ్ సామర్థ్యం వెనకున్న కారణాన్ని కనిపెట్టి, దాన్ని సరిదిద్దే స్థాయికి ఇప్పుడు చేరుకోగలిగాం. రక్త ప్రసరణ లోపం వల్ల గుండె మీద మచ్చ ఏర్పడినప్పుడు కూడా పంపింగ్ సామర్థ్యం దెబ్బతింటుంది. ఈ సమస్యను ఎమ్మారైలో పసిగట్టి, సరిదిద్దడం ద్వారా, బెలూన్ పంప్ ఉపయోగించే అవసరం లేకుండా, 2 నుంచి ఐదు శాతం ముప్పుతో నేడు గుండెకు చికిత్స చేయగలుగుతున్నాం. గుండె గదులకు మరమ్మతు చేసి గుండె సామర్థ్యాన్ని కూడా పెంచగలుగుతున్నాం. గుండె కొట్టుకునే క్రమంలో అవతకవకలు ఉన్నప్పుడు, ఆ సమస్యను సరిదిద్దే 'కార్డియోవెర్టర్ డిఫిబ్రిలేటర్' పరికరాలు కూడా ఇప్పుడు అందుబాటులోకొచ్చాయి. అలాగే మునుపు వాడుకలో ఉన్న రక్తకణాలు, ప్లేట్‌లెట్స్ దెబ్బతినే వీలున్న బబుల్ ఆక్సిజనేటర్లకు బదులుగా మరింత సురక్షితమైన మెంబ్రేన్ ఆక్సిజనేటర్లు కూడా నేడు వాడుకలోకొచ్చాయి.

తక్కువ కోతతో, ఎక్కువ సామర్థ్యంతో...

హార్ట్ లంగ్ యంత్రాన్ని ఉపయోగించకుండానే, గుండె కొట్టుకుంటున్నప్పుడే సర్జరీని ముగించే బైపాస్ చికిత్సా విధానం కూడా అమలవుతోంది. సాధారణంగా గుండె బైపాస్ సర్జరీలో కాలి నుంచి శిరను సేకరించి గుండె దగ్గరి ధమనికి అనుసంధానించి, దాన్ని ధమనిలా ప్రవర్తించమని ఆదేశిస్తూ ఉంటాం. కానీ ఈ క్రమంలో ఆ రక్తనాళం సామర్థ్యం తగ్గిపోయే అవకాశం ఉంటుంది. కాబట్టి ఇప్పుడు ఛాతీ వెనక ఉండే ధమనితో గుండె ధమనిని అనుసంధానించే సర్జరీలు చేస్తున్నాం. ధమనితో శిరను అనుసంధానించడానికి బదులుగా మరొక ధమనినే అనుసంధానించడం వల్ల మన్నిక పెరుగుతుంది. మధుమేహులకు ఛాతీ దగ్గరి ధమనికి బదులుగా, చేతిలోని ధమనిని వినియోగిస్తూ ఉంటాం. అలాగే పెద్ద కోత పెట్టే అవసరం లేకుండా ఎండోస్కోపీ ద్వారా రెండు చిన్న రంధ్రాలతో ధమనిని సేకరిస్తున్నాం. దీంతో కోలుకునే సమయం, నొప్పి, ఇన్‌ఫెక్షన్ అవకాశాలు కూడా తగ్గిపోతున్నాయి. పెరిగే వయసుతో పాటు కవాటాలు కూడా ఇరుకుగా మారి, పూడుకుపోతూ ఉంటాయి. ఇలాంటి సందర్భాల్లో ఈ కవాటాలు చీరుకుపోతూ ఉంటాయి. ఇలాంటప్పుడు కృత్రిమ కవాటాలను అమర్చవలసి వస్తుంది. ఇందుకోసం ఛాతీ ఎముకను కోసే అవసరం లేకుండా, పక్కటెముకల మధ్య ఉన్న జాగా ద్వారా సర్జరీని ముగించే వెలుసుబాట్లు అందుబాటులో ఉన్నాయి. దీంతో రోగి కోలుకునే సమయం తగ్గిపోతోంది. కోత తాలూకు మచ్చలు కూడా ఎబ్బెట్టుగా కనిపించవు. అలాగే కృత్రిమ కావాటాల పరంగా కూడా ఎంతో అభివృద్ధిని సాధించాం. ప్రస్తుతం లోహపు కవాటాలు, కణజాల కవాటాలు వాడుకలోకొచ్చాయి. రెండు లీఫ్స్ కలిగిన లోహపు కవాటాలతో పాటు ఆవు గుండె పైపొరను ఒక కణజాల కవాట పొరగా కుట్టి వాడుకుంటున్నాం. వీటి మీద క్యాల్షియం పేరుకుపోకుండా ఆ పరిస్థితిని నియంత్రించే సాంకేతికతలు కూడా అందుబాటులోకొచ్చాయి. వీటితో గుండె కృత్రిమ కవాటాల ఆయుష్షు 20 ఏళ్లకు పెరిగింది. రెండోసారి, మూడోసారి గుండె సర్జరీలు చేయడం కూడా సులభతరం అయిపోయింది.


లక్షణాలు ఉన్నా, లేకున్నా...

వ్యాధిని అర్థం చేసుకునే తీరు మారడంతో, చికిత్స తర్వాత ఆ వ్యాధి తిరగబెట్టకుండా నియంత్రించే మార్గాలను కనిపెట్టగలుగుతున్నాం. సాధారణంగా గుండె చికిత్స తదనంతరం, సమస్య పూర్తిగా పరిష్కారమైపోయిందని నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించేస్తూ ఉంటారు. కానీ ఇది సరికాదు. అప్పటికి సమస్యను సరిదిద్దినా, ముప్పు ఎప్పటికీ పొంచి ఉంటుందని ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకోవాలి. కాబట్టి గుండెకు ముప్పు తెచ్చిపెట్టే అలవాట్లను మానుకోవాలి. గుండె సమస్య లక్షణాలు ప్రత్యేకంగా ఉండవు. ఛాతీలో అసౌకర్యం, శ్వాస ఇబ్బందిగా మారడం లాంటి లక్షణాలు గుండె సమస్యను చెప్పకనే చెప్తూ ఉంటాయి. అయినా వాటిని వేరొక ఆరోగ్య సమస్యతో ముడిపెట్టేవాళ్లే ఎక్కువ. 'ఆరోగ్యంగానే ఉన్నాను కాబట్టి నాకు గుండె జబ్బు ఎందుకొస్తుంది?' అనే ధీమా కూడా అందర్లో ఉంటోంది. వ్యాధి నిర్ధారణ అయినప్పుడు, 'నిన్నటి వరకూ బాగానే ఉన్నాను, ఇంత హఠాత్తుగా గుండె దెబ్బతినడం ఏంటి?' అని ఆశ్చర్యపోయేవాళ్లూ ఉంటారు. కానీ గుండె జబ్బు ఎవరికైనా, ఎప్పుడైనా రావచ్చు. కాబట్టి 40 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ఎలాంటి లక్షణాలతో పని లేకుండా, ఏడాదికోసారి గుండె పరీక్షలు చేయించుకోవాలి. ముప్పు ఎక్కువగా ఉన్నవాళ్లు 35 ఏళ్ల నుంచే అప్రమత్తంగా ఉండాలి. ఇసిజితోనే గుండెజబ్బును పసిగట్టే వీలుంది. కాబట్టి సరళమైన ఆ పరీక్షతో గుండె ఆరోగ్యాన్ని పరీక్షించుకోవడం అత్యవసరం.



ఈ జాగ్రత్తలు తప్పనిసరి

- ప్రతి ఒక్కరికీ గుండె జబ్బు ముప్పు ఉంటుంది. ప్రధానంగా అందరూ ఈ విషయాన్ని గ్రహించాలి
- ఛాతీలో ఎలాంటి అసౌకర్యం కలిగినా, అది ఏ కారణం వల్ల తలెత్తినా, గుండె జబ్బుగా, తీవ్రంగానే పరిగణించాలి
- దురలవాట్లు, ఒత్తిడి, అస్తవ్యస్థ జీవనశైలి, ఆహారపుటలవాట్లు, కుటుంబ చరిత్ర... వీటితో గుండె దెబ్బతినక ముందే గుండెను క్షేమంగా ఉంచే అలవాట్లు ఏర్పరుచుకోవాలి
- వారంలో కనీసం ఐదు రోజులు కనీసం గంట పాటైనా వ్యాయామం చేయాలి
- సమతులాహారం తీసుకోవాలి
- జవాబుతారీ భాగస్వామిని ఏర్పరుచుకుని, వ్యాయామ ప్రేరణ పొందాలి
- 40 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ప్రతి ఏడాదీ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి
- గుండెజబ్బుల ముప్పు ఉన్నవాళ్లు 35 ఏళ్ల నుంచే ఆరోగ్య పరీక్షలు మొదలుపెట్టాలి
- మధుమేహం, అధిక రక్తపోటులను అదుపులో ఉంచుకోవాలి
- అధిక బరువు తగ్గించుకోవాలి



కుటుంబ చరిత్రలో గుండె జబ్బులున్నవారు, మిగతా వారితో పోలిస్తే ఐదు రెట్లు గుండెజబ్బుల ముప్పును కలిగి ఉంటారు. అధిక రక్తపోటు, మధుమేహం ఉన్నవాళ్లకు గుండె జబ్బుల ముప్పు ఎక్కువ. అలాగే మద్యపానం, ధూమపానం దురలవాట్లు ఉన్న వాళ్లకు కూడా గుండెజబ్బులొచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అలాగే కొందరి కుటుంబాల్లో అధిక కొలెస్ట్రాల్ సమస్య ఉంటుంది. వీళ్లు కూడా అప్రమత్తంగా ఉండాలి.

వదలని వణుకు

పైబడే వయసుతో వేధించే నాడీసంబంధ రుగ్మతల్లో పార్కిన్సన్స్ ఒకటి. పెద్దలను వేధించే ఈ వ్యాధి, చికిత్సల గురించి వైద్యులు ఇలా వివరిస్తున్నారు.

ప్రధానంగా డోపమైన్ హార్మోన్‌ను ఉత్పత్తి చేసే మెదడులోని నడీకణాల క్షీణతతో ఈ నాడీ రుగ్మత తలెత్తుతుంది. మెదడులో ఉత్పత్తయ్యే డోపమైన్ అనే న్యూరోట్రాన్స్‌మిటర్ కండరాల కదలికలను నియంత్రించే సంకేతాల సరఫరాకు సహాయపడుతుంది. ఈ నాడీకణాలు దెబ్బతిన్నప్పుడు, శరీర కదలికలను సమన్వయపరిచే, నియంత్రించే మెదడు సామర్థ్యం కుంటుపడుతుంది. దాంతో కొన్ని లక్షణాలు ప్రస్ఫుటంగా కనిపించడం మొదలుపెడతాయి. అవేంటంటే...

కదలికలతో సంబంధం ఉన్న లక్షణాలు

పార్కిన్సన్స్ వ్యాధి ప్రారంభంలో ఈ లక్షణాలు కనిపిస్తాయి. దశలు దాటేకొద్దీ లక్షణాల తీవ్రత కూడా పెరుగుతుంది. అయితే లక్షణాల తీవ్రత పెరిగే వేగం వ్యక్తుల్లో భిన్నంగా ఉంటుంది. లక్షణాలు ఏవంటే...

- **వణుకు:** అప్రమేయంగా చోటుచేసుకునే కదలికలు ఇవి. ఒక చేతిలో, కాలు లేదా వేలిలో మొదలవుతాయి. కొందర్లో విశ్రాంతిలో ఉన్న సమయంలో కదలికలు కనిపిస్తాయి.
- **బ్రాడీకైనీసియా:** కదలికలు క్రమేపీ తగ్గిపోయే పరిస్థితి ఇది. ఎంతో సులభమైన పనులు కూడా చేసుకోలేని స్థితి ఇది. చొక్కాకు గుండీలు పెట్టుకోవడం, నడవడం లాంటి సులభమైన పనులు కూడా కష్టంగా మారి ఎక్కువ సమయం తీసుకుంటూ ఉంటాయి.
- **బిగుసుకుపోవడం:** కండరాలు, ప్రత్యేకించి చేతులు, కాళ్లు, మెడ పట్టుకుపోతాయి. పార్కిన్సన్ రోగుల్లో అత్యంత సాధారణ లక్షణమిది.



ఈ ఇబ్బంది నొప్పికి దారి తీస్తుంది. కదలికలు తగ్గిపోతాయి. రోజువారీ పనులు చేసుకోవడం కష్టమైపోతుంది

- **భంగిమ:** వ్యాధి ముదిరేకొద్దీ, ఈ రోగులు సంతులనం కోల్పోతారు. దాంతో నడుస్తూ పడిపోవడం, నిలబడినప్పుడు ముందుకు లేదా వెనకకు ఒరిగిపోతూ ఉంటారు
- **నడక:** అడుగుల మధ్య దూరం తగ్గిపోయి, చిన్న చిన్న అడుగులు వేస్తూ ఉంటారు. నడిచేటప్పుడు చేతుల కదలికలు కూడా తగ్గిపోతాయి

కదలికలతో సంబంధం లేని లక్షణాలు

కదలికలతో సంబంధం లేని లక్షణాలు గుంభనంగా జీవన నాణ్యతను దెబ్బతీస్తాయి. ఈ లక్షణాలు ఏవంటే...

- **మెదడు సామర్థ్యం సన్నగిల్లడం:** జ్ఞాపకశక్తి సమస్యలు, ఏకాగ్రత నిలపలేకపోవడం, ఆలోచనలు నెమ్మదించడం
- **కుంగుబాటు:** మెదడులోని రసాయనాలు క్రమం తప్పడం వల్ల మానసిక భావోద్వేగాల మీద అదుపు కోల్పోవడం, కుంగుబాటు, ఆందోళనలు వేధిస్తాయి
- **నిద్రలేమి:** నిద్రలేమి, రాత్రివేళ తరచూ నిద్ర మెలకువ అయిపోవడం, రెస్ట్‌లెస్ లెగ్ సిండ్రోమ్, పీడకలలు వేధిస్తూ ఉంటాయి.
- **జీవక్రియలు:** రక్తపోటు నియంత్రణ, జీర్ణశక్తి, చెమట పట్టడం లాంటి జీవక్రియలు కూడా క్రమం తప్పుతాయి. నిలబడినప్పుడు రక్తపోటు పడిపోవడం, మలబద్ధకం లేదా అధిక లాలాజలం లాంటి సమస్యలు కూడా వేధిస్తాయి.
- **మాట, మింగుడు సమస్యలు:** ఈ వ్యాధి కండరాలను దెబ్బతీస్తుంది కాబట్టి మాట్లాడడానికీ, మింగడానికీ తోడ్పడే కండరాలు ప్రభావితమై, మాట బొంగురుగా మారుతుంది. పదాలను కూర్చడం కష్టమవుతుంది. మింగడంలో ఇబ్బందులను ఎదుర్కోవడం వల్ల అంతిమంగా ఆహారం గొంతులో అడ్డుపడే పరిస్థితి తలెత్తే ప్రమాదం ఉంటుంది.

వ్యాధి నిర్ధారణ

పార్కిన్సన్స్‌ను నిర్ధారించే ఏకైక పరీక్ష అంటూ ఏదీ లేదు. వైద్య చరిత్ర, భౌతిక పరీక్షలతోనే ఈ వ్యాధిని నిర్ధారించాల్సి ఉంటుంది. ఈ లక్షణాలకు ఇతరత్రా రుగ్మతలను కారణం కాదని నిర్ధారించుకోవడం కోసం ఎమ్మారై లేదా సిటి స్కాన్‌లు అవసరమవుతాయి.

చికిత్స ఇలా...

ఈ రుగ్మతను పూర్తిగా నయం చేసే చికిత్సలేవీ లేకపోయినప్పటికీ, లక్షణాలనూ, వ్యాధి పురోగతినీ నెమ్మదించి, జీవన నాణ్యతను పెంచే మందులు, థెరపీలు, సర్జరీలు అందుబాటులో ఉన్నాయి.

- **లెవొడొపా:** ఈ మందు మెదడులో డోపమైన్‌గా మారుతుంది. ఇది వణుకును తగ్గిస్తుంది.
- **డోపమైన్ ఎగోనిస్ట్:** ఈ మందులు మెదడులోని డోపమైన్‌ను అనుకరిస్తాయి. పార్కిన్సన్స్ ప్రారంభ దశలో లేదా లెవొడొపాకు అదనంగా ఈ మందులు వాడుకోవాల్సి ఉంటుంది.
- **ఎమ్ఎఒ-బి ఇన్హిబిటర్స్:** మెదడులో డోపమైన్ విచ్ఛిన్నమైపోకుండా నివారిస్తుంది. దీన్ని కూడా లెవొడోపాతో కలిపి వాడుకోవాలి
- **సిఒఎమ్‌టి ఇన్హిబిటర్స్:** ఈ మందులు లెవొడొపా ప్రభావాన్ని పెంచుతాయి
- **అమాంటడీన్, యాంటీకోలినెర్జిక్స్:** వణుకు, బిగదీసుకుపోవడం లాంటి లక్షణాలు తగ్గుముఖం పడతాయి.



డాక్టర్ రూపమ్ బోర్గోహైన్
సీనియర్ న్యూరాలజిస్ట్ అండ్ డైరెక్టర్,
పార్కిన్సన్స్ డిసీజ్ అండ్ మూవ్‌మెంట్ డిజార్డర్ రీసెర్చ్ సెంటర్,
యశోద హాస్పిటల్స్, హైటెక్ సిటీ,
హైదరాబాద్

పరిశోధన

ఈ నూనెలతో రొమ్ము క్యాన్సర్

వృక్షాధారిత నూనెలను విపరీతంగా ఉపయోగించడం వల్ల ఇన్‌ఫ్లమేషన్ పెరిగి, రొమ్ము క్యాన్సర్ ముప్పు పెరుగుతుందని ఒక కొత్త పరిశోధనలో తేలింది. వివరాలు తెలుసుకుందాం!




వృక్షాధారిత నూనెల్లో ఉండే లినోలిక్ ఆమ్లం రొమ్ము క్యాన్సర్ కణాల పెరుగుదలకు తోడ్పడుతుందని న్యూయార్క్‌లోని వీల్ కార్నెల్ మెడికల్ స్కూల్ పరిశోధనలో తేలింది. సాధారణ క్యాన్సర్లతో పోల్చితే, లినోలిక్ ఆమ్లం కారక రొమ్ము క్యాన్సర్ వేగంగా విస్తరించడంతో పాటు, ఈ క్యాన్సర్‌తో ప్రాణాలతో బయటపడే అవకాశాలు కూడా తక్కువగా ఉంటాయని ఈ మెడికల్ స్కూల్ చేపట్టిన పరిశోధనలో వెల్లడైంది. ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్ అయిన లినోలిక్ ఆమ్లం, సోయాబీన్, పొద్దుతిరుగుడు నూనెలతో పాటు, పోర్క్‌లో కూడా ఉంటుంది. ఈ ఆమ్లం చికిత్సకు లొంగని ట్రిపుల్ నెగిటివ్ రొమ్ము క్యాన్సర్ పెరుగుదలను ప్రోత్సహిస్తుందని పరిశోధకులు కనిపెట్టారు. ఈ పరిశోధన, ఆహార కొవ్వులు, క్యాన్సర్ల మధ్య సంబంధాన్ని స్పష్టం చేయడానికి సహాయపడడమే కాకుండా, నిర్దిష్ట పోషకాహారం నుంచి క్యాన్సర్ రోగులు అదనపు ప్రయోజనాన్ని ఎలా పొందవచ్చో తెలుపుతుంది.

అప్రమత్తం

మామిడి పండ్లు కొంటున్నారా?

ఇది మామిడి పండ్ల సీజన్. ఎక్కడ చూసినా నోరూరించే మామిడి పండ్లే కంటపడుతూ ఉంటాయి. అలాంటప్పుడు వాటిని తినకుండా ఉండలేం! అయితే ఆ పండ్లు సహజసిద్ధంగా పండినవేనా? లేదంటే అందుకోసం రసాయనాలను ఉపయోగించారా? ఎలా తెలుసుకోవాలి?



మామిడి పండ్లను మగ్గించడం కోసం క్యాల్షియం కార్బైడ్ అనే రసాయనాన్ని ఉపయోగిస్తూ ఉంటారు. ఈ రసాయనం ఆరోగ్యానికి హానికరం. కాబట్టి ఆ రసాయనం ఆనవాళ్లను ఇలా కనిపెట్టాలి. క్యాల్షియం కార్బైడ్ ఉపయోగించిన మగ్గించిన మామిడి పండ్లు, మొత్తంగా ముదురు పసుపురంగులో ఉంటాయి. వాటి పైన ఆకుపచ్చ రంగు అక్కడక్కడా ఉంటుంది. లేదంటే ఎక్కడా కనిపించదు. సహజసిద్ధంగా పండిన మామిడి పండ్లు తొడిమ దగ్గర తీపి వాసన వెదజల్లుతాయి. కానీ కృత్రిమంగా పండించినవి సింథటిక్ వాసన వెలువరిస్తాయి. అరమగ్గినట్టు కనిపిస్తున్నా, తాకినప్పుడు మరీ మెత్తగా ఉంటే, అవి క్యాల్షియం కార్బైడ్‌తో పండించినవి అని అర్థం. మామిడి పండులో ఒక భాగం పండిపోయి, మెత్తగా ఉండి, మిగతా పండంతా గట్టిగా ఉన్నా ఇలాగే అర్థం చేసుకోవాలి. తెలుపు లేదా బూడిదరంగులోని పొడి పండ్ల మీద పైపొరగా పరుచుకుని ఉన్నా, ఆ పండ్లను అనుమానించాలి. పండ్ల మీద ముడతలు ఉన్నా, కృత్రిమంగా పండించినట్టు అనుమానించాలి. క్యాల్షియం కార్బైడ్‌తో నోరు, చర్మం, గొంతు మండుతాయి. ఎక్కువ పరిమాణాల్లో తీసుకున్నప్పుడు తలతిరుగుతుంది. కాబట్టి ఇలాంటి దుష్ప్రభావాలకు దూరంగా ఉండాలంటే, సహజసిద్ధంగా మగ్గించిన మామిడి పండ్లనే ఎంచుకోవాలి.

ఇంగ్లండ్ వ్యక్తి.. ముత్తాత తాత సమాధి వెతికించి..

» 8 నెలలు ప్రయత్నాలు ఫలించి... తిరుమలగిరిలో కనిపించిన స్మారకం

» సమాధి చూసేందుకు భార్యతో కలిసి రానున్న ఆ పరదేశి


చార్లెస్ విల్సన్ సమాధి వద్ద రవిరెడ్డి (ఇన్‌సెట్‌లో) రాబిన్ డికెన్స్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): నాలుగైదు తరాలకు చెందిన తమ పూర్వీకుల పేర్లు ఎంతమందికి గుర్తుంటాయి? మహా అయితే ముత్తాత పేరు చెప్పగలరేమో.. ఆయన తండ్రి, తాత పేరు చెప్పమనేసరికి ఏమో అనేవాళ్లే ఎక్కువ!! అలాంటిది.. ఎప్పుడో 120 ఏళ్ల క్రితం ముత్తాత తాత మృతిచెందితే.. ఆ వివరాలను పట్టుకొని సికింద్రాబాద్‌లో ఆయన సమాధిని వెతికించేందుకు విశ్వ ప్రయత్నాలు చేశాడో వ్యక్తి. అదీ ఇంగ్లండ్‌లో ఉంటూ! ఇక దుర్లభం అనుకున్న స్థితిలో ఆ సమాధి దొరకడంతో ఆయన ఆనందం అంతా ఇంతా కాదు. ఆ వ్యక్తి.. ఇంగ్లండ్ వాస్తవ్యుడు, మాజీ సైనికుడు 67ఏళ్ల చార్లెస్ డికెన్స్. ఈయన ముత్తాత తాత, లెఫ్టినెంట్ చార్లెస్ విల్సన్ పుట్టి పెరిగిందంతా ఇంగ్లండ్‌లోనే! ఆయన బ్రిటిష్ సైన్యంలో 1880లో చేరారు. 1885లో పదోన్నతిమీద సికింద్రాబాద్‌లో అడుగుపెట్టాడు. ఇక్కడే హ్యారియెట్ అనే యువతిని పెళ్లి చేసుకున్నాడు. వీరికి నలుగురు సంతానం. అయితే అనారోగ్యం బారినపడ్డ చార్లెస్ విల్సన్ 1906లో కన్నుమూశారు. ఆయన భౌతికకాయన్ని ఈ ప్రాంతంలోనే ఖననం చేశారు. తర్వాత విల్సన్ భార్య హ్యారియెట్ తన పిల్లలను తీసుకొని ఇంగ్లండ్ వెళ్లిపోయారు. డికెన్స్ తండ్రి, తాత కూడా బ్రిటిష్ ఆర్మీలో పనిచేశారు. తండ్రి మరణానంతరం ఆయన దగ్గరున్న పూర్వీకుల వివరాలను డిజిటలైజేషన్ చేస్తున్న క్రమంలో తన ముత్తాత తాత సికింద్రాబాద్‌లో చనిపోయినట్లు డికెన్స్ గుర్తించారు. ఆయన సమాధిని చూడాలన్న ఆసక్తితో జర్నలిస్టు రవిరెడ్డిని ఆన్‌లైన్‌లో సంప్రదించి..వివరాలన్నీ పంపారు. రవిరెడ్డి బృం దం 8నెలల పాటు శ్రమించి.. తిరుమలగిరి సెమిత్రి-12లో చార్లెస్ విల్సన్ సమాధిని కనిపెట్టింది. ఆ వివరాలను ఫొటో తీసి పంపగా.. డికెన్స్ ఆనందానికి అవధుల్లేకుండా పోయా యి.ముత్తాత తాత సమాధిని చూసేందుకు భార్యతో కలిసి వచ్చే ఏడాది డికెన్స్ సికింద్రాబాద్‌కు రానున్నట్లు రవిరెడ్డి చెప్పారు.

నకిలీ ధ్రువపత్రాల దందా!

ఆదిలాబాద్ జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి

ఐటీబీపీలో ఉద్యోగాలకు ముగ్గురి దరఖాస్తు

విచారణలో వారు రాష్ట్రవాసులే కాదని తేలిన వైనం

కేసు నమోదు.. కుట్ర కోణంలోనూ విచారణ

జిల్లావ్యాప్తంగా మీ సేవ కేంద్రాల్లో తనిఖీలు


తప్పుడు ధ్రువపత్రాలు పొందిన వారిపై ఫిర్యాదు ఇస్తున్న డిప్యూటీ తహసీల్దార్

ఆదిలాబాద్/ఇచ్చోడ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఆ యువకులు కేంద్ర భద్రతా సంస్థల్లో ఉద్యోగాలు పొందారు. దేశ సరిహద్దులో కీలక విధులు నిర్వర్తించే 'ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ)' దళంలో కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు!! కానీ, వారి ధ్రువపత్రాల పరిశీలనలో అసలు విషయం బయటపడింది. నకిలీ నివాస ధ్రువపత్రాలతో ఉద్యోగాలు పొందేందుకు యత్నించినట్లు అధికారుల విచారణలో తేలింది. ఆదిలాబాద్ జిల్లాలో జరిగిన ఈ 'నకిలీ' దందా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇచ్చోడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సహాని సూరజ్, గజేంద్ర, దిగ్విజయ్ విసుకర్మ ఐటీబీపీలో కానిస్టేబుల్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్నారు. వీరు ముగ్గురూ ఇచ్చోడ మండలంలోని ఇస్లాంనగర్, కోకస్మన్నూర్ గ్రామ నివాసులమంటూ నకిలీ నివాస ధ్రువీకరణ పత్రాలతో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. అయితే ధ్రువపత్రాల పరిశీలనలో అసలు విషయం బయటపడింది. ఈ ముగ్గురూ తమ గ్రామస్థులే కాదని స్థానిక ప్రజలు తేల్చి చెప్పారు. అలాంటి పేర్లతో ఎవరూ లేరని చెప్పడంతో అధికారులు ఆశ్చర్యపోయారు. మరింత లోతుగా విచారణ చేపట్టగా.. వీరు తెలంగాణకు చెందిన వారే కాదని తేలింది. దీంతో ఆ ముగ్గురిపై ఇచ్చోడ పోలీసు స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. ఇక ఇస్లాంనగర్‌లో 14 మంది నకిలీ ధ్రువపత్రాలను కలిగి ఉన్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. అలాగే ఇంద్రవెల్లి, సిరికొండ, బేల మండలాల్లో కూడా నకిలీ సర్టిఫికెట్లు ఉన్నట్లు నిఘా వర్గాల ద్వారా తెలుస్తోంది. గతంలోనూ ఇచ్చోడ మండలంలో నకిలీ కల్యాణలక్ష్మి దరఖాస్తులు వెలుగుచూశాయి. ఇచ్చోడలోని మీసేవ ద్వారానే ఈ అక్రమాలు జరుగుతున్నట్లు సమాచారం. నకిలీ నివాస ధ్రువపత్రాల బాగోతం బయటపడడంతో అధికారులు అప్రమత్తమయ్యాయి. జిల్లావ్యాప్తంగా మీసేవ కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించి, రికార్డులను పరిశీలిస్తున్నారు. ఇతర రాష్ట్రాల వారు ఐటీబీపీకి ఇక్కడి నుంచి ఎందుకు దరఖాస్తు చేశారు? దీని వెనక ఎవరున్నారు? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ దందా వెనక ఏదైనా కుట్ర ఉందా!? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిందితులకు సహకరిస్తున్నదెవరో కూడా గుర్తించే పనిలో పడ్డారు. రెవెన్యూ అధికారులతో పాటు మీసేవ కేంద్రాల నిర్వాహకులను పోలీసులు విచారిస్తున్నారు. ఇక తన సంతకంతో కూడిన ఫేక్ నివాస ధ్రువపత్రాలను సృష్టించిన సూరజ్, అబ్దుల్ ఖాన్, హతుల్ కుమార్ యాదవ్, బిపిన్ యాదవ్‌పై గతంలో ఇచ్చోడలో డిప్యూటీ తహసీల్దార్ (డీటీ)గా పని చేసిన జాదవ్ రామారావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆగస్టులోనే ఆయన బదిలీపై వెళ్లిపోగా.. సెప్టెంబరు, అక్టోబరుల్లో నకిలీ నివాస ధ్రువపత్రాలను సృష్టించినట్లు అధికారుల విచారణలో తేలింది.

జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందజేశాం..

ఇచ్చోడ మండలంలోని ఇస్లాంనగర్‌కు చెందిన 14 మంది నివాస ధ్రువీకరణ పత్రాలు సరైనవి కావని తిరస్కరించాం. గతంలో ఇక్కడ డీటీగా పని చేసిన జాదవ్ రామారావు సంతకంపై తప్పుడు ధ్రువపత్రాలను సృష్టించి, కొందరు ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్నారు. ఐటీబీపీలో ఉద్యోగానికి ఎంపికైనవారి ధ్రువపత్రాల తనిఖీ కోసం వస్తే ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దీనిపై కలెక్టర్‌కు నివేదిక అందజేశాం.

- సత్యనారాయణరావు, తహసీల్దార్, ఇచ్చోడ

చిత్రజ్యోతి

SINCE 1965

ఆ బాధ్యత దర్శక నిర్మాతలదే

- అల్లు అరవింద్



'కొవిడ్ సమయం నుంచి చాలా మంది ప్రేక్షకులు ఓటీటీలకు అలవాటు పడ్డారు. మార్పును ఎవరూ ఆపలేరు. సినిమా చాలా బాగుంది అని టాక్ వస్తే తప్ప ప్రేక్షకులు థియేటర్లకు రావడం లేదు. అలా చాలా బాగుంది అనిపించేలా సినిమాలు చేయడం దర్శక, నిర్మాతల బాధ్యత' అని అన్నారు ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్. శ్రీవిష్ణు హీరోగా, కేతిక శర్మ, ఇవానా కథానాయికలుగా కార్తిక్ రాజు దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'సింగిల్'. అల్లు అరవింద్ సమర్పణలో విద్యా కొప్పినీడి, భాను ప్రతాప్, రియాజ్ చౌదరి నిర్మించారు. మే 9న ప్రేక్షకుల ముందుకు వస్తోన్న సందర్భంగా సోమవారం ట్రైలర్‌ని రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మాత అల్లు అరవింద్ మాట్లాడుతూ 'డైరెక్టర్ కార్తిక్ ఈ కథ చెబుతుంటే రెండు గంటల పాటు పగలబడి నవ్వుతూనే ఉన్నాను. సినిమాలో శ్రీ విష్ణు, వెన్నెల కిశోర్ కనిపించినప్పుడు నవ్వులు మామూలుగా ఉండవు. కుటుంబమంతా కలిసి థియేటర్స్‌లో ఎంజాయ్ చేసే సినిమా ఇది' అని అన్నారు. హీరో శ్రీ విష్ణు మాట్లాడుతూ 'ఇంటిల్లిపాదిని కడుపుబ్బ నవ్వించాలనే ప్రయత్నంతో ఈ సినిమా చేశాం. స్క్రీన్‌ప్లే, స్టోరీ చాలా కొత్త అనుభూతిని ఇస్తాయి' అని అన్నారు. నిర్మాత బన్నీ వాసు మాట్లాడుతూ 'నవ్వించడమే లక్ష్యంగా పెట్టుకొని తీసిన సినిమా ఇది' అని చెప్పారు.

శర్వా సినిమాలో డింపుల్ హయాతి



శర్వానంద్ కథానాయకుడిగా సంపత్ నంది దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. 'శర్వా 38' అనేది వర్కింగ్ టైటిల్. కేకే రాధామోహన్ నిర్మించనున్నారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనుల్లో ఉందీ చిత్రం. త్వరలోనే షూటింగ్ మొదలుకానుంది. 1960ల కాలంలో ఉత్తర తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో సాగే పీరియాడిక్ యాక్షన్ డ్రామా ఇది. ఇందులో శర్వా సరసన అనుపమ పరమేశ్వరన్ నటించనున్నారు. తాజాగా ఈ ప్రాజెక్ట్‌లో డింపుల్ హయాతి ఓ కీలక పాత్ర పోషించనున్నట్లు మేకర్స్ ప్రకటించారు.

శక్తిమంతమైన పాత్రలో...



విజయ్‌సేతుపతి కథానాయకుడిగా పూరిజగన్నాథ్ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాను పూరి జగన్నాథ్, చార్మీ కౌర్ సంయుక్తంగా నిర్మించనున్నారు. ఇటీవలె ఈ ప్రాజెక్ట్‌లోకి టబు ఎంటర్ అయ్యారు. తాజాగా, ఈ సినిమాలో ఓ శక్తిమంతమైన పాత్రను కన్నడ నటుడు విజయ్‌కుమార్ పోషించనున్నట్లు మేకర్స్ తెలిపారు. 'వీరసింహా రెడ్డి' సినిమా తర్వాత ఆయన నటించనున్న రెండో తెలుగు సినిమా ఇది. రెగ్యులర్ షూట్‌ను జూన్ నుంచి మొదలుపెడుతున్నారు.

అమెరికాలో కన్నప్ప ప్రచారం



'కన్నప్ప' చిత్రం కోసం అమెరికాలో వరుస ప్రమోషన్స్ చేయనున్నారు మంచు విష్ణు. ఇందులో భాగంగా మే నెల 8 నుంచి అమెరికాలో పలు ప్రచార కార్యక్రమాలు, రోడ్ షోలను ప్లాన్ చేస్తున్నారు. దాదాపు 15 రోజుల పాటు న్యూజెర్సీ, డల్లాస్, లాస్ ఏంజిల్స్‌లో ఇవి జరగనున్నాయి. ఈ ప్రచారంలో చిత్రబృందం పాల్గొననుంది. జూన్ 27న సినిమా విడుదల కానుంది. కాగా, మంచు విష్ణు టైటిల్ రోల్‌లో ముఖేష్‌కుమార్ ఈ సినిమాను తెరకెక్కించారు.

సందడికి మళ్లీ సిద్ధం!



భారతీయ సినిమా చరిత్రలో 'బాహుబలి' చిత్రానికి ఎంతటి ప్రత్యేక స్థానం ఉందో చెప్పక్కర్లేదు. ఈ సినిమా మొదటి భాగం విడుదలై 10 ఏళ్లు అవుతోంది. ఈ సందర్భంగా నిర్మాత శోభు యార్లగడ్డ అభిమానులకు తీపికబురందించారు. ఈ సినిమాను అక్టోబర్‌లో రీ రిలీజ్ చేయనున్నట్లు ఎక్స్ వేదికగా ప్రకటించారు. "ఇది రీ రిలీజ్ మాత్రమే కాదు. ఈ సినిమా పదేళ్లు పూర్తిచేసుకున్నందుకు అభిమానులతో కలసి చేసుకునే వేడుక. మరిన్ని సర్‌ప్రైజ్‌లకు సిద్ధంగా ఉండండి" అని పేర్కొన్నారు. కాగా, 'బాహుబలి: ద బిగినింగ్' 2015లో జూలై 10న విడుదలవ్వగా, రెండో భాగం 2017 ఏప్రిల్ 28న విడుదలైంది.

మలయాళ దర్శకుడు షాజీ.. ఇక లేరు



ప్రముఖ మలయాళ దర్శకుడు, సినిమాటోగ్రాఫర్ షాజీ.ఎన్.కరుణ్ (73) ఇక లేరు. కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆయన, సోమవారం తిరువనంతపురంలో కన్నుమూశారు. 1976లో 'లక్ష్మీ విజయం'తో సినిమాటోగ్రాఫర్‌గా కెరీర్‌ను ఆరంభించిన ఆయన.. కొన్నేళ్లపాటూ పలువురు ప్రముఖ దర్శకులతో పని చేశారు. ఆ తర్వాత 1988లో విడుదలైన 'పిరవి' సినిమాతో మెగాఫోన్ చేతపట్టారు. ప్రపంచవ్యాప్తంగా విశేష గుర్తింపు తెచ్చుకున్న ఆ చిత్రం, ఏకంగా 31 అవార్డులను కైవసం చేసుకుంది. జాతీయ ఉత్తమ చిత్రం, ఉత్తమ నటుడు, ఉత్తమ దర్శకుడు అవార్డులతో పాటు కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రత్యేక ప్రశంసను దక్కించుకుంది. ఆయన తెరకెక్కించిన రెండో చిత్రం 'స్వహమ్' (1994) కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రధమ విభాగంలో పోటీపడింది. మోహన్‌లాల్ కథానాయకుడిగా ఆయన రూపొందించిన మూడో చిత్రం 'వనప్రస్థానం' (1999) సైతం కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్లో ప్రదర్శితమవ్వడం విశేషం.

ఆనందంగా ఉంది



ఈశ్వర్, నైనా సర్వర్ జంటగా రాజేశ్ నాదెండ్ల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'సూర్యాపేట్ జంక్షన్'. అనిల్ కుమార్ కాట్రగడ్డ, ఎన్.శ్రీనివాసరావు నిర్మాతలు. ఇటీవలె విడుదలై రన్ అవుతోన్న ఈ సినిమా సక్సెస్ మీట్‌ను మేకర్స్ నిర్వహించారు. హీరో ఈశ్వర్ మాట్లాడుతూ 'ప్రేక్షకులు చూపించిన ప్రేమ, ఆదరణకు మా ధన్యవాదాలు. పాజిటివ్ టాక్‌తో థియేటర్లకు వచ్చి సినిమా చూస్తున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది' అని అన్నారు.

అమ్మాయి కోసం..



సౌమిత్‌రావు, శ్రేయాసి సేన్ జంటగా నటించిన చిత్రం 'నిలవే'. సౌమిత్‌రావు, సాయి వెన్నం దర్శకత్వం వహిస్తున్నారు. సాయి వెన్నం, గిరిధర్ రావు పోలాటి నిర్మాతలు. సోమవారం ఈ సినిమా టీజర్‌ని మేకర్స్ విడుదల చేశారు. అర్జున్ అనే వ్యక్తి తన ఒంటరి జీవితాన్ని కష్టంగా గడుపుతూ ప్రేమ కోసం తాపత్రయపడుతుంటాడు. అతని జీవితంలో ఓ అమ్మాయి ప్రవేశించి కొత్త కాంతిని తీసుకొస్తుంది. టీజర్‌లో ఆ అమ్మాయి కోసం ఎంతదూరమైనా వెళ్తారు అనే అంశాన్ని ఆవిష్కరించే ప్రయత్నం చేశారు. ఈ చిత్రానికి దిలీప్ కె.కుమార్ సినిమాటోగ్రఫీ, కళ్యాన్ నాయక్ సంగీతం అందిస్తున్నారు.

మనసుని కదిలించింది

-రాజమౌళి



కె.సుధాకర్ రెడ్డి, అరుణ్ రాజ్, పూర్ణచంద్ర, మౌనికా బొమ్మ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ముత్తయ్య'. భాస్కర్ మౌర్య దర్శకత్వంలో వంశీ కారుమంచి, వృందా ప్రసాద్ నిర్మించారు. మే 1నుంచి ఈటీవీ విన్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా ప్రముఖ దర్శకుడు రాజమౌళి, నిర్మాత శోభు యార్లగడ్డ చేతుల మీదుగా సినిమా ట్రైలర్‌ని రిలీజ్ చేశారు. మూవీ ట్రైలర్ తన మనసుని కదిలించిందని చిత్రబృందాన్ని రాజమౌళి అభినందించారు.

బిజినెస్

వరంగల్ ● మంగళవారం 29 ఏప్రిల్ 2025

హాయర్ ఇండియాపై అంబానీ ఆసక్తి




రేసులో సునీల్ మిట్టల్, బర్మన్లు సైతం..

న్యూఢిల్లీ: హాయర్ ఇండియాలో వాటా కొనుగోలు చేసేందుకు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) కూడా బరిలోకి దిగినట్లు తెలిసింది. చైనాకు చెందిన కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల తయారీ దిగ్గజం హాయర్ భారత అనుబంధ విభాగమే హాయర్ ఇండియా. ప్రస్తుతం హాయర్ తన భారత వ్యాపారంలో స్థానిక భాగస్వామిని చేర్చుకునేందుకు 51 శాతం వరకు వాటా విక్రయించాలని చూస్తోంది. ఈ డీల్‌లో భాగంగా కంపెనీ విలువను 200-230 కోట్ల డాలర్ల (రూ.17,000-19,550 కోట్లు) స్థాయిలో లెక్కగట్టే అవకాశం ఉంది. కాగా, హాయర్ ఇండియాలో వాటాను దక్కించుకునేందుకు అంబానీతో పాటు భారతీ ఎయిర్‌టెల్ ఛైర్మన్ సునీల్ విట్టల్, డాబర్ ప్రమోటర్లైన బర్మన్ల కుటుంబం, అమిత్ జాతియా, టీకే గోయెంకా కూడా పోటీలో ఉన్నట్లు సమాచారం. టీవీ, ఏసీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మెషీన్, వాటర్ హీటర్, మైక్రోవేవ్ ఓవెన్ తదితర ఉత్పత్తులను విక్రయిస్తున్న హాయర్ ఇండియా గత ఏడాది రూ.8,900 కోట్ల విక్రయాలను నమోదు చేసింది. ఈ ఏడాదిలో విక్రయాలు రూ.11,500 కోట్లకు పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది.

రిలయన్స్ జోరు.. మార్కెట్లో హుషారు

సెన్సెక్స్ 1,006 పాయింట్లు అప్
5.27% పెరిగిన ఆర్ఐఎల్ షేరు



ముంబై: భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు సోమవారం భారీగా లాభపడ్డాయి. భారత్-పాక్ సరిహద్దుల్లో ఉద్రిక్తతల కారణంగా గత వారాంతంలో ఏర్పడిన నష్టాలను పూర్తిగా పూడ్చుకోగలిగాయి. సెన్సెక్స్ 1,005.84 పాయింట్లు (1.27 శాతం) ఎగబాకి 80,218.37 వద్దకు చేరగా.. నిఫ్టీ 289.15 పాయింట్ల (1.20 శాతం) వృద్ధితో 24,328.50 వద్ద ముగిసింది. అంచనాలను మించిన ఆర్థిక ఫలితాలు ప్రకటించిన రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్)తో పాటు బ్యాంకింగ్, ఫార్మా, ఎనర్జీ, ఆటో రంగ షేర్లలో మదుపరులు భారీగా కొనుగోళ్లు జరపడం ఇందుకు దోహదపడింది. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల(ఎఫ్ఐఐ) పెట్టుబడులు కొనసాగడమూ మార్కెట్‌కు కలిసివచ్చింది. ఈ అనూహ్య ర్యాలీలో ఈక్విటీ మదుపరుల సంపదగా భావించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.4.52 లక్షల కోట్లు పెరిగి రూ.426.10 లక్షల కోట్ల(5 లక్షల కోట్ల డాలర్లు)కు చేరింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 23 రాణించాయి. మార్కెట్ దిగ్గజం ఆర్ఐఎల్ షేరు ఏకంగా 5.27 శాతం ఎగబాకి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. సన్‌ఫార్మా 3.08 శాతం లాభపడగా.. టాటా స్టీల్, ఎం అండ్ ఎం, ఎస్‌బీఐ, యాక్సిస్ బ్యాంక్, టాటా మోటార్స్ షేర్లు 2 శాతానికి పైగా పెరిగాయి. హెచ్‌సీఎల్ టెక్, అల్ట్రాటెక్ సిమెంట్ మాత్రం ఒక శాతానికి పైగా నష్టపోయాయి.

బీఎస్ఈలోని మిడ్‌క్యాప్ సూచీ 1.34 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.39 శాతం వృద్ధి నమోదు చేశాయి. రంగాలవారీ సూచీల్లో ఎనర్జీ 3.02 శాతం లాభపడింది. ఆయిల్ అండ్ గ్యాస్ 2.90 శాతం పెరిగింది. క్యాపిటల్ గూడ్స్, హెల్త్‌కేర్, మెటల్, బ్యాంకెక్స్, రియల్టీ సూచీలు 1.93 శాతం వరకు పెరిగాయి. ఐటీ, ఫోకస్డ్ ఐటీ ఇండెక్స్ మాత్రం నేలచూపులు చూశాయి.

సెన్సెక్స్‌లో అత్యధిక వెయిటేజీ కలిగిన ఆర్ఐఎల్ షేరు 5 శాతానికి పైగా పుంజుకోవడంతో కంపెనీ మార్కెట్ విలువ ఒక్క రోజులోనే రూ.92,629 కోట్లు పెరిగి దాదాపు రూ.18.52 లక్షల కోట్లకు చేరకుంది. 2024 జూన్ 3 తర్వాత ఆర్ఐఎల్ షేరుకిదే అతిపెద్ద ఒక్కరోజు లాభం. ఈ మార్చితో ముగిసిన త్రైమాసికంలో కంపెనీ మెరుగైన లాభాలు ప్రకటించడం ఇందుకు తోడ్పడింది.

ఎల్‌జీ ఇష్యూ వాయిదా

దక్షిణ కొరియా ఎలక్ట్రానిక్స్ దిగ్గజం ఎల్‌జీ తన భారత అనుబంధ విభాగమైన ఎల్‌జీ ఇండియా ఐపీఓను వాయిదా వేసుకున్నట్లు ఇండస్ట్రీ వర్గాలు తెలిపాయి. వచ్చే నెల రెండో వారంలో ఇష్యూను ప్రారంభించాలని కంపెనీ భావించినప్పటికీ, స్టాక్ మార్కెట్లో ఒడుదుడుకుల నేపథ్యంలో కనీసం 3 నెలలు ఆగాలని నిర్ణయించుకున్నట్లు ఆ వర్గాలు వెల్లడించాయి.

వచ్చే ఏడాది భారత మార్కెట్లోకి డెంగ్యూ వ్యాక్సిన్

క్యూడెంగా పేరుతో అందుబాటులోకి

'బయోలాజికల్-ఈ'తో కలిసి విడుదల చేయనున్న తకెడా ఫార్మా

ముంబై: వచ్చే ఏడాది కల్లా భారత మార్కెట్లోకి డెంగ్యూ వ్యాక్సిన్ అందుబాటులోకి రానుంది. జపాన్‌కు చెందిన తకెడా ఫార్మాస్యూటికల్స్.. హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే 'బయోలాజికల్ ఈ (బీఈ)'తో కలిసి 'క్యూడెంగా' పేరుతో ఈ వ్యాక్సిన్‌ను మన దేశంలో తయారు చేసి మార్కెట్ చేయనుంది. తకెడా ఫార్మా ఉన్నతాధికారి ఒకరు ఈ విషయం వెల్లడించారు. కంపెనీ ప్రస్తుతం మనుషులపై ఈ వ్యాక్సిన్ ప్రభావాన్ని పరీక్షిస్తోంది. ఈ పరీక్షలు పూర్తయిన వెంటనే భారత్‌తో పాటు 40కిపైగా దేశాల్లో ఈ వ్యాక్సిన్ అందుబాటులోకి రానుంది. మూడు నెలల విరామంతో రెండు డోసులు ఈ వ్యాక్సిన్ తీసుకుంటే డెంగ్యూ రాకుండా అడ్డుకోవచ్చని తకెడా చెబుతోంది. ఇప్పటికే ప్రయోగాత్మకంగా కోటి డోసుల వ్యాక్సిన్ తయారు చేసి వివిధ దేశాలకు సరఫరా చేసింది. మనుషులపై ప్రయోగాలు పూర్తయిన తర్వాత తాను ఉత్పత్తి చేసే ఈ వ్యాక్సిన్‌లో సగ భాగం బీఈ ద్వారా తయారు చేయించాలని తకెడా భావిస్తున్నట్టు సమాచారం.

విమ్టా ల్యాబ్స్ 1:1 బోనస్ ఇష్యూ

క్యూ4 లాభం రూ.18 కోట్లు

బయోలాజిక్స్ కాంట్రాక్ట్ ఆర్ అండ్ డీలోకి అడుగు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): విమ్టా ల్యాబ్స్. వాటాదారులకు 1:1 నిష్పత్తిలో బోనస్ షేర్లు జారీ చేస్తున్నట్లు ప్రకటించింది. అర్హులైన వాటాదారులందరికి రూ.2 ముఖ విలువతో కూడిన ప్రతి షేరుకు ఒక షేరును జారీ చేయనున్నట్లు వెల్లడించింది. కంపెనీ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం)లో వాటాదారుల అనుమతికి లోబడి ఈ షేర్ల జారీ ఉంటుందని తెలిపింది. కాగా గడచిన ఆర్థిక సంవత్సరం మార్చితో ముగిసిన చివరి త్రైమాసికం (క్యూ4)లో కంపెనీ రూ.96.1 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.18.3 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. మార్చితో ముగిసిన పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను రూ.348.20 కోట్ల ఆదాయంపై రూ.66.8 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండటంతో రూ.2 ముఖ విలువతో కూడిన ప్రతి షేరుకు రూ.2 తుది డివిడెండ్‌ను డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది. కాగా కార్యకలాపాల విస్తరణలో భాగంగా బయోలాజిక్స్ కాంట్రాక్ట్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్ అండ్ డీ)లోకి అడుగుపెడుతున్నట్లు విమ్టా ల్యాబ్స్ ప్రకటించింది. నోవెల్ బయోలాజిక్ ఎంటిటీస్, బయోసిమిలర్స్, పెప్టైడ్ ఆధారిత థెరాప్యుటిక్స్‌పై ఈ విభాగం దృష్టి పెడుతుందని తెలిపింది.

సనోఫీతో డాక్టర్ రెడ్డీస్ భాగస్వామ్యం విస్తరణ

త్వరలో మార్కెట్లోకి బేఫోర్టస్ ఔషధం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సనోఫీ హెల్త్‌కేర్‌తో తమ భాగస్వామ్య ఒప్పందాన్ని మరింత విస్తరించినట్లు డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ ప్రకటించింది. తాజా నిర్ణయంతో శిశువుల్లో ఏర్పడే శ్వాసకోశ సంబంధిత వ్యాధి నివారణలో ఉపయోగించే సరికొత్త ఔషధం భారత మార్కెట్లో ప్రవేశపెట్టే అవకాశం తమకు కలిగిందని డాక్టర్ రెడ్డీస్ వెల్లడించింది. బేఫోర్టస్ పేరుతో ఈ ఔషధాన్ని ప్రీ ఫిల్డ్ ఇంజెక్షన్ రూపంలో విడుదల చేయనున్నట్టు తెలిపింది. ఈ ఔషధాన్ని ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో విడుదల చేసే ఆస్కారం ఉందని, గరిష్ఠంగా 24 నెలల వయసు గల చిన్నారుల వరకు అందరికీ ఈ ఔషధాన్ని వినియోగించవచ్చని పేర్కొంది. ఈ ఒప్పందంతో భారత్‌లో బేఫోర్టస్ ఔషధాన్ని పంపిణీ చేసేందుకు తమకు ప్రత్యేక హక్కులు లభిస్తాయని డాక్టర్ రెడ్డీస్ బ్రాండెడ్ మార్కెట్స్ విభాగం సీఈఓ ఎంవీ రమణ తెలిపారు.

యూకో బ్యాంక్ లాభంలో 24% వృద్ధి

క్యూ4లో రూ.666 కోట్లు

కోల్‌కతా: ప్రభుత్వ రంగంలోని యూకో బ్యాంక్ మార్చితో ముగిసిన 2024-25 ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.665.72 కోట్ల నికర లాభం ఆర్జించింది. 2023-24 ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.537.86 కోట్ల లాభంతో పోల్చితే ఇది 24 శాతం అధికం. త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం ఆదాయం రూ.6,984 కోట్ల నుంచి రూ.8,136 కోట్లకు పెరిగింది. కాగా మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి గాను కన్సాలిడేటెడ్ లాభం రూ.1,671 కోట్ల నుంచి రూ.2,468 కోట్లకు పెరిగినట్టు బ్యాంక్ ప్రకటించింది. మార్చి నాటికి స్థూల మొండి బకాయిలు (ఎన్‌పీఏ) 3.46% నుంచి 2.69 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.89% నుంచి 0.50 శాతానికి తగ్గాయి. ప్రొవిజన్ కవరేజీ నిష్పత్తి 96.69 శాతంగా ఉంది. వార్షిక ప్రాతిపదికన బ్యాంక్ మొత్తం వ్యాపారం 14.12% పెరిగి రూ.5,13,527 కోట్లకు చేరింది. రుణాలు 17.72% వృద్ధితో రూ.2,19,985 కోట్లకు చేరగా డిపాజిట్లు 11.56% వృద్ధితో రూ.2,93,542 కోట్లుగా నమోదయ్యాయి. రిటైల్, వ్యవసాయం, ఎంఎస్ఎంఈ విభాగంలో రుణాలు 25.74% వృద్ధితో రూ.1,22,613 కోట్లకు చేరాయి.

75 శాతానికి ప్రభుత్వ వాటా తగ్గింపుపై కసరత్తు



ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో 270 కోట్ల ఈక్విటీ షేర్లు జారీ చేయాలని యూకో బ్యాంక్ ప్రణాళికలు రచిస్తోంది. సెబీ నిబంధనలకు అనుగుణంగా బ్యాంకులో ప్రభుత్వ వాటా 75 శాతానికి తగ్గించుకునేందుకు ఈ తాజా ఈక్విటీ షేర్లు జారీ చేయనున్నట్టు బ్యాంక్ ఎండీ, సీఈఓ అశ్వనీ కుమార్ తెలిపారు. ప్రస్తుత బ్యాంక్ షేరు విలువ రూ.31ని పరిగణనలోకి తీసుకుంటే మొత్తం ఇష్యూ సైజు రూ.8,000 కోట్లుగా ఉండనుంది. మార్చి త్రైమాసికంలో బ్యాంక్.. క్యూఐపీ విధానంలో రూ.2,000 కోట్లు సమీకరించింది. దీంతో ప్రభుత్వ వాటా 95.39 శాతం నుంచి 90.95 శాతానికి దిగివచ్చింది.

క్యూ1లో కొలువుల మార్కెట్ భళా

మహిళల నుంచి భారీగా దరఖాస్తులు: అప్నా

న్యూఢిల్లీ: దేశంలో ఉద్యోగ మార్కెట్ గాడిన పడుతోంది. ఈ ఏడాది మార్చితో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో తమ పోర్టల్‌లో 1.81 కోట్ల మంది అభ్యర్థులు ఉద్యోగాల కోసం తమ రెస్యూమ్స్ పోస్టు చేసినట్టు 'ఇండియా ఎట్ వర్క్- క్యూ1 2025' పేరుతో విడుదల చేసిన ఒక నివేదికలో అప్నా జాబ్స్ పోర్టల్ తెలిపింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 30 శాతం ఎక్కువ. గత త్రైమాసికంలో అప్నా పోర్టల్‌కు వచ్చిన రెస్యూమ్స్‌లో 62 లక్షలు మహిళల నుంచి వచ్చాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 23 శాతం ఎక్కువ. కంపెనీలు అనుసరిస్తున్న ఫ్లెక్సిబుల్ వర్క్, నియామకాల్లో స్త్రీలకూ సమాన అవకాశాలు కల్పించడం, బీపీఓ, ఫైనాన్స్, హెచ్ఆర్ రంగాల్లో మహిళలకు పెరుగుతున్న అవకాశాలు ఇందుకు ప్రధాన కారణం.

భారత్‌లో యాపిల్ యాప్ స్టోర్ హవా

న్యూఢిల్లీ: గడిచిన కొన్నేళ్లలో భారత్‌లో యాపిల్ ఐఫోన్లతో పాటు యాపిల్ యాప్ స్టోర్ సేవల వినియోగం గణనీయంగా పెరిగింది. గత ఏడాది యాపిల్ యాప్ స్టోర్ ద్వారా భారత్‌లో ఏకంగా రూ.44,447 కోట్ల (531 కోట్ల డాలర్లు) విలువైన డెవలపర్స్ బిల్లింగ్స్, విక్రయాలు జరిగాయి. అందులో 94 శాతానికి పైగా ఆదాయం డెవలపర్లు, వ్యాపారులకే సమకూరిందని, పైగా అది యాపిల్‌కు ఎలాంటి కమీషన్ చెల్లించాల్సిన అవసరం లేని రాబడి అని యాపిల్ పేర్కొంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



29వ తేదీ			
హైదరాబాద్	420	విజయవాడ	435
వరంగల్	422	గోదావరి	420
చిత్తూరు	473	విశాఖపట్నం	430
		డజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	125	విజయవాడ	127
వరంగల్	125	గుంటూరు	125
కరీంనగర్	125	ఒంగోలు	125
మహబూబ్‌నగర్	125	చిత్తూరు	82
కర్నూలు	125	నెల్లూరు	87
విశాఖపట్నం	121	అనంతపురం	87
గోదావరి	127		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	97,530 ▼	89,400 ▼	1,11,000 ▲
విజయవాడ	98,300 ▼	92,200 ▼	99,300 ▼
విశాఖపట్నం	98,340 ▲	89,400 ▼	1,11,000 ▼
రాజమండ్రి	97,530 ▼	89,400 ▼	99,300 ▼
ప్రొద్దుటూరు	97,500 ▲	89,710 ▲	99,000 ▼
ముంబై	95,108 ▼	87,119 ▼	96,426 ▼

స్పోర్ట్స్

నేటి మ్యాచ్

ఢిల్లీ x కోల్‌కతా	వేదిక ఢిల్లీ, రా.7.30 నుంచి



రాష్ట్రపతి భవన్‌లో సోమవారం జరిగిన పద్మ అవార్డుల ప్రదాన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా పద్మ భూషణ్, పద్మ శ్రీ అవార్డులను అందుకుంటున్న భారత హాకీ మాజీ గోల్‌కీపర్ శ్రీజేష్, క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్

బాక్సింగ్ పసిడి పోరుకు మనోళ్లు 21 మంది


అమ్మాన్ (జోర్డాన్): జూనియర్ ఆసియా చాంపియన్‌షిప్స్‌లో భారత బాక్సర్లు దుమ్ము రేపుతున్నారు. ఆరుగురు మహిళలు సహా మొత్తం ఏడుగురు బాక్సర్లు అండర్-17 ఫైనల్స్‌లో అడుగుపెట్టారు. ఈ చాంపియన్‌షిప్స్‌లో భారత్ ఇప్పటికే 43 పతకాలు ఖాయం చేసుకోగా అండర్-15, అండర్-17 విభాగాలలో 21 మంది బాక్సర్లు స్వర్ణం కోసం తలపడనున్నారు. అండర్-17 మహిళల కేటగిరీలో అహన శర్మ (50కి.), ఖుషీచంద్ (44-46కి.), జనత్ (54కి.), సిమ్రన్‌జీత్ కౌర్ (60కి.), హరిస్కా (63కి.), అన్షిక (80+కి.) ఫైనల్లో ప్రవేశించారు. పురుషుల అండర్- 17 కేటగిరీలో దేవాన్ష్ (80కి.) పసిడి పతక పోరుకు చేరాడు.

అరవింద్‌కు రెండో స్థానం

వార్సా: గ్రాండ్ ప్రీ చెస్ ర్యాపిడ్ విభాగంలో భారత గ్రాండ్ మాస్టర్ అరవింద్ చిదంబరం రెండో స్థానంలో నిలిచాడు. సోమవారం జరిగిన ఆఖరి మూడు రౌండ్లలో రెండు నెగ్గిన అరవింద్.. ఓ గేమ్‌లో పరాజయం పాలయ్యాడు. దీంతో మొత్తం 9 రౌండ్ల నుంచి 11 పాయింట్లతో రెండో స్థానం దక్కించుకొన్నాడు. కాగా, వ్లాదిమిర్ ఫెడోసివ్ (స్లొవేనియా) కూడా 11 పాయింట్లే సాధించినా.. మెరుగైన టైబ్రేక్ స్కోరుతో అగ్రస్థానాన్ని చేజిక్కించుకొన్నాడు. మరో భారత జీఎం ప్రజ్ఞానంద 10 పాయింట్లతో నాలుగో స్థానంతో సరిపెట్టుకున్నాడు.

3 నెలలు 94 మ్యాచ్‌లు

2028 నుంచి ఐపీఎల్ విస్తరణ యోచన



న్యూఢిల్లీ: ప్రపంచ క్రికెట్‌లో అగ్రశ్రేణి లీగ్‌గా కొనసాగుతున్న ఐపీఎల్‌ను మరింతగా విస్తరించే దిశగా కసరత్తు జరుగుతోంది. దీనిలో భాగంగా మ్యాచ్‌ల సంఖ్య, టోర్నీ కాలపరిమితిని పెంచే అవకాశం ఉన్నట్టు సమాచారం. ప్రస్తుతం లీగ్‌లో 74 మ్యాచ్‌లు జరుగుతున్నాయి. అయితే 2028 నుంచి ఈ సంఖ్య 94కు పెంచి, మూడు మాసాల పాటు నిర్వహించే ఆలోచనలో ఉన్నట్టు ఐపీఎల్ ఛైర్మన్ అరుణ్ ధూమల్ పేర్కొన్నాడు. తాజా మీడియా హక్కుల కాలపరిమితి 2027 వరకు ఉంది. ఆ తర్వాతి ఏడాది నుంచి జరిగే సైకిల్‌తో ప్రారంభించి మరో 20 మ్యాచ్‌లను పెంచేందుకు అవకాశం ఉందని ధూమల్ అన్నాడు. 'ఇదే విషయమై ఐసీసీలో చర్చిస్తున్నాం. అలాగే బీసీసీఐలోనూ అంతర్గతంగా చర్చ జరుగుతోంది. ఈ ఏడాది మ్యాచ్‌లను పెంచే ఆలోచన చేయలేదు. కానీ సమీప భవిష్యత్‌లో నిర్ణయం తీసుకుంటాం' అని ధూమల్ వివరించాడు.

పిల్లాడు పిడుగల్లే..

35 బంతుల్లో శతకంతో సూర్యవంశీ విధ్వంసం



పిన్నవయసులో టీ20 సెంచరీ

ఐపీఎల్‌లో గేల్ తర్వాత వైభవే..

8 వికెట్ల తేడాతో గుజరాత్ చిత్తు

రాజస్థాన్ ప్లేఆఫ్స్ రేసులోనే..!

జైపూర్: ఇంకా పాలబుగ్గల పసివాడే.. అయితేనేం అంతర్జాతీయ స్థాయి బౌలర్లను చెడుగుడు ఆడేశాడు **14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ.** కలా.. నిజమా? అనే రీతిన సాగిన ఈ చిచ్చర పిడుగు బ్యాటింగ్ విన్యాసాలను కళ్లారా తిలకించాల్సిందే. గుజరాత్ బౌలర్లు ఇషాంత్, సిరాజ్, ప్రసిద్ధ్, రషీద్, సుందర్, కరీం జనత్ ఇలా ఏ ఒక్కరినీ వదలకుండా కేవలం 38 బంతుల్లోనే 7 ఫోర్లు, 11 సిక్సర్లతో 101 రన్స్‌తో ప్రపంచ క్రికెట్‌ను ఔరా.. అనిపించాడు. టీ 20 ఫార్మాట్‌లో 14 ఏళ్ల 32 రోజుల పిన్నవయసులో సెంచరీ సాధించిన ఆటగాడయ్యాడు. అలాగే ఐపీఎల్‌లో గేల్ (30) తర్వాత తక్కువ (35) బంతుల్లో శతక బాదిన రెండో ప్లేయర్‌గా నిలిచాడు. ఐపీఎల్ చిరస్మరణీయ ఇన్నింగ్స్‌లో ఒకటిగా నిలిచిన వైభవ్ ఆటలో బౌండరీల రూపంలోనే 94 పరుగులు రావడం మరో విశేషం. అతడి ధాటికి వరుసగా ఐదు ఓటముల తర్వాత రాజస్థాన్ 8 వికెట్ల తేడాతో నెగ్గింది. ఈ మ్యాచ్‌లో ఓడితే ఆర్ఆర్ అధికారికంగా ప్లేఆఫ్స్ నుంచి నిష్క్రమించేది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 209 పరుగులు చేసింది. గిల్ (84), బట్లర్ (50 నాటౌట్), సాయి సుదర్శన్ (39) రాణించారు. తీక్షణకు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో రాజస్థాన్ 15.5 ఓవర్లలో 2 వికెట్లకు 212 పరుగులు చేసి గెలిచింది. జైస్వాల్ (40 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్సర్లతో 70 నాటౌట్), పరాగ్ (15 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 32 నాటౌట్) వేగంగా ఆడారు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా వైభవ్ నిలిచాడు.

ఆది నుంచీ బాదుడే..: ఈ పిచ్‌పై 210 పరుగుల ఛేదన కష్టమే అనుకున్న చోట.. రాజస్థాన్ స్కోరు ఆరంభం నుంచే రాకెట్ వేగంతో పోటీపడింది. ఓపెనర్లు వైభవ్, జైస్వాల్ తుఫాన్ ఇన్నింగ్స్‌తో చెలరేగారు. ముఖ్యంగా వైభవ్ నాలుగో ఓవర్ నుంచి సాగించిన విధ్వంసం 12వ ఓవర్ వరకు నిరంతరాయంగా సాగింది. ఈ దశలో గుజరాత్ బౌలర్లు అతడికి బంతి వేసేందుకే జంకాల్సి వచ్చింది. ముందుగా ఇషాంత్‌ను లక్ష్యంగా చేసుకున్న తను 6,6,4,6,4తో 28 పరుగులు రాబట్టాడు. దీంతో జీటీ శిబిరం షాక్‌కు గురైంది. ఆ వెంటనే స్పిన్నర్ సుందర్‌ను దించగా అతడినీ వదలకుండా 4,6,6,4తో 21 రన్స్ రాబట్టడమే కాకుండా 17 బంతుల్లోనే ఫిఫ్టీని కూడా పూర్తి చేశాడు. అటు పవర్‌ప్లేలో ఆర్ఆర్ 87 పరుగులతో నిలిచింది. ఐపీఎల్‌లో ఈ జట్టుకిదే అత్యధికం. ఎనిమిదో ఓవర్‌లోనే స్కోరు వంద దాటేసింది. ఇక తొలి ఐపీఎల్ మ్యాచ్ ఆడిన పేసర్ కరీమ్‌కు వైభవ్ పీడకలే మిగిల్చాడు. అతడి మొదటి ఓవర్‌లోనే ఏ బంతినీ వదలకుండా 6,4,6,4,4,6తో 30 పరుగులు రాబట్టడంతో స్టేడియం హోరెత్తిపోయింది. అప్పటికి 94 పరుగులతో ఉన్న వైభవ్ రషీద్ ఓవర్‌లో భారీ సిక్సర్‌తోనే సెంచరీ పూర్తి చేయడం అబ్బురపరిచింది. చివరికి 12వ ఓవర్‌లో పేసర్ ప్రసిద్ధ్ అవుట్ చేయడంతో వైభవ్ అద్భుత ఇన్నింగ్స్ ముగిసింది. అయితే అప్పటికే తొలి వికెట్‌కు 166 పరుగులు జత చేరడం విశేషం. ఆ తర్వాత రాణా (4) వికెట్ పడినా జైస్వాల్‌కు జత కలిసిన పరాగ్ సైతం వేగం కనబర్చాడు. దీంతో మరో 25 బంతులుండగానే ఈ భారీ ఛేదన పూర్తయ్యింది.



జైస్వాల్ (40 బంతుల్లో 70 నాటౌట్)

టాపార్డర్ షో: గుజరాత్ ఇన్నింగ్స్‌లో ఓపెనర్లు గిల్, సాయి సుదర్శన్ మరోసారి మెరిశారు. ఇరువురి క్యాచ్‌లను ఫీల్డర్లు వదిలేయడం కూడా వీరికి కలిసివచ్చింది. అలాగే వన్‌డౌన్‌లో బట్లర్ బాదుడుకు స్కోరు 200 దాటేసింది. పవర్‌ప్లేలో గిల్-సాయిల అడపాదడపా బౌండరీలతో స్కోరు 53 పరుగులకు చేరింది. ఆ తర్వాత స్పిన్నర్ హసరంగ పరుగులను కట్టడి చేసినా యుధ్‌వీర్ ఓవర్‌లో గిల్ 4,6తో 13 రన్స్ అందించాడు. అలాగే 29 బంతుల్లోనే ఫిఫ్టీని కూడా పూర్తి చేశాడు. అయితే 11వ ఓవర్‌లో సుదర్శన్‌ను తీక్షణ అవుట్ చేయడంతో తొలి వికెట్‌కు 93 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అనంతరం గిల్‌కు జతగా బట్లర్ చేరడంతో స్కోరు రాకెట్ వేగంతో వెళ్లింది. పొదుపుగా బౌలింగ్ వేస్తున్న హసరంగను బట్లర్ బాదేశాడు. అతడి చివరి ఓవర్‌లో 6,6,4,6తో ఏకంగా 24 పరుగులు రాబట్టాడు. రెండో వికెట్‌కు 38 బంతుల్లోనే 74 పరుగులు జత చేరాక గిల్‌ను సైతం తీక్షణ పెవిలియన్‌కు చేర్చాడు. అటు బట్లర్ మాత్రం తన జోరును సాగిస్తూ 18వ ఓవర్‌లో 6,6,4తో 19 రన్స్ అందించాడు. సుందర్ (13), తెవాటియా (9) త్వరగానే అవుటైనా.. చివరి ఓవర్‌లో 13 రన్స్ రావడంతో స్కోరు 200 దాటింది. అలాగే బట్లర్ 26 బంతుల్లోనే సీజన్‌లో నాలుగో అర్ధసెంచరీని పూర్తి చేశాడు.

స్కోరుబోర్డు

గుజరాత్: సాయి సుదర్శన్ (సి) పరాగ్ (బి) తీక్షణ 39; గిల్ (సి) పరాగ్ (బి) తీక్షణ 84; బట్లర్ (నాటౌట్) 50; సుందర్ (సి) హెట్‌మయెర్ (బి) సందీప్ 13; తెవాటియా (ఎల్బీ) ఆర్చర్ 9; షారుక్ (నాటౌట్) 5; **ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: 20 ఓవర్లలో 209/4; వికెట్ల పతనం:** 1-93, 2-167, 3-193, 4-202; **బౌలింగ్:** ఆర్చర్ 4-0-49-1; తీక్షణ 4-0-35-2; యుధ్‌వీర్ 3-0-38-0; సందీప్ 4-0-33-1; పరాగ్ 1-0-14-0; హసరంగ 4-0-39-0.

రాజస్థాన్ రాయల్స్: యశస్వీ జైస్వాల్ (నాటౌట్) 70, వైభవ్ సూర్యవంశీ (బి) ప్రసిద్ధ్ కృష్ణ 101, రాణా (ఎల్బీ) రషీద్ 4, పరాగ్ (నాటౌట్) 32, **ఎక్స్‌ట్రాలు 5, మొత్తం: 15.5 ఓవర్లలో 212/2, వికెట్లపతనం:** 1-166, 2-171, **బౌలింగ్:** సిరాజ్ 2-0-24-0, ఇషాంత్ శర్మ 2-0-36-0, సుందర్ 1.5-0-34-0, ప్రసిద్ధ్ కృష్ణ 4-0-47-1, రషీద్ ఖాన్ 4-0-24-1, కరీమ్ జనత్ 1-0-30-0, సాయి కిషోర్ 1-0-16-0.

టీ20 ఫార్మాట్‌లో శతకం బాదిన అతి పిన్నవయస్కు (14 ఏళ్లు)డిగా వైభవ్.

1 ఐపీఎల్‌లో తన తొలి ఓవర్‌లోనే అత్యధిక రన్స్ (30) సమర్పించుకున్న బౌలర్‌గా కరీం జనత్.

ఐపీఎల్‌లో 200+ ఛేదనను తక్కువ ఓవర్లలో (15.5)నే పూర్తి చేసిన జట్టుగా రాజస్థాన్

2 ఐపీఎల్‌లో రెండో వేగవంతమైన (35 బంతుల్లో) శతకాన్ని నమోదు చేసిన వైభవ్. గేల్ (30 బంతుల్లో) టాప్‌లో ఉన్నాడు.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
బెంగళూరు	10	7	3	0	14	0.521
ముంబై	10	6	4	0	12	0.889
గుజరాత్	9	6	3	0	12	0.748
ఢిల్లీ	9	6	3	0	12	0.482
పంజాబ్	9	5	3	1	11	0.177
లఖ్‌నవూ	10	5	5	0	10	-0.325
కోల్‌కతా	9	3	5	1	7	0.212
రాజస్థాన్	10	3	7	0	6	-0.349
హైదరాబాద్	9	3	6	0	6	-1.103
చెన్నై	9	2	7	0	4	-1.302

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

జిన్‌పింగ్ ఫోన్ చేశారు: ట్రంప్

» అలాంటిదేం లేదంటూ తోసిపుచ్చిన చైనా

హాంగ్‌కాంగ్: చైనా సహా అనేక దేశాలపై ఇటీవల ప్రతీకార సుంకాలను విధించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా ఆ దేశాధ్యక్షుడిపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఇటీవల తనతో ఫోన్‌లో మాట్లాడినట్లు ప్రకటించారు. అయితే చైనా ఆ వ్యాఖ్యలను తోసిపుచ్చింది. ఇటీవలి కాలంలో ఇరు దేశాల అధ్యక్షుల మధ్య ఎలాంటి ఫోన్ సంభాషణలు జరగలేదని తేల్చిచెప్పింది. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ తన స్నేహితుడని పలుమార్లు ప్రకటించిన డొనాల్డ్ ట్రంప్.. గతవారం టైమ్ మ్యాగజీన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన గురించి ప్రస్తావించారు. "ఆయన నాకు ఫోన్ చేశారు, దానిని ఆయన బలహీనతగా నేను భావించడం లేదు. నేను ఆ విషయం గురించి స్పందించాలని అనుకోవడం లేదు కూడా.. కానీ ఆయనతో చాలా సార్లు మాట్లాడాను" అని తెలిపారు. కానీ చైనా అధ్యక్షుడితో ఎప్పుడు మాట్లాడారు, ఏ అంశంపై మాట్లాడారనే వివరాలను ట్రంప్ వెల్లడించలేదు. ఈ విషయంపై చైనా విదేశాంగ అధికార ప్రతినిధి గుయో జియాకున్ స్పందించారు. తనకు తెలిసినంత వరకు ఇటీవలి కాలంలో ఇరుదేశాల అధ్యక్షుల మధ్య ఎటువంటి ఫోన్ సంభాషణలు జరగలేదని స్పష్టం చేశారు.

రోబోలు ఐదేళ్లలో సర్జన్లను మించిపోతాయి!

వాషింగ్టన్, ఏప్రిల్ 28: శస్త్రచికిత్సల విషయంలో రోబోలు భవిష్యత్తులో వైద్యులను (సర్జన్లను) మించిపోతాయని ఎలాన్ మస్క్ పేర్కొన్నారు. 'రానున్న కొన్నేళ్లలోనే మంచి సర్జన్లను రోబోలు మించిపోతాయి. ఐదేళ్లలోపే అత్యుత్తమ సర్జన్లనూ మించిన నైపుణ్యం చూపుతాయి. వేగం, కచ్చితత్వంలో రోబోలతో పోటీ పడటం మనుష్యులకు సాధ్యం కాదు' అని ఎక్స్‌లో ఒక పోస్టు పెట్టారు. ఎక్స్‌లో టాక్ షో నిర్వహించే మారియో నవ్‌ఫాల్ అనే వ్యక్తికి ఓ అంశంపై ప్రత్యుత్తరం ఇస్తూ మస్క్ ఈ వ్యాఖ్య చేశారు. కాగా, ఇప్పటికే శస్త్రచికిత్సల్లో రోబోల పనితీరును వెల్లడించే ఓ నివేదికను మారియో షేర్ చేశారు. ఈ నివేదిక ప్రకారం.. 137 సర్జరీల్లో రోబోలను ఉపయోగించగా, రెండు కేసులు తప్ప మిగిలిన అన్నింటినీ అవి విజయవంతంగా పూర్తి చేశాయి. ఆ రెండు కూడా.. ఒక కేసులో సంబంధిత రోబోలో సాంకేతిక సమస్యలు రాగా, మరో కేసులో పేషంట్ పరిస్థితి సంక్లిష్టంగా ఉండటంతో సర్జన్లతోనే ఆపరేషన్ జరిపారు.

కరెంటు లేక స్తంభించిన యూరప్

బార్సెలొనా, ఏప్రిల్ 28: యూరప్‌లోని స్పెయిన్, పోర్చుగల్, ఫ్రాన్స్ దేశాల్లో విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం పన్నెండున్నరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో సబ్ వే నెట్‌వర్క్‌లు, మెట్రో స్టేషన్లు, ఫోన్ లైన్లు, ట్రాఫిక్ లైట్లు, ఏటీఎం మిషన్లు పనిచేయడం లేదు. ట్రాఫిక్ లైట్లు పనిచేయకపోవడంతో రోడ్లపై భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. మొబైల్ ఫోన్ నెట్‌వర్క్లు పనిచేయకపోవడంతో వాయిస్ కాల్స్‌కు అవకాశం లేకుండా పోయింది. ఎలక్ట్రానిక్ పేమెంట్ సేవలు నిలిచిపోయాయి. రైళ్లు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. విమానాశ్రయాల్లో కూడా సేవలు నిలిచిపోయాయి. వీటితో పాటు అనేక సేవలు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. యూరోపియన్ విద్యుత్ గ్రిడ్‌లో సమస్య తలెత్తిందని, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు యత్నాలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు.

యెమెన్ జైలుపై అమెరికా దాడి..68మంది మృతి

దుబాయి, ఏప్రిల్ 28: యెమెన్ జైలుపై అమెరికా జరిపిన వైమానిక దాడిలో 68 మంది మరణించగా 47 మంది గాయపడ్డారు. యెమెన్‌లోని సాదా రాష్ట్రంలో అమెరికా వైమానిక దాడులు చేసిందని హౌతీ తిరుగుబాటుదారులు ఆరోపించారు. ఆఫ్రికన్ వలసదారులు ఉన్న జైలులో ఈ దాడులు జరిగాయన్నారు. ఇందులో 68 మంది మృతిచెందగా 47 మంది గాయపడ్డారని వెల్లడించారు. ఈ జైలులో 115 మంది ఖైదీలు ఉన్నట్లు వార్తలొస్తున్నాయి. యెమెన్ రాజధాని సనాలో కూడా అమెరికా వైమానిక దాడులు జరిపిందని, ఈ దాడుల్లో ఎనిమిది మంది మరణించారని హౌతీలు తెలిపారు.

వీసా అక్రమాలపై అమెరికా కన్నెర్ర



భారత దేశ అభ్యర్థుల బ్లాక్ లిస్టింగ్.. మిత్ర దేశాలకూ వివరాలు పంపేచాన్స్

» విద్యార్థులు, పర్యాటక వీసాలపై డేగకన్ను

» ఇప్పటికే 2 వేల మందికి అగ్రరాజ్యం షాక్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28: వీసా అక్రమాలపై అమెరికా కన్నెర్ర చేసింది. ముఖ్యంగా భారత్‌కు చెందిన దరఖాస్తు దారులు మోసాలకు పాల్పడడంపై విచారణ జరుపుతున్న అగ్రరాజ్యం.. దీనిని మరింత వేగవంతం చేయడంతోపాటు లోతుగా కూడా విచారించనుంది. ఈ క్రమంలో విద్యార్థుల వీసాలతోపాటు పర్యాటకుల వీసాలపైనా డేగకన్ను సారించింది. అక్రమాలకు పాల్పడిన అభ్యర్థులను బ్లాక్ లిస్టులో పెట్టడంతోపాటు.. వారి వివరాలను తన మిత్ర దేశాలైన బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియా సహా ఇతర దేశాలతో పంచుకోనుంది. తద్వారా ఆయా దేశాలు కూడా వీరికి వీసాలు ఇవ్వకుండా, వారిని బ్లాక్‌లిస్టులో పెట్టేలా చర్యలు తీసుకోనుంది. వీసాల విషయంలో అక్రమాలకు పాల్పడినట్టు గుర్తించిన భారత్‌లోని అమెరికా దౌత్య కార్యాలయం 2 వేల మందికి గత నెలలో అపాయింట్‌మెంట్లను రద్దు చేసింది. ఈ క్రమంలో ట్రావెల్ ఏజెంట్లు సహా దరఖాస్తు దారులపై విచారణ చేపట్టింది. తాజాగా ఈ విచారణను మరింత విస్తరించింది. అమెరికా వీసా అపాయింట్‌మెంట్ వ్యవస్థతో ఆడుకున్న వారిని ఎట్టిపరిస్థితిలోనూ వదిలి పెట్టబోమని దౌత్యకార్యాలయ అధికారి ఒకరు హెచ్చరించారు. "ఇప్పటి వరకు విద్యార్థి వీసాల విషయంలోనే అక్రమ అపాయింట్‌మెంట్లపై చర్యలు తీసుకుంటున్నాం. అయితే, పర్యాటక వీసాల అపాయింట్‌మెంట్స్‌లోనూ అక్రమాలు జరిగాయని గుర్తించాం. వాటిపై కూడా చర్యలు తీసుకోనున్నాం" అని ఆ అధికారి తెలిపారు.

ముందస్తు తేదీలతో మోసం!

కరోనా అనంతరం.. దేశవ్యాప్తంగా అన్ని కాన్సులేట్స్‌లో వీసా దరఖాస్తులు కుప్పలు తెప్పలుగా పేరుకుపోయాయి. చెన్నైలోని కాన్సులేట్‌లో పర్యాటక వీసా(బీ-1/బీ-2) అపాయింట్‌మెంటు కోసం ప్రస్తుతం 440 రోజుల నిరీక్షణ కొనసాగుతోంది. 2023 అక్టోబరు-2024 సెప్టెంబరు మధ్య ఢిల్లీ దౌత్య కార్యాలయం సహా చెన్నై, హైదరాబాద్, ముంబై, కోల్‌కతా కాన్సులేట్స్ 13.75 లక్షల వీసాలను మంజూరు చేశాయి. వీటిలో 9 లక్షల వీసాలు కేవలం పర్యాటకానికి సంబంధించినవే కావడం విశేషం. ఇది సరికొత్త రికార్డు నమోదు చేసింది. కాగా.. డిమాండ్‌కు తగిన విధంగా వీసాలను మంజూరు చేయలేని పరిస్థితి ఏర్పడడంతో దీనిని అక్రమార్కులు తమకు అనుకూలంగా మార్చుకున్నారు. సమాంతర వ్యవస్థను ఏర్పాటు చేసుకున్న వీసా ఏజెంట్లు.. ఒక్కొక్కరి నుంచి రూ.60 వేల చొప్పున వసూలు చేసి ముందస్తు తేదీలతో కూడిన దరఖాస్తులతో అభ్యర్థులను మోసం చేశారు.

ఈ పిల్లల పరిస్థితేంటి?

మరోవైపు, అమెరికాలోని హెచ్-1బీ వీసా దారుల పిల్లలకు పెద్దకష్టమే వస్తోంది. హెచ్-1బీ వీసాలపై అగ్రరాజ్యంలో నివసిస్తున్నవారి పిల్లలకు 21 ఏళ్ల వయసు వస్తే.. వారిని మేజర్లుగా గుర్తిస్తారు. దీంతో ఇప్పటి వరకు తల్లిదండ్రులపై ఆధారపడి జీవిస్తున్న వారికి ఇచ్చిన 'హెచ్-4' వీసాలు చెల్లుబాటు కావు. ఈ నేపథ్యంలో వారు కొత్త చట్టపరమైన అవకాశాలను వెతుక్కోవడమో.. లేక దేశం విడిచి వెళ్లడమో చేయాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. అయితే.. 21 ఏళ్ల వయసు వచ్చిన తర్వాత కూడా రెండేళ్ల వరకు వారు అమెరికాలో ఉండేందుకు అవకాశం ఉందని, కానీ రూల్స్ మారుతుండటంతో అనిశ్చితి నెలకొందని అన్నారు.

ట్రంప్‌పై అమెరికా వర్సిటీల నిరసనాస్త్రం

విద్యా రంగం స్వేచ్ఛ విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రాజకీయ జోక్యానికి వ్యతిరేకంగా ఆ దేశంలోని యూనివర్సిటీలు ఏకం అవుతున్నాయి. ట్రంప్ ప్రభుత్వం నుంచి ఫెడరల్ పరిశోధన నిధుల నిలిపివేతకు గురైన హార్వర్డ్ యూనివర్సిటీకి బాసటగా నిలిచాయి. 2.2 బిలియన్ డాలర్ల నిధులను స్తంభింపజేయడానికి వ్యతిరేకంగా హార్వర్డ్ వర్సిటీ ఇప్పటికే ట్రంప్ సర్కార్‌పై దావా వేసిన విషయం తెలిసిందే. తమ ప్రభుత్వ విధానాలను విమర్శించిన లేదా వ్యతిరేకించిన యూనివర్సిటీలే టార్గెట్‌గా ట్రంప్ బెదిరింపులకు పాల్పడుతున్నారని, రాజకీయ జోక్యం చేసుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో వర్సిటీల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురవుతోంది. హార్వర్డ్ వేసిన దావా యూనివర్సిటీల్లో కదలిక తెచ్చింది. ట్రంప్ సర్కార్ ఎన్నడూలేని విధంగా పాల్పడుతున్న 'ప్రభుత్వ అతిక్రమణ'ను ఖండిస్తూ 150కి పైగా యూనివర్సిటీ ప్రెసిడెంట్లు తమ సంతకాలతో ఒక సంయుక్త లేఖను విడుదల చేశారు. ట్రంప్ నుంచి విద్యా రంగ స్వేచ్ఛ, సంస్థాగత స్వయంప్రతిపత్తిని ఉమ్మడిగా కాపాడుకుందామని పిలుపునిచ్చారు. ఫెడరల్ ఫండింగ్ ద్వారా యూనివర్సిటీల పాలసీలను ప్రభావితం చేయాలని ప్రభుత్వం యత్నిస్తోందని, ఇది ప్రజాస్వామ్యానికి పునాది అయిన లిబరల్ ఎడ్యుకేషన్ సూత్రాలకు ప్రత్యక్ష బెదిరింపు అని ఆందోళన వ్యక్తం చేశారు. నిర్మాణాత్మకమైన సంస్కరణకు యూనివర్సిటీలు సిద్ధంగానే ఉన్నాయని, అయితే రాజకీయ అజెండాకు అనుగుణంగా బలవంతం చేయకూడదని లేఖ స్పష్టం చేసింది. ఈ విధమైన వైఖరి విద్యాసంస్థల ప్రధాన విలువలను దెబ్బతీస్తాయని పేర్కొంది.

రష్యా మూడు రోజుల కాల్పుల విరమణ

» మే 8-10 మధ్య రెండో ప్రపంచ యుద్ధ విజయోత్సవాలు

» ఈ 3రోజులు ఉక్రెయిన్‌లో కాల్పుల విరమణకు పుతిన్ ఆదేశం



కీవ్, ఏప్రిల్ 28: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఆశ్చర్యకర రీతిలో ఉక్రెయిన్‌తో యుద్ధానికి తాత్కాలికంగా మూడు రోజుల కాల్పుల పాటించాలని తమ సైన్యాలను సోమవారం ఆదేశించారు. మే 8 నుంచి 10 మధ్య కాల్పుల విరమణ ఉంటుందని రష్యా అధ్యక్ష భవనం క్రెమ్లిన్ తెలిపింది. నాజీ జర్మనీపై రెండో ప్రపంచ యుద్ధంలో రష్యా సాధించిన విజయానికి గుర్తుగా మే ఎనిమిదో తేదీ (ఏడో తేదీ అర్ధరాత్రి) నుంచి మే 10 వరకూ కాల్పుల విరమణ కొనసాగుతుందని వెల్లడించింది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఆదేశాల మేరకు మే 9న విజయోత్సవ దినం (విక్టరీ డే) సందర్భంగా మానవత్వ కోణంలో శత్రువులపై పూర్తి స్థాయిలో కాల్పుల విరమణ పాటిస్తున్నామని పేర్కొంది. ఉక్రెయిన్‌తో శాంతి ఒప్పందానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్యవర్తిత్వం వహిస్తున్న నేపథ్యంలో రష్యా తాత్కాలికంగా కాల్పుల విరమణ ప్రకటించడం ఆసక్తికర పరిణామం. కానీ, ఉక్రెయిన్‌తో పూర్తిస్థాయిలో బేషరతుగా కాల్పుల విరమణకు పుతిన్ నిరాకరించారు. ఉక్రెయిన్‌తో శాంతి ఒప్పందం చేసుకోవాలంటే ఆ దేశానికి ఆయుధాల పంపిణీని, అవసరమైన నిధుల సమీకరణకు పాశ్చాత్య దేశాలు మద్దతు నిలిపేయాలని పుతిన్ మెలిక పెట్టారు. కాగా, ఉక్రెయిన్ కూడా పరస్పరం కాల్పుల విరమణ పాటిస్తుందని క్రెమ్లిన్ ఆశాభావం వ్యక్తంచేసింది. తద్వారా యుద్ధానికి చరమగీతం పాడేందుకు ఇరు దేశాల మధ్య ప్రత్యక్ష చర్చలకు ఇది ముందడుగు అవుతుందన్న రష్యా సంకేతాలిచ్చింది. 2022లో యుద్ధం మొదలైనప్పటి నుంచి బేషరతుగా పరస్పరం చర్చలకు సిద్ధమని ప్రకటించడం ఇదే ప్రథమం. కానీ, తమ భూభాగంలోని నాలుగు రీజియన్లను విలీనం చేసుకున్న పుతిన్‌తో ప్రత్యక్ష చర్చలు జరిపేది లేదని ఉక్రెయిన్ తేల్చి చెప్పింది.

పోలీసు భద్రతతో నీట్ ప్రశ్నపత్రాల రవాణా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28 : నీట్ పరీక్షలో ఎటువంటి అవకతవకలు చోటు చేసుకోకుండా కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటోంది. ఇందుకు కేంద్ర విద్యాశాఖ అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల కలెక్టర్లు, ఎస్పీలతో వరుసగా సమావేశాలు నిర్వహిస్తోంది. మే 4వ తేదీన ఈ పరీక్షను దేశ వ్యాప్తంగా 550 నగరాల్లోని 5000కు పైగా కేంద్రాల్లో నిర్వహించనున్నారు. గత ఏడాది ఈ పరీక్ష నిర్వహణపై పలు ఆరోపణలు వచ్చిన దృష్ట్యా ఈసారి ఎటువంటి లోపాలు తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు. నీట్ ప్రశ్నపత్రాల రవాణా, భద్రతకు అలాగే సమస్యల నివారణకు ఇప్పటికే ప్రతి జిల్లాలో ఏర్పాటు చేసిన సమన్వయ కమిటీలు పూర్తిస్థాయిలో పనిచేస్తున్నాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. పరీక్ష కేంద్రాల వద్ద జాతీయ పరీక్ష ఏజెన్సీ(ఎన్టీయే) నియమించే సిబ్బందితోపాటు ఆయా జిల్లాల పోలీసులు తనిఖీలు చేపడతారు. ప్రశ్నపత్రాలు, ఓఎంఆర్ షీట్ల వంటి ముఖ్యమైన వాటిని పూర్తిగా పోలీసు భద్రతతోనే రవాణా చేస్తారు. మోసాలకు పాల్పడకుండా కోచింగ్ సెంటర్లు, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లపై నిఘా ఉంచుతారు. అన్ని పరీక్ష కేంద్రాలను డ్యూటీ మేజిస్ట్రేట్‌లు తప్పనిసరిగా తనిఖీ చేయాలి. అలాగే జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు ఆ కేంద్రాల వద్ద ఏర్పాట్లను పరిశీలించాలి.

అశ్లీల చిత్రాలపై నిషేధం కోర్టు పరిధిలో ఉంటుందా?

» సుప్రీంకోర్టు సందేహం

» న్యాయస్థానం ఆదేశాలు ఇవ్వొచ్చు

» సొలిసిటర్ జనరల్ సమాధానం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28: న్యాయ వ్యవస్థ అధికారాల విషయం మరోమారు సుప్రీంకోర్టులో చర్చకు వచ్చింది. కోర్టులు పరిధులు దాటుతున్నాయంటూ విమర్శలు వస్తున్న నేపథ్యంలో కాబోయే ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ సోమవారం ఆ విషయాన్ని ప్రస్తావించారు. ఓటీటీ, సామాజిక మాధ్యమాల్లో అశ్లీల అంశాలను నిషేధించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "నిషేధాలు విధించడం మా పరిధిలోకి రాదు. కార్యనిర్వాహక వ్యవస్థ పరిధిలోకి వస్తుంది. కార్యనిర్వాహక వ్యవస్థ, శాసన వ్యవస్థల్లో జోక్యం చేసుకుంటున్నామని విమర్శలు వస్తున్న నేపథ్యంలో కోర్టులు విచారించగలవా?" అని ప్రశ్నించారు. న్యాయవాది విష్ణు శంకర్ జైన్ ఈ పిటిషన్ వేశారు. దీనిపై జస్టిస్ గవాయ్‌తో పాటు, జస్టిస్ ఆగస్టిన్ మాసిహ్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది.సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ దీన్ని ప్రభుత్వ వ్యతిరేక వ్యాజ్యంగా పరిగణించబోమని తెలిపారు. దీనిపై ఇక్కడే విచారణ జరపాలని కోరారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ కేంద్రానికి, కొన్ని ఓటీటీలు, సోషల్ మీడియా సంస్థలకు నోటీసులు ఇస్తామని తెలిపింది. ఓటీటీలకు సామాజిక బాధ్యత అవసరమని వ్యాఖ్యానించింది.

ఏసీబీకి చిక్కిన శామీర్‌పేట ఎస్సై

» నిందితుల ఫోన్లు తిరిగివ్వడానికి 25 వేల లంచం డిమాండ్

» అప్పటికే ఫిర్యాదుదారు నుంచి 2 లక్షలు వసూలు చేసిన ఎస్సై

మూడుచింతలపల్లి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఓ కేసులో ఇద్దరు అనుమానితుల నుంచి స్వాధీనం చేసుకున్న ఫోన్లు తిరిగి ఇవ్వడానికి లంచం తీసుకున్న శామీర్‌పేట ఎస్సై పరశురామ్‌నాయక్ ఏసీబీకి చిక్కాడు. అప్పటికే ఫిర్యాదుదారు నుంచి రూ.2 లక్షలు లంచం తీసుకున్న ఎస్సై.. అనుమానితుల నుంచీ రూ.22 వేలు లంచం దండుకున్నాడని ఏసీబీ అధికారులు తెలిపారు. కూకట్‌పల్లిలోని ఓ ఆయిల్ మిల్లులో చోరీ జరిగింది. నిందితులిద్దరూ శామీర్‌పేట్‌లో ఉంటున్నారని తెలుసుకున్న యజమాని.. ఎస్సై పరశురామ్ నాయక్‌ను ఆశ్రయించాడు. ఎస్సై నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా వారు ఆయిల్‌ను కొన్నామని చెప్పుకొచ్చారు. ఎస్సై యజమానిని పిలిపించి అడగ్గా ఆయిల్‌ను రికవరీ చేసి ఇవ్వాలని కోరాడు. దీనికి ఎస్సై రూ.2 లక్షలు డిమాండ్ చేశాడు. యజమాని దానికి అంగీకరించి కొన్నాళ్ల కిందట ఆ డబ్బు తీసుకొచ్చి.. ఎస్సై చెప్పినట్టే ఆయన కారులో పెట్టి వెళ్లిపోయాడు. మరోవైపు ఎస్సై ఇద్దరు నిందితుల నుంచి ముందే స్వాధీనం చేసుకున్న ఫోన్లను తిరిగి ఇవ్వడానికి రూ.25 వేలు డిమాండ్ చేశాడు. వారిద్దరూ బేరమాడి రూ.22 వేలకు ఒప్పించారు. ఆపై ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వారి సూచన మేరకు సోమవారం ఎస్సైకు రూ.22 వేలు ఇవ్వడానికి వెళ్లారు. ఎస్సై చెప్పినట్లు టేబుల్ వద్ద ఉన్న డస్ట్‌బిన్‌లో వేసి బయటకు రాగానే ఏసీబీ అధికారులు దాడి చేశారు. ఆ సొమ్మును స్వాధీనం చేసుకుని ఎస్సైను అదుపులోకి తీసుకున్నారు.

తలపై రాయితో కొట్టి వ్యక్తి హత్య

» మృతదేహాన్ని మూటగట్టి అపార్ట్‌మెంట్ లిఫ్ట్‌లోకి

» హిమాయత్‌నగర్‌లో అర్ధరాత్రి దుండగుల ఘోరం

కవాడిగూడ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): హిమాయత్‌నగర్‌లో ఓ వ్యక్తి దారుణహత్యకు గురయ్యాడు. మృతదేహంపై ఉన్న గాయాలను బట్టిచూస్తే.. తలపై బండరాయితో బలంగా కొట్టి అతడిని చంపినట్లు అనిపిస్తోంది. మృతదేహం బట్టలేమీ లేకుండా నగ్నంగా పడి ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది. హిమాయత్‌నగర్ వీధి నంబరు-8లోని 'పీ ప్లాజా' అపార్ట్‌మెంట్‌లోని లిఫ్ట్‌లో మృతదేహం లభ్యమైంది. మృతుడు ఎవరు? అనేది ఇంకా నిర్ధారణ కాలేదు. మృతుడి వయసు 32 ఏళ్లు ఉంటుందని భావిస్తున్నారు. మద్యం లేదా గంజాయి మత్తులో దుండగులు, ఆ వ్యక్తిపై లైంగికదాడికి పాల్పడి చంపినట్లుగా అనుమానిస్తున్నారు. సోమవారం ఉదయం ఊడ్చేందుకు వచ్చిన సిబ్బంది.. నేలపై రక్తపు మరకలను చూసి, వస్త్రాలు చెల్లాచెదరుగా పడి ఉండటాన్ని గమనించి ఆందోళనకు గురై పోలీసులకు సమాచారమిచ్చారు. వారొచ్చి పంజాబ్ నేషనల్ బ్యాంకు పక్కనే ఉన్న లిఫ్ట్‌లో నగ్నస్థితిలో ఉన్న వ్యక్తి మృతదేహాన్ని కనుగొన్నారు. కాగా ఆదివారం రాత్రి పంజాబ్ నేషనల్ బ్యాంకు షట్టర్ వద్ద వ్యక్తి నిద్రపోతుంటే, అర్ధరాత్రి దాటాక కొందరు గుర్తు తెలియని వ్యక్తులొచ్చి అతడిని నిద్రలేపి.. పక్కవీధిలోకి తీసుకెళ్లి గొడవ పెట్టుకున్నారని స్థానికుల్లో చర్చ నడుస్తోంది. ఈ క్రమంలో అతడి బట్టలు ఊడదీసి లైంగిక దాడికి పాల్పడినట్లుగా చెప్పుకొంటున్నారు. ఈ ఘటన ఆదివారం అర్ధరాత్రి రెండు, మూడు గంటల మధ్య జరిగినట్లు సమాచారం.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

» సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలంలో ఘటన

పెన్‌పహాడ్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం మీక్యాతండాలో అప్పుల బాధతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. అంగోతు నాగు (30) తనకున్న 2.20 ఎకరాల్లో వరి సాగుచేశాడు. సాగు కోసం చేసిన 2 లక్షల 20 వేల రూపాయల అప్పు తీర్చలేననే మనస్తాపంతో ఈ నెల 21వ తేదీన ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుల మందు తాగాడు. విషయం తెలియడంతో తల్లి మాజా అతడిని సూర్యాపేటలోని ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి నాగు మృతి చెందాడు. అతడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. అతడి భార్య లలిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గోపికృష్ణ తెలిపారు.

అది విస్కీ బాటిళ్ల మీటింగ్!

» అందుకే మహిళలు ఎక్కువగా రాలేదు

» బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ అట్టర్ ఫ్లాప్

» టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ ధ్వజం

హైదరాబాద్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): "బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ అట్టర్ ఫ్లాప్ అయింది. అది విస్కీ బాటిళ్ల మీటింగ్. ఆ సభలో జనం కంటే విస్కీ బాటిళ్లే ఎక్కువగా కనిపించాయి. అందుకే ఆ సభకు మహిళలు పెద్దగా రాలేదు" అని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్యానించారు. తెలంగాణకు మొదటి.. చివరి విలన్ కేసీఆరేనని స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలన, కాంగ్రెస్ ప్రభుత్వ 15 నెలల పాలనపైన చర్చకు సిద్ధమేనా? అని సవాల్ విసిరారు. దేశం కోసం ఆస్తులు, ప్రాణాలను త్యాగం చేసిన గాంధీ కుటుంబాన్ని పట్టుకుని నకిలీ గాంధీలంటూ కేసీఆర్ చేసిన వ్యాఖ్యలకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. "దొంగ పాస్ పోర్టుల బ్రోకరైన కేసీఆర్‌కు గాంధీ కుటుంబాన్ని విమర్శించే స్థాయి లేదు. కాంగ్రెస్ భిక్షతో ఆయన సీఎం అయ్యారు. ఆయన కుటుంబం రూ. లక్షల కోట్లకు పడగలెత్తింది. తిన్నింటి వాసాలు లెక్క పెట్టడం కేసీఆర్‌కు వెన్నతో పెట్టిన విద్య" అని మండిపడ్డారు. బీజేపీపై నెమలి పింఛంతో కొట్టినట్లుగా కేసీఆర్ మాట్లాడారని, ఆ రెండు పార్టీల మధ్య మ్యాచ్ ఫిక్సింగ్‌కు ఇదే నిదర్శనమన్నారు. కేటీఆర్, హరీశ్‌రావు, కవిత ఆడుతున్న మూడు ముక్కలాటతో కేసీఆర్‌కు మతి భ్రమించిందని, కుటుంబంలో కొట్లాటతో వేగలేకనే రజతోత్సవ సభ పేరిట హంగామా చేశారని దుయ్యబట్టారు. తెలంగాణ రాజకీయాల్లో కేసీఆర్ శకం ముగిసిందని, తెలంగాణ ప్రజలు ఎప్పటికీ కేసీఆర్ ను క్షమించరని వ్యాఖ్యానించారు. కాగా, పార్టీలో ఉన్నవాళ్లు కూడా వెళ్లిపోతారన్న భయంతోనే కేసీఆర్ వరంగల్‌లో మీటింగ్ పెట్టారని, అది డ్యామేజ్ కంట్రోల్ మీటింగ్ అని సీనియర్ నేత వి.హన్మంతరావు అన్నారు. కాంగ్రెస్ తెలంగాణ ఇవ్వకుంటే నాంపల్లి దర్గా దగ్గర కేసీఆర్ కుటుంబం అడుక్కునే పరిస్థితి ఉండేదన్నారు.

నోరుందని అడ్డగోలుగా మాట్లాడొద్దు

తెలంగాణను అప్పులపాలు చేసింది మీరే.. మీ పాలనలోనే కాళేశ్వరం.. కూలేశ్వరమైంది

» కేసీఆర్‌పై మంత్రి ఉత్తమ్ ధ్వజం

» సోనియా లేకపోతే తెలంగాణ వచ్చేదా ?

» అది నోరా... మోరీనా: మంత్రి కోమటిరెడ్డి

» మా పథకాలను చూసి దుఃఖం వస్తోందా?

» కేసీఆర్‌పై పొంగులేటి వ్యంగాస్త్రాలు

» వంద మంది కేసీఆర్‌లున్నా రాష్ట్రం వచ్చేది కాదు: పొన్నం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

"కేసీఆర్.. నోరుందని అడ్డగోలుగా మాట్లాడొద్దు.. పదేళ్ల మీ పాలనలో రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి దివాళా తీయించారు. నీటిపారుదల ప్రాజెక్టులన్నీ సర్వనాశనం చేశారు. ఈ రాష్ట్రాన్ని, ప్రజల్ని తాకట్టు పెట్టి తెచ్చిన అప్పులతో మీరు కట్టిన కాళేశ్వరం... మీ హయాంలోనే కూలేశ్వరమైంది. అవినీతి, కమీషన్ల కక్కుర్తి, అసమర్థతే కాళేశ్వరం కూలడానికి కారణమనడంలో సందేహం లేదు. రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి.. పెద్దపెద్ద మాటలు మాట్లాడటం విడ్డూరం" అని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ధ్వజమెత్తారు. నల్లగొండలో మంత్రి కోమటిరెడ్డితో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన తర్వాత ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో రూ.1.81లక్షల కోట్లను నీటిపారుదలపై ఖర్చు చేసి ఒక్క ఎకరాకూ నీరివ్వలేదని దుయ్యబట్టారు. కృష్ణా జలాల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 811 టీఎంసీల నీటి కేటాయింపులుంటే.. విభజన తర్వాత తెలంగాణకు 299 టీఎంసీలు చాలంటూ సంతకం చేసింది కేసీఆరేనని దుయ్యబట్టారు. తాము అధికారంలోకి వచ్చాక ఈ ఒప్పందాన్ని సవాల్ చేస్తూ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించామని తెలిపారు. పేదలకు ఉపయోగపడాలనే సంకల్పంతో రాష్ట్రంలో 3 కోట్ల మంది లబ్ధిదారులకు సన్నబియ్యాన్ని అందిస్తున్నట్లు వెల్లడించారు. నాలుగేళ్లలో రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. సోనియాగాంధీయే లేకపోతే తెలంగాణ ఏర్పాటయ్యేదా? కేసీఆర్ నీది నోరా... డ్రైనేజీ మోరీనా? అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ధ్వజమెత్తారు. 14 మంది కుటుంబ సభ్యులతో సహా ఢిల్లీ వెళ్లి సోనియాగాంధీ కాళ్లు మొక్కింది మర్చిపోయి.. కాంగ్రెస్ పార్టీనే తెలంగాణకు విలన్ అని మాట్లాడడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. తాను, ఉత్తమ్, రాజగోపాల్‌రెడ్డి, రఘువీర్‌రెడ్డి తలుచుకుంటే వారంలోనే వరంగల్ కంటే నాలుగు రెట్ల పెద్ద సభను నిర్వహిస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి బీఆర్‌ఎస్ నేతల కడుపు మండుతోందని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఎద్దేవా చేశారు. తెలంగాణ కోసం బీఆర్‌ఎస్ మాత్రమే ఉద్యమం చేయలేదని, సకల జనులతో పాటు కాంగ్రెస్ ఎంపీలుగా తాముా ముందుండి పోరాడామని గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ హయాంలో మంత్రులుగా పనిచేసిన వారికి కనీసం కేసీఆర్ వద్ద మాట్లాడే సత్తా కూడా లేదని దుయ్యబట్టారు. మంత్రులు ఉత్తమ్, వెంకట్‌రెడ్డి...సీఎం స్థాయి వ్యక్తులని, అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్నారని కొనియాడారు.

చింతమడకలో ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం

'కేసీఆర్ సొంత గ్రామమైన చింతమడకలో డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇస్తామన్న అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం.. ఉన్న ఇళ్లను పడగొట్టింది. ఇప్పుడు ఆ గ్రామంలో మొండిగోడలు మిగిలాయి. వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తాం' అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా శాఖారంలో మంత్రి మాట్లాడారు. తమ పాలనలో భూ సమస్యల పరిష్కారం కోసం తెచ్చిన భూ భారతి చట్టం, పేదలకు సన్న బియ్యం పంపిణీ, 200యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు పథకం, పేదలకు రూ.10లక్షల దాకా ఆరోగ్యశ్రీ... ఇవన్నీ చూసి కేసీఆర్‌కు దుఃఖం వస్తున్నట్టుందని ఎద్దేవా చేశారు. వంద మంది కేసీఆర్‌లు వచ్చినా తెలంగాణ వచ్చేది కాదని, సోనియాగాంధీ దయాగుణం వల్లే అది సాధ్యమైందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. హనుమకొండ జిల్లాలోని ముల్కనూర్‌లో సోనియాగాంధీ చిత్రపటానికి మంత్రి పొన్నం క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణకు కాంగ్రెస్సే విలన్ అనే మాటలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ హయాంలో పాలమూరు ప్రాజెక్టు 80శాతం పూర్తయిందని కేసీఆర్ ప్రగల్భాలు పలికారని, కనీసం 20శాతం పూర్తయిందని నిరూపించినా.. తన పదవికి రాజీనామా చేస్తానని ఎంపీ మల్లు రవి పేర్కొన్నారు. ఢిల్లీలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అబద్ధాల కోరు, నియంత.. కేసీఆర్ అని దుయ్యబట్టారు.

కేటీఆర్‌పై కేసును కొట్టివేసిన హైకోర్టు

చేసిన వ్యాఖ్యలకు, పెట్టిన సెక్షన్లకు పొంతన లేదని వ్యాఖ్య


హైదరాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తప్పుడు ఆరోపణలు చేశారంటూ మాజీ మంత్రి కేటీఆర్‌పై నమోదైన కేసును సోమవారం హైకోర్టు కొట్టివేసింది. లోక్‌సభ ఎన్నికల ఖర్చు కోసం కాంట్రాక్టర్లు, బిల్డర్ల నుంచి రూ.2,500 కోట్లు వసూలు చేసిన రేవంత్‌రెడ్డి వాటిని ఢిల్లీలోని కాంగ్రెస్ అధిష్ఠానానికి పంపించారని కేటీఆర్ ఆరోపించారు. అవమానించడం, విద్వేషాలు రెచ్చగొట్టే దురుద్దేశంతో ఇలాంటి వ్యాఖ్యలు చేశారని కాంగ్రెస్ నాయకుడు బత్తిని శ్రీనివాసరావు బంజారాహిల్స్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ కేటీఆర్ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. విచారణ చేపట్టిన జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం.. చేసిన విమర్శలకు పెట్టిన సెక్షన్లకు పొంతనేలదని పేర్కొంటూ కేసును కొట్టేసింది.

జిమ్‌లో కేటీఆర్‌కు గాయం

హైదరాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జిమ్‌లో వ్యాయామం చేస్తుండగా గాయపడ్డారు. తన వెన్నెముకకు దెబ్బ తగిలిందని సోమవారం ఎక్స్ వేదికగా ఆయన తెలిపారు. కొన్ని రోజుల పాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారని చెప్పారు. కాగా, కేటీఆర్ త్వరగా కోలుకోవాలని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆకాంక్షించారు.

సర్కారు అరాచకాలను ఎండగడతాం

» మళ్లీ బీఆర్‌ఎస్‌దే అధికారమని ప్రజా సందేశం: కేటీఆర్



హైదరాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు ప్రజలు లక్షల సంఖ్యలో హాజరై కేసీఆర్ నాయకత్వంపై అచంచల విశ్వాసాన్ని ప్రకటించారని, వారి నమ్మకాన్ని నిలబెట్టేలా కాంగ్రెస్ ప్రభుత్వ అరాచకాలను మరింత ఎండగడతామని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. వరంగల్ సభను విజయవంతం చేసిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ ముఖ్య నాయకులు, శ్రేణులతో సోమవారం హైదరాబాద్ నుంచి కేటీఆర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. బీఆర్‌ఎస్ ప్రజా బలాన్ని ఈ సభ నిరూపించిందని, దేశ రాజకీయ చరిత్రలో అతిపెద్ద బహిరంగ సభల్లో ఒకటిగా ఈ రజతోత్సవ సభ నిలుస్తుందని అన్నారు. తెలంగాణలో మళ్లీ అధికారం చేపట్టేది బీఆర్‌ఎస్సేనని లక్షలాది మంది సందేశమిచ్చారని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ప్రజా పోరాటాలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కాగా, మాజీ నక్సలైట్‌గా ప్రజా సమస్యలపై పోరాడిన మంత్రి సీతక్క.. రేవంత్‌రెడ్డి చెబితే మాజీ సీఎం కేసీఆర్‌ను ఎలా తిడతారని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ ప్రశ్నించారు.

రెండు గంటలకు ముందు పరీక్ష రాయకుండా అడ్డుకోవడం చెల్లదు

» అది కఠినమైన చర్య.. హైకోర్టు వ్యాఖ్యలు

హైదరాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పరీక్షల సమయానికి కేవలం రెండు గంట ముందు విద్యార్థిని రాయకుండా సస్పెండ్ చేయడం కఠినమైన చర్య అని హైకోర్టు పేర్కొంది. పరీక్షలు రాయకుండా రెండు గంటల ముందు సస్పెండ్ చేశారని పేర్కొంటూ జడ్చర్లలోని ఎస్‌వీకేఎం నర్సీ మాంజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్‌కు చెందిన న్యాయశాస్త్రం చివరి సంవత్సరం విద్యార్థి ఆనంద్‌రాజ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది ఎస్ గౌతమ్ వాదిస్తూ.. సమాధానం ఇచ్చే అవకాశం ఇవ్వకుండా ఏకపక్షంగా సస్పెండ్ చేయడం వల్ల విద్యాసంవత్సరం కోల్పోతారని పేర్కొన్నారు. ఇటీవల ఆ సంస్థలో కలుషిత ఆహారం కారణంగా 170 మంది విద్యార్థులు వాంతులు, కడుపునొప్పితో ఆసుపత్రి పాలయ్యారని తెలిపారు. దీనిపై సోషల్ మీడియా ద్వారా ప్రశ్నించినందుకు ఇలాంటి కఠిన చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. విద్యార్థిని పరీక్షలు రాయకుండా సస్పెండ్ చేసే అధికారం స్వయంగా కాలేజీకి ఉంటుందా? అని ప్రశ్నించింది. దీనిపై విచారణ చేపడతామని పేర్కొంది. మిగతా పరీక్షలకు అనుమతించాలని ఆదేశించింది. తదుపరి విచారణను మే 2కు వాయిదా వేసింది.

కిశోర బాలికలకు పల్లీ, చిరుధాన్యాల పట్టీ

- ఆసిఫాబాద్, భూపాలపల్లి, భద్రాద్రి జిల్లాల్లో పైలెట్ ప్రాజెక్టు : మంత్రి సీతక్క



హైదరాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా అయ్యే ఆహార నాణ్యతను మెరుగుపరచడం, మరింత రుచికరంగా మార్చేందుకు ఎన్ఐఎన్, యునిసెఫ్ నిపుణులతో కమిటీ వేశామని, వారి నివేదిక ఆధారంగా ఆహారంలో మార్పులు చేస్తామని మంత్రి సీతక్క తెలిపారు. మహిళాభివృద్ధి శిశు సంక్షేమశాఖ 2025-26 కార్యాచరణ ప్రణాళికపై సోమవారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో చర్చించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా 14-18 ఏళ్లలోపు కిశోర బాలికలకు పల్లీ, చిరుధాన్యాల పట్టీలు అందిస్తామన్నారు. పైలెట్ ప్రాజెక్టులో భాగంగా కుమరం భీం ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అమలు చేస్తామన్నారు. కిశోర బాలికల్లో స్వయం సహాయక బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది నిర్దేశించుకున్న లక్ష్యాలను పూర్తి చేసేలా పని చేయాలని అధికారులను ఆదేశించారు.

ఎంసీహెచ్చార్డీ వైస్ చైర్మన్‌గా శాంతికుమారి



ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పదవి నుంచి రిటైర్ అవుతున్న శాంతికుమారిని.. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం (ఎంసీహెచ్చార్డీ) వైస్ చైర్మన్‌గా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శి ఎం.రఘునందన్‌రావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎంసీహెచ్చార్డీ వైస్ చైర్మన్‌తోపాటు డైరెక్టర్ జనరల్ (డీజీ)గా అదనపు బాధ్యతలను కూడా ఆమెకు అప్పగించారు. శాంతికుమారి ఈ నెల 30న పదవీ విరమణ చేశాక ఈ బాధ్యతలను చేపడతారు. ఇప్పటివరకు ఎంసీహెచ్చార్డీ డీజీగా ఉన్న శశాంక్ గోయల్ సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ) వైస్ చైర్మన్‌గా బదిలీ అయిన నేపథ్యంలో.. ఆ బాధ్యతలను శాంతికుమారికి అప్పగించారు.

ఈఆర్‌సీ సభ్యునిగా కంచర్ల రఘు

- మరో మెంబర్‌గా చెరుకూరి శ్రీనివాసరావు

హైదరాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విద్యుత్ సంయుక్త కార్యాచరణ కమిటీ (జేఏసీ) చైర్మన్ కంచర్ల రఘుకు ప్రభుత్వం కీలక బాధ్యతలు కట్టబెట్టింది. ఆయనను విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్‌సీ) సభ్యుని (టెక్నికల్)గా నియమించింది. ఈ మేరకు సోమవారం ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీ చేశారు. రఘు ఈ పదవిలో ఐదేళ్లపాటు లేదా 65 ఏళ్లు నిండే దాకా ఏదీ ముందైతే... అప్పటిదాకా ఉండనున్నారు. రఘుతో పాటు మరో సభ్యునిగా (ఫైనాన్స్)గా చెరుకూరి శ్రీనివాసరావును నియమించారు. దక్షిణ డిస్కమ్‌లో డైరెక్టర్‌గా చేరిన శ్రీనివాసరావు... కాలక్రమంలో ట్రాన్స్‌కోలో జేఎండీగా చాలా కాలం పాటు పనిచేశారు. రఘు 1990లో అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ)గా కెరీర్‌ను ఆయన ప్రారంభించారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత పదేళ్లకాలంలో విద్యుత్ రంగంలో నష్టాలు చేసే విద్యుత్ కొనుగోలు ఒప్పందాల(పీపీఏ)కు వ్యతిరేకంగా ఉద్యమించారు.

పారదర్శకంగా మైన్స్ లీజులు

- వచ్చే నెల 12 నుంచి 16 వరకు టెండర్లు
- తాండూరు అవగాహనా సదస్సులో భూగర్భ గనులశాఖ డీడీ గోవిందరాజ్

తాండూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మైనింగ్ లీజులు ఆన్‌లైన్‌లో పారదర్శకంగా నిర్వహిస్తామని రాష్ట్ర భూగర్భ గనులశాఖ డిప్యూటీ డైరెక్టర్ గోవిందరాజ్ చెప్పారు. భూగర్భ గనులశాఖ ఆధ్వర్యంలో వికారాబాద్ జిల్లా తాండూరులోని స్టోన్ భవనంలో సోమవారం క్వారీ లీజ్ దారులు, ట్రేడర్లకు నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 12వ తేదీ నుంచి 16వ తేదీ వరకూ ఆన్‌లైన్‌లో టెండర్లను ఆహ్వానిస్తామని చెప్పారు. టెండర్ల ప్రక్రియ వెరిఫికేషన్ కోసం రూ.10 వేలు, పాస్‌పోర్ట్ కోసం రూ.లక్ష చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆన్‌లైన్‌లో 25 బ్లాకల వివరాలు వస్తాయన్నారు. భూగర్భ గనులశాఖ తాండూరు ఏడీ సత్యనారాయణ మాట్లాడుతూ తాండూరు సబ్ డివిజన్ పరిధిలో నాలుగు రకాల మైనింగ్ బ్లాక్‌లు ఉన్నాయని చెప్పారు.

మిధాని సీఎండీగా బాధ్యతలు స్వీకరించిన నారాయణమూర్తి



చంపాపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కంచన్‌బాగ్‌లోని మిశ్ర ధాతు నిగమ్(మిధాని) చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ)గా డాక్టర్ ఎస్‌వీఎస్ నారాయణమూర్తి సోమవారం బాధ్యతలు చేపట్టారు. విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో మెటలర్జికల్ ఇంజనీరింగ్‌లో నారాయణమూర్తి బీఈ పూర్తిచేశారు. బెంగళూరులోని ఐఐఎస్సీలో ఎంఈ చదివారు. ఐఐటీ-బాంబేలో పీహెచ్‌డీ పట్టా పొందారు. తిరువనంతపురంలోని విక్రమ్ సారాబాయ్ అంతరిక్ష కేంద్రంలో 1993లో ఆయన చేరారు. అల్ట్రా హై స్ట్రెంథ్ స్టీల్స్, టైటానియం మిశ్రమ లోహాలు, సూపర్ అల్లాయ్‌లు, అల్యూమినియం మిశ్రమ లోహాల అభివృద్ధిపై విస్తృతంగా పనిచేశారు.

లోకాయుక్త, ఉప లోకాయుక్త ప్రమాణ స్వీకారం

హైదరాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : లోకాయుక్తగా జస్టిస్ ఏ. రాజశేఖర్ రెడ్డి, ఉప లోకాయుక్తగా జస్టిస్ బీఎస్ జగ్జీవన్ కుమార్ ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సోమవారం ఉదయం వీరితో ప్రమాణ స్వీకారం చేయించారు. రాజ్‌భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు కె. కేశవరావు, షబ్బీర్ అలీ, వేం నరేందర్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

మే ఒకటి నుంచి వేసవి సెలవులు

రాష్ట్రంలోని 30 తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం వేసవి సెలవులు ప్రకటించింది. తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలో సోమవారం నుంచే సెలవులిచ్చారు. ఉస్మానియా విద్యార్థులకు మే 1 నుంచి 30వరకు, మహాత్మాగాంధీ, కాకతీయ విశ్వవిద్యాలయాలకు మే 31వరకు, శాతవాహన యూనివర్సిటీ విద్యార్థులకు జూన్ ఒకటో తేదీ వరకు సెలవులు ఖరారు చేశారు. పాలమూరు యూనివర్సిటీకి మే 2 నుంచి జూన్ 1 వరకు సవరించారు. కొన్ని విశ్వవిద్యాలయాల్లో సెమిస్టర్ పరీక్షలు జరుగుతుండటంతో షెడ్యూల్ ప్రకారం విద్యార్థులు హాజరుకావాల్సి ఉంటుంది. పరీక్షల సమయంలో విద్యార్థులకు వసతులు కల్పించడంతో పాటు ఆయా సబ్జెక్టుల అధ్యాపకులను కూడా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోనున్నారు.


నేడో రేపో సమాచార కమిషనర్ల నియామకం

- ఇప్పటికే గవర్నర్ వద్దకు చేరిన ఫైలు

హైదరాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సమాచార కమిషన్‌లో ఒక చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్‌తో పాటు మరో ఏడుగురు కమిషనర్లను నియమించేందుకు సర్వం సిద్ధమైంది. ఇందుకు సంబంధించిన పేర్లతో కూడిన దస్త్రం ఇప్పటికే గవర్నర్ వద్దకు చేరింది. గవర్నర్ ఆమోదం తర్వాత నేడో రేపో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉంది. చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్‌గా ఐఎఫ్ఎస్ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి పేరు ఖరారైంది. సమాచార కమిషనర్లుగా జర్నలిస్టు పీవీ.శ్రీనివాస్‌రావు, సీఎం సీపీఆర్వో అయోధ్యరెడ్డి, కప్పర హరిప్రసాద్, పీఎల్ఎన్ ప్రసాద్, రాములు, వైష్ణవి, పర్వీన్ మొహిసిన్‌ల పేర్లు ఉన్నాయి.

తెలుగు ప్రావీణ్యం తప్పనిసరి

(మొదటిపేజీ తరువాయి)



ప్రావీణ్యం కలిగి ఉండాలన్న నిబంధనను చేర్చామని తెలంగాణ ప్రభుత్వం సుప్రీం కోర్టుకు స్పష్టం చేసింది. జూన్ 2023లో అమల్లోకి వచ్చిన నియమాల ప్రకారం తెలంగాణ జ్యుడిషియల్ సర్వీసెస్ పరీక్షలు రాసే అభ్యర్థులకు తప్పనిసరిగా తెలుగులో ప్రావీణ్యం ఉండాలి. అయితే తన విద్యాభ్యాసం మొత్తం ఉర్దూ మీడియంలోనే జరిగిందని, కావున నియామకాల్లో ఉర్దూలో ప్రావీణ్యం నిబంధనను కూడా చేర్చాలని పిటిషనర్ కోరారు. ఉర్దూ భాష తెలంగాణ సంస్కృతిలో భాగమని, తెలంగాణ అధికార భాషల చట్టం-1966 ప్రకారం ఉర్దూ రెండో అధికార భాషగా గుర్తింపు పొందిందని తెలిపారు. పిటిషనర్ వాదనతో విభేదించిన సుప్రీం కోర్టు.. హైకోర్టు నిర్ణయాన్ని సమర్థిస్తూ పిటిషన్‌ను ముగిస్తున్నట్టు తెలిపింది.

కాళేశ్వరం ఎందుకు కూలిపోయింది..?

లోపాలపై నేడు ఉత్తమ్ పవర్‌పాయింట్ ప్రజంటేషన్

హైదరాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో వైఫల్యాలను రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఎన్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఎత్తి చూపనున్నారు. ఈ మేరకు మంగళవారం ఉదయం 11 గంటలకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కాళేశ్వరం పథకంలోని లోపాలను వివరించనున్నారు. ఈ ప్రాజెక్టుపై విపక్ష బీఆర్ఎస్ సమర్థనలను ఎండగడుతూ అంశాల వారీగా ప్రజలకు వాస్తవాలను వెల్లడిస్తారు. దీంతోపాటు కాళేశ్వరం ప్రాజెక్టుపై తదుపరి ప్రభుత్వ కార్యాచరణ ఎలా ఉంటుందన్న విషయమై ప్రకటించనున్నారు. 2023 అక్టోబరు 21న మేడిగడ్డ బ్యారేజీలోని ఏడో బ్లాక్ కుంగిపోయింది. ఆ తర్వాత అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో భారీగా సీపేజీలు బయటపడ్డాయి. బ్యారేజీల నిర్మాణంలో లోపాలు, వాటి పరిష్కారాలపై గతేడాది (2024) మార్చిలో జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ (ఎన్‌డీఎస్ఏ) నియమించిన నిపుణుల కమిటీ.. సుదీర్ఘ విరామం తర్వాత ఇటీవలే నివేదిక సమర్పించింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై సమగ్ర పరిశోధనలు జరిపి, వాటి పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని ఎన్‌డీఎస్ఏ తేల్చి చెప్పింది. ఈ మూడు బ్యారేజీల నిర్మాణంలో వైఫల్యాలు ఉన్నాయని పేర్కొంది. బ్యారేజీల డిజైన్‌ల రూపకల్పనలో లోపాలు, తగిన పరిశోధనలు చేపట్టకుండానే అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణ స్థలాలు మార్చారని వెల్లడించింది. 2019లో బ్యారేజీల నిర్మాణం పూర్తయితే.. మేడిగడ్డ బ్యారేజీ ఏడో పిల్లర్ (2023 అక్టోబర్ 21) కుంగే వరకూ దానిపై ఎటువంటి ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓ అండ్ ఎం) పనులు చేయలేదని ఎన్‌డీఎస్ఏ స్పష్టం చేసింది. ఈ బ్యారేజీల నిర్మాణానికి వినియోగించే సిమెంట్, స్టీల్, ఇతరత్రా సామగ్రిని పరీక్షించకుండానే వినియోగించారని ఆ నివేదిక సారాంశం.

ఖజానా లూటీ.. కేసీఆర్ పనే..

(మొదటిపేజీ తరువాయి)

స్కీములు.. షోపుటప్ పథకాలు నా వల్ల కాదు. ఒక పథకాన్ని ప్రారంభిస్తే అర్హులకు అందే వరకూ పనిచేస్తా" అని స్పష్టం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాలు ఏ రాష్ట్రంలోనూ అమల్లో లేవని, ఎన్నికలకు ఆరు నెలల ముందు వీటిపైనే చర్చ జరుగుతుందని చెప్పారు. తాను కక్ష సాధింపు చర్యలకు దిగబోనని స్పష్టం చేశారు. కేటీఆర్ మీద కేసు.. ఫోన్ ట్యాపింగ్ తదితర కేసులన్నింటిపైనా విచారణ చట్ట పరిధిలోనే జరుగుతుందన్నారు. తాను చట్ట ప్రచారమే పని చేస్తానని, కేసీఆర్‌లాగా చట్టాన్ని అతిక్రమించి అరెస్టులు చేయించబోనని చెప్పారు. బీఆర్ఎస్‌కు పదేళ్లు అవకాశం ఇచ్చిన ప్రజలు.. తమకూ పదేళ్లు ఇస్తారని అన్నారు.

రెండో రోజే గుండె పగిలింది

ఎల్కతుర్తి బీఆర్ఎస్ సభలో కేసీఆర్ చేసిన ప్రసంగంలో పసే లేదని, ప్రసంగం యావత్తూ తన అక్కసును వెళ్లగక్కారని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. అభద్రతా భావంతో ఆయన చేసిన ప్రసంగంలో స్పష్టతే లేదన్నారు. తాను సీఎం అయిన రెండో రోజే కేసీఆర్ గుండె పగిలిందన్నారు. బీఆర్ఎస్ పార్టీని నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. "కేసీఆర్ సభకు ఆర్టీసీ బస్సులు ఎన్ని కావాలంటే అన్ని ఇచ్చాం. దీనివల్ల ఆర్టీసీకి ఆదాయం కూడా వచ్చింది. బస్సులు ఆపితే సభ ఆగిపోతుందనుకునే ఆలోచన వారిదే. బీఆర్ఎస్ హయాంలో ఖమ్మంలో రాహుల్ గాంధీ సభ జరిగితే.. వాళ్లు కనీసం బస్సులు కూడా ఇవ్వలేదు" అని తప్పుబట్టారు. కేసీఆర్ సభతో పోలిస్తే గజ్వేల్‌లో తాము నిర్వహించిన సభే హైలెట్ అన్నారు.

ఆ రోజు నేను చెప్పిందే.. కేసీఆరూ చెప్పాడు

అసెంబ్లీకి వస్తున్న కేటీఆర్, హరీశ్ రావు చిన్న పిల్లలని తాను చెప్పానని, అసెంబ్లీలో తాను ఏం చెప్పానో.. బీఆర్ఎస్ సభలో కేసీఆర్ కూడా అదే చెప్పాడని సీఎం అన్నారు. కేటీఆర్, హరీశ్ పిల్లగాళ్లంటున్న కేసీఆర్.. మరి తాను అసెంబ్లీకి రాకుండా వారిని ఎందుకు పంపుతున్నారని ప్రశ్నించారు.



మాజీ మంత్రి జానారెడ్డితో సమావేశమైన సీఎం రేవంత్, చిత్రంలో ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు

రాహుల్‌తో మంచి సంబంధాలే

ఏఐసీసీ అగ్ర నేత రాహుల్ గాంధీతో తనకు మంచి సంబంధాలే ఉన్నాయని, ఈ విషయంలో ఎవరినీ నమ్మించాల్సిన అవసరం తనకు లేదని సీఎం రేవంత్ పునరుద్ఘాటించారు. ప్రపంచంలోనే ఇందిరా గాంధీని మించిన యోధురాలు లేదని, ఒక దేశాన్ని ఓడించిన చరిత్ర ఆమెదని కొనియాడారు. ప్రధాని మోదీ, కేసీఆర్ తమ అవసరాలకు అనుగుణంగా మాటలు మారుస్తుంటారని, దేశానికి ఇందిరా గాంధీ వంటి ప్రధాని కావాలని అభిలషించారు. తనను నమ్ముకున్న వారిని తాను ఎన్నడూ మరిచిపోనని సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు. "అద్దంకి దయాకర్‌కు ఎమ్మెల్సీ ఇస్తానని చెప్పా. ఓపిగ్గా నన్నే నమ్ముకుని ఉన్నాడు. ఆయనకు ఎమ్మెల్సీ పదవి వచ్చింది. దయాకర్‌లాగా ఓపిగ్గా ఉంటే నాకూ బాధ్యత ఉంటుంది. అలా కాకుండా బయటికి వెళ్లి స్వీపింగ్ రిమార్కులు చేస్తే నాపైన భారం ఉండదు. చెల్లుకు చెల్లయిందని భావిస్తా" అంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇక, కొంతమంది అధికారుల విషయాలు తెలిసినా.. వారినే కొనసాగించాల్సి వస్తోందని, ప్రత్యామ్నాయం లేకపోవడంతో తప్పట్లేదని వ్యాఖ్యానించారు. కలెక్టర్లను మార్చుకునే వెసులుబాటు ఉందని, అందుకే మార్చుకుంటున్నామని చెప్పారు.

ఎమ్మెల్యేలు నియోజక వర్గాల్లోనే ఉండాలి

ఎమ్మెల్యే అయ్యాక మనోడు, మందోడు అనేది ఉండదని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. అయితే, "కొంతమంది ఎమ్మెల్యేలు హైదరాబాద్‌లోనే టైం పాస్ చేస్తున్నారు. అది సరికాదు. వారు నియోజక వర్గాల్లోనే ఉండి.. అవసరమైనప్పుడు మాత్రమే హైదరాబాద్‌కు రావాలి. వారు ప్రజల్లోకి వెళితేనే.. పథకాలూ ప్రజల్లోకి వెళతాయి" అని స్పష్టం చేశారు.

కగార్‌పై పార్టీ నిర్ణయం తర్వాతే ప్రభుత్వ ప్రకటన

కగార్ అంశంపై పార్టీ నిర్ణయం తీసుకున్న తర్వాతే ప్రభుత్వ విధానం ప్రకటిస్తామని సీఎం రేవంత్ వెల్లడించారు. దీనిపై జాతీయ స్థాయిలో చర్చ జరగాలన్నారు. మావోయిస్టుల అంశంపై మాజీ మంత్రి జానారెడ్డి, కె.కేశవరావుతో చర్చించామని, వారితో గతంలో శాంతి చర్చలు జరిపిన అనుభవం వీరిద్దరికీ ఉందని గుర్తు చేశారు. మావోయిస్టులతో శాంతి చర్చల కోసం కమిటీ ఏర్పాటు ప్రతిపాదనను అధిష్ఠానానికి పంపిస్తామని, పార్టీ ఏ నిర్ణయం తీసుకున్నా దానికి కట్టుబడి ఉంటామని తెలిపారు. ఈ వ్యవహారం మొత్తాన్ని జానారెడ్డి, కేకేలే చూసుకుంటారని చెప్పారు.

రైతులు, కూలీలకు అభివృద్ధి ఫలాలు అందాలి

- ఆహార భద్రత కల్పిస్తున్నది రైతులే
- కేరళలో రైతులు, కార్మికుల మహాసభలో భట్టి విక్రమార్క



హైదరాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : దేశ నిర్మాణంలో భాగస్వాములవుతోన్న రైతులు, రైతు కూలీల్లో ప్రతి ఒక్కరికీ అభివృద్ధి ఫలాలు అందాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆకాంక్షించారు. త్రివర్ణోత్సవం పేరిట కేరళలోని కోజికోడ్ జిల్లా కాంగ్రెస్ కమిటీ సోమవారం ఆ జిల్లా కేంద్రంలో నిర్వహించిన రైతులు, కార్మికుల మహాసభలో భట్టి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగకూడదని, ఏ ఒక్క కూలీ ఒంటరిగా మిగిలిపోకూడదని, అందరికీ అభివృద్ధి ఫలాలను అందించాల్సిన అవసరం ఉందని భట్టి అన్నారు. అధునాతన సాంకేతికత కారణంగా శ్రామికులు, కూలీలకు ఉపాధి మార్గాలు తగ్గిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి సందర్భంలో మేధస్సు, ఐక్యత, కారుణ్యంతో పాలకులు పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయం ఒక వృత్తి మాత్రమే కాదని, అది కోట్లాది ప్రజల జీవనాధారమని అన్నారు. ప్రస్తుతం రైతులే ఆహార భద్రత కల్పిస్తున్నారని, సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షిస్తున్నారని తెలిపారు. అపసవ్య రుతుపవనాలు, పెట్టుబడి వ్యయం పెరుగుదల, మార్కెట్ ఒడిదుడుకులు, వాతావరణ మార్పుల వంటి సమస్యలను ఎదుర్కొంటున్న రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణలో రూ.21 వేల కోట్ల రైతుల రుణాలను మాఫీ చేశామని, రైతు భరోసా కింద ఎకరానికి రూ.12 వేలు ఇస్తున్నామని, వ్యవసాయానికి 24 గంటల పాటు ఉచిత విద్యుత్తును సరఫరా చేస్తున్నామని వివరించారు.

రాహుల్ గాంధీకి కేసీఆర్ క్షమాపణ చెప్పాలి

ఆయన ఇవ్వాలని చెబితేనే సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చారు

- సోనియా గాంధీ ఇచ్చిన తెలంగాణకే కేసీఆర్ సీఎం అయిండు
- అప్పుడు ఒరిజినల్ గాంధీ కుటుంబం.. ఇప్పుడేమో నకిలీ గాంధీ కుటుంబమైందా?
- ప్రజల దృష్టిలో కాంగ్రెస్ ఎప్పుడూ హీరోనే
- బీఆర్ఎస్ వాళ్లకు మాత్రం విలనే
- రేవంత్ అంటే భయంతోనే కేసీఆర్ అసెంబ్లీకి పోవట్లేదు
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



హైదరాబాద్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): "పదేళ్లు తెలంగాణకు సీఎంగా పనిచేసిన కేసీఆర్.. గతాన్ని మరిచి డూప్లికేట్ గాంధీలంటూ వ్యాఖ్యానించడం ఆశ్చర్యం కలిగిస్తోంది. సోనియా గాంధీ లేకుంటే తెలంగాణ వచ్చుండేదే కాదని చెప్పింది ఆయనే కదా? ఆయన మాటపై ఆయనకే విలువ లేదా?" అంటూ టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి నిలదీశారు. రాహుల్ గాంధీపై కేసీఆర్ అనవసరంగా మాట తూలారని, వాస్తవానికి తెలంగాణ ఇచ్చేయాలంటూ రాహుల్ గాంధీ చెప్పిన తర్వాతనే ప్రక్రియ మొదలైందని చెప్పారు. "తెలంగాణ వచ్చినప్పుడు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలను దేవుళ్లన్న కేసీఆర్‌కు కడుపు నిండింది కదా అని ఇవాళ వాళ్లు దయ్యాలయ్యారా" అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీకి కేసీఆర్ ఎలా ప్రచారం చేశారో.. తమ పార్టీకి రాహుల్ గాంధీ కూడా అలాగే ప్రచారం చేశారన్నారు. రాహుల్ గాంధీపై చేసిన వ్యాఖ్యలకు కేసీఆర్ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. గాంధీ భవన్‌లో జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడుతూ కేసీఆర్ అంటే తనకు గౌరవం ఉందని, ఆయనను పరిపూర్ణత చెందిన నాయకునిగానే తాను భావిస్తానని చెప్పారు. కానీ ఈ వయసులో ఇంతగా దిగజారి మాట్లాడటం ఆయనకు అవసరమా అని ప్రశ్నించారు. రాజకీయాల్లో విలువలు కలిగిన కుటుంబం కేవలం రాహుల్ గాంధీ కుటుంబమేనన్నారు. బ్రిటిష్ పాలనలో కూడా దేశం కోసం రూ.లక్షల కోట్లు ధారాదత్తం చేసిన కుటుంబం రాహుల్ గాంధీ కుటుంబమని చెప్పారు.

కాంగ్రెస్ నాయకత్వంలేకుంటే కేసీఆర్ దీక్ష జరిగేదే కాదు

తెలంగాణ నినాదం నుంచి వెనక్కు తగ్గాలని కేసీఆర్ అనుకున్న సమయంలో ఆయన్ను లేపిందే కాంగ్రెస్ నేతలని జగ్గారెడ్డి అన్నారు. కాంగ్రెస్ నాయకత్వమే వెనకాల లేకుంటే కేసీఆర్ దీక్ష జరిగి ఉండేదే కాదని చెప్పారు. రాష్ట్ర విభజన కోసం తమ పార్టీ నేతలు ఆయన వెనక నిలబడి నడిపించారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఉనికిని కాపాడుకునే పనిలో భాగంగానే కేసీఆర్ వరంగల్ సభ నిర్వహించారని చెప్పారు. ప్రజల దృష్టిలో కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ హీరోనేనని, ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ వాళ్లకు మాత్రమే విలన్ అని విమర్శించారు. సీఎం రేవంత్ భయంతోనే కేసీఆర్ అసెంబ్లీకి వెళ్లట్లేదన్నారు. వెళితే రేవంత్ కడిగేస్తాడన్న భయంతో ఉన్న కేసీఆర్.. దాన్నుంచి తప్పించుకుంటున్నారని చెప్పారు. అసెంబ్లీకి కేసీఆర్ వస్తే.. వారిద్దరూ ఎదురుపడితే ఎలా ఉంటుందో చూద్దామని తెలంగాణ ప్రజలు అనుకుంటున్నారని, కేసీఆర్ అసెంబ్లీకి రావాలని కోరారు. ఢిల్లీకి, పంజాబ్, కర్ణాటక, తమిళనాడు సహా ఆరేడు రాష్ట్రాలకు డబ్బు సంచులు మోసిందే కేసీఆర్ అని చెప్పారు.

మహిళలను కించపరిచేలా..

నేతలు మాట్లాడితే ఊరుకునేది లేదు

- జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ హెచ్చరిక
- రాష్ట్రంలో తొలిసారిగా జాతీయ మహిళా కమిషన్ బహిరంగ విచారణ

భర్త మరణ ధ్రువీకరణ పత్రం కోసం రెండేళ్లుగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న సికింద్రాబాద్ వాసి మరియా ఫ్రాన్సిస్.. ఆస్తి తగాదాల నేపథ్యంలో తన బావ పరపతి ఉపయోగించి డెత్ సర్టిఫికెట్ రాకుండా అడ్డుకుంటున్నారని ఫిర్యాదు చేశారు... 3 రోజుల్లో మరణ ధ్రువీకరణ పత్రం జారీ చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్‌కు ఆదేశాలు వచ్చాయి.

సికింద్రాబాద్ మహంకాళి ప్రాంతంలోని ఒక వస్త్ర దుకాణంలో పనిచేసే తన 23 ఏళ్ల కూతురు మూడున్నరేళ్లుగా కనిపించడం లేదని, పోలీసులు పట్టించుకోవడం లేదని ఓ మహిళ ఫిర్యాదు చేశారు... ఈ కేసుపై వారంలోగా నివేదిక ఇవ్వాలంటూ పోలీసు అధికారులకు ఆదేశాలు వెళ్లాయి...



బాధితులతో మాట్లాడుతున్న ఎన్‌డబ్ల్యూసీ చైర్‌పర్సన్ విజయ రహత్కర్, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద

.. సోమవారం హైదరాబాద్‌లోని బేగంపేట ప్లాజా హోటల్‌లో జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌డబ్ల్యూసీ) నిర్వహించిన బహిరంగ విచారణలో బాధితులు వెళ్లబుచ్చుకున్న గోడు, దీనిపై జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ విజయ రహత్కర్ వెంటనే స్పందించిన తీరు ఇది. ఇదే కాదు.. పోలీసు ఉద్యోగులైన మామ, ముగ్గురు ఆడపడుచుల వేధింపులు తట్టుకోలేక ముగ్గురు పిల్లలతో కలసి వెళ్లిపోయి ఓ వసతిగృహంలో ఆశ్రయం పొందుతున్న మహిళకు న్యాయ సహాయం అందించడంతోపాటు.. 70మందికిపైగా గృహహింస, లైంగిక దాడి, వరకట్న వేధింపులు, సైబర్ నేరాల బాధిత మహిళలు చెప్పుకొన్న కష్టాలు విన్న ఎన్‌డబ్ల్యూసీ చైర్ పర్సన్ వారికి తగిన సహాయం అందేలా ఆదేశాలు జారీ చేశారు. ఇలా జాతీయ మహిళా కమిషన్ తెలంగాణలో బహిరంగ విచారణ చేపట్టడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. తెలంగాణ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద ఇందులో పాల్గొన్నారు.మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నా.. సమాజం నుంచి ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటున్నారని.. మహిళల అభివృద్ధికి అనువైన పరిస్థితులు కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిమీదా ఉందని విజయ రహత్కర్ పేర్కొన్నారు. కాగా, బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు 2022-23 మధ్యకాలంలో ఆ పార్టీ నేతలు.. కొన్నిసార్లు బీజేపీ మహిళా నేతలను, మరికొన్నిసార్లు యావత్ మహిళాలోకాన్ని కించపర్చేలా వ్యాఖ్యలు చేశారని బీజేపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ గీతామూర్తి ఫిర్యాదు చేశారు. ఎర్రబెల్లి దయాకర్‌రావు, చిరుమర్తి లింగయ్య వంటివారు అవమానకరంగా మాట్లాడారని.. అప్పటి గవర్నర్ తమిళిసైపై పాడి కౌశిక్‌రెడ్డి ఇష్టానుసారం నోరుపారేసుకున్నారని వివరించారు. ఈ సందర్భంగా రహత్కర్ స్పందిస్తూ.. మహిళల ఆత్మాభిమానాన్ని, గౌరవాన్ని దెబ్బతీసేలా, కించపర్చేలా రాజకీయ నాయకులు వాచాలత్వం ప్రదర్శిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మహిళల పట్ల అవమానకరంగా మాట్లాడిన నేతలకు నోటీసులు పంపాల్సిందిగా ఎన్‌డబ్ల్యూసీ అధికారులను ఆదేశించారు.

- ఆంధ్రజ్యోతి, హైదరాబాద్ సిటీ

రైతుబంధు దోపిడీకే ధరణి తెచ్చారు

- పేదలను ఆ పోర్టల్ ఎన్నో కష్టాల్లోకి నెట్టింది
- భూ భారతితో ధరణి మోసాలకు చెక్
- నాలుగేళ్లలో 20లక్షల ఇందిరమ్మ ఇళ్లు: పొంగులేటి



అశ్వారావుపేట, ఎల్కతుర్తి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణితో లక్షల ఎకరాలు కబ్జా అయ్యాయని.. ఆ పోర్టల్ పేదలకు ఎన్నో కష్టాలు తెచ్చిందని, రైతుబంధు నిధులను దోచుకునేందుకే ధరణిని తెచ్చారని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనలో భూములు లేకున్నా ఒక్కొక్కరు 20-30 ఎకరాలకు పట్టా పుస్తకాలు సృష్టించుకొని రైతుబంధును కాజేసేందుకు ధరణి ఉపయోగించుకున్నారని విమర్శించారు. ధరణితో తలెత్తిన సమస్యలకు చెక్‌పెట్టి రైతుల భూ రికార్డులకు, భూములకు రక్షణ కల్పించేందుకు 'భూ భారతి' చట్టాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందని పేర్కొన్నారు. సన్న బియ్యం పథకానికి వచ్చిన మంచి పేరు భూభారతి చట్టానికి కూడా వస్తుందని చెప్పారు. కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని పేదలకు పంచుతామని పేర్కొన్నారు. కొత్తగూడెం జిల్లా, అశ్వారావుపేటలో, హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో సోమవారం భూ భారతి చట్టంపై అవగాహన సదస్సుల్లో పొంగులేటి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇందిరమ్మ ప్రభుత్వం వచ్చాక గత సర్కారులో పెండింగ్‌లోఉన్న 5,45,000 భూ సమస్యలను పరిష్కరించినట్లు వెల్లడించారు. ఏజెన్సీ ప్రాంతంలో సాగు చేసుకుంటున్న గిరిజన, గిరిజనేతరులకు హక్కులు లేకుండా పోయాయని, వీటి పరిష్కారానికి ప్రత్యేక కమిటీని వేసి పరిష్కార మార్గాలు కనుగొంటామని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లు మొదటి దశలో నియోజకవర్గానికి 3,500 మంజూరు చేస్తామని, నాలుగేళ్లలో 20 లక్షల ఇళ్లు నిర్మించడమే తమ ప్రభుత్వం లక్ష్యం అని వివరించారు.. 9,50000 సాదాబైనామా పెండింగ్ దరఖాస్తులకు త్వరలోనే పరిష్కారం లభిస్తుందని మంత్రి ప్రకటించారు. వచ్చే నెల 3 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 28 జిల్లాల్లో 28మండలాలను పైలట్ ప్రాజెక్టులుగా ఎంపిక చేసుకొని భూ భారతి గ్రామసభలు ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు.. వీటిలో అనుభవాలను క్రోడీకరించుకొని జూన్ 2 నుంచి రాష్ట్రవ్యాప్తంగా పూర్తిస్థాయిలో భూభారతి చట్టం అమలులోకి తీసుకొస్తామని మంత్రి పొంగులేటి ప్రకటించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ప్రస్తుతం కొన్ని మాత్రమే అమలవుతున్నాయని, మిగతావి దశలవారీగా అమలు చేస్తామన్నారు. నిరుద్యోగులకు ఉపాధికోసం రాజీవ్ యువ వికాస్ పథకం ద్వారా సాయం అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం ధనిక రాష్ట్రమైన తెలంగాణాను రూ.8,19,000కోట్ల అప్పుల్లోకి నెట్టిందన్నారు. ఆ అప్పులు తీర్చుకుంటూనే కొత్త పథకాలు అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నామని, ఫలితంగానే పథకాల అమలు ఆలస్యమవుతోందన్నారు. కాగా అంతకు ముందు అశ్వారావుపేట ఎంపీడీవో కార్యాలయంలో నిర్మించిన నమూనా ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించి, అశ్వారావుపేట ప్రభుత్వాస్పత్రి ఆవరణలో 100 పడకల ఆస్పత్రికి మంత్రి శంకుస్థాపన చేశారు.

రేపు లేదా ఎల్లుండి టెన్త్ ఫలితాలు!

హైదరాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాలు విడుదల చేసేందుకు విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. జవాబు పత్రాల మూల్యాంకనం ఇప్పటికే పూర్తవగా.. ఒకటి, రెండు రోజుల్లో ఫలితాలు ప్రకటించేందుకు పాఠశాల విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 30 లేదా మే 1వ తేదీన ఫలితాలు విడుదల చేసే అవకాశాలున్నాయి. మార్చి 21 నుంచి ఏప్రిల్ 4 వరకు టెన్త్ వార్షిక పరీక్షలు జరగ్గా.. 5,09,403 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈసారి మార్కుల మెమోలో కొత్త మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఇంతవరకు మొత్తం మార్కుల ఆధారంగా గ్రేడ్ పాయింట్ యావరేజ్ (జీపీఏ) ఇస్తుండగా.. ఇప్పుడు సబ్జెక్టుల వారీగా మార్కులు, గ్రేడ్‌లు ఇవ్వనున్నారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో శ్రవణ్‌రావుకు రక్షణను రద్దు చేయండి

- సుప్రీంకోర్టుకు తెలంగాణ ప్రభుత్వం వినతి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆరో నిందితుడిగా ఉన్న ఒక మీడియా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అరువేల శ్రవణ్ కుమార్‌రావుకు గతంలో కల్పించిన మధ్యంతర రక్షణను రద్దు చేయాలని తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టును కోరింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఐఏఎస్, ఐపీఎస్‌లతోపాటు కొందరు న్యాయమూర్తుల ఫోన్లను సైతం ట్యాప్ చేశారనే ఫిర్యాదులున్నాయి. ఆ వ్యవహారంలో శ్రవణ్ కీలకంగా వ్యవహరించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఆ కేసులో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ శ్రవణ్ హైకోర్టును ఆశ్రయించగా, ఆ పిటిషన్‌ను మార్చి 2న న్యాయస్థానం తిరస్కరించింది. హైకోర్టు తీర్పును మార్చి 3న సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆ పిటిషన్ సోమవారం జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ విశ్వనాథన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. ఆయనకు కల్పించిన మధ్యంతర రక్షణను రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కౌంటర్ పిటిషన్‌లో కోరింది. శ్రవణ్ తరఫున సీనియర్ న్యాయవాది దామా శేషాద్రి నాయుడు వాదిస్తూ ఆయన విచారణకు సహకరిస్తున్నారని తెలిపారు. ఇరుపక్షాల వాదనల అనంతరం తదుపరి విచారణను మే 9వ తేదీకి వాయిదా వేసింది. అప్పటి వరకు శ్రవణ్ రావుకు మధ్యంతర రక్షణ కొనసాగుతుందని స్పష్టం చేసింది.

పోచారంలో బంగ్లాదేశీయుడి అరెస్టు

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): నకిలీ పత్రాలను సృష్టించి పోచారంలో నివాసముంటున్న ఓ బంగ్లాదేశ్ వ్యక్తిని సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా పోచారం వెంకటసాయి ప్రేమ్‌నగర్ కాలనీలోని ఓ ఫ్లాట్‌లో షేక్ రషెల్ అలియాస్ ఎండీ రషెల్ (31) నివాసం ఉంటున్నాడు. పక్కా సమాచారంతో పోలీసులు రషెల్ ఇంటికి చేరుకొని అతన్ని అదుపులోకి తీసుకొని విచారించారు. రషెల్ నకిలీ ఆధార్, పాన్, ఓటర్ కార్డులను సృష్టించి, పశ్చిమ బెంగాల్ నుంచి చౌదరిగూడకు వచ్చి నివాసం ఉంటూ స్థానికంగా ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్నట్లు పోలీసులు తెలుసుకున్నారు. ఇంట్లో సోదాలు చేయగా బంగ్లాదేశ్‌కు చెందిన ఓటర్ కార్డు లభించింది. రషెల్‌ను అదుపులోకి తీసుకొని అతడి నుంచి రెండు ఫోన్లు, ఓటర్‌కార్డును స్వాధీనం చేసుకున్నారు.

అబద్ధాలకు కేసీఆర్ బ్రాండ్ అంబాసిడర్

- దురదృష్టం కొద్దీ మా వాళ్లు కరెక్ట్‌గా లేరు: రాజాసింగ్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : 'ఝూటాకు కేసీఆర్ బ్రాండ్ అంబాసిడర్... ఆయన అబద్ధపు మాటలే మాట్లాడుతున్నాడు... మావాళ్లు కరెక్ట్‌గా ఉంటే గత ఎన్నికల్లోనే బీజేపీ అధికారంలోకి వచ్చేది..' అని బీజేపీ గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు. ఈమేరకు సోమవారం ఆయన ఓ వీడియో విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం ఏమి నిధులు ఇవ్వలేదని కేసీఆర్ అంటున్నారని, ఆయన పేర్కొంటున్న పదేళ్ల పాలనలో ఎన్ని నిధులు వచ్చాయో స్పష్టం చేయాలని లేకపోతే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. "మా దురదృష్టం కొద్దీ మా వాళ్లు కరెక్ట్‌గా లేరు... లేకుంటే గత ఎన్నికల్లోనే తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చేది" అని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇప్పటికీ ఏం ఫరక్ పడలేదని, తెలంగాణలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని రాజాసింగ్ ధీమా వ్యక్తం చేశారు.

ఆదివాసీల నిర్మూలనకే ఆపరేషన్ కగార్:సీపీఎం

హైదరాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీలను అడవుల నుంచి వెళ్లగొట్టేందుకే కేంద్రం ఆపరేషన్ కగార్‌ను చేపట్టిందని, ఆదివాసీలు వెళ్లిపోయాక ఖనిజ సంపదను కార్పొరేట్లకు అప్పగించే కుట్ర ఇదని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు ఆరోపించారు. వెంటనే ఆపరేషన్ ఆపేసి, మావోయిస్టులతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. చర్చిద్దామని మావోయిస్టులు అడుగుతుంటే.. వారిని పిలవకుండా తుద ముట్టించేదాకా వదిలిపెట్టమనడం దుర్మార్గమని విమర్శించారు.

మావోయిస్టులను చర్చలకు పిలవాలి: కవిత

కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరించాలని, మావోయిస్టులను శాంతి చర్చలకు ఆహ్వానించాలని కేంద్ర ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల్లోని అన్ని రాజకీయపార్టీలతో మాట్లాడి సలహాలు, సూచనలు తీసుకోవాలని కోరారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కేసీఆర్ విధానపరమైన నిర్ణయాలతో.. అనేక మంది నక్సలైట్లు లొంగిపోయారని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా అలాంటి విధానాన్ని కొనసాగించాలని, మావోయిస్టుల లొంగుబాటును ప్రోత్సహించాలని కోరారు.

వారిని ఒకే కోణంలో చూడొద్దు: కడియం

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదులు, మావోయిస్టులను ఒకే కోణంలో చూడవద్దని.. కేంద్రం వెంటనే ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపేయాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి డిమాండ్ చేశారు. సోమవారం హనుమకొండలో మీడియాతో మాట్లాడారు. ప్రశ్నించే గొంతుకలు, ప్రజా సంఘాలను బీఆర్ఎస్ పాలనలో అణచివేశారని.. ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలన్న కేసీఆర్ డిమాండ్‌లో నిజాయతీ లేదని కడియం శ్రీహరి విమర్శించారు.

నక్సల్స్‌పై దమన కాండ సరికాదు: చంద్రకుమార్

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్‌ను నిలిపేసి, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని శాంతి చర్చల పీస్ కమిటీ ఛైర్మన్ జస్టిస్ చంద్రకుమార్ డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాంతి చర్చలు జరపకుండా ఆదివాసీలపై దమనకాండకు పాల్పడుతున్నాయని, ఇది ఏమాత్రం సమంజసం కాదని పేర్కొన్నారు. ఆదివాసుల సంక్షేమం దృష్ట్యా పోలీసులు, మావోయిస్టులు శాంతిని పాటించాలని శాంతి చర్చల కమిటీ ఉపాధ్యక్షుడు జంపన్న కోరారు. ఆదివాసీల రాజ్యాంగ హక్కులను కాపాడాలని విద్యార్థి సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు.

ఏపీ నుంచి బీజేపీ రాజ్యసభ అభ్యర్థిగా పాకా

అమరావతి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): వైసీపీతో పాటు రాజ్యసభ సభ్యత్వానికి విజయసాయి రెడ్డి రాజీనామాతో ఖాళీ అయిన సీటు బీజేపీ ఖాతాలో చేరనుంది. ఎన్డీయే కూటమి తరఫున బీజేపీ రాజ్యసభ అభ్యర్థిగా పాకా వెంకట సత్యనారాయణ (64)ను ఆ పార్టీ అధిష్ఠానం ఖరారు చేసింది. సోమవారం బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కేంద్ర కార్యాలయ ఇన్‌చార్జి అరుణ్ సింగ్ ఈ మేరకు ప్రకటనలో వెల్లడించారు. ఈ సీటుకు పలువురు పోటీ పడగా బీజేపీ అధిష్ఠానం మాత్రం పార్టీలో నమ్మకస్తుడిగా పేరున్న పాకా సత్యనారాయణకు పట్టం కట్టింది. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన సత్యనారాయణ ప్రస్తుతం రాష్ట్ర బీజేపీ క్రమశిక్షణ సంఘం ఛైర్మన్‌గా ఉన్నారు. బీసీ(గౌడ్) వర్గానికి చెందిన ఆయన దాదాపు 45 ఏళ్లుగా బీజేపీ జెండా మోస్తున్నారు. ఆయన మంగళవారం ఆయన నామినేషన్‌ను దాఖలు చేయనున్నారు. ఇప్పటికే రాష్ట్రం నుంచి బీజేపీ తరఫున ఆర్.కృష్ణయ్య రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

జిన్నింగ్ మిల్లర్లు, సీసీఐ అధికారుల మిలాఖత్!

- రైతుల పేర్లతో సీసీఐకి పత్తి అమ్మిన జిన్నింగ్ మిల్లర్లు
- నకిలీ రైతులకు ధ్రువపత్రాలు జారీ
- తాత్కాలిక రిజిస్ట్రేషన్ల పేరిట దందా
- 'విజిలెన్స్' విచారణలో వెలుగులోకి
- రైతులకు బదులు మిల్లర్లకు లబ్ధిపై ప్రభుత్వం సీరియస్

హైదరాబాద్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): వారికి గుంట భూమి లేదు. పత్తి పంట సాగుచేసింది లేదు. అసలు వాళ్లు రైతులే కాదు. జిన్నింగ్ మిల్లుల్లో పనిచేసే కూలీలు, సిబ్బంది, ట్రేడర్లు, బ్రోకర్లు, వారి పరిచయస్తులు.. ఇలా ఎవరు దొరికితే వారి పేర్లమీద భారత పత్తి సంస్థ (సీసీఐ)కు పత్తి విక్రయించిన నకిలీల బాగోతం బట్టబయలవుతోంది. తాత్కాలిక ధ్రువపత్రాల పేరిట సీసీఐకి పత్తి అమ్మిన జిన్నింగ్ మిల్లర్లు ఎవరో వెతికే పనిలో విజిలెన్స్ అధికారులు నిమగ్నమయ్యారు. రైతుల నుంచి తక్కువ ధరకు పత్తి కొని, కనీస మద్దతు ధర (ఎమ్మెస్పీ)కు సీసీఐకి అమ్మేసి అక్రమార్కులు లాభపడ్డారు. ఇందుకు వ్యవసాయ శాఖ జారీ చేసిన 60 వేల సాగు ధ్రువీకరణ పత్రాలే కారణం కావటం గమనార్హం. పత్తి రైతులకు బదులుగా జిన్నింగ్ మిల్లర్లు, బ్రోకర్లకు లబ్ధి కలగటం, ఎమ్మెస్పీ వారికే లభించటం, పెద్దఎత్తున అక్రమ కొనుగోళ్లు జరగటంపై రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ విచారణ జరిపిస్తోంది. కౌలు, పోడు రైతులు, పట్టాదారు పాస్‌పుస్తకాలు డిజిటల్ సిగ్నేచర్ కాని రైతులు పంటలు సాగు చేస్తే వారికి ఏఈవోలు సాగు ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తారు. ఏఈవోలు జిన్నింగ్ మిల్లర్లతో కుమ్మక్కై... రైతులు కానివారికి ఈ పత్రాలు జారీ చేశారు. వీటి ఆధారంగా మార్కెటింగ్ శాఖ అధికారులు తాత్కాలిక ధ్రువపత్రాలు (టీఆర్‌లు) జారీ చేశారు. వీటితోనే పత్తి కొనుగోళ్లలో దందా చేశారు. టీఆర్‌లలో సాగు విస్తీర్ణాన్ని కూడా మార్చేశారు. ఉదాహరణకు 3 ఎకరాలకు టీఆర్ తీసుకుని 8 ఎకరాలుగా, ఒక ఎకరానికి టీఆర్‌ను 10 ఎకరాలుగా దిద్దేశారు. ఒక ఎకరం పేరు మీద 12 క్వింటాళ్ల పత్తిని సీసీఐ కొంటుంది. అంటే 10 ఎకరాలకు ధ్రువపత్రం ఉంటే 120 క్వింటాళ్ల పత్తిని సీసీఐకి అమ్ముకోవచ్చు. వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులు జారీ చేసిన 60 వేల తాత్కాలిక ధ్రువపత్రాల్లో సగానికంటే ఎక్కువ నకిలీ రైతుల పేరిట తీసుకున్నవేనని ప్రాథమిక విచారణలో తేలినట్లు తెలిసింది. గత అక్టోబరు నెలలో (దీపావళి సమయంలో) హైదరాబాద్‌లోని ఒక హోటల్‌లో జిన్నింగ్ మిల్లర్లు, సీసీఐ అధికారులు, సిబ్బందితో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. విందు, వినోదాలతో పాటు అక్రమ కొనుగోళ్లపై అక్కడే చర్చలు జరిగినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.

అక్రమాలపై ప్రభుత్వం సీరియస్


ఈ అక్రమాలపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలతో విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగారు. అక్రమ కొనుగోళ్లలో మార్కెటింగ్ శాఖ అధికారుల ప్రమేయం కూడా ఉన్నట్లు విచారణాధికారులు గుర్తించినట్లు సమాచారం. దీంతో ఏడుగురు మార్కెట్ కార్యదర్శులపై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. 134 మందికి మెమోలు జారీ చేసింది. విజిలెన్స్ విచారణ కొలిక్కివస్తే... జిన్నింగ్ మిల్లర్లు, సీసీఐ అధికారులు, సిబ్బంది, బ్రోకర్లు, ట్రేడర్లు, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారుల బండారం బయటపడే అవకాశాలున్నాయి. ఒక్కో క్వింటాలు పత్తిపై జిన్నింగ్ మిల్లర్లు రూ.500 వరకు సొమ్ము చేసుకున్నట్లు సమాచారం.

ఏపీ ప్రగతిపై పగ!



బుసలు కొడుతున్న వైసీపీ విషనాగు.. పెట్టుబడులను అడ్డుకోవడమే లక్ష్యం

- నాడు కియా, నేడు ఉర్సా భూకేటాయింపులపై దుష్ప్రచారం
- ఉర్సాకు రూ.కోటి, 50 లక్షలకు భూమి
- 99పైసలకే ఇచ్చినట్లు జగన్ అసత్యాలు
- కోటికే నాడు వైసీపీ కేటాయింపులు
- నేడు ప్రభుత్వం కేటాయిస్తే గగ్గోలు
- ఉర్సా క్లస్టర్స్ అంతర్జాతీయ సంస్థ..



అమరావతి, ఆంధ్రజ్యోతి: ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులు రావొద్దు! రాష్ట్రం అభివృద్ధి చెందొద్దు! 2014-19 మధ్య జగన్ చేసింది ఇదే. ఇప్పుడు... మళ్లీ చేస్తున్నదీ అదే! అవగాహన లేని మాటలు... అర్ధ సత్యాలు... అసత్యాలతో తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఇందులో భాగంగానే... 'ఉర్సాకు ఉచితంగా భూములు ఇచ్చేశారు' అంటూ జగన్ రోత పత్రిక అక్కసు వెళ్లగక్కింది. ఉర్సా సంస్థ ఊరూపేరూ లేనిదన్నట్లుగా అభివర్ణించింది. పెట్టుబడుల విషయంలో వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ వైఖరికి ఈ కథనం అద్దం పట్టింది. అసలు విషయం ఏమిటంటే... ఉర్సా క్లస్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఒక అంతర్జాతీయ సంస్థ. మరో విషయం ఏమిటంటే.. ఆ సంస్థకు భూములు ఉచితంగా ఇవ్వలేదు.

ఇది రియల్ ఎస్టేట్ వ్యాపారమా?

పరిశ్రమలకు భూకేటాయింపులంటే రియల్ ఎస్టేట్ వ్యాపారం కాదు. ఏఐ, డేటాబేస్ రంగంలో అంతర్జాతీయంగా పేరున్న కంపెనీలను ఏపీ ప్రభుత్వం ఆహ్వానిస్తోంది. ఉర్సా క్లస్టర్స్ కూడా అందులో భాగంగానే వచ్చేందుకు సిద్ధమైంది. కానీ... అదేదో అనామక సంస్థగా, ప్రభుత్వ పెద్దల బినామీది అన్నట్లుగా వైసీపీ విషం చిమ్ముతోంది. అదే నిజమైతే... తెలంగాణ ప్రభుత్వం ఈ సంస్థను తమ రాష్ట్రానికి ఎందుకు ఆహ్వానిస్తుంది? ఇటీవల దావోస్‌లో జరిగిన ఎకనమిక్ ఫోరంలో ఇదే కంపెనీతో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఒప్పందం కుదుర్చుకోవడం నిజం కాదా?

ఇదీ... ఉర్సా నేపథ్యం...

అంతర్జాతీయ కంపెనీలు ఇతర దేశాల్లో పెట్టుబడులు పెట్టేందుకు వచ్చేటప్పుడు ముందుగా అక్కడ స్పెషల్ పర్పస్ వెహికల్(ఎస్పీవీ)ను ఏర్పాటు చేసుకుంటాయి. ఉర్సా క్లస్టర్స్ అంతర్జాతీయంగా పేరున్న నిపుణులతో ఏర్పాటైన కంపెనీ. అభివృద్ధి చెందే రాష్ట్రాల్లో ఏపీని ఒకటిగా భావించడంతోపాటు సొంత రాష్ట్రంపై మమకారంతో... సంస్థ యాజమాన్యం ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చింది. అందులో భాగంగా ఇక్కడ రెండు నెలల క్రితం ఎస్పీవీని ఏర్పాటు చేసుకుంది. అయితే జగన్ మాత్రం ఉర్సా కంపెనీ 2 నెలలు ముందు పెట్టిన కంపెనీ అంటూ దుష్ప్రచారం చేస్తున్నారు. 2 నెలల కిందట పెట్టింది ఎస్పీవీ మాత్రమే! అసలు కంపెనీ ఎప్పటి నుంచో ఉన్నదే! ఇది వాస్తవం! 'ఉర్సా క్లస్టర్స్‌కు ఎకరా 99 పైసలకు భూమి కేటాయించారు. ఇడ్లీ కూడా రూపాయికి రాదు' అంటూ వైఎస్ జగన్ వెకిలి వ్యాఖ్యలు చేస్తున్నారు. వాస్తవానికి ప్రభుత్వం ప్రఖ్యాత ఐటీ సంస్థ టీసీఎస్‌కు విశాఖ ఐటీ పార్కులో 99 పైసలకు 21 ఎకరాలను లీజుకు కేటాయించింది. అదే ఐటీ పార్కులో ఉర్సాకు ఎకరా రూ.కోటికి, కాపులుప్పాడులో ఎకరా రూ.50 లక్షల చొప్పున ధర నిర్ణయించింది. భూకేటాయింపులు చేసినా వారికి సేల్ డీడ్ చేయలేదు. పెట్టుబడులు పెట్టిన తర్వాతే ఆ భూమిని వారికి అప్పగిస్తామని కేబినెట్ భేటీలో స్పష్టంగా తీర్మానించారు. ఇవన్నీ జగన్‌కు తెలియక కాదు. కానీ... రాష్ట్రానికి పరిశ్రమలు రాకుండా చేయడం, ప్రభుత్వంపై బురదజల్లడం లక్ష్యంతోనే ఆయన తప్పుడు ప్రచారం చేస్తున్నారనేది సుస్పష్టం. అనంతపురంలో కియా పరిశ్రమకు ఇచ్చిన రాయితీలు, భూకేటాయింపులపైనా జగన్ ఇలాగే దుష్ప్రచారం చేశారు. పెట్టుబడిదారుల విశ్వసనీయతపై సందేహాలు లేవనెత్తడం, వాళ్ల ప్రతిష్ఠను దెబ్బ తీయడమనే వ్యూహాన్ని అనుసరిస్తున్నారు.

మీరెంత.. మీ బడ్జెట్ ఎంత?

- మా రక్షణ వ్యయం అంతైనా ఉండదు
- కాలమానంలో అరగంటే వెనక కావచ్చు..
- అభివృద్ధిలో అర్ధ దశాబ్దం వెనకబడ్డారు
- భారత్‌తో పోల్చుకోవద్దు
- పాకిస్థాన్‌పై నిప్పులు చెరిగిన ఒవైసీ

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): భారత్‌తో పోలిస్తే కాలమానంలో అరగంట వెనక ఉన్న పాకిస్థాన్... అభివృద్ధి విషయంలో అర్ధ శతాబ్దం వెనకబడిందని మజ్లిస్ అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. పాకిస్థాన్ పూర్తి బడ్జెట్ భారత రక్షణ వ్యయం అంత కూడా ఉండదని, భారత్‌తో పోల్చుకోవద్దని ఆ దేశానికి హితవు పలికారు. మహారాష్ట్రలోని పర్భాణీలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. భారత్ గురించి పాకిస్థాన్ నాయకులు చేసిన వ్యాఖ్యలపై నిప్పులు చెరిగారు. పహల్గాంలో ఉగ్రదాడికి పాల్పడింది పాకిస్థాన్ ఐఎస్ఐ పెంచి పోషించిన ముష్కరులని మండిపడ్డారు. మతం అడిగి మరీ చంపడం అతి దారుణమని, వారిని మనుషులుగా కూడా గుర్తించకూడదన్నారు. సింధు జలాల ఒప్పందం అంశంపై పాక్ నాయకుడు బిలావల్ భుట్టో జర్దారీ చేసిన వ్యాఖ్యలను అసదుద్దీన్ తీవ్రంగా ఖండించారు. 'మీ తాతను, తల్లిని చంపింది ఉగ్రవాదులేనని గుర్తుంటే నువ్విలా మాట్లాడవ'ని బిలావల్‌ను ఉద్దేశించి అన్నారు. 'మా దగ్గర అణ్వాయుధాలు ఉన్నాయంటూ ఇతర దేశాల్లోకి మారణకాండకు పాల్పడతామంటే ఎవరూ చూస్తూ ఊరుకోర'ని పాక్‌ను హెచ్చరించారు. కశ్మీర్ మన దేశంలో అంతర్భాగమన్నారు. కశ్మీరీలు పలువురు పర్యాటకుల ప్రాణాలు కాపాడారని గుర్తు చేశారు. ముస్లింలు హిందువులపై దాడి చేశారని జరుగుతున్న ప్రచారాన్ని తిప్పికొట్టారు. మనమంతా కలిసి పాకిస్థాన్‌కు గుణపాఠం చెప్పాలన్నారు.

భూదాన్ భూముల వ్యవహారం..

ఈడీ సోదాలు

- నిందితుల ఇళ్లు, కార్యాలయాల్లో తనిఖీలు
- 40 వింటేజ్ కార్లు, భూదాన్ భూముల.. ఇతర ఆస్తుల కీలక పత్రాలు స్వాధీనం

హైదరాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): భూదాన్ భూముల వ్యవహారంలో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసుకు సంబంధించి హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లోని నిందితుల ఇళ్లలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) బృందాలు సోదాలు నిర్వహించాయి. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం రెవెన్యూ పరిధిలో వివాదాస్పద భూమికి సంబంధించి ఈడీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. దర్యాప్తులో భాగంగా హైదరాబాద్‌లోని సంతోష్‌నగర్, యాకత్‌పురా, బంజారాహిల్స్, మీర్‌పేట్, విరాట్‌నగర్, రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లో ఈడీ బృందాలు తనిఖీలు చేపట్టాయి. సోమవారం తెల్లవారుజామున ప్రారంభమైన సోదాలు సాయంత్రం 6.30 గంటల వరకు సాగాయి. నిందితులు షర్ఫన్, మునావర్ ఖాన్, ఖదీరున్నీసా, ఎంఏ షకూర్ ఇళ్లు, కార్యాలయాల్లో సోదాలు జరిగాయి. ఈ సోదాల్లో మునావర్‌ఖాన్‌కు చెందిన 40 వింటేజ్ కార్లు, భూదాన్ భూములతోపాటు ఇతర ఆస్తుల పత్రాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, కొంత నగదును ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. హస్తినాపురం డివిజన్ విరాట్‌నగర్‌కు చెందిన ఎంఏ షకూర్ నివాసంలో రూ.9.50లక్షల నగదుతో పాటు కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. నాగారంలోని సర్వే నంబరు 181, 182లోని భూదాన్ భూముల్లో వివాదం నెలకొంది. ఈ భూముల్లో సుమారు 50ఎకరాలకు సంబంధించి ఖదీరున్నీసా బేగం తండ్రి గతంలో భూదాన్ బోర్డుకు దానంగా ఇచ్చారు. ఆ భూములకు వారసురాలిని తానేనని, వాటిని తన పేరున బదిలీ చేయాలని 2021లో ఖదీరున్నీసా దరఖాస్తు చేసుకున్నారు. రెవెన్యూ అధికారులు ఆ భూమిని ఆమె పేరు మీద బదలాయించడంతో ఓ నిర్మాణ సంస్థకు విక్రయించారు. విలువైన భూమిని విచారణ లేకుండా బదలాయించడంపై ఈడీ కేసు నమోదు చేసింది. ఈ కేసుతో సంబంధం ఉన్న పలువురికి నోటీసులు జారీ చేసి విచారించింది. రంగారెడ్డి మాజీ కలెక్టర్ అమోయ్ కుమార్‌ను సైతం ఈడీ గతంలో విచారించింది.

ఎస్సీ గురుకుల బ్యాక్‌లాగ్ ఫలితాలు విడుదల

హైదరాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ గురుకులాల్లో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఎస్సీ బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ కోసం నిర్వహించిన పరీక్షల ఫలితాలను సోమవారం అధికారులు విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఆరో తరగతిలో 2,464, ఏడో తరగతిలో 1,046, 8వ తరగతిలో 918, 9వ తరగతిలో 1,210మంది విద్యార్థులు అర్హత సాధించారని టీజీసెట్ చీఫ్ కన్వీనర్ వీఎస్ అలగు వర్షిణి ప్రకటించారు.

అఫిడవిట్‌లో అబద్ధాలు చెప్తారా?

- రూ. 20 వేలు జరిమానా కట్టండి
- గ్రూప్-1 మూల్యాంకనంలో తప్పులంటూ పిటిషన్ వేసిన 19మందికి జరిమానా
- వారి పిటిషన్‌ను కొట్టివేసిన హైకోర్టు
- మరో పిటిషన్‌లో నియామకపత్రాలు ఇవ్వొద్దన్న ఆదేశాలపై టీజీపీఎస్సీ అప్పీల్



జస్టిస్ నగేశ్ భీమపాక

హైదరాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల మూల్యాంకనంలో తప్పులు జరిగాయని, పారదర్శకంగా తిరిగి మూల్యాంకనం చేసేలా ఆదేశించాలంటూ హైకోర్టులో పిటిషన్ వేసిన 19 మంది అభ్యర్థులకు షాక్ తగిలింది. వారు అఫిడవిట్ (ప్రమాణపత్రం)లో అబద్ధాలు చెప్పడంతోపాటు తప్పుడు డాక్యుమెంట్లు సమర్పించినందుకు పిటిషనర్లకు హైకోర్టు రూ.20వేలు జరిమానా విధించింది. ఈ పిటిషన్‌ను కొట్టివేసింది. తప్పుడు పత్రాలు సమర్పించడంపై విచారణ చేపట్టాలని రిజిస్ట్రార్ (జ్యుడీషియల్)ను ఆదేశించింది. ఈ అంశానికి సంబంధించి రైల్వే ఉద్యోగి కే.ముత్తయ్య, కొందరు ప్రభుత్వ ఉద్యోగులు సహా 19 మంది అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. జస్టిస్ నగేశ్ భీమపాక ధర్మాసనం దీనిపై విచారణ చేపట్టింది. టీజీపీఎస్సీ తరఫు పీఎస్ రాజశేఖర్ వాదనలు వినిపిస్తూ.. "పిటిషనర్లు మూటగూడూరి రాహుల్ అనే అభ్యర్థికి వచ్చిన 329 మార్కులను 192కు తగ్గించి.. తప్పుడు మార్కుల షీట్‌ను కోర్టుకు సమర్పించారు. సదరు అభ్యర్థి ఎవరికీ ఫిర్యాదు చేయలేదు. కోర్టుకు రాలేదు. టీజీపీఎస్సీకి కూడా ఎలాంటి ఫిర్యాదు అందలేదు. అలాంటి తప్పుడు డాక్యుమెంట్‌ను ప్రమాణపూర్వకంగా సమర్పించే అఫిడవిట్‌లో ఎలా సమర్పిస్తారు?" అని ప్రశ్నించారు. ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. పిటిషనర్లు తప్పుడు పత్రం ఆధారంగా కోర్టు ఎదుట అబద్ధాలు చెప్పినట్లు స్పష్టమవుతోందని పేర్కొంది. పిటిషనర్లకు రూ.20 వేలు జరిమానా విధించింది. తప్పుడు డాక్యుమెంట్‌పై విచారణ చేపట్టాలని రిజిస్ట్రార్‌కు ఆదేశాలు జారీచేసింది.

మరో పిటిషన్‌లో టీజీపీఎస్సీ అప్పీల్..

గ్రూప్-1 మూల్యాంకనంలో తప్పులు జరిగాయంటూ దాఖలైన మరో పిటిషన్‌కు సంబంధించి సింగిల్ జడ్జి ఆదేశాలపై తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) సోమవారం హైకోర్టు డివిజన్ బెంచ్‌కు అప్పీలు చేసింది. ఈ పిటిషన్‌ను 20 మంది వేయగా, అందులో 19మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉండటం గమనార్హం. ఆ పిటిషన్‌పై ఈ నెల 16న విచారణ జరిపిన జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం.. గ్రూప్-1కు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు ఇవ్వరాదంటూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఆ ఆదేశాలతో భర్తీ ప్రక్రియ నిలిచిపోయే పరిస్థితి వచ్చిందంటూ టీజీపీఎస్సీ అప్పీల్ చేసింది. "పిటిషనర్లు ప్రభుత్వ ఉద్యోగులని మాత్రమే పేర్కొంటూ.. వారు ఎక్కడ పనిచేస్తున్నారో వివరాలు వెల్లడించలేదు. ప్రభుత్వ ఉద్యోగులుగా ఉండి వారికి అందుబాటులో ఉన్న వనరుల ద్వారా మూల్యాంకనం చేసిన వారి వివరాలు సేకరించారు. ఇది నిబంధనలకు విరుద్ధం. నిబంధనల ప్రకారం నిపుణులతోనే సమాధాన పత్రాలను మూల్యాంకనం చేయించాం. ఊహాజనిత ఆరోపణలతో టీజీపీఎస్సీ ప్రతిష్ఠను దెబ్బతీసేలా పిటిషనర్లు వ్యవహరిస్తున్నారు" అని అప్పీలులో టీజీపీఎస్సీ పేర్కొంది. దీనిపై డివిజన్ బెంచ్ త్వరలో విచారణ చేపట్టనుంది.

24 వేల మంది మోహరింపు

- కర్రెగుట్టల్లోకి చొచ్చుకువెళ్తున్న జవాన్లు
- నేడో రేపో భారీ ఎన్‌కౌంటర్‌కు చాన్స్
- ఇటీవలి ఎన్‌కౌంటర్‌లో మృతుల గుర్తింపు
- అంతా పీఎల్‌జీఏ బెటాలియన్ మహిళలే
- బీజాపూర్‌లో బీర్‌బాటిల్ బాంబు సీజ్
- 24 మంది మావోయిస్టుల లొంగుబాటు
- శాంతి చర్చలపై నక్సల్స్ మరో లేఖ



బీర్‌బాటిల్ బాంబును సీజ్ చేసిన దృశ్యం

చర్ల, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): కర్రెగుట్టల్లో యుద్ధ వాతావరణం నెలకొంది. గుట్టల చుట్టూ డీఆర్జీ, బస్తర్ ఫైటర్స్, ఎస్టీఎఫ్, సీఆర్పీఎఫ్, కోబ్రా సహా.. మొత్తం 24 వేల బలగాలు మోహరించాయి. అటు కర్రెగుట్టల్లో హిడ్మా నేతృత్వంలోని పీఎల్‌జీఏ ఒకటో బెటాలియన్‌తోపాటు దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ(డీకేఎస్‌జడ్‌సీ), తెలంగాణ రాష్ట్ర కమిటీ(టీఎస్‌సీ), సెంట్రల్ రీజియన్ కమిటీల నక్సల్స్, కీలక నేతలు ఉన్నట్లు తెలుస్తోంది. హిడ్మాతోపాటు, బర్సే దేవా, దామోదర్ తదితరులు గుట్టల్లోనే ఉన్నారని ఇటీవల ఇక్కడ కేంద్ర కమిటీ సమావేశాలు జరిగాయని ఛత్తీస్‌గఢ్ పోలీసులు చెబుతున్నారు. 288 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న ఈ గుట్టల్లో మొత్తం 500 మంది వరకు మావోయిస్టులు తలదాచుకుంటున్నట్లు తమకు సమాచారం ఉందని వివరించారు. ఆపరేషన్ కీలక దశకు చేరుకుందని వెల్లడించారు. దీంతో.. ఒకట్రెండ్రోజుల్లో భారీ ఎన్‌కౌంటర్‌కు అవకాశాలున్నాయనే వార్తలు వెలువడుతున్నాయి. 'ఆపరేషన్ కర్రె గుట్టలు' ఎనిమిదో రోజైన సోమవారం కూడా బలగాలు పెద్ద ఎత్తున కాల్పులు జరిపినట్లు సమాచారం. కాగా, ఈనెల 24న జరిగిన ఎన్‌కౌంటర్‌లో పీఎల్‌జీఏ బెటాలియన్‌కు చెందిన ముగ్గురు మహిళా నక్సల్స్ మృతిచెందిన విషయం తెలిసిందే. మృతులు హంగి, సింటు, శాంతిగా గుర్తించారు. ఈ ముగ్గురిపైన రూ.8లక్షల చొప్పున 24లక్షల రివార్డు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

గుట్టలపై గ్రామాలు.. భయంభయం

కర్రెగుట్టలపై మూడు గ్రామాలున్నట్లు తెలుస్తోంది. వీటిల్లో డోలి అనే గ్రామంలో చెప్పుకోదగ్గ స్థాయిలో ఆదివాసీలుంటారని సమాచారం. ఈ విషయం తెలుసుకున్న బలగాలు.. థర్మల్ ఇమేజింగ్‌తో మనుషుల ఉనికిని గుర్తిస్తున్నా.. కాల్పుల విషయంలో వెనకాముందూ ఆలోచిస్తున్నట్లు తెలిసింది. కర్రెగుట్టలపై తాత్కాలిక బేస్ క్యాంపులను ఏర్పాటు చేసుకుని, క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు సమాచారం. అటు బలగాలే లక్ష్యంగా మావోయిస్టులు అమర్చిన బీరుబాటిల్ బాంబులను డీఆర్జీ బలగాలు నిర్వీర్యం చేశాయి. బలగాలు నడిచే మార్గాల్లో ఆ బాంబులను పాతిపెట్టినట్లు మీడియాకు తెలిపాయి. మరోవైపు... బీజాపూర్ జిల్లా ఎస్పీ ఎదుట 24 మంది నక్సల్స్ సోమవారం లొంగిపోయారు.

శాంతి చర్చల కోసం మావోయిస్టులు మరోమారు లేఖ విడుదల చేశారు. గడిచిన వారం రోజుల్లో ఇది మూడో లేఖ కావడం గమనార్హం. 'ఆపరేషన్ కగార్ ఆపేసి, వెంటనే శాంతి చర్చలు జరపాలని మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ ప్రతినిధి అభయ్ ఆ లేఖలో కోరారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.